# ప్రేముడి

నవల

— మంథా భానుమతి



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: ౧౨౭

కౌముది మాసపత్రికలో

జనవరి 2017 సంచిక నుంచి మే 2018 సంచిక వరకూ సీరియల్‌గా

వచ్చిన నవల

KOUMUDI

# (ప్రారంభం)

**ఒకసారి గళ్ళన్నీ** చూసి కళ్ళు గట్టిగా మూసుకుంది కృష్ణవేణి. కళ్ళు మూసుకునే కుచ్చిళ్ళన్నీ ఒక దగ్గరికి చేర్చి పరికిణీ వెనక్కి గోచీ పెట్టింది. మొదటి గడిలో ఎడంకాలు పెట్టింది.

"పాసా!" తల పైకెత్తి అరిచింది.

"ఆ!" నలుగురమ్మాయిలు కోరస్.

"కృష్ణవేణీ!" రొప్పుతూ, గట్టిగా పిల్చాడు సాంబడు. ఎక్కడ్నుంచి పరుగెత్తుకుని వస్తున్నాడో..

కుడికాలెత్తి రెండో గళ్ళో పెట్టబోయిన కాలు అట్లాగే ఉంచి ఆగిపోయింది. కింద పెడ్తే అవుటయిపోతుంది. కళ్ళు తెరిచినా అవుటే. సరిగ్గా.. అప్పుడే పరికిణీ కుచ్చిళ్ళు విడిపోయి కాళ్ళకి అడ్డం పడి కింద పడిపోయింది. కాలు మెలిక పడి, చీలమండ దగ్గర బుసబుసా పొంగడం మొదలెట్టింది.

తొక్కుడు బిళ్ళ ఆడుతున్న అమ్మాయిలంతా చుట్టూ మూగారు.

"అయ్యో! అదేంటట్టా పడిపోయావు కృష్ణవేణీ.. మీ అమ్మా, నాయనా, అన్నా అవనిగడ్డెల్లొత్తామన్నారు. నీతో చెప్పమన్నారు. ఇప్పుడే బోటెక్కించొత్తన్నా.. అయినా అంత ఆత్రవేంటి చెప్పు." అమ్మాయిల్ని పక్కకి నెట్టి కింద కూర్చుని కృష్ణ వేణి కాలు ఒళ్ళో పెట్టుకుని పరీక్షించాడు సాంబడు.

మడమ దగ్గర చిన్నగా నొక్కగానే "అమ్మా!" అంటూ దిక్కులు పిక్కటిల్లేట్టు గగ్గోలు పెట్టింది. ఒక పక్క సాంబడి స్పర్శతో సేద తీరుతూనే!

"ఓ బట్టుంటే తడిపి తీసుకు రండి.." తలెత్తి అందర్నీ చూస్తూ అన్నాడు.

ఓణీలు తప్ప ఎవరి దగ్గరా గుడ్డ ముక్క లేదు. పైగా కను చూపు మేరలో నీటి చుక్క కూడా లేదు. ఎక్కడ చూసినా ముళ్ళతుప్పలూ.. ఇసకా, రాళ్ళూ కలిసిన నేలా! చుట్టూ చూసి పెదవి విరిచారు అమ్మాయిలు.

సరిగ్గా అప్పుడే..

సాంబడి తల్లి, వెంకమ్మ బిందెతో నీళ్ళు మోసుకొస్తూ, ఏం జరిగిందో అని ఆగింది. వెంకమ్మకి నలభైకి అటూ ఇటూగా ఉంటుంది వయసు. చీర కొంగునే తిప్పి నెత్తిమీద చుట్టలాగ చేసి పెట్టి, దాని మీద బిందె పెట్టుకుని వచ్చింది. బిందెలో నుంచి ఒక్క నీటి చుక్క కూడా కింద పడకుండా నడవడం ఆ పల్లెలో అందరికీ అలవాటే.

"ఏందే.. సందడి? ఎవరది?" బిందె నడుం మీదికి దింపి, అపురూపంగా పట్టుకుని గుంపులోకెళ్ళింది.

"అయ్యయ్యో! పిల్లని అట్టా పడేట్టెందుకు చేశారే.. మీ బండ బడా! మీ ఆటలూ మీరూ.. ఒళ్ళు పై తెలవదు." బిందె కింద పెట్టి, తన కొంగు మీద నీళ్ళు చిలకరించి, ఆ తడి బట్టతో కృష్ణవేణి కాలు తుడిచి, చల్లని బట్టతో సున్నితంగా నొక్కసాగింది.

"మేవేం చేశా.. వేణికే కింద మీద తెలవదు, సాంబడి గొంతు వినగానే." మూతి తిప్పుకుని అమ్మాయిలందరూ జారుకున్నారు. అక్కడే ఉంటే వెంకమ్మ కామా కూడా లేకుండా వాయిస్తూనే ఉంటుంది.

వెంకమ్మకి స్వయంగా అన్న కూతురు కృష్ణవేణి. అన్నా చెల్లెళ్ళవి ఎదురుబొదురిళ్ళే. సాంబడూ, కృష్ణవేణీ ఒకర్నొకరు ఆట పట్టించుకుంటూ, పోట్లాడుకుంటూ పెరిగారు. ఏ రోజైనా కృష్ణవేణి కనిపించకపోతే సాంబడికి పిచ్చెక్కినట్లే ఉంటుంది. దాని జడ పీకి, నున్నితంగా మొట్టికాయ మొట్టి ఏడిపించాల్సిందే.

నూనూగు మీసాల యవ్వనంలోకి అడుగు పెడ్తూ ఉండగానే, అప్పుడప్పుడే ఓణీలు వేసుకుంటున్న కృష్ణవేణి వేరుగా కనిపించడం మొదలు పెట్టింది సాంబడికి. ఇద్దరికీ మూడేళ్ళు తేడా. అనురాగం నిండిన కళ్ళతో ఆరాధనగా చూస్తుంటాడు.

నూనె రాసి నున్నగా తలదువ్వి జడేస్తే.. అది నాలుగు వేళ్ళ వెడల్పున, సన్నని మెడ పక్కనుంచి కనిపిస్తూ పిరుదుల మీద నాట్యం చేస్తుంటుంది. జడ చివర్న పువ్వులా కట్టిన రంగు రంగుల రిబ్బన్లు కవ్విస్తున్నట్లనిపిస్తుంది సాంబడికి. కృష్ణవేణి అందం అంతా చెంపకి చారెడేసున్న కళ్ళల్లో ఉంది. తనేమనుకుంటుందో ముందు కళ్ళతో చెప్పి, ఆ తరువాతే నోరు విప్పుతుంది. అయితే అదేంటో.. ఎప్పుడూ కూడా తన మనసులో మాటేదీ సాంబడికి అంతు చిక్కనియ్యలేదు.

పొద్దు గూకులూ కృష్ణవేణి తన గురించేమనుకుంటోందో అనే బాధే వాడికి. బెట్టుగా ఉన్నట్టే ఉండి, అప్పుడప్పుడు బైట పడిపోతుంటాడు, ఆప్యాయతనంతా చేతల్లో చూపిస్తూ.. టౌను కెళ్ళినప్పుడు పూసలగొలుసో, రంగుల గాజులో తెచ్చిస్తుంటాడు. అస్సలు కృష్ణవేణిని చూడగానే వెలిగిపోయే ఆ మొహమే చాలు.. ప్రత్యేకించి చెప్పాలా!

ఇంక పెద్దోళ్ళా..వాళ్ళకి మహా గుట్టు. ఆ బ్రహ్మదేవుడు దిగొచ్చినా వాళ్ళ సంగతి కనిపెట్టలేడు. కృష్ణవేణి తల్లికి మాత్రం కూతురికి టౌన్లో సంబంధం చెయ్యాలని ఉంటుంది.. అదయినా, ఆ పల్లెటూళ్ళో తిప్పలు పడకుండా బ్రతకాలని కోరిక. గుక్కెడు నీళ్ళకి, పిడికెడు అన్నానికీ నడుం పగిలేట్టు నడవడం, చాకిరీ చెయ్యడం.. దానికైనా తప్పుతుందేమో అనే ఆశ.

"ఏమో.. ఎప్పుడేం రాసిపెట్టుందో, ఎవరికి తెలుసు? ఆ సమయం వస్తే అప్పుడు చూద్దాంలే.." వెంకమ్మ వేదాంతం చెప్తుంది, ఎవరైనా అడుగుతే. అదే సాంబడికి చెడ్డ చిరాకు. తన మనసులో పొంగిపోతున్న ప్రేమసముద్రాన్ని ఒడ్డుకు తాక్కుండా గట్టిగా పట్టుంచాడు. అదే ఎన్నాళ్ళు.. అనేదే వాడి ప్రశ్న! ఎప్పుడో తుఫానులా విరుచుకు పడ్తాడు.. తప్పదు. ఒక్క కృష్ణవేణి సరే అంటే చాలు.. ఎవ్వరడ్డు పెట్టినా!

వెంకమ్మ మాటల్లో ఎంత అనుభవం దాక్కుని ఉందో, ఉడుకు రక్తం మీదున్న సాంబడికి తెలియట్లేదు. ఏ క్షణంలో ఏమవుతుందో! పిల్లలకి ఆశ కల్పించడం ఇష్టం ఉండదు ఆవిడకి. తల్లి ఎందుకట్టా ఉదాసీనంగా ఉంటుందో.. ఓ మాటనేసుకోవచ్చు కదా!

తల్లి చేసే పరిచర్యలు చూస్తుంటే.. కొంచెం ఆశ కలిగింది. ఎంత ప్రేమ లేకపోతే అట్టా.. కాళ్ళు పట్టుకుని సేవ చేస్తుంది? అంతా బెట్టు.. మగపిల్లడి తల్లి కదా! సాంబడి మొహంలోకి చిరునవ్వు వచ్చింది.

సరిగ్గా అప్పుడే కృష్ణవేణి కళ్ళు తెరిచి చూసింది. కనుబొమ్మలు ముడుచుకున్నాయి. "తనకేమో ఇంత నొప్పిగా ఉంటే.. ఈన గారికి నవ్వొస్తాందా! వేషాలేస్తున్నాడు." కాలు చటుక్కున వెనక్కి లాగేసి, కూర్చోబోయింది.

"ఆగెహే! కాస్తంతైనా కుదుర్లేదు పిల్లకి.." తన చీర కొంగు చింపి గట్టిగా బిగించి కట్టుకడుతూ ముద్దుగా కసిరింది వెంకమ్మ.

నిశ్శబ్దంగా ఉన్న పరిసరాల్లో ఉన్నట్టుండి కలకలం..

"ఓహ్.. అయ్యయ్యో.. ఏందిరా ఇట్టైతాంది. ఎవర్రా అక్కడ.. కాసింత సాయానికి రండ్రా. వామ్మో! కొంపలు మునిగిపోతా ఉండాయిరా.." కలగా పులగంగా దూరం నుంచి, ఆక్రోశాలు.. ఆక్రందనలు.

మేనకోడలికి కట్టు కట్టేసిన వెంకమ్మ ఒక్క ఉదుటన లేచింది. సాంబడు, అంత హడావుడిలోనూ, కృష్ణవేణి కాలు జాగ్రత్తగా కిందికి పెట్టి కేకలు వినిపించిన వైపుకి పరుగెత్తాడు. అది ఒడ్డు వైపు నుంచే వస్తోంది.

వెంకమ్మకేం చెయ్యాలో తోచట్లేదు. అటు సూర్యుడు విజృంభిస్తున్నాడు. ఎండలో.. కాలిపోతున్న నేల మీద నడవలేని పిల్లని వదిలేసి వెళ్ళలేదు. అక్కడ.. నదొడ్డున ఏదో ఘోరం జరిగిందని తెలుస్తోంది. అంతలో దర్జీ మస్తాన్ తన లూనా మీద ఒడ్డు కెళ్తూ ఆగాడు.

"అర్జంట్ కాకుంటే దీన్ని కాస్త ఇంటి దగ్గర దింపి రాకూడదంట్రా?" మస్తాన్‌ని అడిగింది. మస్తాన్, సాంబడు ఒకే వయసు వాళ్ళు. మస్తాన్ పది పాసవుతూనే కుల వృత్తిలో చేరి పోయాడు. సాంబడు ఇంటర్ పాసయ్యి.. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. రోజూ టౌన్లో కాలేజీ కెళ్ళి చదూ కోడం ఆషామాషీ కాదు.

"అత్తా! నేను కూడా ఒడ్డుకొస్తా. మస్తాన్, నన్ను.. తీసుకెళ్లచ్చా" భయంగా తడ బడుతూ అడిగింది కృష్ణవేణి. కాలు నేల మీద పెట్టనియ్యట్లేదు. ఇంటి కైతే ఫర్లేదనుకుంది అత్త. మరి.. నదొడ్డుకి మస్తాన్ స్కూటర్ మీదంటే ఒప్పుకుంటుందా? అక్కడందరూ చూస్తే.. ఏమనుకుంటారో! అమ్మా వాళ్ళూ పడవలో వెళ్ళారంట.. అసలేమయిందో.. ఆతృతగా చూసింది కృష్ణవేణి.

"నేను కూడా అర్జంట్ గా అవనిగడ్డెళ్ళాలత్తా. దారాలు, బాపిన్ లూ తెచ్చు కోవాలి. కత్తెర కూడా విరిగి పోయింది." మస్తాన్ కి ఎటూ పాలు పోవట్లేదు. వెంకమ్మ అంటే చిన్నప్పట్నుంచీ గౌరవం, ఇష్టం. ఎన్నో సార్లు సాంబడితో వాళ్ళింట్లో పచ్చడి, చేపల పులుసుతో అన్నం తిన్నాడు. ఏదో అట్టా పడెయ్యటం కాదు.. ప్రేమతో ముద్దలు చేసి, కొడుకుతో తనక్కూడా పెట్టేది. కులం వేరు, మతం వేరు అని ఎప్పుడూ చూళ్ళేదు.

"సర్లే.. అట్టే పొండి. బండి మీద కలిసి ఇంటికెళ్తే ఒకటి, కిట్టమ్మ దగ్గరకెళ్తే ఒక్కటేనా?" వెంటనే మస్తాన్ బండి పరుగెత్తించాడు, కృష్ణవేణిని ఎక్కించుకుని.

వెంకమ్మకి మంచినీళ్ళ బిందె ఏం చెయ్యాలో అర్ధం కాలా. ఇంటికెళ్ళాలంటే కిలో మీటరు నడవాలి.

తిరిగి ఒడ్డుకి.. రెండు కిలోమీటర్లు. గుండె గుభేలు మంది. ఒడ్డున గోల ఎక్కువయింది.. ఊళ్ళో నుంచి జనాలు గుంపులుగా పరుగెత్తుకుని వెళ్తున్నారు.

"అత్తా! అర్జంట్ గా బండెక్కు. ఆ బిందట్టుకురా. నీళ్ళొంపేసి" మస్తాన్ కృష్ణ వేణిని దింపేసి వచ్చి వెంకమ్మ పక్కన బండాపాడు.

"ఏందిరా? గోల.." మాట్లాడకుండా.. వెంకమ్మ కూర్చోగానే బండిని పోనిచ్చాడు.

కృష్ణానది ఒడ్డున లూనా దిగగానే స్థాణువులా నిలబడి పోయింది వెంకమ్మ.

నదొడ్డున గందరగోళంగా, హృదయ విదారకంగా ఉంది పరిస్థితి. ఒకటే అరుపులు, పెడబొబ్బలు. ఎవరెటు పరుగెడుతున్నారో.. ఎవర్ని ఎవరు ఏం అడుగుతున్నారో..అంతా అయోమయం.

అద్దరికి వెళ్తున్న పడవ తల్లకిందులైపోయింది. పడవలో ఉన్న జనమంతా వడి వడిగా పారుతున్న కృష్ణమ్మ ఒడిలో పడిపోయారు. "అత్తా! అమ్మ, నాయన.." కృష్ణవేణి కాలు ఈడుస్తూ వచ్చి వెంకమ్మని వాటేసుకుంది, భోరుమని ఏడుస్తూ.

నీళ్ళల్లో కొట్టుకు పోతున్న వాళ్ళు కొందరు చేతులు పైకెత్తి ఊపుతున్నారు. కొంత దూరం వెళ్ళాక ఆ చేతులు కనిపించడం మానేశాయి. నావలో ఉన్న ఈతొచ్చిన మగాళ్ళు చేతికందిన వాళ్ళని, జుట్టు పట్టుకుని తీసుకొచ్చి ఒడ్డున పడేస్తున్నారు.

కృష్ణవేణి అన్న, ఇద్దరు చిన్న పిల్లల్ని ఒడ్డుకు చేర్చి, అమ్మని రక్షిద్దామని నీళ్ళలోకి దిగాడు. గజ ఈతగాడే.. అయితే ఏం లాభం.. ఉగ్ర రూపం దాల్చిన కృష్ణమ్మ ముందు అతని బలం పనికి రాలేదు. అమ్మతో సహా కొట్టుకు పోయాడు. నిస్సహాయులై, నీటి పాలయిన వాళ్ళందర్నీ తనతో సముద్రంలోకి తీసుకు పోయింది.. కృష్ణమ్మ.

"ఏమైందిరా? సాంబడేడిరా.." ఎలాగో నోరు పెగల్చుకుని అంది వెంకమ్మ.. గుండె దడదడ లాడుతుండగా.

"ఇక్కడున్నా లేమ్మా!" ఒళ్ళంతా నీళ్ళు కారుతూ వచ్చాడు సాంబడు.. అప్పుడే ఇద్దరు పాపాయిల్ని ఒడ్డుకి చేర్చి.. రొప్పుతూ, బట్టలు పిండుకుని ఇసకలో పడున్న వాళ్ల దగ్గరికి వెళ్ళాడు.

మస్తాన్ అప్పటికే సగం మంది చేత నోట్లోంచి నీళ్ళు కక్కించాడు, కడుపు నొక్కి.

మస్తాన్ కి ఈత రాదు. ఆ గ్రామంలో అతనొక్కడికే ఆ వయసు వాళ్ళలో ఈత రానిది. గుండె కొంచెం బలహీనంగా ఉందని చిన్నప్పుడు ఊళ్ళోకొచ్చిన మెడికల్ కాంప్ వాళ్ళు చెప్పారు. నీళ్ళల్లోకి దిగద్దని వాళ్ళమ్మ ఒట్టేయించుకుంది. అందుకే.. తను చెయ్యగలిగిన పనులు అతను చేస్తున్నాడు.

నీళ్ళు కక్కేశాక, తెలివొచ్చిన పిల్లలు అమ్మల కోసం గుండెలవిసేట్లు ఏడుస్తున్నారు. కొంత మంది ఇంకా తల్లి పాలు తాగుతున్న వాళ్ళే! ఎవరికీ ఏంచెయ్యాలో.. ఎక్కడ్నుంచి మొదలెట్టాలో అర్ధం అవడం లేదు. ఆడవాళ్ళు, అరవై ఏళ్ళు దాటిన మగవాళ్ళు చూస్తుండగానే నీళ్ళలో కలిసిపోయారు. ఇటువంటి ఉపద్రవాలు చూసిన వెంకమ్మే నడుం బిగించింది.

అక్కడున్న వాళ్ళల్లో మస్తాన్ దగ్గర మాత్రమే సెల్ ఫోనుంది. ఊరి సర్పంచ్ అవనిగడ్డలో ఉంటాడు.. పిల్లల చదువులంటూ. అతనికి ఫోన్ చేసి, వెంటనే జరగాల్సింది చూడమని చెప్పమంది.

ఏదయినా.. ఎంత త్వరగా చెయ్యాలన్నా.. కనీసం నాలుగయిదు గంటలు పడ్తుంది. వాళ్ళు ఉన్న చోటికి కాలి బాట తప్ప లేదు. ట్రాక్టర్లు, జీపులు మాత్రమే రాగలవు. మస్తాన్ లూనా ఒకటే అటూ ఇటూ తిరగ్గలిగిన మోటారు బండి. ముందు తాగడానికి నీటి చుక్క.. గొంతులు పీక్కు పోతున్నాయి జనాలకి.

వెంకమ్మ బిందే అక్కరకొచ్చింది. మస్తాన్ వంపెయ్యమని చెప్పినా, సగం నీళ్ళు ఉంచి పట్టుకొచ్చింది. అవి, దోసిళ్ళతో, పిల్లలకి తాగించారు. సర్పంచ్ కి ఫోన్ చెయ్యడం అయ్యాక బిందె తీసుకుని మంచి నీటి చెలమ దగ్గరికి వెళ్ళారు సాంబడూ, మస్తాన్.

జరిగింది చూస్తున్న సూర్యుడు కోపం ఆపుకోలేక చండ ప్రచండ రూపం దాల్చాడు. తన ప్రతాపమంతా ఆక్రోశిస్తున్న ఆ అసహాయ మానవుల మీద చూపిస్తున్నాడు. ప్రకృతి శక్తులు ఏకమయి తమ కోపాన్నంతా చూపిస్తాయి ఒక్కొక్కసారి..

"నీళ్ళు.. దప్పి.." ఒక్కొక్కళ్ళే పెదాలు తడుపుకుంటూ, రాచుకుపోయిన గొంతులతో ఏడుస్తున్నారు.

"సాంబా!" నాలుగేళ్ళ ముందు పిలిచిన ఆ పిలుపు.. ఆనందంతో, ఎగురుతూ.. చెరుకు గడలు తింటూ.. ఆట పట్టిస్తూ పిలిచిన పిలుపు.. ఇప్పుడు దీనంగా, సర్వం కోల్పోయి.. వంగిపోయి నిలుచున్న కృష్ణ వేణి నోట్లోంచి వచ్చింది. ఇంత కాలం, సిగ్గో, బిడియమో.. పెద్దల మౌనానికి భయపడో నోరు విప్పని కృష్ణవేణి, సాంబడ్ని పిలిచింది.. ఆక్రోశిస్తూ.

ఇంటి నుంచి గ్లాసులూ, ముంతలూ.. మంచి నీటి బిందె, తెచ్చి అందరి దాహార్తినీ తీరుస్తున్న సాంబడికి ఆ ఆర్తనాదం వినగానే గుండె చెరువై పోయింది. అప్పటికే పడుతూ లేస్తూ ఇంట్లో ఉన్న పాలూ, మజ్జిగ, నీళ్ళ బిందెలు, నెత్తిన పెట్టుకుని తీసుకొచ్చిన ఊరి ఆడంగులు బతికి బైట పడ్డ వారిని చూసుకుంటున్నారు.

సాంబడు, ఒక ముంత నిండా మజ్జిగ తీసుకుని కృష్ణవేణి దగ్గరికి వెళ్ళాడు.

"నాకిదేం వద్దు సాంబా! నా వాళ్ళు కావాలి. అమ్మా, నాన్నా, అన్నా.. ఏరీ.. ఎక్కడున్నారు? నేను కూడా ఆళ్ళ దగ్గరకే పోతా. ఒక్క దాన్నీ ఇక్కడేం చేయాల?" కృష్ణవేణి, నీళ్ళలో దూకడానికి పరుగెత్తింది.. అయోమయంగా చూస్తూ. అక్కడున్న అందరి పరిస్థితీ దాదాపుగా అదే..

సాంబడు, వెంకమ్మ చేతుల్లో ముంతని పెట్టి, రెండంగల్లో, కృష్ణవేణి జడని దొరక పుచ్చుకున్నాడు. గిరుక్కున తిరిగి వాడి రెండు భుజాలూ వేళ్ళతో గుచ్చుతూ, తలని ఎదకేసి కొట్ట సాగింది. కొండంత బలంగా అండగా నిలబడి, ఆ ఘాతాల్ని భరించాడు.. కదలకుండా!

సున్నితంగా, హత్తుకుని, తల నిమురుతూ ఓదార్చాడు.

"వేణీ! నీకు నే లేనా? మనకీ, ఆ గంగమ్మ తల్లికీ ఎప్పటాల్నుంచో ఉన్న బంధవే కదే ఇదీ! ఆవిడ గారికి ఆకలేసినప్పుడు తనలోకి లాక్కోడం మామూలే కద. ఊరుకోవే! నా బంగారు తల్లి కదూ!" మృదువుగా చెవిలో చెప్తూ, కొద్దిగా నీడున్న తుప్పల దగ్గరికి తీసుకెళ్ళి, కూర్చో పెట్టాడు.

"ఏం బంధం సాంబా? ఎన్నాళ్ళీ చివికి బతుకులు? గట్టి రోడ్లు, ఊరికి దగ్గర్లో మంచి నీళ్ళూ.. ఆస్పత్రీ, ఇయ్యన్నీ కలలేనా? ఇట్టా ఎంతమందిని పొట్టనెట్టుకోవాల?" వణుకుతూ, వెక్కుతూ.. గొణుగుతూ కళ్ళు మూసుకుని ఒరిగి పోయింది. సరిగ్గా గంట క్రితం, ఉరక లేస్తూ, ప్రపంచంలోని ఆనందమంతా తనదే అన్నట్లు ఆటలాడిన కృష్ణవేణి.

"ఏవైందిరా? పడవ ఎందుకట్టా ఒరిగిపోయింది? అదీ నడి మద్దిన.." దూరంగా ట్రాక్టర్ల శబ్దం వినిపిస్తుంటే.. కళ్ళకి అరచెయ్యడ్డు పెట్టుకుని చూస్తూ అడిగింది అప్పుడే అక్కడికొచ్చిన వెంకమ్మ.

"ఎప్పట్లానే తెల్లారీ తెల్లారకండానే తయారై పోయేరు ఊరోళ్ళంతా. అత్త, మామ.. సరుకులు తెచ్చుకోడానికి, బావ 'వల' రిపేరుకి.."

"సర్లేరా.. అది మామూలే గద.." నిస్త్రాణగా అంది వెంకమ్మ.. అసలు సంగతి చెప్పకుండా నాన్చుడు. విసుగనిపించింది. తల్లి హృదయమైనా, కొడుకు మీద అవధుల్లేని ప్రేమ ఉండీ.. వాడిక్కావలసింది చెప్పకుండానే తెలుసుకో గలిగినదైనా, ఆమెకి ఆ సమయంలో అర్ధంకానిది.. సాంబడు కూడా అదే స్థితిలో ఉన్నాడనీ.. మనసు, శరీరం కూడా మొద్దు బారిపోయి మెదడు చెప్పిన మాట వినట్లేదని.

"అర్జంట్ గా వెళ్ళొచ్చేయాలి.. ఇప్పుడు మంచి సీజన్ కూడా చేపలేటకి. నిన్న మొన్న డబ్బులు బాగనే మిగిలాయిలే. తిండి గింజలూ అవీ కావాలనీ.." ఏదో లోకంలో ఉన్నట్లు.. శూన్యంలోకి చూస్తున్నట్లు చూస్తూ.. కలగా పులగంగా మాట్లాడుతున్నాడు సాంబడు.

"సాంబా! ఏమయిందిరా?" వెంకమ్మకి అప్పుడు తట్టింది. తిండీ తిప్పలూ లేకుండా తిరుగుతున్నాడని. గ్లాసునిండా మజ్జిగ పోసి, పక్కన కూర్చుని తాగించింది. వాడి మొహంలో అలసట.. కళ్ళల్లో ఆపుకుంటున్న నీళ్ళు చూస్తుంటే కడుపులో పేగులు కదిలి పోయాయి వెంకమ్మకి. కళ్ళ లోంచి నీళ్ళు ధారలా కారిపోతున్నాయి.

"అమ్మా! నేను వద్దంటానే ఉన్నానే. ఎవ్వరూ ఇనిపించుకోలా."

తనకంటే అడుగున్నరెత్తున్న కొడుకుని పసిపిల్లడిలా ఒళ్ళోకి చేర దీసి అదుముకుంది. కొంచెం సేపటికి తేరుకున్నాడు సాంబడు.

"ఇరవై ఐదు మందికి మించి మోటర్ పడవలో ఎక్కకూడదే.. యాభై మందెక్కారు. అంత మటుకూ నెమ్మదిగా పారుతానే ఉంది కిట్టమ్మ. ఉన్నట్టుండి యెనకమాలే గాలి లేచిందట. పడవ ఊగిసలాడి కదిలి పోయిందట్నే! రెండో ట్రిప్పుకి వైటింగు చేస్తున్నాళ్ళు చెప్పారు. బాలంసింగు దెబ్బతిందంట. ఒక్క సారి అందరూ ఒకేపుకి ఒరిగేసరికి.. తలకిందులైపోయింది. ఇంకంతే.. అంతా ఆగవాగం. అప్పుడే నేనొచ్చా. కిట్టమ్మ ఉరకలేసుకుంటా వచ్చేసింది. కళ్ళముందే.. దూరమైపోయారే.." సాంబడు వెక్కుతూనే చెప్పాడు.

"అంతమందెక్కుతే ఏమవుద్ది మరి. మనోళ్ళకి ఎప్పటికి బుద్ధొస్తుందో!" పక్కనున్న వాళ్ళెవరో బొంగురు గొంతుతో అన్నారు.

"ఏం జేత్తార్రా మరి.. పడవ్వాడు బేరాన్నొదులుకుంటే ఎట్టాగని ఏడుత్తాడు. ఇప్పుడాడే ఇంతమంది నేడిపిత్తన్నాడు." వెంకమ్మ చుట్టూ చూసింది. "ఏడాడు? ఆడు కూడ పొయ్యాడా? గజీతగాడు కద.."

"నలుగుర్ని ఒడ్డుకు చేరదీశాడు. ఆడ్ని పడవే లాక్కెల్లిపోయింది అంగీ దాని మేక్కి తగిలి." ఇంకోడి గరగర గొంతు పలికింది.

అక్కడక్కడా ఉన్న ముళ్ళ పొదల అంతంత మాత్రం నీడల్లో ఇరుక్కుని గొంతుక్కూర్చున్నారు అందరూ. వేసుకున్న హవాయి చెప్పులు నేల మీదున్న వేడి నుంచి రక్షిస్తున్నాయి.

ఎవరికీ ఏడవడానిక్కూడా ఓపిక లేదు. స్తబ్దుగా అయిపోయారు.

అక్కడక్కడా పిల్లల ఏడుపులు సన్నగా వినిపిస్తున్నాయి. వాళ్ళకి పాలు పట్టించి, ఉన్నదేదో తినిపించీ ఊరుకోబెట్టారు ఊరి ఆడవాళ్ళు. మూడు నాలుగేళ్ళ పిల్లలు అక్కడే పొదల చాటున దాగుడు మూతలాడుకుంటున్నారు. మొత్తం పది మందున్నారు.

అంతలో.. ఒక ట్రాక్టర్ మీద, రెండు జీపుల నిండా జనం వచ్చి అక్కడ ఆగారు. సర్పంచ్ ఒక ట్రాక్టరు, రెండు జీపులు అక్కడికి చేరేశాడు అంతకు ముందెప్పుడో. డ్రైవర్లు మాత్రం అతనొచ్చినప్పుడే వస్తారు.

సర్పంచ్ కరుణాకర్, జీపు లోంచి దూకగానే జనాలంతా చుట్టు ముట్టేసి.. ఒకే సారి మాట్లాడ్డం మొదలెట్టారు.

"అందరూ ఊళ్ళో కెళ్ళి మాట్లాడుకుందాం రా! పదండి." కరుణాకర్ తనకి దగ్గరగా వచ్చిన ఇద్దరు ముగ్గురి భుజాల మీద చేతులేసి అన్నాడు.

"మరి కొట్టుకుపోయిన వాళ్ళ గురించి పట్టించు కోరాండీ?" నిస్సహాయంగా చేతులెత్తేశాడు సర్పంచ్.

"అందరూ సరాసరి సముద్రంలో కెళ్లి పోయార్రా. మీకు తెలవదా? ఎక్కడని వెతికిస్తాం. ఎప్పుడో ఎక్కడికో కొట్టుకొస్తారు. అది కూడా.." ఆపేశాడు. అక్కడున్న అందరికీ తెలుసు అతనేం చెప్పబోయాడో!

**కృష్ణా జిల్లా డెల్టా** ప్రాంతంలో ఒక లంక అది. రెండు పక్కలా కృష్ణానది పాయలు, ఒక పక్క సముద్రం.. మధ్యలో ఉన్న లంక. ఆ లంకలో ఉన్నవి నాలుగు పల్లెలు.

ఆ పల్లెల్లో ఒకటి.. 'నువ్వులారి పాలెం'. నూటాభై గడప ఉంటుంది ఆ పల్లెలో. నూలపాలెం అంటారు వాడుకలో.

ఏది కావాలన్నా టౌను కెళ్ళాల్సిందే. అక్కడికెళ్ళాలంటే కృష్ణానది పాయ దాటాలి. స్వతంత్రం వచ్చి ఇన్నేళ్ళయినా ఇంకా అక్కడ బ్రిడ్జ్ కట్టలేదు. అంతకు ముందు నాటు పడవల్లోనే దాటే వారు. ఆ తరువాత వాటికి మోటార్లు బిగించారు.

మోటారు బోటు వచ్చాక కాస్త బైటి ప్రపంచంతో బాంధవ్యాలేర్పడ్డాయి నూలపాలెం ప్రజలకి. పాలెం లోని పిల్లలు.. ఇద్దరు ముగ్గురైనా అవనిగడ్డ వచ్చి కాలేజీల్లో చదువుతున్నారు. పాలెంలో ప్రభుత్వ పాఠశాల, ఒక గ్రంధాలయం, ఒక ప్రాధమిక ఆసుపత్రి వచ్చాయి.

ఇరవై మంది వరకూ లూనా మోటరు బైకులు నడుపుతారు. వాళ్ళనే బాబ్బాబు అని బతిమాలి, పెట్రోలుకి డబ్బులిచ్చి.. రేవు దగ్గరకెళ్ళొస్తుంటారు నడవలేని కొందరు.

ఆ పెట్రోలుకి డబ్బుల్లేని వాళ్ళు కాళ్ళని నమ్ముకోవలసిందే.అదీ.. సగం అరిగిపోయిన హవాయి చెప్పులతో. ఊరికి కిలోమీటరు దూరంలో మంచినీళ్ళ బావి ఉంది. ఎవరైనా అక్కడికెళ్ళి మంచినీళ్ళు తెచ్చుకోవలసిందే. ఇళ్ళలో బావుల్లో అంతా ఉప్పు నీరే. కష్టమ్మీద పప్పు ఉడుకుతుంది.

ఏదైనా.. చేపలవనీ, కాయగూరలవనీ, కిరాణా సరుకులవనీ.. గంపల్లో పెట్టి, ఆ గంపని నెత్తి మీద పెట్టుకుని నడుస్తారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పడవల రేవు కెళ్ళి, మోటారు బోటెక్కేస్తుంటారు.

ఆ పడవల్లోనే.. నావ కున్న శక్తికి మించి ఎక్కించేసి నడిపేస్తుంటారు పడవ్వాళ్ళు.. అత్యాశకి పోయి.

అదే జరిగింది ఆ రోజు. ఊర్లో అందరికీ ఉప్పెనొచ్చినట్టు వచ్చి పడ్డాయి అవసరాలు. అవే వాళ్ల ప్రాణాలు తీశాయి. మరునాడు, విలేఖరులు.. రాజకీయ నాయకులు వచ్చే సరికి ఏముంది? ఏమీ ఎరగనట్టు మామూలుగా ప్రియుడి ఒడిలో వాలిపోవాలని ప్రేయసి

చూపించినంత ఉత్సాహంతో కృష్ణమ్మ సముద్రం కేసి గలగలా పారుతోంది.

పడవ మునిగిన జాడే లేదు, మళ్ళీ ట్రిప్పుకని ఎదురు చూస్తున్న యువకుల్లో కొందరు ఇంజనీరింగ్ స్టూడెంట్లు.. సర్వే కని నూలపాలెం వచ్చారు. వాళ్ళు తీసిన సెల్ఫోన్లలో ఫొటోలని బట్టి అక్కడ అంత ఘోరం జరిగిందని తెలిసింది. నీళ్ళంటే భయం లేని వాళ్ళు, గజ ఈత గాళ్ళూ నదిలో దూకి వీలయి నంత మందిని కాపాడారు.

ఆ సంఘటనని రకరకాలుగా వర్ణిస్తూ.. సెల్ ఫోన్ లలో తీసిని ఫొటోలని పదే పదే చూపిస్తూ.. అన్ని ఛానల్స్ వాళ్ళూ నాలుగు రోజులు చూపించారు.

"ఇరవై ఒకటో శతాబ్దంలో, ఆధునికత పరుగులిడుతున్న మన దేశంలో.. ఇంకా ఇటువంటి గ్రామాలున్నాయంటే నమ్ముతారా? తమ పదేళ్ళ పాలనలో ప్రభుత్వం ఏం చేసింది? కొత్త ప్రభుత్వమైనా నడక దారి వంతెనైనా కడుతుందా?" అనేక ప్రశ్నలు వేస్తూ. రాజకీయ నాయకుల్ని విసిగించేశారు. ప్రతిపక్షాల దాడి చెప్పనే అక్కర్లేదు.

అనేక విధాలుగా, వివిధ విశ్లేషకులతో చర్చలు జరిగాయి.

ఉన్నట్లుండి ఆ మారుమూల పల్లె ప్రాముఖ్యం సంతరించుకుంది. యమ్మెల్యే వచ్చి పరిసరాలని పరీక్షించి, అవసరమైన సహాయం చేస్తామని ప్రమాణం చేశారు. చనిపోయిన వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇస్తామన్నారు. అక్కడితో ఆ సంఘటనని పాత కాగితాల అడుక్కీ, ఛానల్స్ లోని ఆర్కైవ్స్ లోకి పంపించేశారు.

పాలెంలో మామూలుగానే రోజులు గడుస్తున్నాయి.

## 2

"ఒక్క దానివీ ఎట్టుంటావే.. మా ఇంటికొచ్చెయ్యి వేణీ! ఎట్టా ఉండేదానివే.. ఎట్టయి పోయినావో చూడు. ఇంక పన్లోకి, మడుసుల్లోకి పడాలి. మనవాళ్ళనే వాళ్ళు ఉన్నా లేకపోయినా పొట్ట నింపుకోక తప్పదు.. బట్ట కట్టకా తప్పదు. లే.. ముందీ కాపీ తాగు." ప్రేమనంతా కంఠంలోకి వంపి బతిమిలాడుతున్న వెంకమ్మని శూన్యంలోకి చూస్తున్నట్లు చూసింది కృష్ణవేణి.

మొహం అంతకీ కళ్ళే కనిపిస్తున్నాయి. బుగ్గలు లోతుకు పోయి, పళ్ళు బైటికొచ్చేశాయి. ఏం తిన్నా తినకపోయినా రోజూ చేపలు తినడంతో నిగనిగ లాడుతున్నట్లుండే చర్మం.. పొడారిపోయి.. పొడలు తేలి పోయింది. వెలిసిపోయిన పరికిణీ, జాకెట్టు.. ఇంకాసేపటిలో పేలికలైపోతుందేమో అన్నట్టున్న ఓణీ.. మూర్తీభవించిన శోక దేవతలాగ కృష్ణవేణి మూలనున్న దేవదారు పెట్టి మీద కూర్చునుంది.

ఒక గదీ, ఆనుకుని చిన్న వంటిల్లూ ఉన్న పెంకుటిల్లది. నెల క్రితం వరకూ కలకల్లాడుతూ ఉండేది. కృష్ణవేణి అన్న.. రాజా, అవనిగడ్డెళ్ళినప్పుడు ఏదో సినిమా చూసొచ్చి, ఆ కథని మళ్ళీ ఇంకో సినిమా చూసే వరకూ చెప్తుండేవాడు. రోజూ చేపల వేటకి వెళ్ళాల్సిందే. వేటలో పట్టిన చేపల్ని, అమ్ముకునొచ్చి ఇంట్లోకి సరుకులు తెచ్చేవాడు. సరుకులతో పాటుగా చెల్లికి రిబ్బన్లు, ఫేస్ పౌడరూ కూడా.. ఒక రోజున పెద్ద అద్దం తెచ్చి గోడకి బిగించాడు. ఆ రోజంతా కృష్ణవేణి సంబరవే సంబరం.

ఆ సంబరాన్ని చూస్తున్న అన్నగారు ఆనందిస్తుంటే, తల్లిదండ్రులకి కన్నుల పండుగే.

తనకి గుర్తున్నప్పటి నుంచీ ఒక్క రోజు కూడా అన్న కోపంగా తనని మాట అనడం వినలేదు. ఏదో ఆకతాయి తనానికి తప్ప. ఉన్నరోజు తినడం, లేని రోజు నీళ్ళు తాగి పడుక్కోడం. ఉన్నా లేకపోయినా కబుర్లకేం లోటులేదు ఎన్నడూ!

ఆ ఒంటి గదిలో ఒంటరిగా మిగిలిపోయింది కృష్ణవేణి. రోజూ వెంకమ్మే నాలుగు మెతుకులు తెచ్చి బలవంతాన తినిపిస్తోంది.

కృష్ణమ్మ కన్నెర్ర చేసి నెలయింది. అప్పుడప్పుడే పల్లె ప్రజలంతా తమ దిన చర్యల్లోకి దిగుతున్నారు.

ఉప్పెనలో కొట్టుకు పోయిన వాళ్ళు ముప్పై మంది లెక్కకొచ్చారు.

ఉపద్రవాలొచ్చినప్పుడు ఒకళ్ళిద్దరూ.. నలుగురూ అయితే పేర్లు చెప్పుకుంటారు. పదిమంది దాటితే ప్రజలకి తెలిసేది అంకెలే.. ఆయా కుటుంబాలకి తప్ప.

ఒకటి నుంచీ పదేళ్ళలోపు.. ఆరుగురు పిల్లలు బతికారు. నలుగురికి, తండ్రులు కూడా ఒడ్డుకి చేరగలిగారు. ఆ ఉధృతంలో ఎవరు ఎక్కడున్నారో.. ఎవరు ఎవర్ని ఒడ్డుకు చేరుస్తున్నారో.. అంతా గందరగోళం. ఆ పిల్లలకి ఫరవాలేదు.. ఉనికికి హాని లేదు. ఇళ్ళల్లో బామ్మలూ, తాతలూ ఉన్నారు. తండ్రుల ప్రేమైనా దక్కింది.

ఇద్దరు మాత్రం.. నాలుగేళ్ళ అబ్బాయి నాగరాజు, రెండేళ్ళ పాపాయి నాంచారి.. అనాథలయి పోయారు. కుటుంబం అంతా కొట్టుకు పోయింది. కృష్ణవేణికి లాగే! వెంకమ్మ, సాంబడుల పక్కిల్లే వాళ్ళది. ముందు ఒక వరండా, వెనుక ఒక గది ఉన్న తాటాకుల ఇల్లు. వెంకమ్మే ఆ వయసులో వాళ్ళ ఆలనా పాలనా చూస్తోంది.

వెంకమ్మకి నలభై ఏళ్ళే దాటినా.. మొయ్యగలిగిన కంటే ఎక్కువ భారాన్ని మోయించి, చెయ్యగలిగిన కంటే ఎక్కువే పనిని చేయించి, శరీరాన్ని దుర్వినియోగ పరిచి.. ముసలి రూపు వచ్చేసింది. ఎక్కడి కక్కడ కీళ్ళు కీచుమంటుంటాయి.

అసలే అంతంత మాత్రపు ఆదాయాలు. ఏ రోజు కా రోజు ఏదో విధంగా సంపాయించుకోవాలిసిందే.. చేపలు పట్టో, ఎండ్రకాయలేరో, టౌన్లో కూలి పనికెళ్ళో! మహా ఐతే నాలుగైదురోజులు పనికి వెళ్ళకుండా గడపగలరేమో! ఆ పైన ఇళ్ళల్లో కూర్చుంటే పస్తులే..

“అమ్మడూ! నీకే గదే నే చెప్పేది.. అంతలేసి గుడ్లేసుకుని అట్ట చూత్తవేమే! నిన్ను చూసుకునే నే బతుకుతున్నా. లేచి తానం పానం చూడే కాసింత..” వెంకమ్మ కూడా ఓపిక లేనట్లు బొంగురు గొంతుతో నీరసంగా అంది. వేణి ఉలక్కుండా పలక్కుండా కూచుంది.

వాకిట్లో బిందె చప్పుడు విని నెమ్మదిగా, నేల మీద రెండు చేతులూ ఆనించి, కష్టపడి లేచి నిలుచుంది వెంకమ్మ. కళ్ళు తిరిగినట్టనిపించింది. తనకి మాత్రం ఏమైనా ఎక్కుతోందా నోట్లోకి.. బతికుండాలి కనుక ఒకటో రెండో ముద్దలు నోట పడేసి నడుస్తోంది.

బిక్కుబిక్కుమంటూ, నోట్లో వేలేసుకుని నాంచారీ, దాని వెనుకే నాగరాజూ వచ్చారు. దిక్కు తెలియని పక్షుల్లా దీనంగా చూస్తున్నారు. ఆకలని చెప్పటం కూడ చేత కావటం లేదు. వాళ్ళకి ఏం జరుగుతోందో.. అమ్మా, అయ్యా ఎక్కడికెళ్ళారో.. అంతా అయోమయం. వాళ్ళింక రారని తెలిసిపోయింది. నిద్దరొచ్చినప్పుడు తమ గుడిసెలోకెళ్ళి, తెలివి రాగానే బైట కొచ్చేస్తున్నారు.

నాంచారి ఏడిచినప్పుడు, వెంకమ్మ ఊరడించి కాస్త అన్నం తినిపిస్తోంది. ఊర్లో అందరి స్థితీ అట్లాగే ఉంది. ఎవరూ ఎవర్నీ ఆదుకునేట్లు లేరు.

వెంకమ్మ మొగుడు, చాలాకాలం క్రితమే.. టౌను కెళ్ళి దివి సీమ మీద ఉన్నట్టుండి ఊడిపడ్డ ఉప్పెనలో తల్లీ తండ్రితో సహా కొట్టుకుపోయాడు. ఆడపనీ, మగపనీ చేసుకొస్తూ, సాంబడ్ని సాకింది. అన్నా, వొదినె కూడా ఆ వూరు రావలసి వచ్చింది, టౌన్నుంచి.

“ఏందే.. అట్ట నిలబడ్డారు. ఏం జెయ్యాల నేను.. పదండి రెండు చెంబులు నీళ్ళోత్తా.. ఎట్ట కంపు కొడ్తన్నారో చూడండి. సాంబ మామ నీళ్ళు తెచ్చినట్టున్నాడు. కాస్త మట్టి రాసి తోమతా. సబ్బుముక్కుంది గానీ ఈ నీటికి బంకై చత్తుంది.”

అప్పుడే సాంబడు, టాంకు నుంచి నీళ్ళు తెచ్చి గోలెంలో నింపుతున్నాడు. పాలెంలో గవర్న్ మెంటు కట్టిన నీళ్ళ టాంకులున్నాయి. లారీలతో రెండ్రోజులకోసారి నింపుతారు.. కానీ ఉప్పు నీళ్ళే. తాగటానికి, కాలవ కెళ్ళి తెచ్చుకోవాల్సిందే, నీళ్ళొదిలినప్పుడు.

పిల్లలిద్దర్నీ చెరో చేత్తో పట్టుకుని వంగుని గుమ్మం దాటి బయటికి రాబోయింది వెంకమ్మ.

సరిగ్గా గుమ్మం నడిమధ్యకి వచ్చే సరికి కొద్దిగా తలెత్తిందో ఏమో.. ఠక్కని నెత్తికి వాసం తగిలి, బొక్క బోర్లా పడిపోయింది. పిల్లలిద్దరికీ ఏంగాలేదు.. కానీ భయ పడి పోయి, గోడ పక్కకెళ్ళి కెవ్వుమని ఏడుపులు మొదలెట్టారు.

సరిగ్గా అప్పుడే, చివరి బిందె తీసుకుని సాంబడు వచ్చాడు.

తల్లిని నెమ్మదిగ లేవదీసి, చుట్టూ చూశాడు. ఏడుస్తున్న పిల్లలు.. నిర్వికారంగా పెట్టె మీద కూర్చున్న కృష్ణవేణి. అత్త కింద పడితే కూడా పట్టించుకోకుండా, చలనం లేకుండా కూర్చుంది.

నిస్సహాయతతో కూడిన కోపం.. ఏం చెయ్యలేని ఉక్రోషం.. మొహం ఎర్రగా అయిపోయింది సాంబడికి. వెంకమ్మని గోడ వారగా కూర్చోపెట్టి, భుజం మీదున్న తుండు తీసి తడిపి, నెత్తికి చుట్టాడు. వెంకమ్మ కళ్ళు మూసుకుని కూర్చుంది, స్పృహలో లేనట్టు.. పిల్లలు ఏడుస్తూనే ఉన్నారు.

పక్కకి తిరిగి చూశాడు. కృష్ణవేణి అట్లాగే నిశ్చలంగా కూర్చునుంది.

ఎంతో అపురూపంగా చూసుకోవాలనుకున్నాడు. తన ప్రేమనంతా రంగరించి మూటకట్టి కృష్ణవేణి దోసిట్లో పొయ్యాలనుకున్నాడు. తనకి ఊహ తెలిసిన నాటినుంచీ కలల్లో తేలిపోయాడు. అనుకున్నవన్నీ జరిగితే విధి గొప్పేముంది?

నెల రోజుల్నుంచీ ఓపిక పట్టాడు. ఎంత కాలం? ముసలి తల్లి ముప్పొద్దులా చాకిరీ చేసినట్టే ఉంటాంది. ఏం.. ఆమెకి మాత్రం బాధ లేదా? ఎందుకా తాపత్రయం.

ఆవేశం ఆగలేదు సాంబడికి. ఒక్క ఉదుట్న లేచి కళ్ళు పెద్దవి చేసి చూస్తున్న కృష్ణవేణి దగ్గరగా వెళ్ళి విసురుగా చెయ్యి పట్టి లేపాడు.

మొహం ఎదురుగా పెట్టి, చాచి చెంపదెబ్బ వేశాడు.

ఆ బలానికి కింద పడిపోయింది. లేపి, ఇంకోటి వేద్దామని చెయ్యెత్త బోయాడు. కృష్ణవేణి కళ్ళనుంచి జలజలా నీళ్ళు కారిపోతున్నాయి. అట్లాగే దెబ్బతినడానికి తయారయింది.. కానీ మాట లేదు. జుట్టంతా విడిపోయి, వీపంతా పరుచుకుంది. ఆ జుట్టుని ఇంకొక చేత్తో పట్టి తన దగ్గరగా లాగాడు.

అంతా చూస్తున్న పిల్లలు వెంకమ్మ దగ్గరికి వెళ్ళి, రెండు చేతుల్తో తట్టి లేపారు.

"ఏందిరా? పిచ్చెక్కిందా? ఏందా పని? కళ్ళల్లో పెట్టి చూస్కోవాల్సిన పిల్లని అట్టా చంపేత్తావా ఏంది?" లేని ఓపిక తెచ్చుకుని, కొడుకు చెయ్యి విడిపించి, గుండెకి హత్తుకుంది మేనకోడల్ని.

"అవునే.. పిచ్చే ఎక్కింది. ఎన్ని రోజులిట్టా.. స్మశానంలో ఉంటన్నామా, ఊర్లో ఉంటన్నామా? జనమ మెత్తాక చావకుండా ఉంటామా? చచ్చినోళ్ళతో మనవూ చత్తామా? నడ్డొంగిపోయి, కాళ్ళు ఈడ్చుకుంటా నువ్వూ.. కంట్లో నీటిని గుండెలోకి తోసేత్తూ నేనూ..ఇట్టా ఈవె గార్ని సాగదీత్తా ఉండాలా? నాకు తిక్క రేగిందంటే, తీస్కెల్లి సముద్రంలోకిసిరి పారేత్తానంతే. ఛత్.."

ఆవేశంతో ఊగిపోతున్న కొడుకుని ఒక పక్క.. భయంతో, దుఃఖంతో వణికి పోతున్న మేనకోడల్ని ఒక పక్క.. రెండు చేతుల్తో పట్టుకుని కింద కూర్చోపెట్టింది.

లేచి వెళ్ళి చీర కొంగు తడిపి, ఒకళ్ళ తరువాత ఒకరి మొహం తుడిచింది. సత్తు గ్లాసులో నీళ్ళు తీసుకొచ్చి ఇద్దరికీ, పసి పిల్లలకి తాపించి నట్లు తాపించింది.

జరుగుతున్నదంతా చూస్తున్న పిల్లలు మూలకెళ్ళి, చెరో బొటనవేలూ నోట్లో పెట్టుకుని కూచున్నారు.

"కష్టాలొచ్చినప్పుడే కాసింత ధైర్నం ఉండాలర్రా. అన్నీ సరాసరిగా పోతున్నప్పుడు మనం చేసేదేవుంది.. మన గొప్పతనవేవుంది?

ఇట్టా ఆగం అయినప్పుడే మన సత్తా ఏంటో తెలిసేది. నీళ్ళు తాగితే కడుపులో ఉండి పోతయ్యా? కుంచెం ఆగి బైటికెళ్ళిపోవూ? అట్టగే మడిసి ఈ భూమ్మీద పడ్డప్పుడు పైకి పోక తప్పదు. ఎక్కడునుంచొచ్చాడో తెలవదు. ఎక్కడికెళ్తాడో తెలవదు. మద్దినున్నప్పుడే ఈ మోహాలన్నీ. ఉన్నంతకాలం తినకా తప్పదు. ఆ తిండి సంపాయించుకోకా తప్పదు. సంపాయించుకోనానికి వెంపర్లాడకా తప్పదు. మీరిద్దరూ చిన్నోళ్ళు. ఉన్నంతలో సంతోసంగా ఉండాలి. నన్నూ సంతోసపెట్టాలి. ఇంక ఉసూరంటూ ఉంటం మానెయ్యండి. ఆ పిల్లల సంగతి ఏదో చూడాలి మనవే.”

వెంకమ్మ మంద్రస్వరంతో చెప్తూనే ఉంది.. తన కృష్ణవేణిని కొట్టినందుకు న్యూనతతో తలొంచుకుని సాంబడూ, కళ్ళ నిండా నీళ్ళతో వెంకమ్మనే చూస్తూ కృష్ణవేణీ విన్నారు. వింటూ మనసుకి పట్టించుకున్నారు. ఎవరికీ ఎంత సమయం గడిచిందో గుర్తు రాలేదు.

భీకర యుద్ధరంగంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చేసిన గీతోపదేశానికి ఏమాత్రం తీసిపోదు... తనదైన భాషలో, తనకున్న జ్ఞానంతో వెంకమ్మ చేసిన బోధ. నెల క్రితం ఆ పల్లెలో జరిగింది కూడా యుద్ధరంగానికి ఏమాత్రం తక్కువ కాదు. కాకపోతే అక్కడ మరణించిన వారు ధర్మానికి విరుద్ధంగా నడిచిన వారు కాదు. ఏవో చిన్న చిన్న మనస్పర్ధలు తప్ప అందరూ ప్రేమతో కలిసి మెలసి ఉండే వారే.

మరి.. ఎందుకంత విలయ తాండవం? ప్రకృతి కూడా తన ధర్మం తను పాటించిందనుకోవాలా! ఆటుపోట్లు మనిషికెట్లాగో గాలికీ, నీటికీ అగ్నికీ అంతే అనుకోవాల్సిందే.

“ఆరోజు అంత మంది ఆ పడవే ఎందుకెక్కాలి? కిష్టమ్మకెందుకు కోపం రావాలి? ఆ భగమంతుడు కూడా ఏవీ చెప్పలేడ్రా.. పిల్లలు చూడండి.. శోషొచ్చి పడి పోయారు. వీళ్ళ నేంచెయ్యాలన్నది మనం ముందుగా చూడాల్సిన పని. ఇప్పటికైతే.. అన్నం వొండేశా.. వేణమ్మా! వాళ్ళకి తానం చేపించి, నువ్వు కూడా చేసి బట్టలు మార్చుకున్రా. కాస్తంతైనా పడెయ్యకపోతే.. కడుపులో నారాయణుడు ఊరుకోడు.”

వెంకమ్మని లేపి నించోపెట్టి, సాంబడు, అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

కృష్ణవేణి కూడా లేచి కళ్ళు తుడుచుకుని, పిల్లల దగ్గరికెళ్ళి లేపింది.

“అక్కా!” సంభ్రమంగా చూశాడు నాగరాజు. నాంచారి మాట్లాడలేదింకా. నోట్లో వేలుంచుకునే కృష్ణవేణి కొంగు గట్టిగా పట్టుకుంది.. ఆ పట్టులోనే తన చిన్ని మనసులో భావాన్ని చెప్తూ.

కృష్ణవేణికి కడుపు తరుక్కు పోయింది. తనైతే మాట్లాడగలదు.. తన పని తాను చూసుకోగలదు. ఈ చిన్నారులు? వాళ్ళ కెవరున్నారు? ముందు ముందేం చెయ్యాలన్నది తర్వాత. అప్పటి మట్టుకైతే మనిషి జన్మెత్తినందుకు తను చెయ్యగలిగింది చెయ్యాలి కదా!

నాంచారిని ఎత్తుకుని చంకనేసుకుని, నాగరాజుని నడిపిస్తూ, నీళ్ళ గోలెం దగ్గరికి తీసుకెళ్ళింది. వాళ్ళ వెనుకే వెంకమ్మ వచ్చి అక్కడున్న దణ్ణెం మీద పాత తుండు పడేసి లోపలికెళ్ళింది. బండ మీద కాస్త ఉల్లిపాయ తొక్కు నూరదామని.

కృష్ణవేణి, నాగరాజుని రాతి మీద నిల్చోపెట్టి బట్టలిప్పింది. వెన్నెముకకి అంటుకుపోయింది కడుపు. చూడలేక.. కాసేపు కళ్ళు మూసుకుంది. గట్టిగా ఊపిరి పీల్చి వదిలి, చెంబుతో నీళ్ళు పోసింది వాడి వంటి మీద. ఆ పసి వాళ్ళ మీద తెలియని ప్రేమ, ఆప్యాయతా విరుచుకు పడ్డాయి, కృష్ణవేణి గుండె లోతు ల్లోంచి.

ఎంత అమాయకంగా ఉన్నారు.. వీళ్ళ భవిష్యత్తేంటీ? పధ్నాలుగేళ్ళ అమ్మాయే అయినా.. సహజంగా స్త్రీ కుండే మాతృ హృదయం ఘోషించింది. ఒక్క సారి తలెత్తి ఆకాశం కేసి చూసి కనిపించని దేవుడిని ప్రశ్నించింది.

“అక్కా! అమ్మా, నాయన ఇంక రారా?” అమాయకంగా అడిగాడు నాగరాజు. అన్ని రోజుల తరువాత వాడికి అడగడానికి ఒకళ్ళు దొరికారు. వెంకమ్మ యాంత్రికంగా వాళ్ళని కాచుతోంది.. కానీ ఆ స్పర్శలో అక్కర కనిపించలేదా చిన్నారికి.

కడుపు తరుక్కుపోయినట్టయింది కృష్ణవేణికి.

"కిష్టమ్మ తల్లి మీ అమ్మనీ నాయన్నీ, మా అమ్మనీ నాయన్నీ, మా అన్ననీ పట్టుకు పోయిందిరా కన్నా!"

"ఎందుకక్కా? మనం కూడా ఎల్దామా? ఎల్లి ఆడనే చేపలు పట్టేద్దాం. కిట్టమ్మ తల్లి ఇంటో బోలెడన్ని చేపలుంటయ్యి కదా? మనల్నెందుకు తీసుకుని పోలే? అన్ని డబ్బులు వస్తయ్యా?" రెండు చేతులూ బార చాపి అడిగాడు రాజు.

కృష్ణవేణికి ఏం చెప్పాలో.. ఆ పసివాడిని ఎట్లా సముదాయించాలో అర్థం కాలేదు. దగ్గర్లోనే చింపిరి జుట్టేసుకుని నాంచారి, కళ్ళు పెద్దవి చేసి చూస్తోంది. దానికేం చెప్పినా అర్థం కాదు.

"వెళ్దాంమురా.. అందరం వెళ్ళేదే అమ్మా వాళ్ళున్న ఇంటికి. మరి కిష్టమ్మ మనల్ని కూడా పిలవాలి కదా! పిలిచే వరకూ మనం అల్లరి చెయ్యకుండా ఉండాలి. అక్క చెప్పినట్టే చెయ్యాల. అట్టగేనా?"

తలూపాడు నాగరాజు.. అమ్మ నాయన ఇంక రారని తెలిసి నట్టుగా.

బండ మీద నాలుగు ఉల్లిపాయలు, నాలుగు ఎండు మిరపకాయలు, ఇంత ఉప్పు వేసి నూరుతూ వెంకమ్మ అంతా గమనిస్తూనే ఉంది. కృష్ణవేణి మనుషుల్లో పడుతున్నందుకు ఆనందంగానే ఉంది.. కానీ ఆ పిల్లల మీద ప్రేమ పెంచుకుంటుందేమో.. ఇందర్ని సాకడం సాధ్యమేనా? సాంబడు వచ్చాక ఇద్దర్నీ కూర్చోపెట్టి మాట్లాడాలనుకుంటూ, నూరిన పచ్చడి దాకలోకి తీసి, లోపలికి నడిచింది.

అన్న ఇంట్లోనే, కిరసనాయిల్ స్టౌ వెలిగించి అర్ధశేరు బియ్యం ఉంటే ఎసరు పెట్టి పోసింది. గంజి వార్చి, కుండలో దాచింది. రాత్రికి బియ్యం ఉంటుందో లేదో.. ఏదీ లేకపోతే గంజైనా తాగి పండుకోవచ్చు.

-----------------------------..

"అమ్మా! మాంచి వాసనేత్తాందే.. ఇన్ని రోజులకి కాస్త ఇల్లనిపిస్తాంది." సత్తు పళ్ళెంలో వేడి వేడి అన్నంలో ఉల్లి పాయ కారం కలుపుతూ అన్నాడు సాంబడు.

పక్కనే కూర్చుని, గిన్నెలో అన్నం మెత్తగా కలిపి, కొద్దిగా ఉప్పు, ఉల్లికారం వేసి, ముద్దలు చేసి, పిల్లల నోట్లో పెడుతోంది వెంకమ్మ. కృష్ణవేణి స్నానం చేసి, బట్టలు మార్చుకుని వచ్చింది. ఆ కాస్త శ్రద్ధ చూపినందుకే మొహం తేటగా ఉంది.

అదే కాల మహిమ. ఎన్నో భరించలేమనుకున్న విషయాలని తనలో దాచుకుంటుంది.. ఊరడించి ఓదారుస్తుంది. ఈ క్షణంలో ఎంతో ప్రాముఖ్యమయిన సంఘటన, ఒక సంవత్సరం ఆగుతే ఇంతేనా అనిపిస్తుంది. ఎంతో భయం, దుఃఖం కలిగించిన వార్తని ఒక చరిత్ర గా మారుస్తుంది. కొత్త కొత్తగా దొరికే ప్రేముడిలో బంధిస్తుంది.

"అమ్మాయ్! దా.. నీక్కూడా ముద్దలు పెడతా.." చేతినిండుగా కలిపిన ముద్దని కృష్ణవేణి నోట్లో పెడదామని చెయ్యి చాపింది వెంకమ్మ.

"మనిద్దరం తిందాం లే అత్తా! ముందు సాంబడు బావనీ, పిల్లల్నీ తిననీ. అంతలోకి నేను వాకిలూడిచి వస్తా." చీపురు తీసుకుని వెళ్తున్న కృష్ణవేణి వంక మాటల కందని భావంతో చూశాడు సాంబడు. ఆ చీపురు తను తీసుకుని ఊడిచేస్తే.. తొందరగా తినెయ్య సాగాడు.

"చాన్నాళ్ల తర్వాత, నోటికి ఇతవుగా ఎల్తాందమ్మా! నువ్వు, కృష్ణవేణి తినండి. అన్నం ఉందా, కాసిన్ని బియ్యం కడక్కరానా?"

"అక్కర్లేదురా.. అర్ధశేరు పైనే వండా.. రేపటికి మాత్తరం వస్తయ్యి బియ్యం. రేపేదైనా పనికెల్లాల్సిందే."

"అట్టగే." సాంబడు లేచి, తన పళ్ళెం శుభ్రంగా కడుక్కొచ్చాడు. పిల్లలిద్దరూ, కడుపులు నిండాయేమో.. వెంకమ్మ పరచిన బొంత మీద పడుక్కున్నారు.



KOUMUDI

"ఎల్లి, అన్నంతిను పా.. నేనూదుస్తా." కృష్ణవేణి చెంపని చూస్తూ, చేతిలో చీపురందుకున్నాడు సాంబడు.. నల్లగా కములుతోన్న చెంపని, చేత్తో సున్నితంగా తడమాలన్న కోరికని బలవంతంగా ఆపుకుంటూ.

తలొంచుకుని, చీపురు వదిలేసి లోపలికెళ్ళిపోయింది కృష్ణవేణి.

మనసులో చివుక్కుమంది సాంబడికి. నిజమే.. "అంత పెద్ద చెంప దెబ్బ కొట్టి ఉండాల్సింది కాదు.." అనుకున్నాడు. ఏ దెయ్యం పట్టిందో ఎదవపని చేశాడు. మొహం చిన్న బుచ్చుకుని ఊడవడం మొదలు పెట్టాడు.

"అమ్మా!" చిన్నగా అరిచింది కృష్ణవేణి. కమిలిన చెంపమీద వేడి నీళ్ళలో దళసరి బట్ట ముంచి నెమ్మదిగా వత్తుతోంది వెంకమ్మ.

"వట్టి మొరటు బండెదవ. ఇంత గట్టిగానా కొట్టేది. కాస్త ఓర్చుకోమ్మా. పిండి కట్టుకడ్తా. వాపు తీసేస్తుంది."

"సాంబడ్నేం అనద్దత్తా. నాదే తప్పు. పెద్దదానివని చూడకుండా నీకెంత కష్టం కలిగిస్తన్నా.. ఇప్పటికైనా కళ్ళు తెరిచుకునేట్టు చేశాడు. ఆనిక్కి సముద్రపొద్దుకెళ్ళి ఇసకలో ఎండ్రకాయలేవన్నా దొరకతయ్యేమో చూస్తా." పంటి బిగువున బాధ భరిస్తూ అంది కృష్ణవేణి.

అప్పుడే వాకిలి ఊడిచి లోపలికొస్తున్న సాంబడు ఆ మాట విన్నాడు. ముడుచుకున్న కనుబొమ్మలు విడివడ్డాయి.

అప్పటి వరకూ మనసులో తొలిచేస్తున్న బాధ చేత్తో తీసేసినట్లయి పోయింది. అదీ.. భరించరాని బాధ. నిద్రలో మెలకువలో అదే ధ్యాస.. అట్టా కొట్టుండాల్సింది కాదు. ఏ దెయ్యం పట్టిందో!

"అమ్మయ్య.. కిష్టవేణి నా బాధ అర్ధం చేసుకుంది. ఇంక మడుసుల్లో పట్టానికి ఎక్కువ టయం పట్టదు." ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ తలుపు మూల చీపురు తగిలించి, గోడ వారగా ఉన్న చెప్పులు చేత్తో తీసుకుని వాకిట్లోకి నడిచాడు.

"అమ్మా! అట్టా ఊళ్ళోకి పోయొస్త. ఏం జరుగుతా వుందో.. బావయ్య వల బాగు చేయించడానికి కుదుర్తాదేమో చూస్తా. కొత్త వల కొంటానికి డబ్బుల్లేవు."

బావయ్య అన్నందుకు నాలిక్కరుచుకుని, కృష్ణవేణి వంక ఓరగా చూశాడు సాంబడు. అనవసరంగా దాని అన్న పేరెత్తా.. ఏం గోల చేస్తుందో అని భయ పడుతూ.

కృష్ణవేణి ఏం మాట్లాడకుండా లేచి దొడ్లోకెళ్ళి పోయింది.

"మస్తాన్ ని అడిగి చూడ్రా.. రిపేరింగ్ చేసిత్తాడేమో. ఇప్పటికి పని నడుస్తే.. ఆనిక్కి చూసుకోవచ్చు."

సాంబడు వాళ్ళింటి తాళం తీసుకుని వెళ్ళిపోయాడు

**"అత్తా! నువ్వు** ఇక్కడే పండుకో రాదా? రేత్రి భయం వేస్తోంది నాకు. పిల్లలైతే ఆళ్ళింటికే పోతన్నారు. ఎట్టుంటన్నారో.. అర్ధమే కాదు. ఇప్పట్నుంచీ ఇక్కడ్నే పడుకోబెట్టాల. అస్సలా ఇల్లెట్టుందో.. పోయి శుభ్రం చెయ్యాల."

"అట్టగే అమ్మాయ్! ఎక్కడైతే ఏంది? పిల్లలకి అలవాటైంది కదా.. అక్కడ్నే ఉండనిద్దాం. ఇయేట్టికి కానీ ఇట్టా. టౌన్నించి ఎవుళ్ళో వచ్చి, అనాధ పిల్లల్ని ఆస్టల్లో ఏత్తారంట. ఎప్పుడో.. ఇవేల రేపట్లో వత్తారంట. పంపేద్దాం."

కృష్ణవేణి దెబ్బతిన్నట్టు చూసింది. అనాధ హాస్టలా? లైబ్రరీలో ఉన్న పుస్తకాల్లో రకరకాల కథలు చదివింది ఆ హాస్టళ్ళ గురించి. పురుగులన్నం, నీళ్ళ చారూ, వీపుకంటుకుపోయిన కడుపులూ, వెళ్ళుకొచ్చిన పక్కటెముకలూ.. అమ్మో! రాజు, నాంచారీ పుట్టినప్పట్నుంచీ కృష్ణవేణి ఒడిలోనే పెరిగారు. వాళ్ళమ్మ చేపలేటకెళ్తే అక్క పక్కనే పండు కొనే వాళ్ళు.

కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లు తుండగా వెళ్ళి పిల్లల పక్కలో పడుక్కుని, నాంచారి తల నిమురుతూ ఆలోచనలో పడింది. 'ఊ.." అని మూలిగి,



KOUMUDI

మరింత ముడుచుకుని పడుక్కుని నోట్లో వేలు పడేసి, నిద్దర్లోనే చప్పరించ సాగింది నాంచారి.

"ఏం చెయ్యాలి? అట్టా వదిలెయ్యటమేనా? ఇంకో మార్గం లేదా? అదే తన పక్కన పుట్టిన వాళ్ళైతే.. అస్సలా తలపే ఉండేది కాదు. పరాయమ్మ కన్న బిడ్డలు కదా! ఎవురడుగుతారు? ప్చ్.. లాభం లేదు. పొద్దు పొడిచిన కాడ్నించి ఎన్ని కుదుర్చుకోవాలి.. పిల్లల్ని పెంచటవంటే మాటలా? ఇంత చిన్న వయసులో ఎంత కష్టమొచ్చింది వీళ్ళకి? తనకే తాడూ బొంగరం లేకుండా పోయింది.." అట్లాగే కళ్ళు మూసుకుని రకరకాల ఆలోచనల్తో నిద్దర్లోకి జారుకుంది.

వెంకమ్మ గ్రహించింది కృష్ణవేణి బాధని. ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు? తనకి మాలిన ధర్మం ఎంత వరకూ సాగుతుంది? ఏందో.. ఈ లంక బతుకులు? అస్సల్కి లంకనే ఊడ్చి తీసికెళ్ళకూడదూ ఆ కిట్టమ్మ.. అటు చావనియ్యదు.. ఇటు బతకనియ్యదు.

మళ్ళీ అంతలోనే చెంపలు వాయించుకుని దణ్ణం పెట్టుకుంది. నాలుగు వేళ్ళూ నోట్లోకెళ్తన్నాయంటే ఆ తల్లి దయే కద! ఒకప్పుడెంత కళకళ్ళాడుతూండేవీ.. ఈ లంకలో గ్రామాలు! తన చిన్నతనం కళ్ళ ముందు తిరుగుతున్నట్టే వుంది.

ఎక్కడ చూసినా.. కను చూపుమేర పచ్చని వరి పంట.. ఆనందంగా గాలికి ఊగుతూ పలకరించే కంకెలు.. పంటక్కావలసినప్పుడు పడే వానలు. పొలాల గట్ల వెంబడి పరుగెత్తుతుంటే కాలం తెలిసేదే కాదు. నాట్లెప్పుడెయ్యాల, కుప్ప ఎప్పుడు నూర్చాల, బస్తాలకెప్పుడెత్తాల, పట్నం తీస్కెళ్లటాన్కి నావలో చెయ్యాల్సిన ఏర్పాట్లు.. పొద్దు గూకులూ అవే మాటలు ఊరంతా!

"ఏవీ అవన్నీ.. ఏడ పోయినయ్యి? నారాయడు పట్టుకెళ్ళిపోయాడా తనతో.." కళ్ళనుంచి కారుతున్న నీటిని తుడుచుకుని, పై బొంతని కాళ్ళ మీదినుంచి కప్పుకుని కాళ్ళు ముడిచి పక్కకి తిరిగి పడుకుంది. నిద్దరొస్తేనా? గతం అంతా కళ్ళ ముందు తిరిగింది. ఎప్పటి మాట.. పదిహేనేళ్ళు దాటిపోలా? అయితేనేం.. నిన్న మొన్న జరిగినట్టుంది.

3

అప్పుడే.. వెంకట లక్ష్మికి పధ్నాలుగేళ్ళు నిండాయి. నాలుగిళ్ళవతలున్న బళ్ళో ఎనిమిదో క్లాసు వరకూ చదివింది. కూడికలూ, తీసివేతలూ, గుణకారాలూ, భాగారాలూ చెయ్యగలదు. పేపరు కాగితం ముక్క కనిపించిందంటే చదవకుండా వదలదు.

వెంకటలక్ష్మీ వాళ్ళుండేది ఒక మాదిరి టౌను. రెండు సినిమా హాళ్ళూ, ఒక బాంకూ, హోల్ సేల్ మార్కెట్టూ, ఒక గవర్నమెంటాసుపత్రీ, రెండు ప్రైవేటాసుపత్రులూ, బ్రాందీ షాపులు.. వగైరాలన్నీ ఉన్నాయి.

తండ్రీ, ఇద్దరన్నదమ్ములు.. ముగ్గురూ బెస్తవాళ్ళ దగ్గర చేపలు కొని మార్కెట్లో అమ్ముతారు. కాస్తంత ఉన్నవాళ్ళే. ఓ మాదిరి పెంకుటిల్లు, ఆనుకుని ఎకరం తోట ఉన్నాయి.

ఇంట్లో వాళ్ళు చదువు మానిపించేశాక, వంటా వార్పూ.. ఇంటి పనీ, బజారు పనీ.. అప్పుడప్పుడు స్నేహితురాళ్ళతో, ఇంట్లో వాళ్ళతో బెంచి టికెట్టో, నేల టికెట్టో కొని సినిమాలు చూడ్డం.. ఇవీ వెంకటలక్ష్మి చేసే పనులు. ఏదైనా బండపనుంటే.. వాళ్ళమ్మే చూసుకుంటుంది.

అప్పుడప్పుడే ఊహల్లో తేలిపోవడం తెలిసింది. బంధువులు కలిసినప్పుడు.. ఆడవాళ్ళు చేసుకునే వేళాకోళాలకి అర్థాలు తెలుస్తున్నాయి. పిల్లకి పెళ్ళీడొచ్చింది.. ఎప్పుడెప్పుడూ? ఊదరగొట్టేస్తున్నారు చుట్టాలు. వాళ్ళిళ్ళల్లో పదమూడు నిండకుండా చేసెయ్యాలి. అది రూలట.

"గాడిద గుడ్డేం కాదూ! మా ఇట్టం వచ్చినప్పుడు చేస్తాం.. ఈల్ల గోలేంటంటా!" నాయన చిందులేశాడు. ఇంటికి మాలక్ష్మి అని కూతురంటే ప్రాణం అతగాడికి.

"ఇది పని కాదు. బాగోదు. ఇంక మగపిల్లలక్కూడా సెయ్యాల.." పెళ్ళాం సర్ది చెప్పింది.

సరిగ్గా అప్పుడే నారాయడి సంబంధం వచ్చింది. మధ్యవర్తి తెగ పొగిడాడు అబ్బాయినీ, కుటుంబాన్నీ. పిల్లా పిల్లాడూ నచ్చుకున్నారు.. పెళ్ళైపోయింది.

నాలుగెకరాల మాగాణి భూముందని, లంకలో ఉన్నా, నావలో ప్రయాణం చెయ్యాల్సినా.. నూలపాలెంలో పిల్లనిచ్చారు. టౌన్నుంచి బస్సెక్కి, పడవలో రేవు దాటి, రెండు కిలోమీటర్లు నడిచి వెంకటలక్ష్మిని చూట్టానికొచ్చేవాడు తండ్రి. అయితే.. అత్తమామలు.. ఒక్కడే కొడుకవడంతో కోడల్ని కన్నబిడ్డలా చూసుకుంటారు. అది చాలు కదా, ఏ పుట్టింటి వాళ్ళకైనా!

“యెంకీ! ఏడున్నవే. ఊరు ఊరంతా సంబరాలు చేసుకుంటా ఉంటే ఒక్క దానివీ ఇంటి కాడేం చేత్తన్నా?” నారాయడు ఆమడకో అంగేసుకుంటూ వచ్చాడు. వాడి పెళ్ళైన రెణ్ణెళ్ళకే చేతికొచ్చింది పంట. అమ్మోరి జాతర బ్రహ్మాండంగా జరుగుతోంది. పాలెంలో పండగే పండగ.

వచ్చినవాడు వచ్చినట్లు గుమ్మం దగ్గరే నిలుచుండి పోయాడు.

వెంకటలక్ష్మి అప్పుడే స్నానం చేసి ఎర్రంచు ముదురాకుపచ్చ చీర కట్టి, జాకిట్టు ముడేసుకుంటోంది. కిటికీ తలుపులు వేసున్నా, తలుపు సందుల్లోంచి సూరీడు తన కిరణాల్ని లోపలికి పంపి, సరిగ్గా వెంకటలక్ష్మి మొహం మీద పడేస్తున్నాడు. బుగ్గల మీద అక్కడక్కడా నిలిచిన నీటి బిందువుల్లోంచి పరావర్తనం చెందిన కాంతులు ఇంద్ర ధనుస్సు రంగుల్ని వెదజల్లుతున్నాయి. జుట్టంతా పైకి లేపి నడి నెత్తిన ముడి వేసింది. రింగు రింగులు తిరిగిన వెంట్రుకలు నుదుటి మీద అల్లల్లాడుతున్నాయి

వింతకాంతులు వెదజల్లుతున్న వెంకటలక్ష్మిని చూస్తుంటే నారాయడుకి గొంతంతా ఎండిపోయినట్లయింది. తను వచ్చింది కూడా గమనించకుండా, దీక్షగా, కళ్ళు దించి కొసలు ముడేసుకుంటున్న వెంకి, అలికిడికి తలెత్తి చూసింది.. అమాయకంగా, కళ్ళు పెద్దవి చేసి.

“అబ్బ.. ఎంత ముద్దొస్తున్నావే యెంకీ! ఆలీశం చేసి మంచి పన్జేశా.. ఇంట్లో మనిద్దరవే.. ఇల్లు ఇల్లంతా మందే! వచ్చేత్తన్నా..” ఒక్క ఉరుకులో ముందుకొచ్చాడు.

“అబ్బా! ఉండు మావా.. ఆలీశం అయిందని నువ్వే అంటన్నావుగా!” విడిపించుకుందామని మెలికలు తిరిగింది.

“మరేం గాదులేవే.. ఆ సంబరాల్లో మనల్ని అంత గమనిస్తారా ఏంది. యెల్దాం తీరుబడిగా.. అమ్మకి చెప్పొచ్చాలే.”

వెంకి బుగ్గలు సిగ్గుతో ఎర్ర బడ్డాయి. కళ్ళ నిండా ప్రేమ నింపుకుని చూసింది నారాయడిని.

“ఎందుకే అంతిట్టం నేనంటే?” ఎదకి హత్తుకుని అడిగాడు.

“కల్లు గిల్లు తాక్కుండా నన్నింత చక్కంగా చూసుకుంటే ఇట్టం ఉండదా ఏంటి?”

ఒక్క సారి గతుక్కుమన్నాడు. సర్దుకుని, వీధి తలు గడియ పెట్టొచ్చి, చిరునవ్వు నవ్వుతూ వెంకి నుదుటి మీద చుంబించాడు నారాయడు. వారానికి మూడు సార్లైనా కల్లు లేపోతే ఊరకుండలేని నారాయడు అప్పుడే శపథం చేసేసుకున్నాడు. పెళ్ళిగాక ముందటి సంగతేమో కానీ.. ఇంక జన్మలో తాక్కూడదని ఆ క్షణంలోనే ఒట్టేసుకున్నాడు.

ఏకాంతం ఎంత ఆనందం ఇస్తుందో అప్పుడే అనుభవం అయింది ఇద్దరికీ. అమ్మా, నాన్నా తమ చేష్టల్ని చూస్తున్నారేమోననే భయంతో.. దొంగ చాటుగా, మొక్కుబడిగా చేసే సంసారానికీ, స్వేచ్ఛగా హద్దులే లేని శృంగారానికీ ఉన్న తేడా అప్పుడే తెలిసింది.

ఏదేమైనా దీనికో మార్గం చూడాలనుకున్నాడు నారాయడు.

ఒక గది, దానికానుకున్న వరండా, అందులోనే ఒక పక్క చిన్న వంటిల్లు ఉన్న పెంకుటిల్లది. నారాయడి తల్లీ తండ్రీ, రాత్రయ్యే సరికి, వరండాలో చాపలేసుకుంటారు. చీకటి పడగానే ఊరు ఊరంతా నిశ్శబ్దమై పోతుంది. పెళ్ళికి ముందు నారాయడు వరండాలో పడుక్కునే

వాడు. చలికాలం వస్తే.. రెండు బొంతలు కప్పుకున్నా వణుకుతూ.. ఏ అర్ధ రాత్రికో నిద్రపోయే వాడు.

"ఏంది మావా అట్ట కూర్చున్నా?" మొహం కడుక్కుని, చీరా జాకెట్టూ మార్చుకుని వచ్చి అడిగింది వెంకటలక్ష్మి, దీర్ఘాలోచనలో ఉన్న నారాయడ్ని.

"ఏం నేదే.. ఇంక పదేను రోజుల్లో చలికాలం వస్తంది. అమ్మా, నాయన ఆ వరండాలో చల్లో పడుక్కోవాలి. మనక్కూడా కాస్త చాటు కావాలని ఇప్పుడే తెలిసింది. అదే.. ఏం జెయ్యాల్నా అని ఆలోచిత్తన్నా."

పెనిమిటి మాటలకి మల్లె మొగ్గలా ముడుచుకు పోయింది వెంకటలక్ష్మి.

"అట్టా ముడుచుకో మాకే! ముద్దొచ్చేత్తన్నావు..మనం సంబరాలకెల్లాలి.. అసలే.. ఆలీశం.." దగ్గరగా రాబోతున్న నారాయడ్ని తప్పించుకుని తలుపు గడియ తీసి వీధిలోకి పారిపోయింది వెంకటలక్ష్మి.

"సర్సరే. అట్టనే చేద్దాం. రేపే నాగాయలంకెళ్ళి ఇటికలయ్యా రేట్లు కనుక్కొనా. నాదొక్కటే బాధ. ఈ సారి పంటలో కాసిని డబ్బులు మిగిలినయ్యని ఖరుసెట్టేస్తే.. ముందు ముందు ఏదైనా అవుసరం పడితే ఎట్టా అని.." మల్లయ్య, నారాయడి తండ్రి పుగాక్కాడ సాపు చేస్తూ అన్నాడు. రోజుకి నాలుగు చుట్టలైనా కాల్చందే ఉండలేడు అతడు.

"రెక్కలు బలంగా ఉన్నంత సేపూ మనకేం బయ్యం నాన్నా! షావుకారు దగ్గర దాచి పెట్టిన డబ్బు కూడ తీద్దాం. పక్కాగా ఒక గదేసుకుందాం. హాయిగా ఉందాం."

ఐదారు రోజుల బట్టీ తండ్రికీ కొడుక్కీ అదే వివాదం నడుస్తోంది. రేప్పొద్దున్న పిల్లా పాప వస్తే ఎట్టా అని పెద్దతనికి దిగులు. వచ్చే ఖర్చే కానీ ఆగే ఖర్చు కాదు కదా! ఏటికి సరిపొయ్యే బియ్యం బస్తాలకెత్తి దాచి పెట్టుకున్నారు. కొంత ధాన్యం మార్చి పప్పులు ఉప్పులూ కొనుక్కున్నారు. రోజు వారీకి, రాత్రి పట్టే చేపలు ఆదుకుంటాయి. కాయా కసరూ దొడ్లో కాస్తానే ఉంటాయి. అయినా.. ఏంటో గుబులు గుండెల్లో!

"పోనియ్యరాదయ్యా! ఆళ్ళ సుకం కంటే మనకేం కావాల?" జాలమ్మ, నారాయడి తల్లి నేల మీద ముగ్గులు పెడుతూ అంది. అంతకు ముందే మట్టి నేలంతా శుభ్రంగా అలికింది వెంకట లక్ష్మి.

"మేస్త్రిని అట్టుకొచ్చి ఎట్ట చెయ్యాలో కనుక్కుంటే సరిపోద్ది. నేనూ, వెంకీ కలిపి యేసేత్తాం, గోడలూ, వాసాలూ.. కూలి ఖర్సుండదు." ఆశగా చూస్తూ అన్నాడు నారాయడు. నాయన ఒప్పుకుంటే బాగుండు.

"ఆ.. ఆ సుట్ట ఖరుసు తగ్గిత్తే నాలుగ్గదులేసుకోవచ్చు." మూతి తిప్పుతో అంది జాలమ్మ.

"నీకెంతసేపూ నా సుట్టల గోలేనే.. ఈ పాటి సుకం లేపోతే.. ఒల్లు నొప్పులు పోతయ్యా.. నడ్డొంగుద్దా నాలుగు నూకలొత్తయ్యా! ఆ ట్రంకుపెట్టి తీసుకరారా నారాయడా!" చుట్ట అంటించి, గోడ కానుకుని అర్ధ నిమీలిత నేత్రుడయ్యి అన్నాడు మల్లయ్య.

హుషారుగా వెళ్ళి, ట్రంకు పెట్టెని చులాగ్గా లేపి తీసుకొచ్చాడు నారాయడు.

ట్రంకుపెట్టె గొళ్ళానికి కట్టిన ట్వైను దారం ముళ్ళు విప్పబోయాడు పెద్దాయన. కన్ను సరిగ్గా ఆనలేదు. వేళ్ళు కూడా బండబండగా ఉండి స్వాధీనంలోకి రాలేదు. పొలం దున్ని, మట్టి పిసికి మొద్దు బారిపోయాయి.

వెంకటలక్ష్మి పక్కన కూర్చుని తన నాజూకు వేళ్ళతో, పిన్నీసు వాడి రెండు నిముషాల్లో తీసేసింది. అంతలో నారాయడు బ్లేడు పట్టుకొచ్చాడు.. కత్తిరించి పడేటానికి.

"ఓరి ఓరి.. నా కోడలు ఎంత నేర్పురా.. నువ్వూ ఉన్నావు ఎందుకూ!" వెంకటలక్ష్మిని ఆప్యాయంగా చూస్తూ అన్నాడు మల్లయ్య.

"ఓసోసి.. మురిపెం. నా ఏళ్ళంత సన్నంగుంటే దుక్కి దున్ని, తవుడు కలిపి, గొడ్లకి స్నానాలు చేపించి.. ధాన్యం బస్తాల కెక్కించి పన్లన్నీ చేసినట్టే. ఐనా నాకు తెలీకడగతా డబ్బులన్నీ తీసేస్తే.. ఇంకా పెట్టికి ముళ్ళెందుకంట. ఆ దారం ఎందుకంట!" నారాయుడు బుంగమూతి పెట్టాడు.

పెద్దామె అందర్నీ నవ్వుతూ చూస్తోంది. అణకువ కలిగిన కోడలు దొరకటం నిజంగా ఎంతదురుష్టమో!

"రెండేలున్నయ్యిరా! షావుకార్దగ్గర మరో ఐదుంటయ్యి. అందుట్టోనే సరుదుకోవాల."

"అట్టగట్టగే!" డబ్బు లెక్కపెట్టుకుని పెళ్ళాన్నో సారి చూసి, తలాడించి బైటికెళ్ళాడు నారాయుడు. పెట్టి సర్దేసి, మూలకి పెట్టి దొడ్లో కెళ్ళింది వెంకటలక్ష్మి.

పెద్దవాళ్ళిద్దరూ ఒకర్నొకరు చూసుకుని కళ్ళతో సంజ్ఞలు చేసుకుని ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

ఇంటి చుట్టూతా తిరిగి వెనక్కి వెళ్ళి, సొరపాదు కున్న ఎండు ఆకుల్ని తుంచుతున్న వెంకటలక్ష్మి కొంగు పట్టుకున్నాడు నారాయుడు.

"అమ్మో.. అత్తొస్తుందేమో! ఆగు. ముందెళ్ళి పన్చూడు." గిర్రున తిరిగి, తలెత్తి నారాయుడి కేసి కవ్విస్తున్నట్టుగా చూసింది.

"ఇంక మనకి ఎవరో వస్తున్నారేమో అనే భయం ఉండదు.." మెత్తని వెంకటలక్ష్మి బుగ్గని తన గరుకు మొహంతో రాస్తూ, చెవిలో అన్నాడు గుసగుసగా! చేత్తో నెమ్మదిగా మొగుడి మొహం తప్పించి ఇంట్లోకి తుర్రుమంది వెంకటలక్ష్మి.

తేలికైన మనసుతో, శరీరంతో.. గాల్లో తేలిపోతున్నట్టుగా నాగాయలంక బయల్దేరాడు నారాయుడు. షావుకారు ఐదువేలకీ మరో రెండు వేలు కలిపి ఇచ్చాడు, వడ్డీ కింద.

మేస్త్రీ కూడా ఇటికలు, సిమెంటు అమ్మేదగ్గరే ఉంటాడు. పాలెంలో ఏం కట్టాల్సి వచ్చినా అతడే.

పడవలో వెళ్తున్నంత సేపూ ఊగుతున్న పడవలాగే ఉల్లాసంగా, హుషారుగా కూనిరాగం తీస్తూ ఉన్నాడు నారాయుడు. తను కట్టబోయే గది గురించే ఆలోచిస్తూ.

"అన్ని రేట్లూ పెరిగిపోయినయ్యి నారాయుడూ! తొమ్మిదేలంటే గోడల్లేచే వరకూ వస్తయ్యేమో. ఆ పైన పెంకులంటే.. ఇంకా కొంచెంలో కొంచెం రెండేలన్నా.." మేస్త్రి చప్పరించేశాడు.

"బాబ్బాబు.. మంచోడివి కదూ! కూలోళ్ళక్కర్లా.. మావే చేస్కుంటాం. మరో మాట చెప్పెయ్యబ్బయ్యా!"

"సర్లే.. గది సైజు తగ్గించేద్దాం. పైన రెల్లు పరిస్తే సరిపోద్ది." మేస్త్రీ ఆలోచిస్తూ అన్నాడు.

"రెల్లంటే మరి అగ్గి ముట్టుద్ది కదా! ఎట్టా కాచుకోవాల? ఇంకో ఉపాయం లేదా?" నీరు కారిపోతూ అడిగాడు నారాయుడు.

"రేకుల షెడ్డేసుకోవచ్చు. వాన పడుతే మాత్రం రణగొణ ధ్వనే."

"అంతే కదా! ఇంట్లోకయితే వాన రాదు కదా! ఇంకేంది మరి.. అట్టాగే చేసేద్దాం" రెట్టించిన ఉత్సాహంతో సరుకులన్నీ మాట్లాడి డబ్బిచ్చేశాడు.

"నాలుగైదు రోజుల్లో పట్టుకొస్తా. వచ్చి పునాది లోతులూ అవీ లెక్కలు చెప్తా. గోతులు తవ్వాక గోడలు మొదలుపెట్టేయ్యచ్చు."

"ఇప్పుడు నాతో వచ్చెయ్యరాదన్నా! సరుకు ఆనిక్కి పంపచ్చు. ముందు మేం తవ్వకం మొదలుపెడ్తాం. కావసిన పలుగులు, పారలు చెప్తే.." నెత్తి గోక్కున్నాడు. మరి వాటికి మాత్రం డబ్బులేవీ. మొత్తం మేస్త్రి కిచ్చేశాడు. కొద్దిగా చేతికిందుంచుకుని

"అవన్నీ నేనే ఇస్తాలే. ఒక గంటాగావంటే వెళ్దాం. మరీ ఆత్రంగా ఉన్నట్టున్నావు కదా!" చిరునవ్వు నవ్వాడు మేస్త్రీ.

"లేదన్నా! వచ్చేది శీతాకాలం కదా! అమ్మా నాయనా లోన పండుకోమంటే ఇనరు. బైట పంచలో చలి వణికెత్తించేత్తాది. అందుకే..

ఏమైతే అయిందని ఉన్నదంతా ఊడ్చి తీసకచ్చా! నీదే భారం."

"సర్సరే.. నీకేదైనా పనుంటే పోయిరా. మాపటేల్లోపు పోదాం. రాత్రికి మా బామ్మరిదింట్లో, మీ ఊళ్ళోనే.. ఉండిపోతా. పొద్దు పొడవగానే పని మొదలెట్టేద్దాం."

నారాయడు సంచీ నడుంలో దోపి బయల్దేరాడు. కాస్త మిఠాయి, కొబ్బరికాయ, పూలు కొనుక్కెళ్దామని.

నారాయడు నడుస్తూ ఆలోచిస్తున్నాడు. ఏంటో ఉన్నదంతా ఊడిచి పెట్టడం మంచిదేనా.. ఏదైనా అవుసరం పడితే అప్పుడేం చెయ్యాల? మనసొక పక్కకి, మెదడింకో పక్కకీ లాగేస్తున్నాయి.

వెంకటలక్ష్మితో ఏకాంతంగా, ఎంత హాయి.. తల్చుకుంటేనే ఒంట్లోంచి ఆవిర్లొస్తున్నాయి. ఛా.. యెదవ జలమ. యెంత కాడికీ పైసా పైసా లెక్కెట్టుకోడవే. పోతే పోయింది. షావుకారి పొలంలో రెండుగంటలు పన్చేసి దాచేద్దాం. ముందు ఇప్పటి సుకం.." గట్టి నిర్ణయానికి వచ్చిన నారాయడు, బజారు కేసి నడిచాడు.

"ఏందిరో హుషారు. మొహవట్టా యెలిగిపోతాంది. ఎక్కడన్నా లాటరీ తగిలిందా?" దారిలో ఒక స్నేహితుడి వాకబు.. నారాయడ్ని కలల లోకం లోంచి కిందికి దించింది.

"మనకట్టాంటియ్యేం వద్దురా! కిట్టమ్మ తల్లి చల్లగ చూస్తే చాలు. ఇల్లు ఇరుకయిందనీ పక్కనో వాసం దించుతున్నాం. అందుకే పని బడొచ్చా. అట్టా పోయి టీ చుక్కలు తాగొద్దాం, వస్తా?" టీ బండి చూపించాడు నారాయడు.

"ఈ ఏడు పంట డబ్బులు బాగా చేతికొచ్చినయ్యిరా! చాలా ఆనందంగుంది. మా యావిడకి అడ్డిక చేయిద్దామనుకుంటన్నా. అదీ.. మా అమ్మకి చెప్పకుండా.. పుట్టింటారిచ్చారని డ్రామా కట్టాలి. ఏందో యెదవ బతుకులు.. ఈ అత్తా కోడళ్ళు ఎంతకాలమైనా ఇట్టాగే యుద్ధాలు చేస్కోవలసిందేనా? ఓ శుభం లేదు.. ఓ పండగ లేదు. మంచి లేదు చెడు లేదు." స్నేహితుడు వాపోయాడు.

"ఔనవును. ఆ లచ్చిమీ సరస్వతులకే తప్పలేదు. మనవెంత.." వెంకటలక్ష్మి, తన తల్లీ స్నేహితుల్లా, తల్లీ కూతుళ్ళల్లా కలిసిపోవడం అదృష్టం అనుకుంటూ.. మనసులోనే దుర్గమ్మ తల్లికి దణ్ణవెట్టుకున్నాడు నారాయడు.

"లచిమీ సరస్వతులా.. అదేదో నా బోటోడే కాగితాలుచ్చుకుని కతల్రాశాడు. నేక పోతే.. ఆళ్ళకేం పన్లేదా పోట్లాడుకోడానికి. పైగా ఇద్దరూ ఎవరింటో ఆళ్ళుంటారు." స్నేహితుడు పడీ పడీ నవ్వాడు.

నారాయడిక్కూడా నవ్వొచ్చింది. నిజవే కదా మరి! ఒకామె భర్త బొమ్మలు చేస్తుంటే పక్కనే వీణ వాయిస్తూ కూచుంటుంది. ఇంకొకామె పామ్మీద పడుకున్న పెనిమిటి కాళ్ళొత్తుతూ ఉంటుంది. వాళ్ళు కలిసేదెప్పుడు.. పోట్లాడుకునేదెప్పుడు!

"నీకు తెలుసారా. చేపల చెరువులనీ ఉంటయ్యంట. అందుట్లో రొయ్యల్నీ, చేపల్నీ పెంచుతారంట. ఓ్రెండేళ్ళల్లో లచ్చాదికారులైపోవచ్చుంటన్నారు. నాగాయలంక చుట్టుపక్కలంతా అదే మాటలు. కొందరు పొలాల్ని చెరువుల కింద మార్చేస్తన్నారు." స్నేహితుడు చెప్పాడు.

"ఛా.. అట్టాంటి పన్చేసి నేల తల్లిని తవ్వేస్తారేందిరా! మాగాణి పంట దారి మాగాణిదే. వణ్ణం మానేసి రొయ్యలు, చేపలూ తినగల్రా ఎవ్వురైనా?" నారాయడికి కోపం నసాళం అంటింది.

"రెండు టీ.. ఓ చెంచా పందార ఎక్కువెయ్యి.." బుల్లి బుల్లి గాజుగ్లాసుల్లో టీ ఇచ్చాడు కొట్టువాడు.

"ఇవేందిరా.. రోజు రోజుకీ చిన్నగై పోతన్నయ్యి, ఉగ్గుగిన్నెలో కొంచెం ఎక్కువే పట్టుద్ది." నారాయడు కొట్టు వాడితో తగవేసుకున్నాడు.

“అంతేనండి. ధరలు పెరిగిపోతన్నయ్యి. టీ రేటు అంతే ఉండాలంటే మరి గ్లాసులు చిన్నవి సెయ్యాలి. ఏం చేత్తాం..” టీ బడ్డీ కుర్రాడు నవ్వుతూ అన్నాడు.

“ఈ సేపల సెరువుల కతేందిరా? కిట్టమ్మ ఇస్తానే ఉంది కదా తినగలిగినన్ని. ఇంకా భూదేవిని పొడవాలా సెప్పు?” నారాయడు స్నేహితుడిని అడిగాడు.

“చేపల చెరువులంటే..ఎక్కువగా రొయ్యలన్నమాట. ఆ రొయ్యలకి మాంచి గిరాకీ నంట. ఎక్స్పోర్టింగ్ చేసేత్తారు. గుత్త దార్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. బాంకులోళ్ళు అప్పులిస్తారు. అవి కూడ వాళ్ళే అరేంజ్మెంట్ సేత్తారు. ప్లానింగెయ్యటం.. సీడింగ్లు తేటం.. అంతా ఆళ్ళే నేర్పిత్తారంట. మొదటేడాది.. ఒక్క సారో చూపు చూశావంటే మరుసటేడు నించీ మనవే చూసుకోవచ్చు. ముందో ఎకరాలో ఏసి చూత్తే ఎట్టుంటాదా అని..”

“ఏమోరా.. నేనేం చెప్పలేను. ఇప్పటికైతే భూదేవి తల్లి కడుపులు నింపుతా ఉంది. రేపటి సంగతా.. ఎప్పుడేం జరుగుతుందో ఎవ్వరు చెప్పగలర్రా! ఆ దుర్గమ్మ, ఈ కిట్టమ్మ ఏవాలోసిత్తన్నారో?” ఉన్నట్టుండి నారాయడిలో నిస్సత్తువ ఆవహించింది.

ఉన్న డబ్బంతా పెట్టి గది వెయ్యటం మంచి పనేనా.. అయితే వెంకటలక్ష్మి వాలు చూపులు కంటి ముందు మెదలి.. ఒంట్లోకి కొత్త రక్తం చేరినట్టే అనిపించింది. హుషారుగా తలెగరేశాడు.

“సరేరా.. ఏదైనా అవుసరం పడితే చెప్పు. కూలీలు గానీ కావాలంటే మా ఓళ్ళిద్దరున్నారు.”

“అట్టగే చెప్తా.” తలూపాడు నారాయడు. పంటల పనయింది. మళ్ళీ నారేసే వరకూ అందరూ ఖాళీనే. ఎక్కడ నాలుగు డబ్బులొస్తయ్యా అని చూస్తుంటారు.

ఇద్దరూ టీ తాగి ఎవరి డబ్బు వాళ్ళిచ్చుకున్నారు. అటువంటివి అక్కడ మామూలే. కష్ట సుఖాలు తెలిసిన వాళ్ళు.. సహజంగానే ఇంకొకరికి భారం అవకూడదని నిర్ణయించుకున్నారు.. ఒకరికొకరు చెప్పుకోకుండానే.

టీ గ్లాసులు బడ్డీ కింద పెట్టేసి చెరో దిక్కుకీ వెళ్ళిపోయారు ఇద్దరూ!

**“ఆ ఇటిక బొంతిట్టా అందియ్యే** యెంకీ! ఇంక సరిగ్గా పదంటే పది రోజుల్లో మనిల్లు తయారవుద్ది.” ఇటుక వరుస పేరుస్తూ పిలిచాడు నారాయడు. ఉన్న ఇంటిని ఆనుకునే వేస్తుండటంతో సులువైపోయింది. పునాదులు వెయ్యటం, గోడలు సగం లేవటం పదిహేను రోజుల్లో అయింది. రోజూ అదే పని, అదే ధ్యాస. ఇంట్లో ఉన్న నలుగురూ నడుం కడ్తే ఎంత సేపు!

నారాయడినే చుస్తూ నిలబడ వెంకటలక్ష్మి ఉలిక్కి పడింది. ఆఛ్ఛాదన లేని భుజాలమీదా, చాతీ మీదా ఎండలో మెరుస్తున్న చెమటని ఎగిరి తన కొంగుతో తుడవాలన్న కోరికని బలవంతం మీద ఆపుకుంది.

“నిన్నేనే! ఏందట్టా గుడ్లప్పగించి చూస్తాండా? పని సంగతి చూడు. ఎంతసేపు నిలబెడ్తావిట్టా?” చూసి చూసి గదమాయించబోయిన నారాయడు వెంకిని చూడగానే, ఎత్తుగా కట్టిన బొంగుల దడి మీద నుంచి, ఇసుక కుప్ప మీదికి ఒక్క దూకు దూకాడు.

“అరే.. జాగ్రత్త మావా! ఏందా దూకుడు? ముందూ ఎనకా చూసుకో..” వెంకి ఆదుర్దాగా అంది.

ఎర్రటి చుక్కల చీర, మోకాళ్ళ పైకి గోచీ బిగించి కట్టింది. ఒంటి కంటుకు పోయిన నల్ల జాకెట్టు వెంకి అందాన్ని రెట్టింపు చేస్తోంది. సరిగ్గా అప్పుడే గంపలో నాలుగిటికలు పెట్టి, నెత్తి మీద సర్దుకుంటోంది. రెండు చేతులూ పైకి చేర్చి, గంపని సర్దుతున్న దల్లా కెవ్వుమంది.

వెనుక నుంచి వాటేసుకున్నాడు నారాయడు.

"ఏందయ్యా! పట్టపగలు.. ఆరు బైట. ఎవురన్నా చూత్తే.. అత్త, మామ ఇంట్లనే ఉన్నారు." చేతులు గంపని పట్టుకుని, నెత్తి మీద బందీలైపోయాయి. విడిపించుకునే అవకాశమే లేదు. బుంగ మూతి పెట్టి ముద్దుగా విసుక్కుంది.

"అమ్మా, నాయనా బువ్వతిని తొంగున్నారు లెయ్యే. మనం ఇప్పుడే ఈ గదిలో ఆరంభం చేసేద్దామా? నిన్ను చూత్తా వుంటే ఆగ లేక పోతున్నా. గోడలు లేచినయ్యి కదా!" బతిమాలాడు నారాయడు.

"అదేం కుదరదు. కప్పు వెయ్యకుండా.. పూజ చెయ్యకుండా లోనికి యెల్లనే కూడదు. నువ్విట్టా ఆలీశం చేసిన కొందీ ఇంకా వెనుకడిపోద్ది. నేనెల్లి కూకుంటా." మొగుడి బంధంలోంచి నెమ్మదిగా కిందికి జారి నేల మీద గొంతుక్కూర్చుని, గంపా ఇటికలూ కింద పెట్టేసింది వెంకటలక్ష్మి.

అస్తవ్యస్తంగా కూర్చోడంలో నడుం కలుక్కుమంది.

"అబ్బా!" నడుం పట్టుకుని పెద్దగా మూలిగింది.

"అయ్యో.. ఏటయిందే! పట్టేసిందా? గమ్మునుండకుండా మెలికలు తిరిగితే ఏమవుద్ది?" గాభరాగా వంగుని చూడబోయాడు.

మాట్లాడకుండా అలాగే ఒక పక్కగా నేల మీదికి ఒరిగి పోయింది.

"అమ్మా! అమ్మా!" గట్టిగా అరిచాడు నారాయడు.

"ఏందిరా.. ఏమైంది? వస్తన్నా.." ఇంట్లోంచి పరుగెత్తినట్టుగా వచ్చారు తల్లీ, తండ్రీ.

"నడుం పట్టేసిందే.. గిలగిల్లాడి పోతాంది. ఏం చెయ్యాల?" ఏడుపు గొంతుతో అన్నాడు నారాయడు.

"ఎత్తుకోని ఇంట్లోకి తీసుకెల్లి పండబెట్టు. నే కొట్టుకెళ్ళి తైలం పట్టుకొస్తా." మల్లయ్య పెద్ద పెద్ద అంగలేస్తూ తడిక గేటు తీసుకుని బైటికెళ్ళిపోయాడు.

"ఏందోరా.. అంతా ఆగమాగం ఐతాంది. పిల్లది చూడు ఎట్టా వాడిపోతాందో. నెమ్మదిగా అట్టగే నొప్పి కలక్కుండా తీసుకెల్లు. ఆ గంప ఎత్తేప్పుడు ఏ నరం పట్టేసిందో. ఆచారి గారి దగ్గరేదైనా మందుందేమో చూసొత్తా.. ఏదో పసరిత్తారు. జాగర్త." జాలమ్మకూడా హడావిడిగా బైటి కెళ్ళిపోయింది.

నారాయడు అపురూపంగా, మోకాళ్ల కిందొక చెయ్యి,వీపుకిందో చెయ్యి వేసి నెమ్మదిగా లేపి ఇంట్లోకి తీసుకెళ్ళి, నులక మంచం మీద పడుకోబెట్టాడు.

"అమ్మా!" మూలిగింది వెంకటలక్ష్మి.

## 4

వెంకటలక్ష్మి కళ్ళు చెమర్చాయి.. కట్టుకున్నోడి ప్రేమకి, అత్తమామల ఆప్యాయతకి. చెంపల మీద నాలుగయిదు చుక్కల కన్నీళ్ళు నిలిచాయి. పక్కటెముకల కింద లాగుతున్న నడుం నొప్పి తగ్గినట్లనిపించింది.

"ఏందే.. నొప్పిగా ఉందా? ఊరుకున్నోడినూరుకోకుండా యెదవపన్లు చెయ్య బొయ్యా చూడు.. నన్ను నేను చెంపలు వాయించుకోవాలి. అనవుసరంగా నీ జోలికొచ్చా. పన్చుసుకోవచ్చు కదా!" నేల మీద కూర్చుని, పక్కనే ఉన్న తుండుగుడ్డతో వెంకి మొహం తుడిచాడు.

"ఫర్లేదు. నెమ్మదిగా సర్దుకుంటాంది. కాస్త కాళ్ళు కప్పుతా.. చలేస్తాంది." ఇట్టాంటిదేదైనా వస్తే బానే ఉంటుంది.. నొప్పిగా ఉన్నా,

ఆదుకునే వాళ్ళుంటే. అందుకే జరుగుబాటుంటే జ్వరవంత సుఖం లేదన్నారు.

నారాయడు నడుంకింద చెయ్యి పెట్టి, గోచీ విప్పదీసి, చీర కాళ్ళ కిందికి వచ్చేట్లు సర్దాడు. నరాలు జివ్వున లాగినట్లనిపించింది వెంకటలక్ష్మికి. అంత బాధలోనూ చిరునవ్వు మెరిసింది పెదాల మీద.

అదేం పట్టించుకోకుండా, కుండలో నీళ్ళు తీసి, డబ్బాలో పంచదార మూడు చెంచాలందులో వేసి బాగా కలిపి వెంకి చేత తాగించాడు.. నెమ్మదిగా లేపి కూర్చోపెట్టి.

అమృతం గొంతులోంచి దిగినట్లే ఉంది. వెంకి మొహం కాస్త తేట తీసింది.

“ఏదన్నా తింటాని కుందేమో చూత్తానుండు. నీరసంగా ఉన్నావు.” మంచం గోడ కానేట్టు జరిపి, సరిగ్గా పడుకోబెట్టి, దిండు సర్ది లేచాడు.

“ఇప్పుడేం వద్దు. అత్త వచ్చి ఏదన్నా పెడ్తాది. ఇప్పుడు కాస్త తగ్గింది..”

పక్కనే, నేల మీద కూర్చున్న నారాయడి చెయ్యి పట్టుకుని కళ్ళు మూసుకుంది వెంకటలక్ష్మి.

వెన్నెముక లోంచీ నరం పైకి లాగినట్టనిపించిందేమో.. వెంకటలక్ష్మికి నొప్పి తగ్గటానికి నెల పైనే పట్టింది.

ఆ లోగా ఒక కూలీని పెట్టి వాసాలు బిగించి, రేకులు దించేశారు. ఇంక పూజ చేసి, ఇంట్లోకి ప్రవేశించటమే మిగిలింది.

అచారిగారి మందు సంగతేమో కానీ, జాలమ్మ క్రమం తప్పకుండా చేసిన తైల మర్దనం బాగా పన్చేసింది. కదలకుండా కూర్చుని, వేళ తప్పకుండా తింటూ ఉండడంతో వెంకటలక్ష్మి కొద్దిగా ఒళ్ళు చేసింది.

తల్లీ, తండ్రీ వచ్చి కూతుర్ని తీసుకెళ్తామన్నారు.

“అదేంటి వదినా! అమ్మాయి బాగున్నప్పుడు పని చేయించుకుని, కాస్త నలత పడగానే, బాగు చేసి పంపమని మీ దగ్గరకంపేత్తే అదేవంత మెచ్చుకోలు పని? ఇక్కడున్నది మనుషులే కాని మరలు కాదు కదా! కోడల్ని కళ్ళలో పెట్టుకుని చూసుకుంటాం. లేచి తిరగ్గానే తీసుకెళ్ళి నాలుగురోజులు అట్టే పెట్టుకోండి.. మీ ముచ్చటెందుకు వద్దనాలి?” జాలమ్మ డెక్కుపోయిన గొంతుతో అంది.

వెంకటలక్ష్మి కూడా అదే అనడంతో వెనక్కి తిరక్క తప్పలేదు వియ్యాల వారికి.

అయినా కూతురి మొహంలో కనిపిస్తున్న తృప్తి, మాటల్లో వినొస్తున్న సంతోషం.. ఇంక బలవంతపెట్టడానికి కారణం కనిపించ లేదు.

తూర్పు వైపుకున్న పాత ఇంటికి ఆనుకుని కొత్త గది ఉంది. ఐతే వాకిట్లోకి వచ్చి తిరిగి అందులోకి వెళ్ళాలి. గుమ్మం పెట్టడానికి వీలు పడలేదు. ఆ పక్కనే వంటింటి జాగా ఉంది. అదీ మంచిదేలే అనుకున్నాడు నారాయడు.. కొత్త ఊహల్లో తేలిపోతూ.

“అమ్మా! ఈ శనారం బాగుందంట. పడమటింట్లో పెవేశానికి. పంతులుగారు కావలసిన సామాన్ల లిస్టిచ్చారు. పాలు పొంగించి వ్రతం చేసుకో మన్నారు.” పొద్దున్నే బైటికెళ్ళిన నారాయడు ఉత్సాహంగా అంటూ ఇంట్లోకొచ్చాడు.. ఇల్లంతా వెంకటలక్ష్మి కోసం వెతుకుతూ.

“అట్టాగే. ఇయ్యాల వారికి కబురందియ్యాల. అయ్య నెల్లి రమ్మని, నువ్వు ఇంటిక్కావల్సిన సరుకుల సంగతి చూడు.” టీ పెడుతూ అంది జాలమ్మ.

నారాయడు, అప్పడే దొడ్లో బట్టలెండేసి లోపలికొచ్చిన వెంకి మొహాలు చూసుకున్నారు.

“అది కాదే.. నేనూ, వెంకీ వెళ్లొత్తాం. ఆళ్ళెప్పట్నుంచో రమ్మంటన్నారు. వెంకికి నడుం నొప్పి తగ్గి తిరుగుతున్నట్టు ఆళ్ళకి తెలిసినట్టుంటాది. సాయంగా వెళ్ళి పిలిచినట్టుంటాది.” నట్టుతూ అన్నాడు నారాయడు.

"అట్టాగే పోయి రండ్రా! సరుకలయ్యా నే తెత్తాలే. టీ సంగతయ్యాక, కాస్త ఉప్పు పిండి కలె బెట్టే.. పిల్లలు తిని ఎల్తారు. ఆ ఊరెళ్ళే సరికి ఎండ నడినెత్తికొచ్చేత్తాది. రేపు మద్దిన్నానికి వొచ్చెయ్యండి. ఇక్కడి పన్లు జూసుకోవాల." మల్లయ్య వాకిలి బైట చుట్ట పీలుస్తూ అన్నాడు.

"ఈ పూజకీ, భోయనాలకీ రెండు వేలవ్వుద్ది. డబ్బు ఏవైనా సర్దుతారేమో కూడా అడుగుతా."

"వద్దొద్దు. ఈ మూణ్ణెల్లలో, చేపలు పట్టి బేరవెట్టింది మూడు వేల దాక ఉంది. అది ఖర్చు పెడదాం. వాళ్ళ నెందుకు ఇబ్బంది పెట్టడం. నువ్వెళ్ళి మర్యాదగా అందరినీ రమ్మని చెప్పి రా." చుట్ట పీక అవతలికి విసిరేసి, లోపలి కొచ్చి అన్నాడు మల్లయ్య.

దొడ్లో పూసిన చేమంతులు మాల కడ్తూన్న వెంకటలక్ష్మి మొహంలో నవ్వుల పువ్వులు విరిశాయి..

"ఆగెహె.. కలిసి నడుద్దాం. ఎంత అమ్మా నాయనల దగ్గరకెళ్తుంటే మాత్రం అంత లావు సంబరవా?" రెండు చేతుల్తో నిండుగా ఉన్న సంచీలు మోస్తూ అరిచాడు నారాయుడు. దొడ్లో కాసిన సొరకాయలు, గుమ్మడికాయ, పొట్లకాయలు సంచీల్లో పోసి ఇచ్చింది జాలమ్మ. టౌన్లో ఉండే బంధువులు.. అన్ని కూరగాయలు కొనుక్కుని తినాల్సిందే.

చకచకా నడిచేస్తోంది వెంకటలక్ష్మి.. నడుం నిటారుగా పెట్టి. కొద్దిగా తలతిప్పి, ఓరగా చూసి కళ్ళు చికిలిస్తూ ఒక నవ్వు విసిరేసింది నారాయడి మీదికి.

"ఓయబ్బో! ఏం వయ్యారమే! మరీ విరగబడకు.. నడుం సంగతి కాస్త చూసుకో.."

"ఏవన్నా ఐతే నాకేం భయ్యం.. నా మొగుడున్నాడుగా చూసుకోటానికి.." కొంగు తీసి చుట్టూ తిప్పి కుచ్చిళ్ళలోకి దోపి, రెండు చేతులూ నడుం మీద పెట్టి నిలుచుని సవాలు చేసింది.

చుట్టూ చూశాడు నారాయుడు. పొద్దున్న పది గంటలు దాటింది. ఆ రోజు ఆదివారం. ఎవరికీ పట్నంలో అంత పని పడినట్టు లేదు.. కను చూపు మేరలో ఎవరూ కనిపించలేదు.

కొద్దిగా ఒళ్ళు చేసిన వెంకి కొత్త అందాలతో మెరిసిపోతోంది. చామన ఛాయకి ఎక్కువయిన మేని ఛాయ ఆ నీరెండలో వింత కాంతిని సంతరించుకుంది. కవ్విస్తున్నట్లున్న కంటి చూపు నారాయడికి మతి పోగొడుతోంది.

లేత గులాబీ ఫుల్ వాయిల్ చీర నాజూగ్గా గూడ కట్టు కట్టింది. నల్లని ఒన్ బై టూ జాకెట్టు ఒంటికి అతుక్కు పోయి.. చీర అందాన్ని.. ఆ చీర కట్టిన వెంకటలక్ష్మి సోయగాన్ని రెట్టింపు చేస్తోంది. సన్నని నల్లపూసల గొలుసు శంఖం వంటి మెడకి అందంగా అమరింది. బారెడు జడని బిగించి వేసి.. నక్షత్ర చామంతి పూల దండని అర్ధ చంద్రాకారంగా జడ పైన అలంకరించింది. అసలే పెద్ద కళ్ళేమో, సన్నగా తీర్చి దిద్దిన కాటుక రేఖలు బాపు బొమ్మని తలపిస్తున్నాయి.

"నా వల్ల కాదే యెంకీ! నిన్ను చూస్తూ ఒల్లకుండడం. ఏం చెయ్యాలి? మతి పోతోంది. వేరే దేశాల్లో ఏ గోలా లేకుండా ఎక్కడ పడితే అక్కడ ముద్దెట్టుకోవచ్చంట. యెదవ జలమ.. అక్కడైనా పుట్టాం కాదు.." వెంకి దగ్గరగా వచ్చి సంచీలు కింద పెట్టి, బ్రతిమిలాడుతున్నట్లు చూశాడు.

వాడి ఆత్రం చూసి వెంకటలక్ష్మి నవ్వాగలేదు. ఫకాలున నవ్వింది.. ముత్యాల్లాంటి పలువరుస బైట పెట్టి.

ఏ డెంటిస్ట్ దగ్గరికీ వెళ్ళకుండా.. బ్రేసెస్ పెట్టించుకోకుండా, సహజంగానే ఆ పల్లెల్లో ఎక్కువ మంది పలు వరుస తీర్చి దిద్దినట్టుంటుంది. వాళ్ళ టూత్ బ్రష్ లు వేం పుల్లలు. పావుగంట పైగా నమిలి, కుంచెలాగా చేసి, పళ్ళని శుభ్రంగా తోముతారు. అంత సమయం లేకపోతే.. బొగ్గు పొడి జల్లించి మెత్తగా చేసి, అందులో ఉప్పు కలిపి వాడతారు. "మీ టూత్ పేస్ట్ లో సాల్ట్ ఉందా.." అని కాజోల్ యాడ్ లో వచ్చినట్లు.. పళ్ళు బలంగా ఆరోగ్యంగా ఉంటాయి. ఇంకొక ముఖ్యమైన కారణం జల పుష్పాలని ప్రతీ రోజూ ఆహారంలో


KOUMUDI

తీసుకోవడం.

కొంచెం దూరంలో ఉన్న మడ అడవుల (మాన్ గ్రూవ్స్) గుబుర్ల కేసి చూసింది వెంకటలక్ష్మి.

పొలెంలో ఎక్కువ భాగం నేలలో వరి సాగుబడి జరుగుతుంది. కానీ ఒడ్డు దగ్గర పడే కొద్దీ ఉప్పు నీటి పర్రలు నేలలో లవణ శాతాన్ని పెంచి వరి సాగుకి పనికి రాకుండా చేస్తాయి. ఆ ప్రాంతంలో మడ అడవులు విస్తరించుకుంటాయి.

దట్టంగా పరుచుకున్న ఆ తోపులు.. ఎత్తు తక్కువగా ఉన్నా, ఆ గుబుర్లలో చాటు బాగానే ఉంటుంది.

"ఏం బుర్రే నీది వెంకీ! నడు మరీ.." హుషారుగా తోపు కేసి అడుగెయ్య బోయాడు నారాయడు.

"ఎక్కువ సేపుండద్దు మావా! ఎవురైనా చూస్తే బాగోదు. అత్తకీ, మామకీ చెడ్డ పేరొస్తాది." వెంకికి కూడా పరిష్వంగ సుఖం కావాలనే ఉంది.. కానీ కొంత బిడియం.. కొంత ఎవరైనా చూస్తారేమో ననే భయం.

"అట్టాగే.. పడవకి ఎట్టాగా కొద్ది సేపే టయం ఉంది.." ఉత్సాహంతో సంచీలు తేలికయినట్లనిపించాయి. వెంకి చెయ్యి పట్టుకుని పొదల మాటుకి లాక్కెళ్ళాడు.

ఆకాశంలో అప్పుడే కొన్ని మబ్బులు విహారానికి వచ్చాయి, సూర్యుడ్ని కమ్మేస్తూ.

దరిదాపుల్లో అంతా నిర్మానుష్యం. నారాయడి ఆరాటం ఆకాశాన్నంటుతోంది.

వెంకటలక్ష్మి సిగ్గుల మొగ్గైపోతోంది. పొదల మాటుకి వెళ్ళగానే ఇద్దరూ ఒకర్నొకరు హత్తుకు పోయారు. వెంకి పెదవులు వణుకుతుండగా, నారాయడి వక్షం మీద తల వాల్చింది. మల్లె పువ్వులాంటి లాల్చీని చుట్టి, రెండు చేతులూ నడుం చుట్టూ తిప్పి, పరవశంగా కళ్ళు మూసుకుంది.

నారాయడు, వెంకి తలా జుట్టు నిమురుతూ, నెమ్మదిగా వెంకి మొహం ఎత్తి, పెదవులు దగ్గరగా చేర్చి చుంబించబోయాడు.

ఉన్నట్లుండి, వెంకి నారాయడ్ని తోసేసింది.

వెనక్కి తిరిగి నేల మీద కూలబడి, రెండు చేతులతో మొహంకప్పుకుంది. వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది. పక్కటెముకలు ఎగిరెగిరి పడుతున్నాయి.

నారాయడు హతాశుడై నిలబడి పోయాడు. ఏం చెయ్యాలో అర్ధం అవలేదు. తనేం తప్పు చెయ్యబోయాడు? సొంత పెళ్ళామే కద! పైగా తనే సూచించింది కూడా.. ఎవరైనా చూశారంటే ఆమె నేదో చేసేశాడనుకుంటారు కూడా!

వెంకి ఏడుపు ఎక్కువయింది. చేతులు వణికిపోతున్నాయి.

"ఏందే యెంకీ! ఎందుకట్టా ఏడస్తాన్నా? మళ్ళా నొప్పి వస్తాందా? యెనక్కెల్లిపోదావా? ఎందుకైనా మంచిదని తైలం తెచ్చా.. రాసేదా? పోనీ పూజ వచ్చేనెల పెట్టుకుందావా?"

తల అడ్డంగా తిప్పింది వెంకటలక్ష్మి. నారాయడు పెళ్లాం పక్కనే గొంతు క్కూర్చున్నాడు.. ఇదెక్కడి గోలరా దేవుడా అనుకుంటూ.

"అట్టా నోరెత్తకండా గోలెడతాంటే నేనేం సెయ్యాల.. ఏదో చెప్పేడు."

"పద, నడుస్తా చెప్తా.." మరచెంబులో నీళ్ళు గ్లాసులో పోసుకుని, కొన్ని నీళ్ళతో మొహం కడుక్కుని, మిగిలినవి తాగి లేచింది వెంకటలక్ష్మి. మొహం తేటగా ఉంది. కళ్ళు స్వచ్ఛంగా నిర్మలంగా మెరుస్తున్నాయి.

నారాయడ్ని అంతవరకూ ఉత్తేజపరచిన వెంకి అప్పుడు మామూలుగా కనిపించింది, అతడి ఉత్సాహం అంతా చల్లారి పోగా!

ఇద్దరూ పక్క పక్కనే నడుస్తున్నారు. ఒక బరువైన సంచీ రెండు కొసలూ చెరొకరూ పట్టుకున్నారు. ఒకరి చెయ్యి ఒకరికి తగిలినా



KOUMUDI

ఏమీ అనిపించడం లేదు.

వెంకటలక్ష్మి కాలి కింద ఏదో తట్టుకుని ముందుకి తూలింది. నారాయడు సంచీ కింద పెట్టి పట్టుకోబొయ్యాడు. వెంకి కూడా సంచీ కొస వదిలేసి.. కాలికి తగిలిందేవిటా అని చూసింది..

యెండ్రకాయ.. ఇసుకలో కదులుతోంది. వరుసగా ఇసుక పైకీ కిందికీ కదులుతోంది.

వెంకీ, నారాయడు గబగబా కింద మోకాళ్ళ మీద కూర్చుని, ఇసకని జరపడం మొదలెట్టారు. వరుసగా.. ఎన్నెన్నో వరుసల్లో ఎండ్రకాయలు.. నెమ్మదిగా కదులుతున్నాయి. ఎక్కడికో వలస వెళ్ళి పోతున్నట్లు.

వెంకి కళ్ళు పెద్దవి చేసి వాటిని చూస్తోంది. నారాయడు సంభ్రమంగా అందులో ఒక ఎండ్రకాయని పట్టుకోబోయాడు.

"అయ్యో! ఒక ఖాళీ డబ్బా కానీ, సంచీ కానీ తేవాల్సిందే యెంకీ! ఇయాల విందు చేసుకునేటోల్లం." నారాయడు నిండుగా ఉన్న తన సంచీల కేసి చూశాడు.

"వద్దు మావా! వాటిని వదిలెయ్యి. ఎంత స్వేచ్ఛగా, చీకూ చింతా లేకండా వెళ్తున్నాయో చూడు. మనల్ని పసిగట్టి, ఎక్కడికి, ఎట్టా పారిపోవాలా అని గాభరా పడతన్నయ్యి. వాటి ప్రయాణం వాటిని చెయ్యనీ.. పద మనం పోదాం. మల్లా పడవెళ్ళి పోద్ది." వెంకటలక్ష్మి వారించి పైకి లేచింది.

"అంతే నంటావా? బామ్మరిది కిట్టం కదా.. కాసిని అట్టుకెల్దామా అనుకున్నా." వెంకి ఏడుపు ఆపి మామూలుగా అయినందుకు ఆనందంగా వెంబడించాడు.

"ఏందో మావా! అట్టా పొదల్లోకెళ్ళి, ఏదో పాపం చేత్తనట్టుగా.. నాకు నచ్చలేదు. ఎవరైనా చూత్తే ఎంత అసియ్యంగా ఉంటద్ది.. పరువు పోతుంది. చిలవలు పలవలు కల్పించి ఎవురైనా ఏదైనా చెప్పెయ్యచ్చు కూడా. మనకేం కర్మ చెప్పు. దర్జాగా సంసారం చేసుకోకుండా.. భయం భయంగా తప్పు చేస్తన్నట్లు తుప్పల చాటుకి పొయ్యి..." వెంకటలక్ష్మి గొంతులో ఏదో అడ్డుపడ్డట్టయి మాట్లాడ లేకపోయింది.

"సరే.. దానికంత సీనెందుకట.. మావూలుగ చెప్తే పొయ్యేది కద!" నిష్ఠూరం వేశాడు నారాయడు. రెండు సంచీలు ఒక చేతిలోకి మార్చి, వెంకి చెయ్యి పట్టుకున్నాడు.

"అది కాదు మావా! నీ ఆవేశం చూస్తే నాకు భయం వేసింది. ఏం చెయ్యాలో తోచలేదు. పైగా.. నా మీద నాకే నమ్మకం పోయింది. ఎట్టాగో అడ్డుకోకపోకుంటే అల్లరై పోతావని. ఇప్పుడైతే ఎవ్వురూ లేరు. కానీ పరుగెత్తుకునో.. సైకిల్ మీదో ఎవ్వురైనా వత్తే.. ఏం చెయ్యగలం చెప్పు.. అందుకే.." తల కొద్దిగా దించుకుని తడబడుతూ అంది వెంకి.

"సరే.. ఇంకనెప్పుడూ ఇట్టాంటి కక్కుర్తి పడద్దులే వెంకీ! మనం నిగ్రయించు కుందాం. ఇంక నవ్వుతూ నడు.. పడవలు ఇయ్యాల తక్కవుంటయ్యి.." అన్నాడే కానీ, వెంకి మీదికే మాటి మాటికీ పోయే మనసుని ఎట్టా నిగ్రహించుకోవాలో బోధ పడలేదు.

ఆ.. ఏవుందీ.. పని మీదికి మళ్ళించుకుంటే సరి.. అడుగులు హుషారుగా పడ్డాయి నారాయడికి.

"అదిగో.. పడవ బయల్దేరబోతాంది. ఆగరా కుంటోడా.. వచ్చేత్తన్నాం." పరుగు పరుగున వెళ్ళి పడవెక్కారు. పడవెక్కాక గుర్తుకొచ్చి.. భయంగా వెంకటలక్ష్మిని చూశాడు నారాయడు.

"ఏం శీనన్నా! బాగున్నావా? బేరాలు బాగొత్తన్నయ్యా?" పడవ శీనయ్యని నవ్వుతూ పలకరించింది వెంకి.

శీనయ్య కుటుంబంలో అన్నదమ్ములిద్దరూ తాత ముత్తాతల తరం నుంచీ పడవలు నడుపుతూనే జీవనం సాగిస్తున్నారు. శీనయ్య పుట్టినప్పుడు బాగానే ఉన్నాడు. ఏడాది తరువాతా పోలియో మహమ్మారి బారిన పడ్డాడు.. పడకపోనేమో.. వాడి నాన్నమ్మ ఇంజక్షన్లిచ్చే ఆస్పత్రి

వాళ్ళొస్తే.. పిల్లాడికి సూది గుచ్చుతారా అని చంకనేసుకుని తోపుల్లోకి పారిపోయింది. దాని ఫలితం.. శీనయ్యకి కొన్ని రోజులు జ్వరం వచ్చి, కాలు వంకర పోవడం.

ఎన్ని తైలాలు మర్ధనా చేసినా ఉపయోగం సున్నా. కొంత సుగుణం ఏమిటంటే.. ఆ వ్యాధి ప్రభావం ఒక కాలి మీదే ఉండడం. తొందరగా మేలుకుని నాటు వైద్యం అయినా వెంటనే చేయించడం వల్ల, మోకాలు కింద భాగం సన్నగా బలం లేకుండా పోయినా.. కాలు ఎత్తెత్తి నడవ గలుగుతున్నాడు.

ఊర్లో అందరూ కుంటి శీనయ్యా అనే పిలుస్తారు. అది వాడిక్కూడా అలవాటై పోయి.. కల్మషం లేని నవ్వుతో సమాధానం ఇస్తాడు. పొద్దున్న ఎనిమిగంటలకి పడవెక్కితే ఒంటిగంటకి కూడు తినడానికే ఆపడం. ఉండటానికి మూడు పడవలు ఉన్నా.. ఒక రోజొస్తే రెండ్రోజులు ఎగ్గొట్టే వాళ్ళే. అందుకే శీనయ్య పడవే పడవ అనుకుంటారు ఊర్లో.

అందరూ కుంటోడా అని పిలిచినా, వెంకటలక్ష్మి మాత్రం 'శీనన్నా' అనే పిలుస్తుంది. ఒక మనిషిలోని అంగలోపాన్ని ఇంటి పేరుగా మార్చడం అమానుషంగా అనిపిస్తుంది తనకి. అందులో అతని తప్పేమైనా ఉందా అని వాదిస్తుంది నారాయడితో.

"అట్టా పిలిచావంటే.. రెండ్రోజులు మాట్లాడ్నంతే.." నారాయడ్ని బెదిరిస్తుంది. లెంపలేసుకుని క్షమాపణ చెప్పే వరకు వదలదు.

అలవాటు చొప్పున కుంటోడా అని పిలిచిన నారాయడు, బెదురుతూ వెంకటలక్ష్మి చూశాడు. అదృష్టం.. వెంకి, శీనయ్య కుటుంబ యోగక్షేమాలు విచారించడంలో పట్టించుకోలేదు. లేకపోతే.. అసలే ఆ పొదల్లో జరిగిన గోలతోనే సతమతమైపోతుంటే ఇదొకటి దానిగ్గాని కలిసిందంటే గోవిందా.. గోవింద.. అయ్యప్ప మాలేసుకోవాల్సిందే!

మోటారు ఆన్ చేసి, పడవని పోనిస్తున్న శీనుతో మాటలేసుకుంది వెంకటలక్ష్మి. కళ్ళు విప్పార్చి, శీనుగాడు చెపుతున్న ప్రతీ కబురూ ఆసక్తితో వింటున్న వెంకటలక్ష్మి అమాయకంగా.. పసిపిల్లలా కనిపించింది.

అట్లా ఆ కళ్ళు తిప్పడాన్ని, మెరుస్తూ.. అటూ ఇటూ చేపపిల్లల్లా కదులుతున్న ఆ కనుపాపల్ని, మొహంలో చూపిస్తున్న ఆప్యాయతని.. వెనుక బెంచి మీద కూర్చుని గమనిస్తూ ఉండిపోయాడు నారాయడు.

అప్పుడే పూసిన మల్లెపువ్వంత స్వచ్ఛమైన నవ్వుతో వెలిగిపోతున్న వెంకటలక్ష్మిని చూస్తుంటే తేనెలాంటి తియ్యని ప్రేమ తో మనసంతా నిండి పోయింది. ఎటువంటి ఉద్రేకమూ కలగలేదు. మనసంతా నిర్మలంగా ఉంది.

విశ్వమంతా నిండిన ప్రేమ! పిల్ల తెమ్మెరలకు తలలూగించే చెట్ల కొమ్మల్లో, సుప్రభాత స్వరాలు వినిపించే కోయిలమ్మ పాటలో, సేదతీర్చే పరిమళాలను వెదజల్లే పారిజాతాలలో, పొగడ పూలలో.. అమ్మ పాల కోసం పరుగెత్తే లేగదూడ విన్యాసంలో.. ప్రకృతి అంతా వ్యాపించిన ప్రేమ.. నారాయడి ఒడలంతా పులకరించింది.

పక్కకి వంగి, గలగలా పారుతున్న క్రిష్ణమ్మ అలల్లో చెయ్యి పెట్టాడు. సాగర సంగమానికై పరుగులిడుతున్న కృష్ణమ్మ.. ఆ వడి, ఆత్రం.. చెయ్యి జిల్లుమంది. గభాల్న పైకి తీసి, నీళ్ళని విదిలించాడు.

మీద పడుతున్న చిరుజల్లుకి వెంకటలక్ష్మి భ్రుకుటి ముడిచి చూసింది. మళ్ళీ మొదలెట్టాడా..

ఆర్తిగా చూస్తున్న నారాయడిని చూస్తూనే గుండె ఒక సారి ఆగి కొట్టుకుంది. ఎటువంటి అలజడీ లేని.. పసిపిల్లడిలా చూస్తున్నాడు నారాయడు. తెల్లని అతని లాల్చీ, పైజామా అప్పుడే విచ్చుకుంటున్న మబ్బుల్లోని సూర్యుని వెలుగులో స్వచ్ఛంగా మెరుస్తున్నాయి. అతని శ్యామ వర్ణపు శరీరం.. మరింత నల్లగా నిగనిగ లాడుతూ ఉంది.

వెంకట లక్ష్మికి కూడా పెనిమిటిని ఆ స్థితిలో చూడగానే ఉద్వేగావేశాలకి అతీతమైన ప్రేమ కలిగింది. ధ్యాన ముద్రలో ఉన్న

సర్వేశ్వరుని ఆదిశక్తి కాంచించే పవిత్రమైన ఆరాధనా వీక్షణం.

రెండు నెలలుగా ఇల్లు కట్టడంలో.. వెంకటలక్ష్మిని చూసుకోవడంలో అలసి సొలసిన నారాయడి శరీరానికి కొత్త శక్తి వచ్చినట్లయింది. దంపతులిద్దరు అనురాగంతో ఒకరి నొకరు చూసుకున్నారు.

ఆరోజు మార్కెట్ కి సెలవు. అందుకేనేమో.. పడవలో శీనయ్య, వెంకీ, నారాయడు తప్ప ఇంకెవరూ లేరు. శీనయ్య, స్టీరింగు తిప్పుతూ ముందుకి చూస్తున్నాడు.

"శీనూ! ఇయ్యేల ఏం బేరాలున్నట్టు లేవే.. పొద్దుగుంకే వరకూ ఉంటావా మరి? మేం రాత్రికి ఇంటికెల్లి పోదామనుకుంటన్నాం." నారాయడు దృష్టి మళ్ళించుకుని అన్నాడు.

"ఉండకపోవచ్చన్నా! రేపు పొద్దు పొడిచే టయానికి తప్పక వచ్చేత్తా. రేత్రికి మావగారింట్లో ఉండి పోవచ్చు కదా?" సలహా ఇచ్చాడు సీనయ్య.

"నువ్వుండనంటే మరంతే చెయ్యాలి. కొంచెం ఒడ్డుకి దగ్గరగా తీస్కెల్లు. మీ వదినకి నడుం నొప్పి చేసింది. జాగ్రత్తగా దించాలి."

"అట్టగే.. నే కూడా చెయ్యందిస్తాలే!" ఒడ్డు చేరగానే లంగరు వేసి.. ఒడ్డుకి బల్ల దించాడు సీనయ్య.

నారాయడు, సంచీలు ముందు దించేసి వచ్చి, వెంకటలక్ష్మికి చెయ్యందించి జాగ్రత్తగా ఒడ్డు మీదికి తీసుకెళ్ళాడు.

"అమ్మడూ! ఎట్టున్నావే.. ఇంత సిక్కిపోయావేంటే.. మా అమ్మే. దా! అల్లుడూ, అమ్మా నాయన కులాసేనా?" వెంకటలక్ష్మి, బుగ్గలూ మొహం తడువుతూ తల్లి అంటుంటే.. నవ్వాపుకోడానికి నానా అవస్థా పడ్డాడు నారాయడు.

"ఏందమ్మా! అట్టంటావు.. డబలిడ్లీలా అయింది దాని మొహం. ఆ పేవకి కాస్తంత అడ్డుకట్టెయ్యి." వెంకటలక్ష్మి అన్న చిన్నయ్య తల్లిని విసుక్కున్నాడు ముద్దుగా!

ఇంటిడు మందీ బిలబిలా వచ్చేశారు.

పెద్దన్నకి పెళ్ళయింది. ఒక అబ్బాయి కూడా.. నాలుగేళ్ళుంటాయి. అత్తా అంటూ కాళ్ళు పట్టేసుకున్నాడు. ఇంట్లో పండగ వాతావరణం వచ్చేసింది.

"మీరియాల్టికస్తన్నారని షావుకారు చెప్పాడు. ఆయన్నే మీ గురించి వాకబు చేస్తంటా.. రోజిడిచి రోజొస్తానే ఉంటాడు కదా! వెంకమ్మ కార్డు కూడా రాస్తంటదనుకో!" వెంకటలక్ష్మి తండ్రి వరండాలో గుప్పున చుట్ట పొగ వదులుతూ అల్లుడ్ని పక్కన కూర్చో పెట్టుకుని విశేషాలు అడగ సాగాడు.

ఇంట్లో ఆడపిల్ల ఉండడమే ఒక అందం. ఆ పిల్ల పెళ్ళయి అత్తవారింట్లో ఆనందంగా కాపురం చేసుకుంటూ అల్లుడితో సహా వచ్చిందంటే ఇంక ఇంటి వారి ఉత్సాహం చెప్పేదేముంది. వదినగారు వెళ్ళి గబగబా గారెలకి పప్పు నాన బోసింది. పెద్ద అన్నగారు వెళ్ళి కోడిని కొనుక్కొచ్చాడు. చిన్నన్న సేమ్యా, పాలు తీసుకొచ్చాడు.

వెంకటలక్ష్మికి పుట్టింటి మమకారం చూస్తుంటే కళ్ళలో నీళ్ళాగలేదు. పకపకా నవ్వుతూనే కన్నీళ్ళు కార్చేస్తోంది. అందరికీ అర్ధమైపోతోంది అవి సంతోషం పట్టలేక వస్తున్నాయని.

ఇల్లంతా కలియదిరిగింది వెంకటలక్ష్మి. దొడ్లో ఉన్న బర్రెనీ, దూడనీ పలకరించింది. సన్నజాజి పందిరి దగ్గరకెళ్ళి గిన్నె నిండా పూలు కోసుకొచ్చింది. తలలూగిస్తూ తనని కుశలమడుగుతున్న ముళ్ళగోరింట, జూకా మల్లిలని అందినంత మటుకు ఆకు ఆకు నిమిరింది.

జామ చెట్టుకి ఎన్ని పిందెలున్నాయో లెక్కపెట్టింది. తప్పి పోయిన తల్లి దగ్గరికి వచ్చిన చంటిపిల్ల తల్లిని తడిమి తడిమి

చూసుకున్నట్లు అంగుళం అంగుళం, చెంగు చెంగుమని వదలకుండా తిరిగింది.. తల్లి మురిపెంగా అత్తింటి సంగతులు అడుగుతుంటే జవాబు చెప్తూ.

"వెంకమ్మా! వచ్చి అల్లుడికి కావల్సినవి వడ్డించు." తండ్రి పిలుపు విని విహారం కట్టిపెట్టి ఇంట్లోకి పరుగెత్తింది. అల్లుడికి, మామ పక్కన పీట వేసి, అప్పుడే కోసిన అరటాకు వేశారు. అన్నీ కొద్ది కొద్దిగా వడ్డించి, పిలిచారు అందరినీ. నారాయడి పక్కనే వెంకటలక్ష్మికి కూడా వేసింది వదిన.

"నేను మీతో తింటా వదినా! మగాళ్ళది అవనీ.." ఎర్రబడిన మొహంతో వెంకటలక్ష్మి గునిసింది.

"అదేం కుదరదు. పెళ్ళిలో మేవంతా పన్లలో పడి తిరుగుతా ఉన్నాం. ఇప్పుడు మీరిద్దరూ ఒకరికొకరు తినిపించుకోవాల్సిందే.." పట్టుదలగా అంది వదిన.

నారాయడు పీట మీద కూర్చుని జరుగుతున్న తంతంతా నవ్వుతూ చూస్తున్నాడు. చిన్నన్న బలవంతంగా చెయ్యి పట్టుకుని చెల్లెల్ని, బావ పక్కన కూర్చోపెట్టాడు. నవ్వుల పువ్వులు వెదజల్లుతూ, బావతో పరాచకాలడుగుతూ, కొసరి కొసరి వడ్డిస్తూ భోజనాలు చేశారు.

## 5

"రెండ్రోజులుండి పోవచ్చు కదయ్యా!" అల్లుడ్ని అడిగాడు మామ వరండాలో తీరిగ్గా పొగాకు ఆకులు సాపు చేస్తూ. వెంకటలక్ష్మి ఆశగా చూసింది. తెల్లారి లేచి తయారైపోయారు నారాయడూ వెంకీ.

"ఎట్టా కుదురిద్ది మామా? వెంకికి మాత్రం తెలవదా! శనారానికి మీరంతా రావాలి. కొత్తింటి పెవేశానికి పూజ, వ్రతం పెట్టుకున్నాం. మేవే పీటల మీద కూసుంటామంట. అమ్మ చెప్పమంది. పెద్దయ్యా, చిన్నయ్యా.. అందరూ తప్పక రావాలి."

"రాకుండెట్టుంటామబ్బయ్యా! ఆడపిల్ల పీటల మీద కూకుంటే కళ్ళ పంటే కద! అల్లుడూ ఇదిగో.. ఈ మూడేలూ ఖర్సులకుంచు. భోయనాల ఖర్సు మాదే. ఇంకేం మాట్టాడద్దను మా ఇయ్యంకుడ్ని. శుక్కురారం చివరాకరి పడవలో వచ్చేత్తాం. రేత్రి కూడు కాత్ర పడద్దని సెప్పు సెల్లెమ్మకి. దిబ్బరొట్టేసుకుని తెచ్చేత్తాం అందరికీ." వెంకటలక్ష్మి తండ్రి బాబయ్య గంభీరంగా అన్నాడు.

తల్లిదండ్రులకి దండాలు పెట్టి, అన్నలకీ వదినకీ మరీ మరీ చెప్పి బైటికొచ్చారు నారాయడూ, వెంకీ.

"ఇదిగో.. రిక్షాలో ఎల్లండి. మాకు ఎప్పుడూ పిలిస్తే పలికే వోడొచ్చాడు." పెద్దయ్య, నిండుగా ఉన్నసంచీలు రిక్షాలో పెట్టేశాడు. అత్తా కోడలూ రాత్రి కూర్చుని చేసిన కొబ్బరి బూరెలు, చేగోణీలు, జంతికలు.. చలిమిడి, పండు మిరపకాయ పచ్చడి.. వీలయినన్ని తినుబండారాలతో నింపేశారు సంచీలన్నీ.

"వామ్మో! బామ్మరిదీ.. ఇయ్యన్నీ మోసుకొల్లటం నా వల్లయ్యే పనేనా?" నారాయడు గాభరాగా అన్నాడు.

"అంత సుకుమారవైతే కూలోడ్ని పెట్టుకో బావయ్యా!" మేలవాడాడు పెద్దయ్య.

నారాయడికి రోసవొచ్చి రిక్షా ఎక్కి కూర్చున్నాడు, బుంగమూతి పెట్టి.

"వా అబ్బో! అంతా అలకే? మీరు తెచ్చిందాంట్లో సగం కూడ లేవు బావయ్యా! అట్ట కనిపిస్తన్నయ్యంతే." చిన్నయ్య పక్కకెళ్ళి, గడ్డం పట్టుకుని అన్నాడు.

"మనం ఎప్పటికీ ఇట్టానే కలిసి మెలిసుండాలి చిన్నయ్యా! శనారం కలుద్దాం." నారాయడు చిరునవ్వుతో బామ్మరిది భుజాన్ని తట్టాడు.

వెనక్కి తిరిగి కనిపించినంత మేర చేతులూపుతూనే ఉంది వెంకటలక్ష్మి. ఎందుకో మనసంతా భారమైపోయింది.

ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తున్నారు మల్లయ్య, జాలమ్మ. పట్టుబట్టలు కట్టుకుని పీటలమీద కూర్చున్నారు నారాయడు, వెంకటలక్ష్మి.

“అచ్చంగా లచ్చిమీ నారాయళ్ళ లాగనే ఉన్నారు. నా దిష్టే తగిలేట్టుంది వదినా..” జాలమ్మ, చేమంతి పూలు మాలగా కడుతున్న వియ్యపురాలితో అంది. గోడ వారగా కూర్చుని, కాలు ముందుకు జాపి, బొటని వేలిని తిప్పి దారం రెండు వరసల్లో లాగి, చేమంతి పువ్వు అడ్డంగా పెట్టి, మాల అల్లుతోంది వెంకటలక్ష్మి తల్లి.

నారాయడు, వెంకి శ్రద్ధగా వ్రతం చేస్తున్నారు, పంతులుగారు చెప్పినట్లు. ఊర్లో ఉన్న చుట్టాలందరినీ పిలిచారు. నూటాభై మంది పైన తేలారు. అందరూ ఇంటి బైట, షామియానా కింద జంపఖానాలమీద, కొన్ని కుర్చీల మీద కూర్చుని కబుర్లాడుకుంటున్నారు. మామిడాకులు, అరటాకుల్తో కొత్త ఇంటిని అలంకరించారు.

పచ్చని దిండిగల్లు పట్టు బట్టల్తో నిజంగానే లక్ష్మీ నారాయణుల్లాగనే ఉన్నారు దంపతులు. వెంకటలక్ష్మి తల్లిదండ్రులకేసి చిరునవ్వుతో చూసింది.. తృప్తిగా. ఇంత మంచి ఇంట్లో పడేసినందుకు మనసులోనే నమస్కరించుకుంది. కూతురి పక్కనే మఠం వేసుకుని కూర్చున్న బాబయ్య మొహం సంతోషంతో వెలిగిపోతోంది.

వచ్చిన బంధువులే నడుంకి తువ్వాలు కట్టేసి నలుగురు మొగాళ్ళూ, మోకాళ్ళ కిందికి చీరలు దోపేసి ఐదారుగురు ఆడవాళ్ళూ, వంటలు చేసేస్తున్నారు, పెద్దయ్య, చిన్నయ్యల ఆధ్వర్యంలో. పిలిచిన వాళ్ళని పిలవగా.. పిలవని బీదా బిక్కీకూడా ఆ రోజు భోజనాలు చేస్తారు. మొత్తానికి నూటాభై గడపున్న ఊర్లో ఎవరింట్లోనూ పొయ్యి లేవకూడదా రోజు. ఎవరింట్లో పూజ, పండగైనా అంతే. డబ్బు సర్దుబాటు కాకపోతే.. తలో సరుకూ తెచ్చి పడేస్తారు.

ఉన్నంతలోనే సర్దుకుని అందరం తిందామనుకునే సంస్కృతి. ఎవరైనా నేర్చుకుని పాటించ వలసినదే!

పడమటింట్లోకి వస్తూనే కళ్ళు పెద్దవి చేసి చూశాడు నారాయడు. ‘మరీ చిన్నదిగా లేదే నా ఇల్లు..’ అనుకున్నాడు. నిజమే! ఇంచుమించు తూరుపు ఇల్లంతా ఉంది. గృహప్రవేశానికి బావమరిది పెద్దయ్య ఇచ్చిన పట్టెమంచం, దాని మీద కొత్త దూది పరుపు, రెండు బూరుగు దూది దిళ్ళు. మెత్తని కొత్త దుప్పటితో, దిళ్ల గలేబులతో తళతళ్ళాడుతున్నాయి.

ఒక మూలగా కట్టిన సిమెంటు గట్టు మీద కుండ, దాన్నిండా నీళ్ళు, బోర్లించిన సత్తు పళ్ళెం. రెండు రాగి గ్లాసులు పక్కనే, మిలమిలా మెరిసిపోతున్నాయి. మిగిలిన ఇల్లంతా ఖాళీ.

ఎర్రని సిమెంటు నేలంతా తీర్చైన ముగ్గులతో కళకళ్ళాడిపోతోంది.

వ్రతం అయి రెండ్రోజులయింది. మొదటి రాత్రి అందరూ జాగారం చేశారు. ఆటలు, పాటలతో రాత్రంతా హోరెత్తించేశారు. ఊర్లో ఉన్న దగ్గర బంధువులు కూడా ఓపికున్నంత వరకూ పాల్గొన్నారు. రెండో రాత్రి వెంకటలక్ష్మి పుట్టింటారు అందరూ నేల మీద జంపఖానాలు వేసుకుని పడుక్కున్నారు ఆదమరచి.

ఆ రోజు భోజనాలవగానే ఇల్లంతా ఎక్కడివక్కడ సర్దేసి అందరూ వెళ్ళిపోయారు.

“హడావుడిలో పట్టించు కోలేదు గానీ బానే చేశారు అలంకారం.” నారాయడు చుట్టూ పరికించి తృప్తిగా అనుకున్నాడు.

తలెత్తి చూశాడు. పైన రేకులే.. అయినా ఒక తీరుగా అందంగా ఉన్నాయి. దులుపుళ్ళూ అవీ తేలిగ్గానే చేసుకోవచ్చు. ఉన్నట్టుండి నిస్త్రాణగా అనిపించింది నారాయడుకి.

కాళ్ళీడుచుకుంటూ వెళ్ళి మంచం మీద వాలి పోయాడు. నాలుగు రోజుల నుంచీ, ఇంటి క్కావలసిన చిన్నా చితకా పనులు చేసుకోవడం.. వ్రతానికి అన్నీ అమర్చుకోవడం.. తిండీ తిప్పలు లేకుండా తిరిగాడు.

తల దిండుకాన్చీ ఆన్చగానే ఎక్కడ్నుంచొచ్చిందో.. పరుగెత్తుకునొచ్చి, నిద్రాదేవి కళ్ళ మీద వాలి పోయింది.

క్షణాల్లో గుర్రు పెట్టేశాడు. అప్పుడే లోపలికొచ్చిన వెంకటలక్ష్మి, అమాయకంగా నిద్ర పోతున్న నారాయడి తల ముట్టీ ముట్టకుండా నిమిరి, పక్కనే ముడిచి పెట్టుకుని పడుకుంది.

అర్ధరాత్రి విపరీతమైన దాహం వేసింది నారాయడికి. ఒళ్లంతా చెమటలు. లేచి వెళ్ళి, కుండ లోంచి నీళ్ళు తీసుకుని గటగటా తాగేశాడు. వెనుక తలుపు, ముందు కిటికీ, బార్లా తీశాడు. చల్లని గాలి సేద తీరుస్తూ నెమ్మదిగా తగిలింది మొహానికి.

గుండెల నిండుగా గాలి పీల్చి వదిలి, వాకిట్లోకి వెళ్ళి చూశాడు. ఇంటి ముందున్న వేపచెట్టు గంభీరంగా.. మీకందరికీ నేనున్నాను రక్షగా అన్నట్లు నిలిచి ఉంది. పొగడ చెట్టు పరిమళాల తో నిండిన గాలి ఆవరణని చుట్టు ముట్టేసింది. పల్చని వెన్నెల నేలంతా పరుచుకుని, కదులుతున్న కొమ్మల పొదవాటి నీడలతో అనేక ఆకృతుల చిత్రీకరిస్తోంది.

అంతా కలలాగుంది నారాయడికి. నిజంగా తను ఇల్లు కట్టేశాడా? తమకంటూ ఒక గది.. ధనవంతులకి కానీ సాధ్యం కానిది.. తన వయసు వాళ్లంతా కొద్దిగా అసూయతో చూసిన చూపు తలుచు కుంటే ఛాతీ ఉప్పొంగింది. తూరుపింటికెళ్ళి తలుపు కొద్దిగా లాగి చూశాడు. రాలేదు.

అమ్మా, నాయనా హాయిగా పండుకొని ఉంటారు. వెచ్చగా.. చలి బాధ లేకుండా!

పడమటిల్లు వేసినప్పుడే, ఇంటి చుట్టూ దడి కట్టాడు.. తనొక్కడే. వెంకి సాయంతో! ఇద్దరూ కలిసి పని చేసుకోడంలో ఎంత హాయి.. ఎంత ఆనందం. ప్రపంచంలో తనంత అదృష్టవంతుడు లేడనిపించింది. వెంకి అట్టా అట్టా తమలో కలిసి పోయింది.

ఆరు బయట కాసేపు పచార్లు చేసి, ఇంట్లోకి వెళ్ళాడు.

మంచం ఖాళీ గా ఉండడంతో, తనకి తెలియ కుండానే మధ్యకి జరిగి పడుక్కుంది వెంకట లక్ష్మి. ఏ కలలో విహరిస్తోందో.. చిరునవ్వు నవ్వుతోంది. మొహం ప్రశాంతంగా ఉంది. దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసలతో లయ బద్ధంగా పైకీ కిందికీ కదులుతోంది వక్షం.

ఉన్నట్టుండి ఒకసారి మూలిగింది. మూలుగుతూనే కాళ్ళు ముడుచుకుంది. నారాయడికి ప్రేమ లావాలా ఉబికి వచ్చింది. పక్కన కూర్చుని, కాళ్ళు సుతారంగా జాపి నెమ్మదిగా వత్త సాగాడు.

వెంకటలక్ష్మి నెమ్మదిగా కళ్ళు తెరిచి చూసి నవ్వింది కవ్విస్తున్నట్లుగా! నుదుటి మీద ముంగురులు దోబూచులాడుతూ, మబ్బు తునకలు అల్లరిగా ఆడుకుంటున్న చందమామలా ఉంది మొహం.

నారాయడి గుండె లయ తప్పింది. అసంకల్పితంగా చేత్తో ముంగురులు సవరించాడు. అంటీ అంటనట్టున్న ఆ స్పర్శకి స్పందించిన వెంకటలక్ష్మి మత్తుగా అరమోడ్పు కన్నులతో భారంగా చూసింది. అతి నెమ్మదిగా లేపి కౌగిలిలో బంధించాడు.

ఎన్నో రోజులుగా ఎదురు చూసిన క్షణం.. ఏకాంతం. ఎవరైనా చూస్తారేమో అన్న భయం లేదు. అమ్మా, నాన్నలకి తమ కదలిక తెలుస్తాయేమో నని బెదురు లేదు. హాయిగా స్వేచ్ఛగా..

రెండు చేతులతో నారాయడిని చుట్టేసి, వక్షంలో మొహం దాచుకుంది. సున్నితంగా కళ్ళని చుంబించాడు నారాయడు. కళ్ళతో వీధి



KOUMUDI

తలుపు చూపించింది వెంకటలక్ష్మి. తలుపులోంచి వెన్నెల మంచం వరకూ పరుచుకుంది. లేచి వెళ్ళి తలుపు మూసి వచ్చాడు నారాయడు. చటుక్కున లేచి లతలా అల్లేసుకుంది వెంకి.

✻✻✻

వరండా చివరి వరకూ పాకుతూ వచ్చి, అతి లాఘవంగా గుప్పెడితో మట్టి తీసి నోట్లో పెట్టేసుకున్నాడు సాంబడు. వెనుకే పెద్ద పెద్ద అంగలేస్తూ వచ్చి వాడిని ఎత్తుకుంది జాలమ్మ. తలెత్తి నాన్నమ్మని చూసి మూతి బిగించాడు సాంబడు. రెండు వేళ్ళని వాడి నోట్లోకి జొనిపి, మట్టి తీసి విసిరేసింది జాలమ్మ.

"అల్లరి భడవా! ఇదేం పనిరా? మట్టి అరుగుద్దా?" ముద్దుగా కోప్పడింది.

పకపకా నవ్వాడు సాంబడు.. కింది పళ్ళు రెండూ కనిపించేట్లు.

"చిన్ని కిట్టయ్యవా ఏంరా? నా బంగారు కొండా".. బకెట్టు దగ్గర కెళ్ళి, చెంబెడు నీళ్ళు తీసి, నోరు శుభ్రంగా కడిగింది. అవునన్నట్టు తలూపాడు సాంబడు.

నారాయడు పడమటిల్లు వేసి రెండు సంవత్సరాలయింది. ఇల్లు వేసిన మూడు నెల్లకే వెంకటలక్ష్మికి వేవిళ్ళు మొదలయ్యాయి. నీళ్ళు తప్ప ఏది నోట పెట్టినా బైటికెళ్ళిపోవడమే. నీరసంతో కళ్ళు లోతుకెళ్ళిపోయాయి.

కాలు కదప నియ్యకుండా చూసుకుంది కోడల్ని జాలమ్మ. చింతకాయ పచ్చడితో రెండు ముద్దలు వెళ్తున్నాయని.. పక్కూరికి పంపి పచ్చి చింతకాయలు తెప్పించింది. తిన్నదంతా బైటికెళ్ళిపోతోందని ఊరుకోకుండా ఏదో ఒకటి పెడుతూనే ఉంది.

ఏడో నెల్లో పురిటికి పుట్టింటికెళ్ళి డాక్టరుకి చూపించుకుంది వెంకటలక్ష్మి.

"బిడ్డ బాగా పెరిగిందమ్మా! వేవిళ్ళు లేవా?"

"ఉన్నయ్యండీ. తిన్నదంతా ఎల్లి పొయ్యేది. మా అమ్మ పట్టించుకోకండా పెడ్తానే ఉండేది." నారాయడు జవాబిచ్చాడు, చేతులు కట్టుకుని నిల్చుని.

"ఓ.. చాలా మంచి పని చేసింది మీ అమ్మ.. ఏమీ తెలియకుండానే. ఎంత బైటికెళ్ళినా కొంత లోపలికి వెళ్ళి అరుగుతుంది. అదే పాపాయి బాగా ఎదగడానికి సాయపడింది. నువ్వు చాలా లక్కీ వెంకటలక్ష్మీ! మీ అత్త బాగా చూసుకుంది." డాక్టర్ మాటలకి అవునన్నట్లు తలూపింది వెంకటలక్ష్మి, ఎర్రబడిన బుగ్గలతో.

తప్పదు కనుక బలవంతాన పుట్టింట్లో వదిలారే కానీ ప్రతీ వారం కోడల్నిచూట్టానికి జాలమ్మా, భార్య యోగ క్షేమాలు కనుక్కోటానికి నారాయడు వెళ్తూనే ఉన్నారు.

బిడ్డ అడ్డం తిరిగిందని పెద్దాపరేషన్ చెయ్యాలన్నప్పుడు.. బెదిరి పోయాడు నారాయడు. మిగిలిన అందరూ.. హాస్పిటల్ లో బాగుండదని ఆగి పోయారే కానీ శోకన్నాలు పెట్టేసే వారే.

"ఏందయ్యా.. ఇప్పుడు ఈ ఆపరేషన్ చాలా మామూలైపోయింది. అంత లావు విచారం అవుసరం లేదు. ఇక్కడ సంతకం పెట్టాలి. నువ్వు లోపలికి రా నారాయడూ!" లేడీ డాక్టరు కోప్పడి నారాయడ్ని లోపలికి తీసుకెళ్ళింది.

"మరి ఇదెందుకండి డాక్టరు గారూ! ఏం ఫరవాలేదంటన్నారుగా?" వణికి పోతూ అడిగాడు నారాయడు.

"ఇదంతా ఫార్మాలిటీ. అంటే నేను ఈ తెల్ల గౌనేసుకున్నంత మామూలన్న మాట. ఇందులో నువ్వు సంతకం చేస్తే కానీ నేను ఆపరేషన్ చేసి బిడ్డని బైటికి తియ్యటానికి వీల్లేదు. ఏవంటావు?" డాక్టరమ్మ హడావుడిగా కోటేసుకుంటూ అంది.

"ఇందులో ఏముందండీ?"

డాక్టరమ్మ గట్టిగా నిట్టూర్చింది.

"ఏముంటుందయ్యా? ఆపరేషన్ చెయ్యడానికి నీకేం అభ్యంతరం లేదు. ఎటు పోయి ఎటొచ్చినా డాక్టర్ కి, హాస్పిటల్ కి ఏమీ బాధ్యత ఉండదు అని ఉంటుంది."

"అమ్మమ్మో.. ఎటు పోయి ఎటు రాటమేటండీ?" నారాయడి గొంతు పూడుకు పోయినట్లయింది.

"చూడు నారాయడూ! మా లోపం ఏమీ లేకుండా, శాయశక్తులా ప్రయత్నం చేస్తాం. అసలు మనం బ్రతికే ప్రతీ క్షణమూ, ఆ దేవుడి బిక్షే కదా! ఏం చెప్పగలం? ఈ నిముషం నేనిక్కడున్నాను. రేపెక్కడుంటానో ఎవరైనా చెప్పగలరా? నూటికి తొంభైతొమ్మిది పాళ్ళు ఏమీ కాదు. తల్లీ, బిడ్డా క్షేమంగా ఉంటారు. అయినా.. మన చేతుల్లో లేని పరిస్థితులు కొన్ని ఉంటాయి. మానవమాత్రులెవరూ ఎదుర్కోలేనివి. అందుకని, మా జాగ్రత్త మేం తీసుకుంటాం. అంత కంటే ఏమీ లేదు. సంతకం పెడ్తావా లేదా?'

వణుకున్న చేతుల్తో సంతకం పెట్టాడు నారాయడు డిక్లరేషన్ ఫామ్ మీద.

కుటుంబం అంతా.. మల్లయ్య, జాలమ్మ, వెంకటలక్ష్మి పుట్టింటారు.. అంతా, చేతులు జోడించి కళ్ళు మూసుకుని వరండాలో కూర్చున్నారు. ఒక గంటయ్యాక, డాక్టరమ్మ బయటికి వచ్చింది.

"అంతా కులాసా. మగపిల్లాడు. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. పిల్లడికి స్నానం చేపించాక, మీరంతా చూడచ్చు. ఒకళ్ళిద్దరు వస్తే, అమ్మాయిని పలకరించచ్చు. మళ్ళీ మత్తిచ్చేస్తాము నొప్పి తెలియ కుండా."

నారాయడు, వెంకటలక్ష్మి తల్లి లోపలికి వెళ్ళి పలకరించి, నవ్వు మొహాల్తో వచ్చారు.

రెండుకుటుంబాలలోనూ.. పెద్దాపరేషన్ చెయ్యటం అదే మొదటి సారి. పొట్టకోసి పిల్లాడిని తియ్యడవా? అమ్మో! మొత్తం పాలెం అంతా కథలుగా చెప్పుకున్నారు. అక్కడ అంత వరకూ నలుగురైదుగురికి ప్రసవంలో పిల్లో, తల్లో పోవడం జరిగింది కానీ.. పెద్దాపరేషన్ చేశాక.. తల్లీ పిల్లా కులాసాగా ఉండటం, మల్లయ్యింట్లోనే.

అప్పట్నుంచీ రాణీ వైభోగవే వెంకటలక్ష్మికి. మూడు నెల్లు వచ్చే వరకూ కాలుకింద పెట్టనియ్యలేదు తల్లీ, వదిన గారూ. నారాయడు రెండ్రోజులకొక సారి వెళ్ళేవాడు. బాగుండదని కానీ అక్కడే ఉండి పోవాలనీ.. కొడుకునీ, వెంకినీ చూసుకుంటూ మురిసి పోవాలనే ఉండేది. బావ మరుదులు వేళాకోళం.. వెంకటలక్ష్మి మురిపెపు నిష్ఠూరం చూపులు పట్టించు కోకుండా!

ఘనంగా బారసాల చేశారు వెంకటలక్ష్మి తండ్రి బాబయ్య, అన్నదమ్ములు. తల్లినీ పిల్లడినీ తీసుకుని వచ్చి నాలుగు రోజులుండి వెళ్ళింది వెకటలక్ష్మి తల్లి.

అప్పటి నుంచీ మనవడి ముద్దు మురిపాలన్నీ జాలమ్మవే! పంటల దిగుబడి కూడా బాగనే ఉంది.

"అమ్మా!" కెవ్వున అరిచింది జాలమ్మ. వంగుని, తనని ఎత్తుకున్న నాన్నమ్మ చేతిని ఉన్న రెండు పళ్ళూ చర్మంలోకి దిగేట్లు కసక్కన కొరికాడు సాంబడు. ఆవిడ అరుపుకి, చప్పట్లు చరుస్తూ కిలకిలా నవ్వేస్తున్నాడు. ఉన్నవి రెండే పళ్ళయినా సూదుల్లా ఉన్నాయి.

వంటింట్లో పనిచేసుకుంటున్న వెంకటలక్ష్మి పరుగెత్తుకుంటూ వచ్చింది.

సాంబడిని కిందికి దింపేసి, చెయ్యి నిమురుకుంటూ చూపించింది జాలమ్మ. పంటి గాట్లతో ఎర్ర బడుతున్న చర్మం. చెయ్యి తీసుకుని, అందిన తుండు గుడ్డతో గట్టిగా కట్టేసి, ఒక్కరుపు అరచింది. జాలమ్మ నేల మీద చతికిల బడి, బాధ పడుతూనే చంటాడి కోసం చూసింది.. ఏం కొంప మీదికి తెస్తున్నాడో!

అచ్చు చిన్ని కృష్ణుడి కోసం వెతికిన యశోదమ్మలాగే! కన్నది వెంకటలక్ష్మి అయినా, అమ్మ పాలు తాగేటప్పుడు తప్ప ఎప్పుడూ నాన్నమ్మ దగ్గరే వాడి మకాం. ఆవిడ కన్నుల్లో అంతు లేని ప్రేమ.

"ఏందిరా సాంబయ్యా! ఇట్టాంటి పన్లు చేస్తే ఊరుకోనంతే." ముద్దుగా విసుక్కుంది.

అంతలో సాంబడు చరచరా పాకి వరండా అంచు కెళ్ళి పోయి, మట్టిలో చెయ్యి పెట్టేస్తున్నాడు.

"ఇట్టాంటి పన్లు చేశావంటే కట్టేస్తానంతే." వెంకటలక్ష్మి పరుగెత్తి వెళ్ళి, ఎత్తుకుని బెదిరించింది. వాడికదో లెక్కా! భయపడినట్లు, పెదవులు వణికిస్తూ చూసి, వేప చెట్టు మీద వాలిన కాకిని బుల్లి చేతుల్తో పిలవ సాగాడు.. అంత మొహం చేసుకుని.

కన్న కడుపు కరిగి నీరై పోయింది. శరీరమంతా తెలియని ఉద్వేగంతో నిండి పోయి.. కన్నయ్యని ఎగరేసి ఎత్తుకుంది వెంకటలక్ష్మి. పొట్టమీద రెండు కాళ్ళూ తన్ని పెట్టి, తల్లి మొహం లోకి ఆర్తిగా చూస్తూ, చిరునవ్వు నవ్వాడు సాంబడు.

సృష్టిలో అమ్మ ప్రేమని మించిందేమైనా ఉందా? అందుకుంటున్న పసి పాపల ఆనందాన్ని మించిన తృప్తిని ఎక్కడన్నా కంటామా?

ఎక్కడెక్కడో తిరిగి, ఆహారాన్ని సంపాదించి పిల్లల నోటి కందించే పక్షులు, లేగదూడ ఎగిరెగిరి పాలు తాగుతుంటే తన్మయత్వంతో మురిసిపోతూ, ఆహారాన్ని నెమరేసుకునే గోమాతలు.. పది హేను రోజుల పైనే గుడ్ల మీద.. తినడానికీ, విసర్జనకీ తప్ప లేవకుండా కూర్చునే కోళ్ళ వంటి అనేక పక్షులు.. ఎక్కడయినా ఆ దృశ్యాలని చూస్తుంటే తనువు, మనసు పులకించక మానదు ఎవరికైనా!

అదే పులకింతతో చూస్తూ ఉండి పోయింది జాలమ్మ గోడకానుకుని కూర్చుని. నిండైన తన గర్భఫలమే చిన్నారి సాంబడు. వాడి ముద్దు మురిపాల్లో నారాయడి చిన్నతనాన్ని మనో ఫలకం మీదకి తెచ్చుకుంటోంది.

"కాసిన్ని మంచినీళ్ళిత్తారా? మనవడి ఆటల్లో పడి మమ్మల్ని మరచి పోతన్నారు అత్తాకోడలూ!" తడికె గేటు తీసుకుని లోపలికొచ్చిన మల్లయ్యనీ, నారాయడినీ గమనించనే లేదు ముగ్గురూ.

తాత గొంతు విని అటు తిరిగి, రెండు చేతులూ జాపి దుంకబోయాడు సాంబడు.

జాలమ్మ, రెండు చేతులూ నేల మీద ఆన్చి లేచింది. పిల్లవాడిని తాత కందించి ఇంట్లోకి నడిచి, మట్టి ముంతతో నీళ్ళందించింది వెంకటలక్ష్మి.

తాత మీసాలతో ఆడుకుంటున్న వాడు కాస్తా.. నీళ్ళ ముంత చూసి దాని మీదికి విజృభించ బోయాడు సాంబడు.

"వారి నీ అమ్మకడుపు చల్లంగుండా.. నన్ను నీళ్ళైనా తాగనియ్యవురా అబ్బయ్యా! మంచోడివే.." చేతులు చాపిన నారాయడికి మనవడినందించి, ముంత ఎత్తి నీళ్ళన్నీ ముంత దించకుండా తాగేసి, మీసాలు తుడుచుకున్నాడు మల్లయ్య.

పడమటిల్లు కట్టినప్పుడే ముందు వాకిట్లో ఒక అరుగు కట్టాడు నారాయడు.. మిగిలిన ఇటుకలతో సున్నంతో కలిపి. దాని మీద కూర్చుని అప్పుడే పొలం నుంచి తెచ్చిన కంది కాయల్ని ఒలవటం మొదలెట్టాడు.

చిన్నారి సాంబడు ఇంటికొచ్చే వరకూ ముప్పొద్దులా మూడు లంక పొగాకు చుట్టలు కాల్చకుండా ఉండలేకపొయ్యేవాడు మల్లయ్య. కాడలు తీసి, ఆకులు సాపు చేసి, ఒక తీరుగా చుట్టి, మొదలు కసిక్కిన కొరికి ఉమ్మేసి, చుట్ట అంటించుకుని, గోడ కానుకుని, కాళ్ళు బారజాపి, కూర్చున్నాడంటే.. స్వర్గ లోక విహారమే. గుప్పున పొగ వదులుతుంటే.. మూడిళ్ళవతలికి మల్లయ్య ఇంట్లో ఉన్నట్లు తెలిసేది.

ఇరవై సంవత్సరాలుగా ఉన్న అలవాటు.. జాలమ్మ మాత్రం వ్యసనం అనే అంటుంది. మనవడు నట్టింట్లోకి వచ్చే వరకూ బాగనే సాగింది.

మూడు నెల్ల సాంబడు, నలుగు పెట్టి స్నానం చేయించి వరండాలో చాప మీద నీరెండకి పడుక్కో బెడితే.. అరమోడ్పు కన్నులతో



KOUMUDI

నిద్రలోకి జారుకునే వాడు.

వెడల్పాటి నుదుటి మీద చాదు బొట్టు, కళ్ళకి చిటికిన వేలంత వెడల్పున కాటుక, బుగ్గనొకటి, కుడి కనుబొమ్మ పక్కనొకటి దిష్టి చుక్కలు పెట్టి, లంగోటీ కట్టి, తెల్లని జుబ్బా వేసి తయారు చేస్తుంది నాన్నమ్మ.. కోడలి సాయంతో. మెత్తటి చీరలు నాలుగు కలిపి కుట్టిన బొంత వేసి పడుక్కోబెడితే.. మూడు గంటలు కదలకుండా పడుక్కునే వాడు బుల్లి సాంబడు.. తాత ఇంట్లో లేకపోతే.

తాత, నిద్రపోతున్న మనవడిని చూస్తూ, పక్కనే కూర్చుని ఆనందంగా చుట్ట చుట్టుకునినోట్లో పెట్టుకోగానే ఖళ్ళు ఖళ్ళు మని దగ్గుతూ లేచి పొయ్యేవాడు. దూరంగా జరిగి కూర్చున్నా కూడా ఆపేవాడు కాదు.

ఒక రోజు సాంబడికి ఉక్కిరి బిక్కిరయ్యి ఊపిరి పీల్చుకోడానికి కూడా కష్టమై పోయింది.. జాలమ్మ అంతెత్తున లేచింది.

"పిల్లవాడ్ని చంపేస్తా వేందయ్యా? నీ పాడు అలవాటూ నువ్వూ.. ఈ సారి ఇంట్లో చుట్ట ఎలిగించావంటే.. మేం ముగ్గురం, పొలంలో ఉన్న పాకలోకి మారి పోతాం. నువ్వు ఇక్కడే చుట్ట ముట్టించు కుంటూ ఆనందంగా యెలిగిపో!"

అప్పట్నుంచీ.. ఒక్క సారిగా చుట్ట మానేశాడు మల్లయ్య. అదే ప్రేమ పాశం మహత్యం. తండ్రీ కొడుకులకైనా.. తాతా మనవలకైనా.. ఎవరికైనా బలంగా ముడి వేసేస్తుంది

చిత్రంగా.. నాలిక పీకడం, తలంతా దిమ్ముగా అయిపోవడం, అది లేకపోతే బతగ్గలవా అనుకోవడం.. ఏవీ జరగ లేదు. శుభ్రంగా.. మామూలుగా పనులు చేసుకుంటున్నాడు.

చుట్ట మానేసినప్పట్నుంచీ పనులు కూడా ఎక్కువ చేసుకో గలుగుతున్నాడు మల్లయ్య.

"మనవడొచ్చి మా బాగనే కంట్రోల్లో పెడతన్నాడే తాతని.." పక్కింటి వాళ్ళ మాటలు వింటూ.. మీసాల చాటున నవ్వుకుంటాడు మల్లయ్య.

**"వెంకటలక్ష్మీ! ఏడున్నావే**.. అర్జెంటుగా ఇట్టా రా!" నారాయుడు హడావుడిగా తడికె గేటు తీసుకుని లోపలికి రాబోయాడు. గేటు కాస్తా లటక్కన చేతిలో కొచ్చింది.

"ఛా.. ఇప్పుడే ఇరగాలా ఇది. అవసరమైనప్పుడే అడ్డంకులొస్తయ్యంటే ఏందో అనుకున్నా.." నారాయుడు గేటు పక్కకి పెట్టి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ వరండాలోకొచ్చాడు.

అప్పటికే.. ఎప్పుడెళ్ళాడో మూడేళ్ళ సాంబడు, గేటు దగ్గరకెళ్ళి దాన్ని కిందా మీదా పరిశీలిస్తున్నాడు.

"నాయనా! ఇది నేను పెట్టేస్తా. ఇట్టిట్టే తగిలించెయ్యచ్చు." ఆరిందాలా బొందుల దగ్గర పట్టుకున్నాడు. గేటు మొత్తం వాడి మీదికి ఒరిగి పోయింది.  తల మాత్రం బయటికి వచ్చి.. మొత్తం గేటు కింద ఇరుక్కు పోయాడు.

"అమ్మో! అమ్మా.." అరుస్తూ గింజుకుంటున్నాడు.

"ఒక్క క్షనమైనా ఊరకుండవు గదరా! ఏదో ఒకటి కొంప మీదికి తెస్తానే ఉంటావు. భడవ ఖానా!" మల్లయ్య తూరుపింట్లోంచి బైటికొచ్చి, గేటు కింద నుంచి మనవడిని తీశాడు.

"ఏం గాలేదు కద. చంటోడు పరికిస్తానే ఉంటాడని గుర్తెట్టుకోవాలి అందరూ! ఆదమరవటానికి లేదు."

జాలమ్మ చటుక్కున, గింజుకుంటున్న సాంబడిని ఇంట్లోకి తీసుకెళ్ళింది.

పడమటింట్లో కెళ్ళిన నారాయుడు, స్నానం చేసొచ్చి తాపీగా చీర కట్టుకుంటున్న వెంకటలక్ష్మిని చూశాడు.

"ఏందే.. ఏం పట్టనట్టుంటావు? సాంబయ్య గోల ఇనిపించలా?" కొంగు నడి మధ్యని పంటికింద నొక్కి పట్టి, కళ్ళ తోనే

వినిపించిందన్నట్టు చెప్పింది వెంకి.

నారాయడు నిశ్శబ్దంగా వెళ్ళి తలుపేసొచ్చాడు.

“ఉండుండు నే సర్దుతా. నీకు సరిగ్గా రాదు.” రెండంగల్లో దగ్గరగా వెళ్ళి, రెండు చేతులతో కుచ్చిళ్ళు తీసి శ్రద్ధగా సర్దాడు. వెంకటలక్ష్మి పరవశంగా చూసింది మొగుడ్ని...

“ఏవయిందత్తా? నేను స్నానం చేత్తన్నా! ఏమాగం చేశాడు ఎదవ?” నున్నగా తల దువ్వుకుని, చీరాల పచ్చ చీర మడమల పైకి కట్టుకుని, తెల్లని బుట్ట చేతుల జాకెట్టు వేసుకుని వచ్చింది వెంకటలక్ష్మి.

తల్లో ఎఱని గన్నేరు పువ్వు పెట్టింది. పొద్దున్నా, సాయంత్రం తల దువ్వుకుని జడేసుకోగానే ఏదో ఒక పువ్వు పెట్టాలిసిందే. “ముందుగా పువ్వు పెట్టి, ఆ తరువాత జడేత్తదే వెంకటలక్ష్మి..” చిన్నప్పుడు స్నేహితురాళ్ళు ఏడిపించే వాళ్ళు. “వీలు గాదు కానీ.. జుళ్ళోనే పూలు పూయించేనూ?” దీటుగా జవాబిచ్చేది వెంకటలక్ష్మి.

“ఏం గాలేదే.. కొద్దిగా మోచేతి దగ్గర బొంగు గీచుకు పోయింది. కాస్త పసుపద్దా. కొద్దిగా భయపడ్డట్టున్నాడు. కాసిని పాలు పట్టా... నిద్దరోతున్నాడు. అసలేంటంట.. అంత లావు కేకలేత్తూ వచ్చాడు నారాయడు?”

గతుక్కు మంది వెంకటలక్ష్మి. తను అడగనే లేదు. నారాయడు కూడ మరచినట్టున్నాడు చెప్పటం. కుండ లోంచి నీళ్ళు తీసుకుని తాగ సాగింది.

“వాళ్ళ చిన్నయ్యకి ఆడపిల్ల పుట్టిందట్నే.. షావుకారింటికి ఫోన్ చేశాడు. పది రోజులయ్యాక బారసాలంట. మనందరినీ రమ్మన్నారు. అదే యెంకి కి చెప్పెళ్దావనీ! అంతే కాదు..” నారాయడు సమయానికి వచ్చి.. చెప్ప బోతున్నాడు. మధ్యలోనే అందుకుంది జాలమ్మ.

“వార్నీ.. ఇప్పుడా చెప్పేది.. ఇంత మంచి వార్త. మన సాంబయ్యకి పెళ్ళాం పుట్టిందన్నమాట. వెళ్దాం అందరం.. శుభ కార్యం మరి. పిల్లదానికి వెండి ఉంగరం చేయిద్దాం. కంసాలికి చెప్పిరా.. చుట్టున్నదైతే పెద్దా చిన్న చేసుకోటానికుంటాది.”

వెంకటలక్ష్మి కూడా ఆనందంతో పొంగిపోయింది.

“కాసింత అన్నం పక్కకి తీసి పాయసం చేత్తానత్తా. సాంబడిక్కూడా ఇష్టం.”

“అట్టగే, బెల్లం కోరుతా, ఆ కత్తి పీటందుకో.” సాంబడికి ఐదో నెలొచ్చి నప్పట్నుంచీ వెంకటలక్ష్మే వంట చేస్తోంది. పిల్లడి సంగతి చూసుకోడం నాయనమ్మ పని.

నారాయడు మాత్రం ఆలోచిస్తున్నాడు. ఈ సారి పంట దిగుబడి చాలా తగ్గి పోయింది. ఇంటికి సరిపడా ధాన్యం రాగా.. అమ్మిందాంతో బొటాబొటీగా పప్పులు, ఉప్పులొచ్చాయి. కాయా కసరూ దొడ్లో పండించుకున్నా.. ఊర్లకెళ్ళడం, బహుమతులు తీసుకెళ్లడం అప్పు చెయ్యకుండా కుదరదు. అప్పు చేస్తే అంతే సంగతులు.. వడ్డీ మీద వడ్డీ. పొలం అంతా పొయ్యే వరకూ ఆగదా మహమ్మారి.

ఒక్కోసారి, పడమటిల్లు వెయ్యడం మంచి పనేనా అని ఆలోచిస్తుంటాడు నారాయడు. కాసిని డబ్బులు అందుబాట్లో ఉంటే ధైర్యం ఉండేది. ఇప్పుడెక్కడ వెతికినా ఖాళీనే. ఏ ఖర్చు తగ్గిద్దామన్నా కుదిరేట్టు లేదు.

కిటికీ కింద కూర్చుని ‘వల’ బాగు చేస్తున్న మల్లయ్య తలెత్తి చూశాడు. పంటెత్తెయ్యడం అయింది. ఇంక చేపలు పట్టటానికెళ్ళాలి. అదృష్టం బాగుండి మంచి చేపలు పడ్డాయంటే నెల ఖర్చులకి ఢోకా ఉండదు.

నారాయడి మొహం చూసి పరిస్థితి అర్థం చేసుకున్నాడు. ఆడోళ్ళక్కూడా ఏం జరుగుతోందో చెప్తుండాలి.. లేకపోతే కోరికలట్టా పుడుతూనే ఉంటాయి. పూటకింత అమరుస్తుంటే కష్టం సుఖం ఏం తెలుస్తుంది?



KOUMUDI

"నాకు రాటానికి కురదు రా నారాయడూ! ఆ టయం లోనే మాంచి బరువు చేపలు, బొమ్మిడాయిలు వత్తయ్యంట చెరువు లోకి. ఎక్స్పోర్టింగ్ చేసేటోళ్ళుకూడా వత్తారన్నాడు షావుకారు. నువ్వు, కోడలూ, సాంబడూ యెల్లి రండి. మేం వీలు చూసుకుని ఎప్పుడో యెల్తొత్తాం." మల్లయ్య గట్టిగా చెప్పేశాడు.

నోరు తెరిచి ఏదో అనబోయిన జాలమ్మ, గంభీరంగా ఉన్న మల్లయ్యని చూసి మాట్లాడకుండా ఊరుకుంది. వెంకటలక్ష్మి మొదట్నుంచీ మామ ఎదురుగా నోరెత్తదు.

"అంతే కాదమ్మా! ఎవురో కిరణ్మయీ సొసైటీ వాళ్లంట.. ఈ లంకలో ఉన్న పల్లెల్లో ఆడోళ్ళకి టైలరింగు నేర్పిత్తన్నారు. మనూరి నుంచి వెంకటలక్ష్మిని సెలెక్షన్ చేశారు. రెండు నెల్లు టౌన్లో ఉండాలి. అయ్యాక వాళ్ళే కుట్టు మిషనిస్తారు. వెంకటలక్ష్మి దర్జీ పని చేసుకోవచ్చు. సన్నీళ్ళకి ఏన్నీళ్ళుగా ఉంటయ్యి. మనకి పంట సరిగ్గా అందట్లేదు కూద."

జాలమ్మ మాట్లాడలేక పోయింది. అమ్మో! రెణ్ణెల్లు చంటోడి నొదిలి ఉండాలా.. కోడలు ఎప్పుడెళ్ళినా రెండు రోజులకి మించి ఉండ లేదు పుట్టింట్లో. ఏం చెయ్యాలి? ఎట్లా.. ఈ ఇంట్లో బితుకు బితుకు మంటూ ఉండాలి? ఒక్క సారి నీరసం ఆవహించింది. నేల మీద కూలబడి పోయింది.

"అత్తా! వారానికొక సారి వస్తుంటాం. మొత్తం మన పాలేనికి నన్నొక్క దాన్నే తీసుకున్నారు. అంతా ఫ్రీ.. ఫీజులెయ్యీ లేవు. మనూళ్ళో జాకిట్లూ, గౌన్లూ, లంగాలూ కుట్టినా నెలకి వంద పైగా సంపాయించచ్చు."

"మరి ముందు నాకెందుకు చెప్పలేదు?" జాలమ్మ మొహం ఎర్రగా చేసుకుని అంది.

"చెప్పటానికి నన్ను తీసుకుంటారో లేదో తెలీదు కదా! నీ కొడుకు ఎప్పుడో పేరిచ్చాడంట. ఇందాకే మాకు తెలిసింది. సోం వారం నుంచీ క్లాసులు మొదలు. నీక్కూడా చక్కగా అవిరేట్టు జాకెట్టు కుట్టేత్తా.. ఎంత లోకి.. ఇట్టే గడచి పోతయ్యి రెణ్ణెల్లూ."

"వారం ఓరం వత్తుండాలి మరి. తప్పద్దు." బుంగ మూతి తోనే సరే అన్నట్లు తల ఊపింది జాలమ్మ.

"తాతా! చేపలు పట్టటానికెల్తన్నావా? నేనుకూడా వత్తా." ఎప్పుడు లేచాడో సాంబడు లేచి వలని పట్టుకుని చూస్తున్నాడు.

"అట్టగే యెల్దాం. ముందు అమ్మమ్మ గోరింటికెల్లి బుజ్జి పాపాయిని చూసి రండి. ఆ మీన సేపలకెల్దొద్దాం."

"అబ్బో.. అబ్బో! అల్లుడు గారొచ్చారు. ఆరతి పళ్ళెం పట్రండి." చిన్నయ్య గట్టిగా అరిచాడు, వెంకటలక్ష్మీ, సాంబడూ వస్తుంటే.

సాంబడు సిగ్గు పడుతూ, అమ్మ కుచ్చిళ్ళల్లో మొహం దాచుకున్నాడు.

"ఏమ్మా! కులాసాయేనా? ఇయ్యంకుడు వాళ్ళు రాలేదా?" బాబయ్య, సాంబడిని ఎత్తుకున్నాడు. కళ్ళ నిండా నీళ్ళతో వెంకటలక్ష్మి అడ్డంగా తల తిప్పింది. అంతకు ముందు సంవత్సరమే వెంకటలక్ష్మి తల్లి పోయింది.. పచ్చ కామెర్లు వచ్చి. పన్నెండు రోజులూ వెంకటలక్ష్మి కుటుంబం అందరూ ఉండెళ్ళారు.

"ఎట్టున్నావు నాన్నా? ఒంట్లో ఎట్టుంది?"

"నాకేందమ్మా. గుండ్రాయిలా ఉన్నా. మరో పదేళ్ళు గారంటీ." బాబయ్య పిల్లడినెత్తుకుని దొడ్లో కెళ్ళాడు.

"అదేం విచిత్రమో! మానవుడు అదే అనుకుంటాడు.. అన్నీ గారంటీ అని. ఈ ప్రపంచంలో దేనికి గారంటీ ఇవ్వగలరు ఎవరైనా?" మనసులో అనుకుంది వెంకటలక్ష్మి.

నారాయుడు రిక్షా డబ్బులిచ్చేసి వెనుకే వచ్చాడు.. చేతిలో కూరల సంచీ పట్టుకుని.

"ఏంది బావా ఎప్పుడొచ్చినా ఏదో తెస్తానే ఉంటావు. మీకేదైనా ఇయ్యటానికే మాకు ఛాన్సివ్వవు." నవ్వుతూ నిష్ఠూరమాడాడు చిన్నయ్య, సంచీ లోపల పెట్టొచ్చి.

"ఇంక అమ్మాయినే ఇచ్చే ఛాన్సొచ్చింది కదా! పెద్దయ్య భార్య నవ్వుతూ అని, వెంకటలక్ష్మిని లోపలికి తీసుకెళ్ళింది.

"అత్తా! నాకేం తెచ్చావు?" పెద్దయ్య కొడుకు, రాజా పరుగెత్తుకుంటూ వచ్చి వెంకటలక్ష్మిని పట్టేసుకున్నాడు.

"నేనే వచ్చేశా! ఇంకేం కావాలి రా నీకు. మనూర్లో రెణ్ణెల్లుంటా. బాగా చదువుతున్నావా? ఒకటో క్లాసు కదూ? పెద్ద చదువులు చదవాలి.. నా లాగ కాదు. ఇవిగో చూడు బాగున్నాయా?" పది చాక్ లెట్లు ప్లాస్టిక్ కవర్లో పెట్టి ఇచ్చింది. అంతకు ముందే జాతరలో కొనుక్కొచ్చింది. ముచ్చి బంగారం తో చుట్టి మెరుస్తున్నాయి.

"వావ్. చాలా బాగున్నయ్యత్తా. ఇప్పుడే తినెయ్యనా? మా ఫ్రెండ్సందరికీ కొన్నిచ్చొత్తా." రాజా రివ్విన పరుగెత్తాడు.

"ఎంత ముద్దొస్తున్నావురా రాజా! తొందరగా వచ్చెయ్యాలి, మనం బోలెడు కబుర్లు చెప్పుకోవాలి. ఇప్పటికైతే కాళ్ళు చేతులు కడుక్కొచ్చి పాపాయినెత్తుకోవాలి నేను." వెంకటలక్ష్మి దొడ్లోకెళ్ళింది.

"ఏంటే యెంకటలక్ష్మీ రెండు నెలలుంటా! మీ అత్త ఒప్పుకుందా? ఏం చేత్తావిక్కడ?" వెనుకే పెద్ద వదిన వెళ్ళి అడిగింది.

వెంకటలక్ష్మి నాలిక్కరుచు కుంది. ముందు అన్నా వదినలకి చెప్పకుండా తనే అనేసుకుంది. ముందూ వెనకా ఆలోచించు కోవద్దూ? వాళ్ళకి గాని వీలవక పోతే..

"సొసైటీ వాళ్ళు కుట్టు నేర్పిత్తారంట అక్కా! మన చుట్టు పక్కల ఇరవై ఊర్లనుంచి ఊరి కొక్కరిని తీసుకున్నారు. ఉంటానిక్కూడా వాళ్ళే ఏర్పాటు సేత్తారు. పిల్లాడిని చూసుకోటానికి సెంటరు కూడా ఉందంట, వెంకటలక్ష్మి పన్లోకెళ్ళి నప్పుడు." నారాయడు వచ్చి అంతా వివరించాడు.

"ఉంటానిక్కూడా ఆళ్ళేనా.. తనకి చెప్పనే లేదే.." కినుకగా అనుకుంది వెంకటలక్ష్మి.

"అట్టాగా! మరి టౌన్లలో ఆడోళ్ళకేం నేర్పియ్యరా?"

"కనుక్కుందామక్కా! మా ఊరొచ్చి అడుగుతే నేను వెంకటలక్ష్మి పేరిచ్చా. ఇక్కడ కూడా ఉండే ఉంటుంది. అస్సలా సొసైటీ బెజవాడలో ఉంటదంట. ఇళ్ళల్లో కూచునే ఆడోళ్ళు సంపాయించుకునే స్కీములు పెడతారంట."

"మనిల్లుండగా ఆడనెక్కడో ఉండటం ఎందుకు? మామ కూడా సాంబడితో ఆడుకోవాలని సంబర పడిపోతాన్నడు. ఇక్కడే ఉండాలి, ఇంటాడపడుచు." పెద్ద వదిన కచ్చితంగా చెప్పేసింది.

"కానీ, ఇంట్లో బాలింతరాలు. సాంబడసలే అల్లరోడు. ఆడిని పట్టుకోడం చాలా కష్టం. ఈ క్షనం ఈడ, మరో సెకను ఆడ. సొసైటీలో ఐతే ఆల్లే చూసుకుంటారు. అప్పుడప్పుడు రేత్రికి వస్తుంటాదిలే." నారాయడు సర్ది చెప్పాడు.

నిజమే! వెంకటలక్ష్మి అనుకుంది.. ఎంత పుట్టిల్లైతే మాత్రం, ఇంకోళ్లని ఇబ్బంది పెట్ట కూడదు. ఒక మనిషి ఎక్కువయిందంటే మధ్య తరగతి కుటుంబాలకి పరీక్షే.

నారాయడిని ఆరాధనగా చూసింది. అత్తింటి నుంచి ఇంకా కావాలి.. ఇంకా కావాలి అని ఏడిపించే అల్లుళ్ల గురించే వింటారు అందరూ! ఇట్టాంటి మానవత్వం గల మనుషుల గురించి ఎవరూ చెప్ప రెందుకో! అక్కడా ఇక్కడా కాగితాలూ, పత్రికలూ దొరికినప్పుడు వెంకటలక్ష్మి చదివిన అన్ని కథలూ ఇంచు మించు అదే బాపతు. "జామాతా దశమగ్రహ.." అంటూ.. అందరు అల్లుళ్ళనీ విలన్లుగా చూపించే వారే!



KOUMUDI

"ఎంత చక్కగా ఉందో పాప.. అంతా అమ్మ లాగుంది కదూ?" చిన్నయ్య కూతురిని ఒళ్ళో కూర్చో పెట్టుకుని అంది వెంకటలక్ష్మి.

"అవునే వెంకీ! అమ్మే మళ్ళీ మనింటికొచ్చేసినాది. అందుకే అమ్మ పేరే పెట్టేస్తన్నాం." చిన్నయ్య ఎప్పుడొచ్చాడో, బాలింత రాలి గుమ్మం దగ్గర నిలుచుని అన్నాడు.

"ఓ.. అయితే కృష్ణవేణమ్మ మళ్ళీ పుట్టింది.. వేణిని బాగా చదివించాలి అన్నా! అమ్మకి కూడా నన్ను స్కూలుకి పంపాలని ఉండేది. మనిళ్ళలో పది నిండకుండానే పెళ్ళో.. పెళ్ళో అని గోలెడతారు."

చిన్న వదిన చిరు నవ్వు నవ్వింది సిరులొలికేలా!

❧❧❧

పొద్దున్నే తనవీ సాంబడివీ బట్టలు రెండు సంచీల్లో పెట్టుకుని తయారై పోయింది వెంకటలక్ష్మి. నారాయడు రిక్షా తెచ్చేశాడు.

"ఏందో అమ్మాయ్! నాకేం బాగో లేదు, ఊర్లో మేం ఉండీ మీరిట్టా ఎక్కడో ఉండటం." సాంబడి నెత్తుకుని వాకిట్లోకి వచ్చాడు బాబయ్య.

"రోజూ అంత దూరం పోటం రాటం నాకు చాలా కష్టమౌతాదయ్యా. అప్పుడప్పుడు వస్తుంటా కదా!" కూతురికే కష్టమంటే మరి మాట్లాడ్లేదు బాబయ్య. నిజవే దగ్గరా దాపా.. ఊరి చివర్న ఉంది సెంటరు. అక్కడుంటవే మంచిది. పైగా వాళ్ళే భోజనం అదీ కూడ చూస్తారుట.

"ఒక్క నిముషం ఆగు వెంకీ.. అక్కడ ఎప్పుడు పెడతారో ఏమో.. దిబ్బరొట్టి, మాగాయ పెట్టా.. మధ్యలో తినండి." పరుగెత్తుకుంటూ వచ్చి ఒక డబ్బా ఇచ్చింది పెద్ద వదిన.

అడ్రస్ చెప్పి, ఎక్కి కూర్చున్నారు ముగ్గురూ. సాంబడు రిక్షా వెనుక ఉన్న తెర తీసి టాటా చెప్పాడు.

సెంటర్ దూరంగానే ఉంది వెంకటలక్ష్మి పుట్టింటారింటికి. కాలవ వెంబడే ఐదు కిలో మీటర్లెళ్ళుంటారు. పక్కూరికీ టౌనుకీ మధ్యలో ఉన్నట్లుంది.

పక్కా స్కూలు బిల్డింగు ముందు రిక్షా ఆగగానే లోపల్నుంచి, ఒకావిడ బైటికొచ్చింది. ముప్పై ఏళ్ళుంటాయి. నాజూగ్గా ఉంది.. నీలం పువ్వులున్న తెల్ల చీర కట్టుకుంది. బాగా చదువుకున్నావిడ లాగుంది. నిస్సంకోచంగా ముందుకొచ్చి సాంబడి నెత్తుకుని, నవ్వుతూ పలకరించింది.

"రండి. మీరే మొదటి వారు. నా పేరు విజయలక్ష్మి. విజయక్కా అని పిలుస్తే చాలు. ఈ రెండు నెలలూ మీకు ఏం కావలసినా నన్ను అడగండి. మీకు సెంటర్ అంతా చూపిస్తాను. ఆ తరువాత నారాయడుగారు వెళ్ళి పోవాలి. ఇంకా అమ్మాయిలొస్తారు కదా! వాళ్ళకి ఇబ్బందిగా ఉండచ్చు. ఈ దుండగీడుకి డేకేర్ ఉంది. దింపేద్దాం. అందులో ఇంకా పిల్లలుంటారు. హాయిగా ఆడుకుంటాడు." గలగలా మాట్లాడుతూ, సాంబడిని కిందికి దింపి చెయ్యి పట్టుకుని నడిపిస్తూ అంతా చూపించింది.

డేకేర్ లోకి వెళ్ళగానే అక్కడున్న బొమ్మల దగ్గరికి పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు సాంబడు.

నెమ్మది నెమ్మదిగా ఒక్కొక్కళ్ళే రావడం మొదలు పెట్టారు. కొందరు ఒక్కరొక్కరే వచ్చారు. ఒకళ్ళిద్దరిని తల్లీ తండ్రీ దింపారు. ఇద్దరు మాత్రం, వెంకటలక్ష్మి లాగనే పిల్లలతో వచ్చారు.

వదల్లేక వదల్లేక వెళ్ళాడు నారాయడు. అప్పుడు కూడా అడిగింది వెంకటలక్ష్మి.. ఇదంతా అవసరమా అని.

"ఉండాలి యెంకీ! ఏదో ఒక పని చేతిలో ఉండాలి. అదీ అన్నం పెట్టేదే.. పని నేర్చుకోటం ఎట్టున్నా, పదిమందినీ కలుస్తావు. ఎవరు ఎప్పుడు ఆత్మీయులౌతారో.. ఎందుకు మనకీ పని సెయ్యమని బగమంతుడు చెప్తాడో ఏం చెప్పగలం? భూమి తల్లిని నమ్ముకున్నాం బానే ఉంది.

ఆ తల్లికీ విసుగొచ్చేత్తాంది. ఇంక పండించ లేనంటాంది. తతరాలుగా తవ్వుకుని తింటానే ఉన్నాం. నాకు మాత్రం ఇష్టవా నిన్నొదిలి ఉంటం. ఎందుకో ఆయన తోపించాడు. మనం చేసెయ్యాలంతే. నువ్వు పువ్వులు అవీ కుడ్తంటావు కదా దిండు గలీబుల మీద. అయ్యే నేర్చుకో. లేదా.. మా అమ్మకి చెప్పినట్లు జాకిట్లు కుట్టడం నేర్చుకో..” ఆయాసం వచ్చినట్లయి ఆగి పోయాడు నారాయడు. వాడికీ ఉద్వేగంతో మాట రావట్లేదు. వెంకి లేని ఇంట్లో రేపట్నుంచీ.. ఎట్టుండాలో!

ఒకర్నొకరు కౌగలించుకోడం, సంసారం చెయ్యడం కోసమే కాదు భార్యాభర్తల అనుబంధం... అది ఇంత పెద్ద జీవితంలో చాలా కొద్ది సేపు మాత్రమే ఉండేది.. ముఖ్యమైనదే అయినప్పటికీ! ప్రతీ రోజూ ఒకరికొకరు అన్నట్లు బ్రతకడం.. కష్ట సుఖాలు సమానంగా పంచుకోవడం. పరస్పరం అవసరాలు గమనించుకోవడం.. ఎన్నెన్నో, ప్రతీ క్షణం తలచుకోవడం.. అదే నిజమైన ప్రేమ. సర్వ వ్యాపితమైన ప్రేమ.

ఏ అదృశ్య శక్తి నారాయడిని ప్రేరేపించిందో.. వెంకటలక్ష్మిని కుట్టు పని ట్రైనింగ్ లో చేర్పించమని.. ఎందుకు అందరినీ ఒప్పించి, వెంకటలక్ష్మితో సహా.. చేర్పించాడో.. కాలమే చెప్పాలి.

కళ్ళ నిండా నీళ్ళతో వీడ్కోలు పలికింది వెంకటలక్ష్మి. సాంబడు చూడ లేదు నాన్న వెళ్లటం. చూస్తే భూమీ ఆకాశం ఏకం చేసేవాడు.

విజయలక్ష్మి ఇరవై మంది అమ్మాయిల్నీ ఒకరి కొకర్ని పరిచయం చేసింది. ఆవిడ ఎంబ్రాయిడరీ నేర్పిస్తుంది. ఇంకొక మేడమ్ పేరు సావిత్రి. ఆవిడ జుత్తు కత్తిరించుకుని, తల తిప్పుతూ మాట్లాడుతుంటే ఆ జుట్టు తమాషాగా ఊగుతూ ఉంటుంది. సావిత్రి మేడం జాకెట్లు, గౌన్లు.. ఇంకా చురుకుగా నేర్చుకుంటే శల్వార్– కమీజులు కత్తిరించడం కుట్టడం నేర్పిస్తుంది.

అందరూ ఏ పూట కా పూట తిండికి వెతుక్కోవలసిన వాళ్ళే. పెళ్ళిళ్ళయి రెండు నుంచీ ఐదేళ్ళ పైన అయినా ఎవరికీ పద్దెనిమిదేళ్ళు నిండ లేదు.

అందుకే విజయలక్ష్మి మేడం.. “అమ్మాయిలూ” అని పిలుస్తుంది. ఆ పిలుపుతో అందరికీ మళ్ళీ చిన్న పిల్లలం అయి పోయామన్న భావం కలుగు తోంది.

మొదటి రోజు పరిచయాలయ్యే సరికి భోజనాల టైమయింది. పిల్లల్ని కూడా తీసుకొచ్చారు. సాంబడు ఒక్క ఉదుట్న వెంకటలక్ష్మి మీద పడ్డాడు. ఎత్తుకుని ముద్దులు కురిపించింది. ఏంటో.. యుగాలయిపోయినట్టుంది వాడిని చూడక.

“అమ్మా! నాన్నేడీ? మనింటికెల్లి పోదామా?” అమ్మని చూడగానే వాడు మాట్లాడిన మొదటి మాటలవే. కొంచెం ఆగుతే.. నాన్నమ్మ, తాత అని మొదలెడతాడేమో అని భయం వేసింది వెంకటలక్ష్మికి.

“అన్నం తిన్నాక వస్తారు. దా..” డే కేర్ లో టీచర్ వచ్చి పిలిచింది.

ఆవిడ రమ్మనగానే మంత్రం వేసి నట్లు వెళ్ళిపోయాడు సాంబడు.

“ఆ టీచర్ అంతే.. పిల్లల్ని బాగా చేర దీస్తుంది. నువ్వు చూసుకోనక్కర్లేదు. నువ్వు వెళ్ళేటప్పుడు ఆవిడ్ని వదిలి రానంటాడు చూడు.” నవ్వుతూ అంది విజయా మేడమ్, నోరు తెరుచుకుని చూస్తున్న వెంకటలక్ష్మితో.

పప్పు, కూర, చారు, మజ్జిగతో వేడి వేడి అన్నం వడ్డించారు. అన్నీ కూడా దేవాలయాల్లో పదార్ధాల్లాగ ఎంతో రుచిగా ఉన్నాయి.

“రేపట్నుంచీ వంతుల ప్రకారం కిచెన్ లో హెల్ప్ చెయ్యాలి. డ్యూటీలు వేస్తాం. ఇద్దరు వంట చేసే వాళ్ళున్నారు కానీ.. మొత్తం సెంటర్లో పిల్లలు, పని వాళ్ళు, టీచర్లు, ట్రైనీలు కలిపి వంద పైన ఉంటారు. అందుకే కూరలు తరగడం వంటి పనుల్లో సాయం చెయ్య వలసి


KOUMUDI

ఉంటుంది." విజయలక్ష్మీ మేడమ్ చెప్తుంటే, అదెంత పని అన్నట్లు చూశారు అందరూ.

అక్కడున్న ప్రతీ ఒక్కరూ ఇంటి పనుల్లో ఆరి తేరిన వారే. యాభై అరవై మందికి చులాగ్గా వండి, వడ్డించగలరు. వివిధ రకాల భావాలతో భోంచేశారు ట్రైనీలు.

వెంకటలక్ష్మికి అత్త, మామ గుర్తుకొచ్చారు. ఏం చేస్తున్నారో? కొడుకు మీద కంటే తన మీద, సాంబడి మీద ప్రాణం పెట్టుకున్నారు. వాళ్ళని వదిలి రావటం తనకి ఎంత మాత్రం ఇష్టం లేదు. నారాయడు ఏమైనా అనుకుంటాడని వచ్చింది

ఆలోచనల్లో ఉండగానే మేడమ్ పిలుపు.. మధ్యాన్నం క్లాసులకి ఐదు నిముషాల్లో వచ్చెయ్యాలని. మధ్యలో సాంబడి టీచర్ వచ్చి వాడి బట్టల సంచీ తీసుకెళ్ళింది. మొహం కడిగి తుడవటానికి తువ్వాలు కావాలని.

అంతా కొత్త కొత్తగా ఏదో వేరే ప్రపంచం లోకి వచ్చినట్లుంది ట్రైనీ లందరికీ. ఎవరూ, కుటుంబాలనొదిలి ఉండలేదు అప్పటి వరకూ. కొంతమంది హాయిగా, స్వేఛ్ఛగా ఉందనుకుంటే. కొందరు బెంగగా ఉన్నారు.

అందరూ ట్రైనింగ్ హాల్లో సమావేశమయ్యారు.

స్త్రీలకి స్వయం ఉపాధి పథకాలెందుకుండాలో వివరించింది విజయలక్ష్మీ మేడం. ఆవిడ చెప్తుండగానే ఆ సంస్థ డైరెక్టర్ వచ్చారు. అందరినీ పేరు పేరునా పలుకరించి, ధైర్యం చెప్పి వెళ్ళారు.

"మీకు ఇక్కడ ఏమీ భయం లేదు అమ్మాయిలూ. హాయిగా ఉండి బాగా పనులు నేర్చుకోండి. మీ కాళ్ళ మీద మీరు నిలబడి, సమాజానికి కూడ ఉపయోగ పడాలనేదే మా సంస్థ ధ్యేయం. ఆదివారం మీరు ఇంటికి వెళ్ళచ్చు. కానీ సాయంత్రానికి వచ్చెయ్యాలి. లేదా మీ వాళ్ళని ఇక్కడికి పిలిపించు కోవచ్చు. అతి తక్కువ ధరకి భోజనం పెడతాము. సాయంత్రం వరకూ మీతో గడిపి వెళ్ళచ్చు." డైరెక్టర్ మేడమ్ చెప్పిన మాటలే రాత్రంతా కలలో కొచ్చాయి వెంకటలక్ష్మికి.

సంస్థ ఆశయాలు, ఆచరణలు అన్నీ వివరించాక, ట్రైనీస్ అందరినీ పెద్ద హాల్లోకి తీసుకెళ్ళారు. అక్కడ ఇరవై కుట్టు మిషన్లున్నాయి. మొదటగా అందరికీ బాపిన్ లోకి దారం ఎక్కించడం నేర్పించారు. అప్పుడే ఇద్దరమ్మాయిలకి కళ్ళు సరిగ్గా కనిపించట్లేదని తెలిసింది. మరునాడు కళ్ళ డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తామని చెప్పింది మేడమ్.

వెంకటలక్ష్మి ఆశ్చర్యంగా చూసింది. ఇట్లా కూడా ఉంటారా మనుషులు.. అయినా మరి ఎందుకింత గందరగోళంగా ఉంది దేశం? అర్ధం చేసుకోడానికి ప్రయత్నించింది.. రాత్రి సాంబడిని పక్కలో వేసుకుని, వాడి జుట్టు సవరిస్తూ.

"అమ్మా! తాత.." మూలిగి.. పక్కకి తిరిగి పడుక్కున్నాడు వాడు.

"వెరీ గుడ్ వెంకటలక్ష్మీ! ఇట్టే పట్టేస్తున్నావు. ముందు పేపర్ కాగితం తీసుకుని, దాని మీద కత్తిరించుకోవాలి. మీరంతా ఒకరి జాకెట్లొకరు కత్తిరించడం నేర్చుకోండి. ఎవరిది వారికంటే ఎదుటి వారి వైతే తప్పులు బాగా తెలుస్తాయి. మనది మనం సర్ది చెప్పుకోడానికి ప్రయత్నిస్తాం." ఆ రోజు అందరికీ కటింగ్ చెయ్యడం నేర్పిస్తున్నారు సావిత్రీ మేడమ్.

మొదటి రెండ్రోజులు సూదిలో, బాపిన్ లో దారం ఎక్కించడం, కాలితో మిషన్ తొక్కుతూ, రెండు చేతులతో బట్ట పట్టుకుని అటూ ఇటూ కదిలిపోకుండా కుట్టు వెయ్యడం, చూపించారు. ప్రతీ ఒక్కరి దగ్గరికీ వెళ్ళి నేర్పించారు. అందరికీ చకచకా కుట్టెయ్యడం వచ్చేసింది. కటింగ్ దగ్గరకొచ్చే సరికి మాత్రం తడబాటొచ్చేసింది. కత్తెర పట్టుకోడం నేర్చుకోవడనికే గంట పైన పట్టింది అందరికీ. మొత్తానికి ఇరవై జాకెట్లు కత్తిరించి నంబర్లేసుకుని పెట్టుకున్నారు.

ఆ రోజు సంస్థ స్థాపించిన రోజట. ప్రత్యేకంగా పాయసం చేశారు. భోజనాలకి కూర్చునే ముందు ప్రార్ధన చెయ్యాలి. ఎవరి దేముడిని

వాళ్ళు తలుచు కోవచ్చు మనసులో. ట్రైనీలలో ఐదుగురు క్రిస్టియన్ అమ్మాయిలున్నారు. ఒక క్రమ శిక్షణతో.. ఆటపాటలతో మళ్ళీ బాల్యానికి తీసుకెళ్ళి పోతున్నారు అందరినీ. మేడమ్స్ ప్రతీ బాచ్ తో కలిసి మెలసి తిరుగుతూ, వారితో సమానంగా ఉండటం వల్లేమో.. ఎప్పుడూ హుషారుగా, చలాకీగా ఉంటారు. పిల్లలు కూడా కొత్త వాతావరణానికి అలవాటు పడుతున్నారు.

వారం రోజులయ్యేసరికి, ప్రతీ ఒక్కరూ అందరికీ తెలిసిపోయారు. కుటుంబ నేపథ్యాలూ, భవిష్యత్ ప్రణాళికలూ.. అన్నీ మాట్లాడుకుంటూ, ఎప్పట్నుంచో తెలిసున్న ఆప్త మిత్రుల్లా అయిపోయారు.

అదే సాన్నిహిత్య మహిమ. క్రమంగా పొరలు తొలగి మనుషుల్ని దగ్గర చేస్తుంది. ఆప్యాయత, ప్రేమ.. దగ్గరితనం, ఎదుటి వారి గురించి ఆలోచించగలగడం.. అన్నీ ఒకర్నొకరు కలుస్తుంటేనే కలుగుతాయి. అదే క్రమంగా సార్వజనిక మవుతుంది.

ఎవరి మీద ఎవరికి ఎందుకు ప్రేమ కలుగుతుందో.. అది ఏ రకమైన ప్రేమో ఎవ్వరూ చెప్పలేరు. దాన్నే చూసుకున్న వేళావిశేషం అంటుంటారు. అదే విధంగా ఏ కారణం లేకుండానే, ఉట్టి పుణ్యానికి ద్వేషించడం కూడా.. నాణానికి ఒక పక్క బొమ్మ, ఇంకొక పక్క బొరుసు వుంటాయి కదా!

ఒక అడవిలోనో, ఎడారిలోనో ఇద్దరు మనుషులు చిక్కుకు పోతే ఏమవుతుంది? వారు బద్ధశత్రువులే అనుకుందాం. ఒక్కరూ ఎక్కడికెళ్ళలన్నా ఏమవుతుందో అనే భయం. కొత్త పరిసరాలు. ఎక్కడ ఏముందో తెలియదు. అటువంటి పరిస్థితుల్లో.. అహంతో మొదట్లో బిగుసుకుపోయి కూర్చున్నా, కాలం గడుస్తున్నకొద్దీ ఎవరో ఒకరు తెర తొలగిస్తారు.

నర మానవుడు లేని ఒక ద్వీపం మీదికి కొట్టుకెళ్ళిన ఒకతను, దొరికినవి తింటూ, ఒక బొమ్మని చేసి, దానికో పేరు పెట్టి, దాంతో మాట్లాడుతూ, దాన్నే స్నేహితుడిలా భావించి కష్ట సుఖాలు చెప్తూ ఏళ్ళు గడిపేస్తాడు, ఒక సినిమాలో (కాస్ట్ ఎవే). ఆ తరువాత ఒక పడవ తానే చేసుకుని ఎలాగో కష్టపడి, జనారణ్యం లోకి వస్తాడు.. ఆ తరువాత ఏమయింది అనేది వేరే సంగతి కానీ.. ఒంటరి తనాన్ని పోగొట్టుకోడానికి అతను పడిన తపన కళ్ళ నీళ్ళు తెప్పిస్తుంది.

కిరణ్మయీ సొసైటీ వాళ్ళు పెట్టిన వొకేషనల్ ట్రైనింగ్ సెంటర్లో కూడా అంతే.. ట్రైనీలంతా దగ్గర దగ్గర్లో ఉన్న ఊర్ల నించే వచ్చినా.. అంతకు ముందు ఒకరి కొకరు పరిచయం లేదు. సరిగ్గా తిండికీ బట్టకీ మాత్రమే బొటాబొటీగా సరిపోయేట్లు వచ్చే సంపాదనలున్న కుటుంబాలు. ఏ పండగో పబ్బమో వచ్చినా క్లుప్తంగానే చేసుకోవాల్సిన పరిస్థితులు.

నాలుగు రోజుల్లోనే విడదీయలేని బంధమేర్పడింది అందరి మధ్యా. రాత్రిళ్ళు పడుకునే వరకూ ఒకటే కబుర్లు.. జట్లు జట్లుగా. సాయం సంధ్యా సమయంలో కాలవొడ్డున తిరుగుతూ భవిష్యత్ ప్రణాళికలు.. పిల్లల్ని ఆడించడంలో, వంటింట్లో పనులు చెయ్యడంలో.. అన్నిటా అంతటా కలసి మెలసి తిరుగుతూ ఆప్యాయంగా పలకరించుకుంటూ.. అదొక కొత్త ప్రపంచమైపోయింది.

వెంకటలక్ష్మి మేనకోడలి బారసాల ఆదివారం వచ్చింది. సెంటర్ నుంచి స్నేహితురాళ్ళందరినీ రమ్మని ఆహ్వానించింది. పది మందికి మాత్రమే వీలయింది. సావిత్రీ మేడమ్ అందరినీ తీసుకుని వెళ్ళింది.

వెంకటలక్ష్మి పుట్టింటివాళ్ళ ఆప్యాయతని, నారాయడి మంచితనాన్ని స్నేహితురాళ్ళందరూ మెచ్చుకున్నారు. సాంబడు తండ్రిని వదిలిపెట్టలేదు. మల్లయ్య, జాలమ్మలు మాత్రం రాలేదు. మరుసటి ఆదివారం పాలెం వెళ్ళి చూసి రావాలని నిశ్చయించుకుంది వెంకటలక్ష్మి. అప్పుడే తనకి కూడా కుట్టు నేర్చుకునే అవకాశం ఇమ్మని పెద్దయ్య భార్య, సావిత్రి మేడంని అడిగింది. వచ్చే బాచ్ లో ప్రయత్నం చేస్తానని ఆవిడ మాట ఇచ్చింది ఆవిడ.

"తాతా!" ఎగిరి మల్లయ్య మీదికి దూకాడు సాంబడు.

"అబ్బయ్యా.. అట్టా మీద పడితే తట్టుకోలేనయ్యా! ముసలై పోయా కద.." మల్లయ్య వెలిగి పోతున్న మొహంతో సాంబడిని ఒళ్ళో కూర్చో పెట్టుకుని ముద్దులు కురిపించాడు.

"వచ్చేశారే.. మా బంగారం. ఎట్టున్నవయ్యా? నాయనమ్మ ఏవన్నా గురుతుకొచ్చిందా? బెంగ పెట్టుకున్నావా? అక్కడ అల్లరి చేశావా?" జాలమ్మ ఆగకుండా ప్రశ్నలు..

"నెమ్మదిగా.. ఇటు తీసుకురా." నారాయుడు, వెంకటలక్ష్మి కుట్టు మిషన్ ని, పడమటింట్లోకి దారి చూపిస్తూ పెట్టించారు. ఇద్దరు కూలీలు.. టౌన్నించే వచ్చారు.

"ఏందేమ్మా ఇదీ.. దీంతోనే నంటా కుట్టేదీ. మా అమ్మే ఎంత చిక్కి పోయినావే. సాంబడు కూడా. " జాలమ్మ వెనుక వెనుకే తిరుగుటుంటే.. చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళి బెంచీ మీద కూర్చోపెట్టాడు నారాయుడు.

"కాసేపిట్టా కూర్చో.. అయ్యన్నీ సర్దాక, మాట్లాడు కుందాం."

వణికి పోతూ కూర్చుంది జాలమ్మ. వెంకటలక్ష్మి, సాంబయ్యల సంగతేమో కానీ ఆవిడకి కళ్ళల్లో ఉన్నాయి ప్రాణాలు. ఏ రోజూ కడుపు నిండా ముద్ద తిన్నట్టు లేదు. అంతా సర్దేశాక, వెంకటలక్ష్మి దగ్గర కూర్చుని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"ఇదేందమ్మ. ఇట్టైతే ఎట్టా చెప్పు. ఇంక నుంచీ నే చెప్పినట్టే యినాల. ఏదిచ్చినా వద్దనక తినాలి. మేం గుండ్లల్లా ఉన్నాం. వేళకి అన్నీ పెట్టారు." ఒక్క క్షణం వెంకటలక్ష్మికి ఎందుకెళ్ళామా అని బాధేసింది.

"మరి ఒక్క సారన్న రాలే కదే మీరు. మరి బెంగుండదా?"

"నిజమే అత్తా. ఆదివారం కూడా క్లాసులు తీశారు. బాగా నేర్చుకోవాలని. ఇప్పుడు చూడు, సల్వార్ కమీజుల దగ్గర్నుంచీ కుట్టేత్తా నేను. నీ జాకిట్లిట్లా డొల్లల్లా యేల్లాడుతుంటయ్యనుకున్నావా? ముందు అన్నీ సరి చేసి కుట్టేత్తా రేపీపాటికి. మరి ఆకలేత్తంది. ఏవన్నా పెడతావా లేదా?" వెంకటలక్ష్మి గోముగా అడుగుతుంటే జాలమ్మ కొత్త శక్తి వచ్చినట్లు తటాలున లేచి పన్లోకి జొరబడింది.

"ఒక్కరగంటలో చేసి పెట్టనూ! మీరొత్తన్నారని ఇందాకే మామ యెల్లి నాలుగు చేపలట్టుకొచ్చాడు."

"భలే ఫిట్టింగయిందే వెంకటలచ్మీ! ఇంత బాగా నేర్చుకున్నావా? ఎంతిమ్మంటా జాకిట్టుకీ?" పక్కింటామె సంబర పడుతూ వచ్చింది.

"మీరిది వరకు దర్జీకి ఇచ్చినంతే ఇయ్యత్తా.."

"అంతిచ్చేట్టయితే ఇంక నువ్వెందుకే? ఆళ్ళకే ఇచ్చే పని కదా! ఇంకోమాట జెప్పు."

వెంకటలక్ష్మికి మొహమాటం విసుగూ ఒకేసారి వచ్చాయి. నేర్చుకునేటప్పుడు, ఇవన్నీ ఊహించలేదు. బాగా కుట్టినందుకు, ఎక్కువియ్యక పోయినా.. పాత దర్జీ కిచ్చినంతైనా ఇస్తారనుకుంది. అందులోనే బేరాలా..

"సర్సరే.. మీ ఇట్టం." పనిలో పడిపోయింది, తలెత్తకుండా.

ఊళ్ళో ఉన్నవే నూట యాభైకి ఒకటో రెండో తక్కువే ఇళ్ళు. అందులో కొంత మంది పట్నం వెళ్ళినప్పుడు పాత బట్టలమ్మే వాళ్ళ దగ్గర మంచి జాకెట్లు, చీరలు కొనుక్కుంటారు. అవే వాళ్ళ సైజుకి టాకా లేసుకుని వాడుతుంటారు.

చిన్న పిల్లలక్కూడా రోడ్ల పక్కన ఫుట్ పాత్ ల మీద అమ్మే గౌన్లే కొంటారు. దిగువ మధ్య తరగతి కుటుంబాలు అన్నీ. అయితే ఆ కొన్న గౌన్లన్నీ అడ్డదిడ్డం సైజుల్లో ఉంటాయి. వాటన్నింటినీ సైజు చెయ్యడానికీ, గట్టి కుట్లు వెయ్యడానికీ తీసుకొస్తున్నారు. కొత్త గౌనుకిచ్చినంత

ఇవ్వరు కదా! ఒక్కో గౌనుకి రూపాయో రెండో ఇస్తే గొప్ప. ఇంక లోపల్లంగాలు.. బట్ట కొని కుట్టించే కంటే, ఫుట్ పాత్ మీద అమ్మే రెడీ మేడ్స్ కొంటే బాగా చవక. వాటికీ, గట్టి కుట్లు,, రెండు రూపాయలు కూలీ.

ఊర్లో ఉన్న ఏకైక దర్జీ కుటుంబం హుస్సేనుది. రెండు తరాల్నుంచీ ఆ కుటుంబం వారే ఊళ్ళో కుట్టు పనులు చెయ్యడం. మొదట్లోనే వెంకటలక్ష్మికి సందేహ మొచ్చింది.. హుస్సేన్ కి పోటీ అవుతానేమో నని. కానీ ఎప్పుడెళ్ళినా ఖాళీ లేదంటుంటే బోలెడు పనుందేమో అనుకుంది.

వెంకటలక్ష్మి ట్రైనింగ్ అయి ఆరు నెలలయింది. మూడు వందలు కూడా రాలేదు.

"ఏందో అనవుసరంగా ఈ ట్రైనింగూ అదీ గొడవ.. శుద్ధ దండగ. ఈ మిషనొకటి, కాళ్ళకీ చేతులకీ అడ్డం తప్ప." నారాయడితో వాపోయిందొకసారి.

"ఫర్లేదే యెంకీ! ఏ విద్దయినా ఎప్పటికీ వృధా కాదు. నేనెళ్ళి హుస్సేన్ తో మాటాడొస్తా. ఆళ్ళేదోటి చేస్తంటారు కదా బతకటానికి."

వెంకటలక్ష్మి నిరాశగా చూసింది. నిజం చెప్పుకోవాలంటే ఇల్లుగడవడానికి చాలా ఇబ్బందిగా ఉంది. దాచి పెట్టుకున్న తిండి గింజలు అయిపోతున్నాయి. ఈ సంవత్సరం పంట కూడా అంత ఆశాజనకంగా లేదు. ముందు ముందు గడ్డురోజులే అని తెలిసి పోతోంది.

"అట్టా పెట్టకే మొహం యెంకీ! ఏదోటి ఆ భగమంతుడే చూపిస్తాడు దారి." నారాయడికి గుండె కరిగి చేతిలో కొచ్చినట్టనిపించింది. కుటుంబం కోసం ఎంత కష్ట పడుతోంది? ఆ పల్లెలో అన్ని కుటుంబాలలో అంతే. ఆడవాళ్ళు కూడా మగాళ్ళతో సమానంగా పనిచేస్తారు. ఏదో ఒక పని.. అది చేపలు పట్టడమైనా, నాట్లు వెయ్యడమైనా, కుప్ప నూర్పడమైనా.. ఏదైనా సరే!

"నువ్వొక్కడే అంతా నెత్తి మీదేసుకుంటే.. నే సూడ లేకపోతన్నా మామా! మీ నాయనైతే.. దగ్గి దగ్గి యాష్టై పోతన్నాడు. టౌన్లో డాక్టర్ కి చూపించాలి వెంటనే. అత్త కూడా రోజు రోజుకీ చిక్కి పోతాంది. నా కైతే భయమేస్తోంది. ఈ గుళ్ళ పేరు తీసుకెళ్ళి తాకట్టు పెట్టో, అమ్మో డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళు.. అది కూడ రేపే."

ఉన్న ఒకే ఒక బంగారు నగని ఇచ్చేస్తోంది.. నారాయడికి నోట్లోంచి మాట రాలేదు. ఆలు మగల మధ్య అనుబంధం, ప్రేమ అంటే ఇట్లాగే ఉంటుందా!

"అట్టగే యెంకీ! రేపే తీసకెల్తా. అట్టా బైటికెళ్ళి చూసొస్తా.. హుస్సేన్ తండ్రిని ఏడకి తీసుకెళ్ళారో, ఎంతయిందో కనుక్కొనొస్తా."

***

"ఈ పాలెంలో దర్జీ పని చేసి డబ్బు సంపాయిద్దావనే.. ఉన్న నాకే పని పాటు లేదు నారాయడా! రిపేరింగులయ్యా అంటే నా వల్ల కాదని సెప్తా అనుకో! లేక పోతే.. పాంట్లు, షర్ట్ లు నిఖార్సుగా కుట్టగలోడిని, గట్టి కుట్టేస్తావా అని లంగాలు, అంచులు కుట్టవా అని ఓణీలు తెస్తే నా పరువేం గావాలి చెప్పు. ఆళ్ళే చేత్తో కుట్టీసుకోవాలి.."

"అది కాదన్నా! మరి నీకు డబ్బెట్లా వస్తాంది? ఇక్కడ అంత లావు షోకులేం లేవు కదా?" నారాయడు నీరసంగా అడిగాడు. పొద్దుట్నుంచీ టీ చుక్కలు తప్ప ఏం వెయ్యలేదు లోపలికి.. పెందళ కడే అన్నం వండేస్తా అంది వెంకటలక్ష్మి.

ఒక్క క్షణం ఆలోచించాడు హుస్సేను. తప్పేం ఉంది? నారాయడికి సాయం చెయ్యడం వల్ల తనకొచ్చిన నష్టవేం లేదు. పైగా చిన్నతనాన్నుంచీ కలిసి మెలిసి తిరిగారు..

"ఈ పాలెంని నమ్ముకుంటే కుండలెప్పుడో ఢింకీలు కొట్టేవి. టౌన్లో రెడీ మేడ్ షాపు నుంచి పని తెచ్చుకుంటా. వాళ్ళు బాగనే ఇస్తారు డబ్బులు. పనిని బట్టి.. కుట్టే శాల్తీని బట్టి.."

"మరి అందరికీ ఇస్తారా పని? ఎట్టాదొరుకుద్ది? నువ్వే కాస్త సాయ పడాలన్నా!"

దీనంగా అడుగుతున్న వారాయడిని చూస్తుంటే జాలేసింది హుస్సేనుకి. ఎంత అవుసరం లేకపోతే ఇట్లా అడుగుతాడు? పది మందికి

పని చూపించి అన్నం పెట్టినోళ్ళు. ఎందుకో పంటల దిగుబడులే లేవు. అకాల వర్షాలు.. కావల్సినప్పుడు వాన చుక్కే లేకపోవడం. ప్రకృతి కినుక వహిస్తే ఎవరేం చెయ్యగలరు?

"ఇస్తారన్నా! బోలెడు పనుంటుంది. పని చేతనైతే చాలు. ఎంతిస్తారనేది చేసే పనిని బట్టి ఉంటుంది. రేపెళ్తన్నా. వస్తావా? వదిన రానవసరం లేదు. మనం సరుకు తెచ్చేసుకోవచ్చు."

"ఇంకో సంగతి.. ఆ మధ్యని మీ నాయనకి జబ్బు చేస్తే ఆసుపత్రికి తీసుకెళ్ళావు కదా! ఎక్కడ.. ఎంతయింది? ఆ సాయం కూడ చెయ్యాలన్నా! మా అమ్మని నాయని చూపియ్యాల."

"అట్టాగే చూపిద్దాం. రేపు అందరం కలిసి పోదాం. గవర్నమెంటాసుపత్రే ఉంది. ఆళ్ళే మరి గుంటూరేవన్నా తీసుకెళ్ళమంటారేవో! జబ్బుని చూసి కానీ చెప్పలేరు. సొమ్ము రెడీ చేసుకో."

వెళ్ళిన పనై నందుకు ఆనందంగా ఇంటికెళ్ళాడు నారాయడు.

ఇంట్లోనుంచి వస్తున్న వాసనలకి ఆకలి రెట్టింపయింది. అడుగులు హుషారుగా పడ సాగాయి. లోపలికి కూడా వెళ్ళకుండా రెండు చెంబులు స్నానం చేసి, తుడుచు కుంటూ తూరుపింట్లోకి వెళ్ళాడు.

అలికిడి విన్న వెంకటలక్ష్మి, అప్పటికే నాలుగు సత్తు పళ్ళాలు పరిచి.. అన్నం గిన్నె, చేపల పులుసు వడ్డించింది. సాంబడు, తాత చెయ్యి పట్టుకుని తీసుకొచ్చాడు.

"నువ్వు కూడా యెట్టుకో వెంకీ! ఉన్నది అందరం సరుదుకుని తిందాం." జాలమ్మ కూచుంటూ, ఇంకొక పళ్ళెం పెట్టింది.

"ఎప్పుడూ పులుసేనా.. నాక్కూర కావాలి.." సాంబడు పేచీ పెట్టబోయాడు.

"నీకు బంగాళ దుంప కూర చేశాలేరా.. దా!"

"దుంపలెక్కడియే యెంకటలచ్చిమీ?" మల్లయ్య ఆశ్చర్యంగా అడిగాడు.

ఇంట్లో రూకలైపోయి చాలా రోజులే అయింది. రోజూ మిరపకాయ కారం, ఉల్లిపాయ రోటి పచ్చడి, చేపలు దొరికిన్నాడు చేపల పులుసూ.. బజారు కెళ్ళి కూరలు కొని నెల పైనే అయింది. ఇంక కొద్ది రోజులలో బియ్యం కూడా నిండుకునే పరిస్థితి.. ఏదో ఒక ఆధారం దొరక్క పోతే!

మల్లయ్య గొంతులో ఆనందం. కమ్మటి దుంపల వాసన పీల్చి ఎన్నాళ్ళయిందీ..

"నిన్న షావుకారు గారమ్మాయికి నాలుగు ఓణీలకి అంచులు కుట్టిచ్చా. అర కిలో బంగాళ దుంపలు ఇచ్చింది. దొడ్లో ఉన్న పచ్చి మిరపకాయ, కరేపాకు వేసి కూర చేశా." అందరికీ కూర వడ్డించింది. తృప్తిగా అన్నాలు తిన్నారు అందరూ.

అప్పుడు.. నారాయడు మర్నాడు టౌను కెళ్తున్నామని చెప్పాడు.

'ఇప్పుడాసుపత్రెందుకురా మాకు. ఏదో వయసొచ్చాక రోగాలు రాకుండుంటయ్యా! కాస్త కషాయం తాగుతే అదే పోతంది. ఇప్పుడు అన్ని డబ్బులు ఖరుసు చేసి అదేవంత అవుసరం చెప్పు?" మల్లయ్య, జాలమ్మ కూడా వద్దనేశారు.

"అట్టనద్దమ్మా!. నేనెట్టాగా యెల్లి, యెంకికి మిషను బట్టలు తెద్దావనుకుంటన్నా. అట్టగే ఒక్క సారి చూపించుకునొచ్చేద్దాం. ఇంకేం మాట్లాడకండి. మనం ఎల్తన్నావంతే!" నారాయడు ఇంకోమాట చెప్పనియ్యలేదు.. ఎవరినీ కూడా.

వెంటనే బైటికెళ్ళి పోయాడు.. షావుకారు దగ్గరకెళ్ళి, నగ తాకట్టు పెట్టి డబ్బు తేవడానికి.

అన్నాలు తినేశాక తూరుపిల్లంతా సర్ది, ఒళ్ళంతా చితచితగా ఉంటే నాలుగు చెంబులు నెత్తి మీద నుంచి పోసుకుందామని దొడ్లో

కెళ్ళింది వెంకటలక్ష్మి. ఎక్కడిదో.. వంట జాగా దగ్గర గూడు సర్దుతుంటే ఓ సబ్బు ముక్క దొరికింది. వాసనంతా పోయింది.. అదేం సబ్బో కూడా తెలియట్లేదు. ఏదైతేనేం.. నీరు తగిల్తే నురుగొస్తోంది. అది చాలు మురికి వదల్చడానికి.

కడుపులు నిండాయేమో పెద్ద వాళ్ళిద్దరూ అట్లాగే చాపల మీద వాలి పోయారు. వెంటనే కునుకు పట్టేసినట్లుంది.. పెద్దగా గుర్రు వినిపిస్తోంది. సాంబడికి మూడేళ్ళు నిండుతాయి రెండ్రోజుల్లో. ఆ లోగా అక్షరాభ్యాసం చేద్దామనుకున్నారు కానీ కుదరలేదు. డబ్బులు సర్దుబాటవాలి. పైగా మల్లయ్య ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉంది. రాత్రంతా ఖళ్ళు ఖళ్ళు మని దగ్గుతూనే ఉంటున్నాడు.

అటు తిరిగి, ఇటు తిరిగి.. అమ్మ ని ప్రశ్నలతో కాసేపు విసిగించి సాంబడు కూడా నాన్నమ్మ పక్కన దూరి నిద్రలోకి జారుకున్నాడు.

ఎప్పటి నుంచో నిద్ర మొహమెరుగని వారి లాగ అందరూ గాఢ నిద్రలోకెళ్ళి పోయారు.

ఆకాశం అంతా దట్టంగా మబ్బులు పట్టేసున్నాయి. రివ్వుమని చల్లని గాలి చెవులోకి కొడుతోంది. కళ్ళు చికిలించి ఆకాశంలోకి చూసింది వెంకటలక్ష్మి. అంతా ముదురు నీలం. కొంచెం దూరం లో ఉన్న సముద్రానికి, ఆకాశానికీ తేడా లేదు.. వానలు ఈ సారి దట్టంగా కురిసేట్లే ఉన్నాయనుకుంది. గోలెం దగ్గరకెళ్ళి నీళ్లలో చెయ్యి పెట్టింది. వేళ్ళు జివ్వుమన్నాయి. ఇంతటి చల్లటి నీళ్ళు, వంటి మీద పడితే..

అయినా సరే.. స్నానం చెయ్యాలిసిందే.. తప్పదు. బక్కెట్లో నీళ్ళు పడమటింటి లోకి తీసుకెళ్ళింది. ఇంట్లో అయితే కాస్త నయం.. చలిగాలన్నా ఉండదు.

అట్లాగే గడగడా వణుకుతూ స్నానం ముగించాననిపించి ముదురు నీలం ముతక చీర కట్టుకుని, తెల్లని జాకెట్టేసుకుంది. తూములోంచి నీళ్ళన్నీ నెట్టేసి, పొడి బట్ట పెట్టి తుడిచింది. మధ్య వేలితో కుంకం తీసుకుని, గోడకున్న చిన్న అద్దంలోచి చూసి బొట్టు దిద్దుకుంది. ఎర్రని గుండ్రని బొట్టు.. నీలం కడలి మీద అప్పుడే ఉదయిస్తున్న పున్నమి చంద్రుడిలా ఉంది.

నారాయుడు ఆయాస పడుతూ ఇంట్లోకి వచ్చాడు.

“వెంకీ! కాసిని మంచినీళ్ళియ్యే..”

“ఏందట్టున్నా? పని కాలేదా?” మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ అడిగింది.

“అయిందే! అవకేం గానీ.. షావుకోరు మాత్తరం మా గట్టి మనిశనుకో. తూకం వేసి సగం బంగారానికే ధర కట్టాడు. అందులో ఒక నెల వడ్డీ తీసుకుని మిగిలింది ఇచ్చాడు. అంతా కలిపి నాలుగు వేలు కూడ రాలే.. పది వేల రూపాయల సరుక్కి.” గటగటా నీళ్ళు తాగి గట్టిగా నిట్టూర్చాడు.

“అంతే మరి.. అవుసరం మందీ, యాపారం ఆళ్ళదీ. ఏం చేత్తాం. ఉన్నదే మనది. ఏదేమైనా అమ్మా నాయనల ఆరోగ్యం ముఖ్యం. రేపు మొదటి నావకే బయల్దేరండి. పచ్చడి అన్నం కట్టి ఇస్తా ముగ్గురికీ.”

నారాయుడు మంచం మీద వాలిపోయాడు.. కళ్ళు మూసుకుని. ఏదైనా ఆలోచించడానికికూడా శక్తి లేదు. బాగా చిక్కి పోయాడు ఆరు నెలల్లోనే.

“ఏందోనే ఈ బతుకులెట్టా తెల్లారతయ్యో భయమేస్తోంది. అస్సలీ పడమటిల్లు కట్టడం తప్పయ్యిందేమోనే యెంకీ! అంత వరకు హాయిగా ఉండే వోళ్ళం. ఊరుకున్నోడిని ఊరుకోక యెదవ పని చేశా..”

వెంకటలక్ష్మికి నారాయడ్ని అట్లా చూస్తుంటే.. జాలి, ప్రేమ పొంగుకొచ్చాయి.

మంచం మీద కూర్చుని నారాయడి కాళ్ళు ఒళ్ళోకి తీసుకుని వత్త సాగింది. నిజమే! ఈ జీవితాలిట్టా సాగ వలసిందేనా? అటు చూస్తే పుట్టింట్లో పరిస్థితులు కూడా రోజు రోజుకీ దిగజారుతున్నాయి. అయినా, ప్రస్తుతానికి తిండి గింజలకి లోటు లేకుండా సాగుతోంది. ఏదో



KOUMUDI

అద్భుతం జరుగుతే కానీ.. మార్పుండదు.

"ఏం అద్భుతాలుంటయ్యి.. నాపిచ్చిగానీ.." మనసులోనే అనుకుంది.

నారాయడు కళ్ళు తెరిచి, వెంకటలక్ష్మిని చూశాడు. అప్రయత్నంగా పెదవుల మీదికి నవ్వొచ్చింది. పడుతున్న వేదనంతా చేత్తో తీసినట్లు మాయమై పోయింది. ఎంతో హాయిగా.. తనంత అదృష్టవంతుడు ఈ భూ ప్రపంచంలో ఉండడేమో అనిపించింది. నిజమే.. వెంకటలక్ష్మి లాంటి ఇల్లాలుంటే దేన్నైనా జయించవచ్చు.

నిజమే! ఒక్క విధిని తప్ప..

కళ్ళతోనే రమ్మని పిలిచాడు. ముందుకి జరిగి నారాయడి వక్షం మీద తల ఆన్చింది. ఆర్తిగా రెండు చేతులతో అతని నడుం పట్టుకుని బిగించింది. ఆ స్పర్శలో కోరిక లేదు.. సేద తీర్చుకోడం తప్ప. ఒకరి కొకరు తోడు నీడగా ఉన్నామన్న తృప్తి మాత్రమే ఉంది.

భార్యా భర్తల ప్రతీ పరిష్వంగం లోనూ శృంగార భావనలే ఉండవు. కష్ట సుఖాల్లో, వెలుగు నీడల్లో కలిగే ఒక ఓదార్పు, ఒక అనురాగం, ఒక స్నేహం, ఆత్మీయత.. అన్నీ కలగలిపిన అనుబంధమే ఈ ప్రేముడి.

నారాయడు ఒక చేత్తో వెంకటలక్ష్మి తల నిమురుతూ, ఇంకొక చెయ్యి వీపు మీద వేసి.. అలా ఉండి పోయాడు. ఒక అలౌకికమైన స్థితి అది. అట్లా ఎంత సేపుండిపోయారో.. కాల గమనం ఆగిపోయినట్లయింది. ఆగిపోతే ఎంత బాగుంటుంది.. అదే అనిపించింది ఇద్దరికీ.

అట్లా ఎంత సేపుండి పోయే వారో కానీ..

తలుపు ధడేల్ మని తోసిన చప్పుడు, అమ్మా అనే పిలుపు ఒకే సారి వినిపించి, వెంకటలక్ష్మి చటుక్కున లేచి నిలబడి, చీర సవరించుకుని, చేతులు జాపింది.

సాంబడు పరుగెత్తి వచ్చి వాలి పోయాడు అమ్మ చేతుల్లో.

"ఏం కావాలి కన్నయ్యా?" ఎగరేసి ఎత్తుకుని, ఉప్పొంగి పోతున్న ప్రేమతో అడిగింది.

సాంబడు చేతులు అమ్మ మెడ చుట్టూ వేశాడు. మొహం లోకి తదేకంగా చూడసాగాడు.

"ఏందిరా అట్ట చూస్తన్నావ్? అమ్మ నెప్పుడూ చూడలేదా ఏంటి?" నవ్వుతూ అడిగింది వెంకటలక్ష్మి.

"ఈంత పేద్ద బొట్టు.. బాగుందమ్మా! రోజూ ఇట్టగే ఉండు. నాకు బాగుంటాది."

పకపకా నవ్వింది వెంకటలక్ష్మి. వాడి ఆశ్చర్యం, అమ్మ మీద ఉన్న ఆరాధన.. ఆ కనుల్లో అమాయకత్వం.. ముద్దొచ్చేశాడు. గట్టిగా హత్తుకుని తల మీద, బుగ్గల మీద ముద్దులు కురిపించేసింది.

"అమ్మా! ఆకలేత్తందే.." ఊపిరి గట్టిగా తీసుకుని అడిగాడు సాంబడు.

తల్లీ కొడుకుల విన్యాసాలు చూస్తూ నారాయడు లేచి కూర్చున్నాడు. అసంకల్పితంగా అతడి కన్నుల్లో నీళ్ళు తిరిగాయి. లేచి, ఇద్దర్నీ కలిపి తన కౌగిలి లోకి తీసుకున్నాడు. ఒక ఆవేశం, ఒక ఉద్వేగంతో నిండి పోయింది అక్కడి వాతావరణం.

బయటి వాతావరణం లో కూడా మార్పు జరుగుతోంది.

ఎకడెక్కడ్నుంచో మబ్బులన్నీ ఆ ప్రాంతంలో చేరుతున్నాయి. ఆకాశంలో ఒక పెద్ద మెరుపు మెరిసింది. భూమి కదిలిపోతుందేమో అన్నంతగా ఒక పెద్ద ఉరుము.. చెవులు బద్దలయ్యేట్లు.

నారాయడు బైటికొచ్చి చూశాడు. కొంచెం సేపట్లోనే ఏం జరగనట్లు మామూలుగా అయిపోయింది. మబ్బులు పలచబడి, గాలి ఉధృతం కూడా తగ్గింది.. తగ్గినట్లు అనిపించింది.



KOUMUDI

**"ఇంకొక సారి** ఆలోచించబ్బయ్యా! నిన్నటాల్నుంచే రేడియోలో వార్నింగులిత్తనారంట. షావుకారు కొడుకొచ్చి చెప్పాడు" మల్లయ్య పది నిముషాల్నుంచీ బతిమాలుతున్నాడు.

"మనవెన్నిచూడలేదయ్యా ఇట్టాంటియి. మామూలే కద. కాసేపు ఊళ్ళనీ ఏకం ఐపోతున్నట్లు భయపెడ్తారు.. ఆ రేడియో వాళ్ళు. అన్నీ ఉత్తుత్తి మాటలే. నిన్న ఉన్న మబ్బులుకూడ ఇవేళ కానిపియ్యట్లేదు. అయ్యనీ నమ్మి కూకుంటే.. మన పనులయినట్లే. అయినా నీకు ఆసుపత్రి కెళ్ళటం ఇష్టం లేదు. అందుకే గద ఇట్టంటన్నావు. అదేం కుదరదు.. బయల్దేరు. అమ్మా! నడు. వెంకీ వెళ్లొత్తాం." నారాయడు చెప్పులేసుకుని బయటికొచ్చాడు.

వెంకటలక్ష్మి అన్నంలో ఉల్లిపాయ పచ్చడి కలిపి ప్లాస్టిక్ సంచీలో పెట్టి.. అది ఇంకొక గుడ్డ సంచీలో పెట్టి తీసుకొచ్చి, జాలమ్మ చేతిలో పెట్టింది.

"నువ్వేనా చెప్పు తల్లీ.." మల్లయ్య జాలిగా చూశాడు.

"రేత్రంతా దగ్గి దగ్గి, ఊపిరాడకుండా బాధ పడ్డావు. ఆసుపత్రికెల్దామంటే చంటి పిల్లడిలా అట్ట గోల సేత్తావేందయ్యా? ఏదో మందిత్తారు.. జబ్బేంటో తెలుత్తాది. ఎవ్వరేం జెప్పినా యినననంతే."

తప్పని సరిగా వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ ఇంట్లో నుంచి బైటికి నడిచారు మల్లయ్య జాలమ్మలు. అప్పటికే నారాయడు పెద్ద పెద్ద అంగలేసుకుంటూ నడిచేస్తున్నాడు.

వెంకటలక్ష్మికి పెద్దాయన్ని చూస్తుంటే బాధనిపించింది. పరుగెత్తుకునెళ్ళి నారాయడ్ని ఆపితే..

"తాతా! నేనూ వత్తా.." సాంబడు పరుగు పరుగున వెళ్ళబోయాడు. మల్లయ్య వెనక్కి తిరిగాడు. మనవడిని సముదాయిద్దామా అనుకుంటూ.

"పడవెళ్ళిపోతుంది పదండి. మళ్ళీ ఆస్పత్రిలో క్యూ పెరిగి పోద్ది. అట్టయితే రేత్రికి రాలేం. వెంకీ, సాంబయ్యని లోపలికి తీసుకపో." ఏడుస్తున్న సాంబడిని బెల్లమ్ముక్కిస్తా లోపలికెల్దాం అని సముదాయిస్తూ వెంకి ఇంట్లోకి తీసుకెళ్ళిపోయింది.

అప్పటికే రేవు దగ్గరకి చాలా మంది వచ్చేశారు.

"చూశారా.. నే చెప్తుంటే ఆలిశ్యం చేసేశారు. ఇప్పుడు చూడండి పడవ అందుతుందో లేదో!" నారాయడు వరుసలో ముందున్న వాళ్ల దగ్గరకెళ్ళి బతిమాల సాగాడు.

"నాయన్ని అర్జంటుగా తీసుకెల్లాల. రేతిరి పానం పోతుందేమో అన్నంత భయమేసింది. కొంచెం యెనక్కి తగ్గండిరా.. మా మంచోళ్ళు కదూ?" తనకంటే చిన్న వాళ్ళని బతిమాలి ముందుకెళ్లగలిగాడు ఎట్లాగయితేనేం.

"ఏరు చాలా పోటు మీదుంది. ఇరవై మంది మించి ఎక్కడానికి లేదు. ఏమైనా సరే.." కుంటి శీనయ్య ఎవరెంత బతిమాలినా ఇరవైకి పైన ఎక్కనియ్యలేదు.

అద్దరికి చేరే వరకూ ఆకాశం లో అక్కడక్కడ మబ్బులు తప్ప ఏ ప్రమాదం కనిపించ లేదు.

"ఏందో నయ్యా.. ఈ రేడియో.. వాతవరణ ఆఫీసోల్లంటూ ఊదరగొట్టేస్తారు. అక్కడెక్కడో అస్సాం దగ్గర గాలులు విపరీతం అయితే మద్దిలో మనకి వార్నింగులే వార్నింగులు. ఇట్టా కూచుంటే నెలకి పదేన్రోజులు ఇళ్ళల్లోనే కూసోవాల. మనకి బతుకెట్టా ఎల్తుంది? మా నాయన ఆ మాట పట్టుకుని రానంటే రానంటాడు." నారాయడు బాధంతా శీనయ్య దగ్గర వెళ్ళ బోసుకున్నాడు.

"లేదన్నా! ఎందుకో కిట్టమ్మ తీరులో తేడా ఉంది. పైకి బానే ఉంది కానీ.. పడవ కట్టం మీద నడుస్తా ఉంది. ఇంకో

KOUMUDI

త్రిప్పెయ్యగల్నేమో. అ తర్వాత కట్టేసి ఇంటికెళ్ళి పోతా.” శీనయ్య కేసి వింతగా చూశాడు నారాయడు.

టౌన్లో గుంపులు గుంపులుగా రేడియోలో వార్తల గురించే చెప్పుకుంటున్నారు.

మల్లయ్య ఇంక మాట్లాడ్డం మానేశాడు.

“రాతెట్టుంటే అట్టగే జరుగుద్ది. మన సేతిలో ఏవుంది. నా చుట్టలే ఇంత వరకు తెచ్చాయి. దానిగురించి ఇప్పుడనుకుని ఏం లాభం.. “ పడవెక్కగానే పెళ్ళాం దగ్గర మొత్తుకుని ఆ పైనుంచీ నోరు మూసేశాడు.

ఎందుకో జాలమ్మకి కూడా గుండె గుబులుగానే ఉంది.

టౌన్లో పరిస్థితి చూశాక నారాయడిక్కూడా కాస్త గుబులేసింది. అయినా బింకం వదలకుండా ఆసుపత్రికి తీసుకెళ్ళాడు తల్లినీ తండ్రినీ, రెండు రిక్షాల్లో. ఈ సారి రేడియో వార్తలు నిజవవుతాయేమో! నారాయడికి అనుమానం వేసింది.

ఆసుపత్రిలో సీరియస్ కేసులు తప్ప చూడట్లేదు. చిన్న చిన్న సమస్యలున్న అవుట్ పేషంట్లందర్నీ తుఫాను హెచ్చరికలు చూసుకుని మళ్ళీ రమ్మని పంపేస్తున్నారు. స్కూళ్ళన్నింటికీ మూడు రోజులు సెలవలిచ్చేశారు.

మల్లయ్యని కూడా.. దగ్గు తగ్గడానికేదో సిరప్ ఇచ్చి నాలుగు రోజులయ్యాక రమ్మన్నారు.

“మీరు సొంతంగా రోగాలు తెచ్చుకుని ఆస్పత్రుల చుట్టూ తిరుగుతారు.. ఏం వ్యసనాలయ్యా ఇవి?” ఆ డాక్టర్, చుట్టలు ముప్పై ఏళ్ళుగా కాల్చినందుకు చీవాట్లేశాడు. హాస్పిటల్ నుంచి బయటకు రాగానే మొత్తం అంతా చీకటై పోయింది.

“అప్పుడే రాత్రయిపోయింది.. టైమెంతయిందిరా నారాయడూ?” జాలమ్మ అడుగుతుంటే పక్కనున్న వాళ్ళెవరో అన్నారు..

“అంతా కారు మబ్బులు కమ్మేశాయమ్మా! పగలు పన్నెండయింది. తొందరగా ఇంటి కెళ్ళిపోండి.

అంతలో.. విపరీత మైన వేగంతో గాలులు వీయడం మొదలెట్టాయి. మబ్బులన్నీ సముద్రం కేసి దూసుకునెళ్ళి పోతుంటే.. ఎక్కడ్నుంచో కొత్త మబ్బులు చేరిపోతున్నాయి. ఏ క్షణాన్నైనా వర్షం మొదలవచ్చు. అదీ కుంభ వృష్టే..

“ఏం చేత్తాం. మా అత్తారింటికెల్దాం. ఇయ్యాల ఇంటికెల్లేట్టు లేదు. పడవలెల్తయ్యని నాకనిపించటంలా. నేనింకా హుస్సేను చెప్పిన రెడీమేడ్ షాపు కెల్దావనుకున్నా. అది కూడా చూసుకుని రేపెల్దాం. మా అత్తారు ఏవనుకోర్లే.” నారాయడు అంటుంటే మల్లయ్య మొహం పక్కకి తిప్పేశాడు.

“అవున్నాయినా.. నువ్వు చెప్తానే ఉండావు. నే యినిపించుకోలా. అట్టని సాధిస్తావా ఏంది? ఇట్టాంటివి మనకి ప్రతీ ఏడూ మావూలే కదనుకున్నా. ఇప్పటికైతే ఏదోటి సెయ్యాలి కదా! పదండి.”

బాబయ్య వీధిలోనే ఎదురయ్యాడు.

“వచ్చారా! ఇప్పుడే అనుకుంటాన్నాం. ఈ తుఫాను బీభత్సంగా వస్తుందంట. అన్ని పక్కలా నీళ్ళే కదా.. మీ లంక ఏమవుద్దో అని భయపడ్తా ఉన్నాం. మంచి పని చేశారు. అమ్మాయేది? సాంబా..” వీధి వాకిట్లోకి చూస్తూ అరిచాడు.

నాలిక్కరుచుకున్నాడు నారాయడు. ఈ సంగతి ఊహించలేదతను. వెంకటలక్ష్మినీ, సాంబడినీ తీసుకు రాలేదంటే ఏమంటారో.. ఏం సమాధానం చెప్పాలీ? మల్లయ్యే ఆదుకున్నాడప్పుడు.

“మేం బయల్దేరేప్పటికి బానే ఉంది బావా! ఇక్కడికొచ్చాకే తెలిసింది.. అన్నీ కట్టేశారని. ఆసుపత్రిలో కూడా సరిగ్గా సూడటంలా. రిక్షాలు, బస్సులు ఏవీ నడవటంలా. ఇంక మేవు తప్పని సరై ఇక్కడికి మీ ఇంటికి వచ్చాం. వెంకటలక్ష్మి పాలెం లోనే ఉంది. రేప్పొద్దున్నే ఫస్టు నావ కెల్లిపోతం.” సిగ్గు విడిచి అడిగినట్లు అడిగాడు. అవుసరం మరి.. తప్పదు.

అప్పటికే వాన మొదలయింది. పెంకుటిల్లేమో చూర్ల మీంచి ధారలు పడుతూ.. పంచలన్నీ తడిసి పోతున్నాయి. అందరూ నడిమింటిలోకి చేరారు.

"ఫర్లేదు బావా! కాపోతే.. అందరం ఒక చోటుంటే బాగుండేదేమో అని. అంతే కానీ మిమ్మల్ని రావద్దనీ, ఉండద్దనీ కాదు. కాళ్ళు కడుక్కోటానికి నీళ్ళు పట్రండిరా.." అరవగానే తనకే నవ్వొచ్చింది. వాన ఉధృతం పెరిగి ఊరూ వాడా ఏకమయ్యేట్లు పడుతోంది. వరండా చివరికి వెళ్తే చాలు.. కాళ్ళేం ఖర్మ, ఒళ్లంతా కడిగేసుకోవచ్చు.

మాటా మంతీ లేకుండా కూర్చున్నారందరూ.

హాల్లో ఉన్న రేడియో బరబర మంటోంది. అందరు దాని చుట్టూ చేరారు. పెద్దయ్య భార్య, పెసరపప్పేసి పప్పులుసు.. అన్నం వండుతోంది. ఆ వాసనలకి మల్లయ్యకి డొక్క లోంచీ ఆకలి నొప్పులు మొదలయ్యాయి. అడగటానికి మొహమాటం. వెంకటలక్ష్మి కట్టిచ్చిన అన్నం తినటానికి టైమూ లేదు.. మనసూ లేదు. ఆసుపత్రి దగ్గరే అడుక్కునే పిల్లలకిచ్చేసింది జాలమ్మ. కోడల్నీ, పిల్లడినీ వదిలేసి రావడం బుద్ధిలేని పనే! వియ్యంకుడు నొచ్చుకున్నాడంటే నొచ్చుకోడూ మరి. పెద్దవాడే అయినా కూడా కొడుకు మాట వినడం బుద్ధి తక్కువ పనే. రాను పొమ్మంటే ఏం చేసే వాడేంటి..

నారాయడు కూడా అట్లాగే బాధ పడుతున్నాడు. వర్షం జోరు బాగా ఎక్కువయింది. గదుల్లో పెంకుల్లోంచి కురుస్తోంది. నడిమిల్లు మాత్రం ఆ మధ్యని పెంకులు తిరగేయించడంతో కురవట్లేదు.

"పిల్లలేరీ?" నారాయడు హీనస్వరంతో అడిగాడు.

"చిన్నయ్య, భార్య అత్తారింటికెళ్ళారు. మనవడు కూడా.. చెల్లితో యెల్తానని పేచీపెట్టి వెళ్ళాడు. ఆళ్ళెట్టున్నారో! అందరూ ఒక దగ్గరుంటే అదో దారి." బాబయ్య విచారంగా అన్నాడు.

"అయితే.. పెద్దోళ్ళంతా ఒక దగ్గర, పిల్లలు వేరే దగ్గరా చిక్కు పడి పోయారన్నమాట. ఈ వాన ఎప్పటికి తగ్గుతుందో.. తగ్గాక కూడా రాదారి ఎట్టుంటాదో!" మల్లయ్య స్వగతంగా అన్నాడు.. గట్టిగానే.

"మామా! అన్నాలు పెట్టేస్తా. రండి." పెద్దయ్య భార్య అందరికీ వరుసగా అరటాకులేసి వడ్డించింది. కంచాలవీ అంటే మళ్ళీ కడగాలి.. బైటికెళ్ళాలి.

ఆకలి, ఇంకేమీ అలోచించడానికి తావియ్యలేదు. అప్పటికే సాయంత్రం నాలుగు దాటింది. కానీ అర్ధరాత్రిలా ఉంది చీకటి. కరెంటు ఎప్పుడో పోయింది. కొవ్వొత్తులు అయిపోయి చాలా సేపయింది.. దేవుడి గూడులో వెలిగించిన వత్తుల దీపాల వెలుతురే దిక్కయింది.

"అందుకే నేను హరికేన్ లాంతరు పెట్టుకుందావంటా. ఈ కరెంట్ దీపాలనెవడు నమ్మగలడు? అమ్మాయ్! నూనన్నా ఉందా ఇంట్లో.. లేదంటే చీకట్లో రాంభజనే!" బాబయ్య ఆందోళన కప్పి పుచ్చు కోవడానికి ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు.

అందరూ తిన్నాక, పెద్దయ్య పెళ్ళాం పిల్లడిని తలుచుకుంటూ తిన్నాననిపించింది. అన్నీ సర్దేసి.. చూరు నీళ్ళతోనే గిన్నెలు తొలిచేసి, ముణగ దీసుకుని కూర్చున్నారందరూ.

"ఎవరైనా ఒంటేలుకైనా, బైర్భూమికైనా యెల్లాలంటే.. ఆ మూల గదిలోకెల్లిపోడవే. అక్కడ తూవుంది.. ఇల్లు కడిగినప్పుడు అన్ని నీళ్ళూ పోటానికని పెట్టించాం. ఆలోచించకండి. నేనైతే కునుకు తీస్తన్నా." బాబయ్య చాప పరచుకుని బొంతొకటి కప్పేసుకున్నాడు. మిగిలిన అందరూ మాటా పలుకూ లేకుండా క్షణ క్షణానికీ పెరిగిపోతున్న వాన చూస్తూ ఉండిపోయారు.

పాలెంలో ఇంకా భీభత్సంగా ఉంది. అక్కడ కూడా మధ్యాన్నించీ చీకటి పడిపోయింది. సాంబడికి అన్నం పెట్టి, తను కూడా తిని,


KOUMUDI

పడమటింట్లోకి వెళ్ళింది వెంకటలక్ష్మి, తూరుపింటికి తాళం పెట్టి.

విపరీతమైన గాలులు.. భీకర వర్షం. దానికి సాయం రేకులు. వాటి మీద దడ దడా ఉన్న దానికంటే పది రెట్లు ఎక్కువ శబ్దం, గుండెల్లో కొడుతున్నట్లే ఉంది. ఎక్కడో పిడుగు పడినట్లుంది.. బ్రహ్మాండం బద్దలయ్యే చప్పుడు. గట్టిగా అరుస్తూ సాంబడు తల్లిని కరుచుకు పోయాడు. వెంకటలక్ష్మికి కూడా చాలా భయం వేసింది.

"నువ్వన్నా చెప్పమ్మా! ఇవేళ వద్దని. ఇంకొకరోజు వెళ్లచ్చు ఆసుపత్రికి.." మల్లయ్య మాటలు చెవుల్లో వినిపిస్తున్నట్లే ఉన్నాయి.

ఇదేనా ప్రళయం అంటే.. ప్రపంచం మునిగిపోతుందా? అంతమైపోతుందా? వెంకటలక్ష్మికి కళ్ళల్లో నీళ్ళు ధారల్లా కారుతున్నాయి. తలెత్తి చూసింది. రేకులు కదులుతున్నట్లనిపించాయి. వెంటనే తలుపు తీసుకుని, తాళం కూడా పెట్టకుండా, దగ్గరగా వేసి, విసురుగా వచ్చే జల్లుల్లోంచి తూరుపింటికి వెళ్ళింది. తలుపు తీసుకుని లోపలికి వెళ్ళే సరికి.. ఏముంది? గుండె ఆగినట్లయింది.

మధ్య వేలంత లావు వాన ధారలు, నాలుగయిదు చోట్ల కురుస్తున్నాయి, ఇంట్లో కూడా. గబగబా బకెట్లు, గిన్నెలు పెట్టింది. వాన పడని చోట, ఒక మూల, నేలమీద ఉన్న బొంతల్లో సగం పరచి, సగం కప్పుకుని కూర్చున్నారు తల్లీ కొడుకూ.. అయినా కూడా వణికి పోతూ! సగం భయం తో, సగం చలికి.

అట్లా.. కళ్ళు తెరుచుకునే కూర్చుంది వెంకటలక్ష్మి.

సాంబడు మాత్రం అమ్మ రక్షణలో ఉన్నానని ధైర్యమో ఏమో.. నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాడు. ఎంత టైమ్ అయిందో! ఊర్లో అంతా ఎట్లా ఉన్నారో? కనీసం పక్కింటికి వెళ్ళటానికి కూడా లేదు. అస్సలు కదలడానికే లేనట్లు ఉంది.

"కనీసం నారాయుడు, అత్త, మామ బాగా ఉండుంటారు. ఆళ్ళెళ్ళటం మంచిదే అయిందేమో! ఉంటే అందరు సమాధి అయిపోయుండే వారేమో!" తలుచుకుంటూ.. గడగడ వణుకుతూ.. కొంచెం సేపటికి తుఫాను భీభత్సం పెరిగింది. ఆకాశం బద్దలైపోతుందేమో! ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని కూర్చుంది వెంకటలక్ష్మి.

ఎక్కడో మంటలు రేగుతున్నట్లు.. పిడుగులు పడుతున్నట్లు.. అదంతా తన ఊహా నిజమా? వాన, మంటలు ఒకేసారి ఎట్లా వస్తాయి? మనసు మొద్దుబారి పోయింది. గాలి వృక్షాలను వేళ్ళతో సహా లేపుతానంటూ వీస్తోంది.. భయంకరంగా. సరిగ్గా అప్పుడే, పడమటింటి మీది రేకులు రెండు లేచి శరవేగంతో తూరుపింటి మీద పడి ముందుకి ఒరిగిపోయాయి.

ధాం... ధాం. ఫెళ.. ఫెళ. చెవులు భరించలేనంత చప్పుడు. అయిపోయింది. తనూ, సాంబడూ భూస్థాపితం అయిపోతున్నారు. కనీసం తమ వాళ్ళు వచ్చినప్పుడు.. శవాలన్నా దొరుకుతాయా? స్పృహ తప్పి పడిపోయింది వెంకటలక్ష్మి.

కొంచెం సేపటికే గాలి వాలు మారింది.. దానితో పాటుగా.. వాన కూడా. విచిత్రంగా, పాలెంలో రెండు గంటల్లో తుఫాను దాడి తగ్గిపోయి, చిరుజల్లులు మాత్రం కురవ సాగాయి.

"అమ్మా! అమ్మా!" సాంబడు తట్టి లేపుతుంటే మెలకువొచ్చింది వెంకటలక్ష్మికి.

"ఏమయిందీ? తనూ, సాంబడూ బానే ఉన్నారా? బతికే ఉన్నారా? ఇదంతా నిజమేనా? ఆ కాళరాత్రి గడిచి పోయిందా?" వెంకటలక్ష్మి నెమ్మదిగా లేచింది. పాలెం ఎట్టా ఉందో.. వాకిలి తలుపు తియ్యబోయింది. తలుపులు బిగుసుకు పోయాయి. అంతే కాదు.. ఏదో తలుపుకి అడ్డంగా పడి, అడ్డుకు పోయినట్లు తెలుస్తోంది.

"అమ్మా! ఆకలైతాందే. నాన్నా, తాతయ్య, నాన్నమ్మ రాలేదా? వాన తగ్గిందా?" సాంబడు ప్రశ్నలు సంధిస్తూనే ఉన్నాడు. ముందుగా నిన్నటి అన్నం కొంచెం ఉంటే వాడికి పెట్టింది. తనకీ ఆకలేస్తోంది. ఏదో ఒకటి తినాలి.. అస్సలు టైమెంతయిందో!



KOUMUDI

దొడ్డి వాకిలి తలుపు తీసింది. అది వెంటనే తెరుచుకుంది. దొడ్లో ఉన్న చెట్లన్నీ నేల మట్టం అయిపోయాయి. గోలెం మాత్రమే కాదు.. అక్కడున్న బకెట్లు, ముంతలూ అన్నీ నీళ్ళతో నిండిపోయాయి. అంతేనా.. అసలు పెరడు మొత్తం మోకాళ్లోతు నీళ్ళలో ఉంది. కళ్ళల్లో నీళ్ళు రాబోయి ఆగిపోయాయి వెంకటలక్ష్మికి. ముందు ముందు వాటి అవసరం చాలా ఉంటుందనేమో!

ఇంటి చుట్టూ జాగ్రత్తగా గోడలు పట్టుకుని తిరిగి వాకిట్లోకి వెళ్ళింది. పడమటింటి రేకులు తూరుపింటి ముందు పాతుకు పోయున్నాయి. అవే వీధి వాకిలి తియ్యకుండా అడ్డుకున్నాయి. పడమటింటి గోడలుకూడా సగం నాని ముట్టుకుంటే కూలిపోయేట్లున్నాయి.

తనూ, నారాయుడూ ఎంత కష్టపడి ఆ ఇల్లు కట్టారో.. ఒక్క క్షణం కళ్ళ ముందు మెదిలింది.

నారాయుడు చెప్పింది నిజమేనేమో! అసలా ఇల్లుకట్టకుండా ఉంటే.. ఎట్లా ఉండేదో? వెన్నులోంచీ వణుకొచ్చింది వెంకటలక్ష్మికి. ఇంతేనా జీవితం అంటే..మూడు సంవత్సరాలు కూడ అవలేదు.. ఎంత ప్రేమతో కట్టు కున్నారా ఇల్లు? అంతలో ఆశలన్నీ ఎట్లా తలకిందులై పోయాయి? ఇంట్లో ఉన్న తిండి గింజలు కూడ తడిసిపోయాయి. నారాయుడు వాళ్ళొచ్చాక కానీ ఏం చెయ్యాలో తెలీదు. వాళ్ళొచ్చే సరికి ఎంత కాలం పడుతుందో!

పడిపోయిన తడికల గేటు మీద నుంచి దాటుకుంటూ ఊర్లోకి బయలు దేరింది. సాంబడు ఎంత భయ పడ్డాడో కానీ.. నోరు విప్పకుండా చూస్తున్నాడు, కళ్ళు పెద్దవి చేసి.

పాలెంలో మరీ ఎక్కువ విధ్వంసం జరక్కుండా తుఫాను దారి మార్చుకుంది. భయ పడుతూ, ఏం చూడ వలసి వస్తుందో అని బెదురుతూ.. ఒక్కొక్కళ్ళే ఇళ్ళల్లోంచి బయటికి వస్తున్నారు. పూరి గుడిసెలు అడ్రస్ లేకుండా మాయం అయిపోయాయి. అందులో ఉన్న వాళ్ళంతా వాన బాగా పెరగక ముందే స్కూలు బిల్డింగ్ లోకి మారి పోయారు.

కరంటు స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లు ఎప్పుడో కూలి పోయాయి. నడుస్తున్న వెంకటలక్ష్మి కాళ్ళకి ఏదో తట్టుకుని, ముందుకు పడ బోయి ఆపుకుంది. ఏంటా అని చూస్తే.. పక్కింటి వాళ్ళ బర్రె. అంతెత్తు స్తంభం మీద పడి.. చచ్చి పడుంది. చూడగానే భళ్ళున వాంతి చేసుకుంది.

“అమ్మా! ఇంటి కెల్లి పోదామమ్మా!” సాంబడు ఏడుస్తూ అడిగాడు.

“అట్టగే పోదాం. రేవు దగ్గరకెళ్ళి చూద్దామా? నాన్న వాళ్ళు వస్తున్నారేమో! ఇంటి కెళ్ళి పోదామా?” అభం శుభం తెలియని పిల్లవాడికి ఆ భీభత్సం చూపించడం ఇష్టం లేకపోయినా తప్పదు. ఎక్కడొదిలిపెడుతుంది? నారాయుడూ, అత్తమామల మాటెలా ఉన్నా.. ఒంటరిగా ఇంట్లో ఉంటే పిచ్చెక్కి పోయేట్లుంది. అప్పుడుకాక పోయినా కొన్ని గంటలయ్యాకయినా ఏదో తినాలి.. ప్రాణం నిలుపుకోటానికి. ఎక్కడి నుంచి వస్తుంది? తన మాటెట్లా ఉన్నా. పిల్లడి మాట?

అన్నీ ప్రశ్నలే.. జవాబు లేని ప్రశ్నలు.

“వెంకటలక్ష్మీ.. వెంకట లచ్చీ..” ఎవరిదో కంఠం.. నూతిలోంచి వస్తున్నట్లుగా.

అటూ ఇటూ తిరిగి చూసింది. నుయ్యి కాదుగానీ, నూతి లాంటి గొయ్యి. షావుకారు తన పెరట్లో ఎత్తు చేసుకోడానికి రోడ్డు పక్కన మట్టి తవ్వేసి తీసుకు పోయాడు.. అడిగే వారెవరున్నారని! ఊళ్ళో నూటికి తొంభై తొమ్మిది మందికి అతను అప్పులిచ్చాడు. ఎవరూ ఏం చేసినా అడగరనే ధీమా..

సరిగ్గా అదే గోతిలో భుజాల వరకూ నీళ్ళల్లో దిగి ఉన్నాడు. బైటికి రాలేక. మరి అతని కుటుంబం ఏమయిందా అని చూసింది. ఎక్కడా ఎవరూ కనిపించలేదు. అందరూ కట్ట కట్టుకుని ఎక్కడి కెళ్ళి పోయారో!

“నన్ను పైకి లాగవా వెంకటలక్ష్మీ! చలికి చచ్చి పోతున్నా..” వణుకుతున్న గొంతు.. మాట స్పష్టంగా లేదు.

వెంకటలక్ష్మి చుట్టూ చూసింది. రోడ్డు మీదనే అడ్డంగా పడుంది ఒక చెట్టు కొమ్మ వేరే కొమ్మల్లో చిక్కుకుని. కష్టపడి దాన్ని తీసి.. ఒక చివర షావుకారు కిచ్చి, ఇంకొక చివర తను పట్టుకుని, పడి పోకుండా నిలిచి ఉన్న చెట్టు నానుకుని నిలుచుంది. షావుకారు కొమ్మని పట్టుకుని పైకి రావడానికి ప్రయత్నిస్తున్నాడు. అడుగు ముందు కేస్తే, అరడుగు కింది కెళ్ళి పోతున్నాడు. వెంకటలక్ష్మికి తను కూడా ఆ గోతిలో పడి పోతానేమో అని భయం వేసింది.

ఎట్లాగయితేనేం షావుకారు బైటికొచ్చాడు.. ఆయాస పడుతూ. వెంకటలక్ష్మికి ఊపిరాగి పోతుందేమో అని భయం వేసింది. చేతులు, నడుం లాగేస్తున్నాయి. ఆ క్షణంలో తన నగకి సగం డబ్బే ఇచ్చాడన్న సంగతి గుర్తు రాలేదు. ఆపదలో ఉన్నాడు తోటి మానవుడు. తనకి వీలయినంత వరకూ సాయం చెయ్యాలి.. అదొక్కటే మనసులో ఉంది. తోటి జీవరాశి మీద మనిషికి ఉన్న ప్రేమే ఎన్ని రకాల దుర్మార్గాలు చేసినా, మానవాళి మన గలుగుతోంది.

“వెంకటలక్ష్మీ! నారాయుడు వాళ్ళు రాలేదా ఇంకా?”

“రాలేదు.. టౌన్లో చిక్కడి పోయారేవో కానీ.. మీరెట్లా పడిపోయారు గోతిలో?”

“మా వోళ్ళంతా రేవు దగ్గరకెళ్ళారు. అన్నం పొట్లాలవీ ఇస్తారని. తుఫానొచ్చినప్పుడు, బియ్యం బస్తాలు, పప్పులు అవీ కూడా ఇస్తారు కదా! నేనే యెల్లమన్నా! మధ్యలో కాలు జారి గోతిలో పడిపోయా. నేనెట్టాగో పైకొస్తాలే అని ఆళ్ళనెల్లమన్నా.”

వెంకటలక్ష్మికి తిప్పుకోలేనంత ఆశ్చర్యమేసింది. ఆ గొయ్యి, ఎంత లోతుందో తెలీదు.. వానకి నాని నాని ఊబి లాగ కూడ అయిపోయుండచ్చు. ఒక వేళ తియ్యడానికి ఎవ్వరూ రాకపోతే ఏం చేసేవాడు? బియ్యం పప్పులు అవీ అంత ముఖ్యమా? చెక్కు చెదరని తన కొట్లో సరుకుండే ఉంటుంది.

అదే అడిగింది షావుకారిని.

“నువ్వొచ్చి తీశావా లేదా? ఆయుర్దాయం ఉందనుకో ఎవరో ఒకరు వస్తారు. లేదూ.. మా వోళ్ళు పది మందీ వచ్చి పైకి లాగినా రాలేను.” షావుకారి వేదాంతానికి నవ్వాలో ఏడవాలో తెలియలేదు వెంకటలక్ష్మికి.

కానీ ఒక్కటి మాత్రం తెలిసింది. ఆయుర్దాయం ఉంటే ఎటువంటి పరిస్థితుల్లోనైనా నిలదొక్కు కోవచ్చు. లేకపోతే.. రాజ భవనాలూ, హంస తూలికా తల్పాలూ, వంది మాగధుల సేవలూ ఏవీ కాపాడ లేవు, బతికించ లేవు.

“ఈ షావుకారికి ఇంకా ఇంకా ప్రజలని మోసం చేసి, కిందా మీదా పెట్టి దోచుకునే గీత ఉంది. అందుకే.. అంత భయంకరమైన తుఫానులో, గోతిలో నీళ్లల్లో, కలువ పువ్వులా నిటారుగా నిలుచున్నాడు. ఎటువంటి మనుషులు?” ఆలోచిస్తుంటే వెంకటలక్ష్మికి మనసంతా కలచి వేసినట్లయింది.

“పద వెంకటలచ్చీ.. రేవు దగ్గర కెళ్దాం. అక్కడేమవుతోందో.. ఎవరైనా మినిస్టరో, యమ్మెల్యేనో వస్తున్నారో లేదో.. అన్నీ కనుక్కుందాం.” షావుకారుతో రేవు దగ్గర కెళ్ళారు వెంకటలక్ష్మీ, సాంబడూ.

రేవెక్కడా? కనిపించదే! ఒక కిలోమీటరు ముందుగానే ఉధృతంగా పారుతున్న కిట్టమ్మ.. ఎంత మోటారున్నా పడవల్ని అందులో నడిపించే సాహసం చెయ్యగల మొనగాళ్ళెవరుంటారు.. అప్పుడే ఊర్లో వాళ్ళంతా అక్కడున్న గుట్ట మీదికి చేరుతున్నారు. షావుకారి కుటుంబం అంతా అక్కడే ఉంది.

పక్కాగా ఉన్న స్కూలు భవనం ఇంచుమించు రేవుకి దగ్గరగా వచ్చేసింది. అందులోనే తల దాచుకున్నారు, తమ గుడిసెలన్నీ

కొట్టుకు పోయిన వాళ్ళు. షావుకారు ఊహించినట్లు ఎవరెవరో వచ్చి అక్కడ తిండి సరుకులు పంచి పెట్టేట్లు లేదు పరిస్థితి. నర మానవుడెవడూ నది జోలికి వెళ్ళలేరు ఆ సమయంలో.

పెంకుటిళ్ళు కూడా.. గోడలే మిగిలాయి. ఇళ్ళల్లో ఉన్న సరుకులు, బట్టలు, అన్నీ ముద్దలే!

ముందున్నది ఆహార సమస్య. పాలెంలో మనుషులంతా బతికే ఉన్నారు. రాత్రి నుంచీ ఏదైనా తిన్నారో లేదో అనుమానమే. అప్పటి వరకూ ప్రాణ భయంతో బిగుసుకు పోయున్నారు కానీ.. ఎంత సేపు ఉండగలరు?

పరిస్థితి చూస్తుంటే షావుకారుకి దడ మొదలయింది. ఊరు మొత్తం మీద అతని కొట్టు, ఇల్లు, స్కూలు భవనం మాత్రం చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఇప్పుడు.. వీళ్ళందరికీ తిండీ తిప్పలూ.. ఎట్టా?

"**వెంకటలక్ష్మీ!** ఇక్కడున్నావా? ఊరంతా యెతికొస్తన్నా నీ కోసం. నీ వోళ్ళెక్కడున్నారో రేపు తెలుస్తాదంట. దా.. అన్నం తిందాం. మూడు రోజులయింది తిండి తిని. శోషొచ్చి పడిపోతావు." పక్కింటామె పిలిచింది.

శూన్యం లోకి చూస్తున్నట్లు చూసింది వెంకటలక్ష్మి. సాంబడు అమ్మ పక్కనే, ఆనుకుని కూర్చున్నాడు.. ఆకలేస్తున్నా అడక్కుండా!

"నారాయుడు వాళ్ళొచ్చే సరికి నువు పేనాలతో ఉండాలా లేదా? ఉన్నా లేచెల్లి నాలుగు ముక్కలు మాటాడాలా వద్దా?"

అయినా ఉలుకూ పలుకూ లేదు. సాంబడికి ఆవిడే తినిపించసాగింది, చిన్న డబ్బాలో తెచ్చి.

ఉప్పెనొచ్చి రెండ్రోజులయింది. మొదటి రోజు ఎవరికీ తిండీ తిప్పలూ లేవు. ప్రభుత్వం పొట్లాలు పంపుతుందన్నారు. అందరూ ఒడ్డు దగ్గర్లో ఉన్న గుట్ట మీద కూర్చుని ఎదురు చూశారు. నీరు కూడా దిగుతోంది. లంకకీ బైటి ప్రపంచానికీ లంకె లేదు. కరెంటు మొదలే లేదు. చంటి పిల్లలు గోలెడుతుంటే, తడీ పొడి బియ్యం అందరిళ్ళల్లోనూ వెతికి, కిరసనాయిలు స్టౌలమీద కాస్త గంజి కాచి పోశారు. పశువులన్నీ కట్లు తెంచుకుని పారిపోయాయి.

ఆ రోజు చాలా మంది గుట్ట మీదే కూర్చుని కళ్ళు కాయలు కాచేలా రేవుకేసి, ఆకాశం కేసి చూస్తున్నారు. కడుపులు దొక్కలకంటుకు పోయాయి.

కొంత మంది ఓపికున్న వాళ్ళు, ఊళ్ళో దారికడ్డంగా పడున్న చెట్లూ అవీ పక్కకి తీసి నడవడానికి తోవ చేస్తున్నారు. మరి కొందరు ఎవరింట్లో నైనా.. ఏవైనా సరుకులు తడవకుండా ఉన్నాయేమో చూడ్డానికెళ్ళారు.

అంతలో కమ్మటి అన్నం ఉడుకుతున్న వాసన, పప్పులుసు వాసన ఊరంతా వ్యాపించింది.

అందరూ ఆశ్చర్యంతో లేచారు. ఎక్కడ్నుంచి? షావుకారింట్లో వండుకుంటున్నారేమో! ఒకేసారి నీరసంతో కూలబడి పోయారు. షావుకారి ఇల్లు చాలా పెద్దది. అందులోనే చాలా సరుకులు దాచి పెడతాడు, సంవత్సరం పొడుగునా కొట్లో అమ్మటానికి. పెద్ద సావిడిలో కట్టెలు కూడా ఉంటాయి. కానీ పిల్లికి కూడా ఒక ముద్ద పడెయ్యడు. వీలైనంత అందరి దగ్గరా తీసుకోడానికే ప్రయత్నిస్తాడు. ధర్మ వడ్డీ ఇస్తాడు, ఎవరైనా తన దగ్గర డబ్బు దాచుకుంటే.

షావుకారింట్లో వండుకుంటుంటే ఆశ్చర్యవేముంది? గుట్ట మీద కూర్చున్న కొంత మందికి మాత్రం కోపంతో కళ్ళెర్ర బడ్డాయి. ఊరందరికీ పస్తులతో ప్రాణాలు పోయేట్లుంటే వాళ్ళు మాత్రం విందులా? చుట్టూతా వెతికి నట్లు చూశారు.

ఉన్నాయి.. వాళ్ళకక్కావలసిన కర్రలు. ఎక్కడ పడితే అక్కడ. చెట్ల కొమ్మలు బోలెడు విరిగి పడిపోయిన వున్నాయి. ఒకరి కొకరు సైగ చేసుకుంటున్నారు.

అంతలో..

షావుకారు దగ్గర పని చేసే కుర్రాడొచ్చాడు పరు గెత్తుకుంటూ.

“మిమ్మల్నందరినీ అమ్మగారు రమ్మంటన్నారు. అందరూ వచ్చెయ్యండి. అన్నవెడతారంట.” నమ్మ బుద్ధి కాలేదెవరికీ! నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళారు.

“త్వరగా రండ్రా. వేడి వేడిగా తిందాము. వాన తగ్గినా చలిగాలి తగ్గ లేదు. ఇట్టా పొయ్యి మీదినుంచి దింపుతే అట్టా చల్లగా అయిపోతాంది. పులుసన్నం ఊదుకుంటూ తింటేనే మజా.” బొంగురు గొంతుతో వాకిట్లోనే నిలబడి షావుకారు పిలుస్తుంటే అట్లా నిలబడి పోయారు జనం.

“నేనేరా! నే మాత్రం మడిసిని కానా? నా వ్యాపారంలో జాగ్రత్తగా ఉంటా. వెంకటలచ్చిమి నన్ను గోతి లోంచి బైటికి తియ్యకపోతే మీతో మాట్లాడతా ఉండేవోడినే కాదు. ఒకరి కొకరు అవసరంలో సాయ పడకపోతే జన్మెందుకురా? ఇప్పుడు మీ కేవీ ఎట్టకుండా చంపేశాననుకోండి.. ఇంక నా వ్యాపారం ఎవరితో చెయ్యాల? రండి రండి ఉన్నంత వరకూ మనం అందరం ప్రేమతో పంచుకుందాం. ఆ పైన ఆ భగమంతుడే ఉంటాడు.. బతికించినందుకు ఏదో చెయ్యక పోతాడా?”

షావుకారు భార్య కూడ బయటికి వచ్చి ఆడవాళ్ళందరినీ పిలుచుకెళ్ళింది.

లోపల పెద్ద మండువాలా ఉంది. అక్కడే గాడి పొయ్యి పెట్టి గుండిగల్లో అన్నం వండారు. పెద్ద భాండీల్లో పప్పులుసు ఉడుకుతోంది.

గబగబా వెళ్ళి మొహాలు కడుక్కుని, వీలైనంత భాగం ఒళ్ళు తడుపుకుని, భుజం మీదున్న తుండు గుడ్డలతో తుడుచుకుని వరుసగా కూర్చున్నారు.

వట్టి పప్పులుసు అన్నమే.. కానీ అది అమృతంతో సమానం. పూర్తిగా సరిపోయిందా లేదా అనేది ప్రశ్న కాదు. అందరూ కలిసి కలబోసి తింటున్నది. ఎవరికెంత ఉంది, ఎవరు ఏ కులం.. ఏ వృత్తి.. ఏమీ పట్టదు. ఆ సమయంలో జీవించి ఉన్న వాళ్ళంతా ఒకే జాతి. “వసుధైక కుటుంబం.”

షావుకారు, భార్య అందరూ తృప్తిగా తింటున్నారా లేదా అని పేరు పేరునా పరికిస్తున్నారు. ఊరంతా షావుకారు కొట్లోనే కొనాలి ఏ సరుకైనా.. అందుకే అందరి పేర్లూ, వారి వారి కష్ట సుఖాలు కూడా తెలుసు. ఇద్దరి మొహాల్లోను ఒక తృప్తి, ఒక వింత వెలుగు. అదే, ఇవ్వటంలో ఉండే ఆనందం.. దానాన్ని స్వీకరించే వాళ్ళు దేవుడితో సమానం.. “అభ్యాగతి స్వయం విష్ణు..” అని అందుకే అంటారు. ఇవ్వడానికి మనసున్నా, తీసుకునే వాళ్ళు లేకపోతే దానం చేసే అవకాశమే ఉండదు కదా!

ఇంకెవరైనా మిగిలారా అని చూస్తుంటే, వెంకటలక్ష్మి గుర్తుకొచ్చింది షావుకారుకి.

“అయ్యో.. వెంకటలచ్మేదర్రా? ఎక్కడన్నా పడిపోయిందేమో చూడండి. చిన్న సాంబడు కూడా.. “ గొడవ గొడవ పెట్టేస్తుంటే వెంకటలక్ష్మి వాళ్ళ పక్కింటామె పరుగెత్తింది.. ఇందాగే గుట్ట దగ్గర చూశానంటూ.

బలవంతంగా లేపి నడిపించింది వెంకటలక్ష్మిని, సాంబడిని. వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూనే నడుస్తోంది వెంకటలక్ష్మి.

షావుకారు, భార్య ఎదురొచ్చి ఆప్యాయంగా లోపలికి తీసుకెళ్ళారు.

“దామ్మా! కాస్త అన్నం తిందాం. మిగిలిన వాళ్ళెవరైనా ఉంటే మనందరం కలిసి తిందాం. వడ్డించండి బాబూ కాస్త.” షావుకారు అడగ్గానే చకచకా విస్తళ్ళు వేసేశారు.

వెంకటలక్ష్మి దూరంగా గోడకానుకుని కూర్చుంది.

KOUMUDI

"అట్టయితే మేం కూడ తినం." షావుకారు, భార్య లేవబోయారు. వెంకటలక్ష్మి అందరి వంకా చూసి, వచ్చి కూర్చుంది.. గబగబా తినేసి, రేవు దగ్గరకెళ్ళి పోవాలి. నారాయడొచ్చే సమయానికి అక్కడుండాలి. అదే ఆమె ధ్యేయం.

నూలపాలెంలో నెమ్మదిగా జనం కోలుకుంటున్నారు. విరిగి పడిపోయిన చెట్లకొమ్మలూ, తాటాకులు తెచ్చి, రాటలు పాతి గుడిసెలు వేసుకుంటున్నారు. ఉప్పెన వచ్చి వారం అయింది. మోటారు బోట్లు నడిపించడానికి రిపేర్లు చేస్తున్నారు. లంగరు వెయ్యడానికి ఒడ్డు దగ్గర వీలుగా చెయ్యడం.. నావల్ని చిల్లుల్లేకుండా చెక్కలవీ దిట్టంగా కొట్టడం.. అంతా యుద్ధ ప్రాతిపదికన నడుస్తోంది.

ఆ ప్రాంతాల్లో ఉన్న పల్లెల్లో నూలపాలెంలోనే తక్కువ విధ్వంసం జరిగింది.

వెంకటలక్ష్మి వాళ్ళ పక్కింటామె, సరస్వతి తమ గుడిసే వేసుకుంటున్నప్పుడే వెంకటలక్ష్మి ఇల్లు కూడా సరి చేసేట్లు చూసింది. పడమటింటి రేకుల్ని బయటికి లాగి, గోడలు గట్టిగా ఉన్న తూరుపింటి మీద వేశారు. పడమటిల్లు, గోడలన్నీ నానిపోయి కూలి పోయింది. హెలికాప్టర్ల మీద సరుకులు తెచ్చి దింపుతున్నారు. మొదట్లో అన్నం పొట్లాలు, చిన్న పిల్లలకి పాలు అట్లాగే పడేశారు.

సరస్వతి ఒకరోజు పరుగు పరుగున వచ్చింది.

"వెంకటలక్ష్మీ! పడవలు నడిపిస్తన్నారంట. టౌను కెళ్దామా? మీ వాళ్ళందరి గురించీ తెలుస్తాదేమో. ముందుగా నీ వంటి వాళ్లనే తీసుకెళ్తన్నారంట. అంటే.. కుటుంబంలో వాళ్ళ గురించి సంగతులేయీ తెలీని వాళ్ళని. అసలేమయిందో కనుక్కుందాం. అందరూ బానే ఉండుంటార్లే. లే పోతే ఈ పాటికే తెలిసేది కద.."

వెంకటలక్ష్మి గబగబా మొహం కడుక్కుని తయారయి పోయింది.

ఊళ్ళో అందరి బలవంతంతో మనుషుల్లో పడింది వెంకటలక్ష్మి. స్తబ్దుగా ఉండకుండా హెలికాప్టర్లోంచి పడేసిన పేపర్లని చదవడం, మైకుల్లోంచి ప్రభుత్వ ఉద్యోగులు చెప్తున్న వార్తలువినడం, వంట చేసి, సాంబడికి పెట్టి తను తినడం.. మామూలుగా ప్రవర్తిస్తోంది.

ముఖ్యంగా సరస్వతి, బాగా ఆదుకుంటోంది. తను చెయ్యవలసిన పనికి ఆ పైవాడు తన తరఫున కొందరిని నియమిస్తాడు కాబోలు. సరస్వతి వాళ్ళాయన కొన్నేళ్ళ క్రితమే సముద్రంలో చేపల వేటకెళ్ళి మునిగిపోయాడు. తుఫాను వస్తోంది వెళ్ళొద్దని వార్నింగులిచ్చినా వినకుండా. ఇద్దరు కొడుకుల్నీ తనే పెద్ద చేసింది, ఉన్న రెండెకరాల మాగాణి దున్ను కుంటూ. ఇప్పుడిద్దరూ చేతికందొచ్చారు. ఒకడు టౌన్లో ఆటో నడుపుతాడు. ఉప్పెనొచ్చిన రోజు అమ్మని చూడ్డానికొచ్చాడు.. అందుకే, ఇద్దరు కొడుకుల్నీ దగ్గర పెట్టుకుని.. సరస్వతి బెంగ లేకుండా నలుగురికీ సాయం చేస్తోంది.

వెంకటలక్ష్మీ, సరస్వతీ, సాంబడూ, సరస్వతి రెండో కొడుకూ రేవు దగ్గరికి వెళ్ళారు. దూరంగా టౌను కెళ్తోన్న బోటు కనిపిస్తోంది. అప్పటికే అక్కడి కొచ్చిన ప్రభుత్వ ఉద్యోగులు కొందరు బల్లలేసుకుని కూర్చున్నారు. ఆర్ఎస్సెస్ వాళ్ళు కూడా ఒడ్డునే ఉండి వచ్చిన వాళ్ల సందేహాలు తీరుస్తూ, సూచనలిస్తున్నారు.

క్యూలో వెంకటలక్ష్మి వంతు రాగానే వివరాలు రాసుకున్నారు.

"మమ్మల్ని టౌన్ కి తీసుకెళ్ళరా? నా దగర డబ్బులేం లేవు.." తన తండ్రీ, అన్నదమ్ముల వివరాలు, నారాయుడు, మల్లయ్య, జాలమ్మల పేర్లు ఇచ్చాక అడిగింది వెంకటలక్ష్మి.

"తప్పకుండా తీసుకెళ్తామమ్మా! ఉప్పెనలో నష్టపోయిన వారికి ముందుగా కొంత డబ్బు ఇస్తోంది ప్రభుత్వం. అది మీకిస్తాము. అక్కడ మీ వాళ్లని వెతకటానికి కూడా వాలంటీర్లు హెల్ప్ చేస్తారు." వివరాలు రాసుకున్న ఒక ఉద్యోగి అన్నాడు.

"మీ పుట్టింటి వాళ్ళుండేది ఎక్కడ?" ఆర్ యెస్సెస్ వాలంటీర్ అడిగాడు, ఒక పెద్ద నోట్ బుక్ తీసి.


KOUMUDI

వెంకటలక్ష్మి చెప్పింది.

నోట్ బుక్ తీసి రాయబోయిన వాలంటీర్, పక్కతని కేసి చూశాడు. అతను తల పంకించాడు. ఇంకొకతను సానుభూతితో చూశాడు వెంకటలక్ష్మిని.

"మీ ఆయన, అత్తమామలు ఎక్కడికెళ్ళారు?"

"ఆసుపత్రికని వెళ్ళారు. ఆ తరువాత ఏమయ్యారో తెలీదు." వణుకుతున్న కంఠంతో చెప్పింది వెంకటలక్ష్మి.

"ఎంతమందున్నారు మొత్తం?"

"ఇక్కడి నుంచెళ్ళిన వాళ్ళు ముగ్గురు. అత్త ,మామ, నా పెనిమిటి. అక్కడ మా ఓళ్ళు ఐదుగురు పెద్దోళ్ళు, ఇద్దరు పిల్లలు." ఈ లెక్కలేంటి? బల్లలు, కుర్చీల్లాగ.. భయం భయంగా చూశారు వెంకటలక్ష్మి బృందం.

"మీరక్కడ కూర్చోండమ్మా! వచ్చే నావలో మిమ్మల్ని పంపిస్తాం, మా మనిషిని తోడిచ్చి. అక్కడ మీరు మీ వాళ్ళని కలవచ్చు." వాలంటీర్ మాటలకి సంతోషంతో విప్పారింది, వెంకటలక్ష్మి మొహం.

'మీ వాళ్ళని కలవచ్చు..' అంటే బ్రతికున్నట్లేగా? శరీరంలోకి ఎక్కడ్లేని శక్తి వచ్చింది. వెంకటలక్ష్మి వెళ్ళి అక్కడున్న కుర్చీలో కూర్చుంది, సాంబడిని ఒళ్ళో కూర్చో పెట్టుకుని. వేదనంతా ఎవరో చేత్తో తీసేసినట్లయిపోయింది.

సరస్వతి ఇంక టౌనుకి వెళ్ళక్కర్లేదులే అనుకుంది. వాలంటీరబ్బాయుంటాడు. అక్కడేమో వాళ్ళ వాళ్ళని కలిసేస్తుంది. ఇంకేం భయం. అస్సలు వెంకటలక్ష్మి వెళ్ళకపోతే వాళ్ళే వచ్చేస్తారు కదా ఇవేళ రేపట్లో! వాళ్ళొచ్చే సరికి ఇక్కడ కాస్త వండి వార్చి ఉంచచ్చు. ఎప్పుడు తినుంటారో ఏమో.

వివరాలు రాసుకున్న వాలంటీర్ ని పిలిచి తన ఆలోచన చెప్పింది.

"నిజమే నమ్మా! వాళ్ళే వచ్చేస్తారు. కానీ.. ఆ అమ్మ వెళ్తే బాగుంటుంది. వాళ్ళొచ్చే టైమ్ కి మీరు తయారు చెయ్యచ్చు వంటలవీ."

వాలంటీర్ మాటలు వింటుంటే ఏదో అనుమానం వేసింది సరస్వతికి లోపల్లోపల. నిజంగానే అందరూ బ్రతికున్నారా? అట్టాంటప్పుడు తను కూడ వెళ్తే వెంకటలక్ష్మి కాస్త ఆసరాగుంటుంది కదా! మళ్ళీ వాలంటీర్ దగ్గరకెళ్ళి అడిగింది.

"మీ ఇష్టమమ్మా! ఆ అమ్మాయికి తోడుగా వెళ్ళాలంటే వెళ్ళండి. మీ అబ్బాయి కూడ ఉంటే ఇంకాస్త నయమే. మా వాళ్ళిద్దరు ముగ్గురుంటారనుకోండి. మీరైతే తెలిసున్న వాళ్ళు కదా!" ఓపిగ్గా సరస్వతికి సమాధానం ఇచ్చాడు. సరస్వతి మారు మాట్లాడకుండా వెళ్ళి వెంకటలక్ష్మి పక్కన కూర్చుంది.

ఏమో! ఇప్పుడద్దరి నుంచొచ్చే బోటు లో మల్లయ్య వాళ్ళుండచ్చేమో.. ఎవరు చెప్పగలరు?

గంట పైగా ఎదురు చూశాక వచ్చింది బోటు. గవర్నమెంట్ వాళ్ళది లాగుంది. కాస్త పెద్దదే. స్టీమరు లాంచి.. అందులో పప్పులు, బియ్యం, చింతపండు లాంటి సరుకులు తీసుకొచ్చారు, ప్రభుత్వ ఉద్యోగులు, మిలట్రీ వాళ్ళు, వాలంటీర్లు.

ఆత్రంగా ఎదురెళ్ళిన వెంకటలక్ష్మి మొహంలో నిరాశ..

సరుకులన్నీ దింపేశాక, పాలెంలో పనిచెయ్యడానికి వచ్చిన వాళ్ళు ఉండిపోయారు, అక్కడ పునరావాస కార్యక్రమాల కోసం. వెంకటలక్ష్మి బృందంతో ఇద్దరు వాలంటీర్లు వెళ్ళారు.

బోట్ లో వెళ్తున్నంత సేపూ వెంకటలక్ష్మి చెయ్యి పట్టుకునే ఉంది సరస్వతి.

సాంబడైతే ఉప్పెన వచ్చినప్పట్నుంచీ బెదిరి పోయి, అమ్మనే ఆనుకుని తిరుగుతున్నాడు. తన అల్లరి, ఆటలు అన్నీ మర్చి పోయాడు.



KOUMUDI

వస పోసినట్లు వాగే వాడు, మాటలే మర్చి పోయినట్లున్నాడు.

"బాబుని ఎవరి దగ్గరైనా వదిలి రావలసిందమ్మా! ప్రయాణం అదీ తట్టుకోలేడేమో." జాలిగా అడిగాడు వాలంటీర్.

"ఎవరూ లేరు బాబూ! చెప్పాంగా మొత్తం అందరూ టౌన్లోనే ఉన్నారని. ఈమె మాత్రం పాలెంలో ఉండి పోయింది. అందరూ వారి వారి కష్టాల్లో ఉన్నారు, ఎవ్వరుంచుకుంటారు.. పైగా ఈయనుండాలి కదా!" సాంబడిని చూపిస్తూ అతని పక్కనే కూర్చున్న సరస్వతి జవాబిచ్చింది.

"చిన్నపిల్లలు తట్టుకునే పరిస్థితి లేదక్కడ." చిన్నగా సరస్వతికి మాత్రమే వినిపించేట్లు గొణిగాడు వాలంటీర్.

అయోమయంగా చూసింది సరస్వతి.

వాలంటీరబ్బాయి గొణిగిన పరిస్థితులేంటో అద్దరి దగ్గర పడుతుండగానే అర్థమయింది అందరికీ. ముక్కులు బద్దలయ్యే వాసన. సరస్వతీ వాళ్ళకి కూడా ముక్కుకి అడ్డంగా కట్టుకోవడానికి మాస్కులిచ్చాడు వాలంటీర్. సాంబడు కూడా ముక్కు చిట్లిస్తూ కట్టించేసుకున్నాడు.. ఎటువంటి ప్రశ్నలూ వెయ్యకుండా.

లంగరేసి, బల్ల దించగానే, వాలంటీర్లు ముందుగా దిగి, చెయ్యందించారు.. సరస్వతికి, వెంకటలక్ష్మికి. సరస్వతి కొడుకు ఒడ్డు ఎక్కుతూనే భళ్ళున వాంతి చేసుకున్నాడు. భరించలేని దుర్గంధం. ప్రతీ అంగుళం డిడిటి పొడి చల్లారు. ఆ వాసన దుర్గంధాన్ని మరింత ఎక్కువ చేసింది, కలగాపులగం అయి.

వెంకటలక్ష్మీ, సరస్వతీ కాస్త తట్టుకున్నారు. సాంబడైతే.. అమ్మని ఎత్తుకోమని, భుజం మీద కళ్ళు మూసుకుని నిద్ర పోయాడు.

"నేనెత్తుకుంటానమ్మా! కొంచెం దూరం నడవాలి. బాబు నెత్తుకుని ఇక్కడ మీరు నడవలేరు." వాలంటీర్ సాంబడిని ఎత్తుకుని ముందు నడిచాడు. అప్పటికి సరస్వతి కొడుకు కొంత తేరుకుని, ఆవిడ చెయ్యి పట్టుకుని నడిపించాడు. వాలంటీర్ పరిస్థితిని ముందుగానే.. కనీసం ఆ అబ్బాయికన్నా చెప్పుంటే తయారుగా ఉండే వాడేమో! ఊహించని దృశ్యం చూడవలసి వచ్చేసరికి తట్టుకోలేక పోయాడు.

వార్తల్లో వినడం వేరు, ప్రత్యక్షంగా చూడడం వేరు.

ఉప్పెన అనంతరం కార్యక్రమాలు చకచకా జరుగుతున్నా.. ఎంత మిలటరీ వాళ్ళ సహాయం, స్వచ్ఛంద సంస్థల సహాయం తీసుకున్నా.. వారం రోజుల్లో ముప్పై శాతం మాత్రం పనులు చెయ్యగలిగారు. ప్రతిఫలాన్నాశించని సేవా సంస్థలు మానవత్వంతో, చేస్తున్న సేవ మరపురానిది.

దారి పొడవునా ఉన్న అడ్డంకులన్నీ తప్పించుకుంటూ, వెంకటలక్ష్మి బృందాన్ని జీపెక్కించారు. జీపు, హైస్కూలు భవనం వైపు కెళ్తుంటే వెంకటలక్ష్మికి అనుమానం వేసింది.

"మా ఇల్లు ఇటు కాదబ్బాయ్!" గట్టిగా అరిచింది, జీపు హోరులో వినిపించదేమో అని.

"మీవాళ్ళిక్కడే ఉన్నారమ్మా! మీ ఇల్లంతా కూలి పోయింది. ఈ ఊళ్ళో చాలా ఇళ్ళు కూలిపోయాయి. అందుకే.. ఇటు తీసుకెళ్తున్నాం."

గుండె దిగజారిపోయినట్లయింది వెంకటలక్ష్మికి.కాళ్ళూ చేతులూ నణుకుతున్నాయి.

స్కూలు భవనం చేరగానే అంత దూరం నుంచే గుర్తు పట్టింది.

"చిన్నన్నా!" జీపు ఆగీ ఆగగానే ఒక్కసారిగా దూకి పరుగెత్తింది.

"వెంకీ! నువ్వున్నావా? నిజంగా నువ్వేనా? సాంబయ్యా?" సాంబడిని జీపులోంచి కిందికి లాగి ఎత్తుకుని ఆబగా తడిమాడు

చిన్నయ్య. వెంకటలక్ష్మిని కూడా దగ్గరికి పిలిచి, నుదుటి మీద జుట్టు సవరించాడు. కళ్ళలోంచి ఆగకుండా కన్నీళ్ళ ధార.

"మనోళ్ళంతా ఏరి? నారాయుడు, అత్త, మామయ్య కూడా ఈ వూరొచ్చారు. ఆళ్ళు కూడా కనిపించట్లేదు. అందరూ ఇక్కడే ఉన్నారా?"

చిన్నయ్య ఏదో చెప్పబోయాడు..

"అత్తా!" పరుగు పరుగున వచ్చాడు రాజా, పెద్దయ్య కొడుకు. వెనుకే చిన్నయ్య భార్య, కృష్ణవేణి నెత్తుకుని.

❦❦❦

వెంకమ్మగా మారిన వెంకటలక్ష్మి ఉన్నట్లుండి లేచి కూర్చుంది. నేర్చుకున్న దర్జీ పని వదిలేసి, నడుం బిగించి, చిన్నన్నతో కలిసి చేపలచెరువులు నిర్వహించి.. అందులో నష్ట పోతే రోజు కూలీ చేసి సంసారాన్ని గడిపిన రోజులు గుర్తుకొచ్చాయి. ఇప్పటికీ టౌను కెళ్ళి చేపల వ్యాపారం చేస్తూ గుత్తేదారు వెంకమ్మగా అందర్నీ ఒక తాటి మీద నిలబెట్ట గలగడం.. ఊర్లో అందరికీ సలహాలు ఇస్తూ తలలో నాల్కలా మెలగడం జ్ఞాపకం చేసుకుంది. అదే వెంకమ్మగా మళ్ళీ లేచి నిలబడాలి. ఆటుపోట్లకి తట్టుకోగలదని నిరూపించాలి.

ఒళ్ళంతా చెమటలు. కుండలోంచి నీళ్ళు తీసుకుని, ఎత్తిన గ్లాసు దించకుండా గడగడా తాగింది. గతం అంతా గడిచిపోయింది. పుట్టినప్పుడే రాసేస్తాడు కదా అందరి రాతలూ ఆ బ్రహ్మ. ఎక్కడ పుట్టిస్తాడో ఎక్కడ నుంచి తీసుకెళ్తాడో! ఉన్నంత వరకూ ఆనందంగా బతకాల్సిందే.

"పోయినోళ్ళందరూ మంచోళ్ళు, ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపి గురుతులు.." కవిగారి పాట గుర్తుకొచ్చింది.. వెంకమ్మకి తన జీవితంలో రెండో సారి.

తన వాళ్ళు చాలామంది ఉప్పెన ఉధృతానికి, అర్ధరాత్రి ఇల్లు కూలి బలై పోయినా, ఉన్న సాంబడిని, చిన్నన్నని, వదిన్ని, కృష్ణవేణిని, రాజాని తీపి గుర్తులుగానే భావించి, జీవితాన్ని ఒక సవాలుగా స్వీకరించింది.

ఇప్పుడు కూడా అదే చెయ్యాలి. చిన్నయ్య, వదిన, పెద్దయ్య కొడుకు రాజా పోతేనేం.. తన ప్రాణంలో ప్రాణమైన సాంబడిని, కృష్ణవేణిని కాపాడుకోవాలి. తనే నీరసించి పోతే, వాళ్ళేమైపోతారు? వాళ్ళకి బ్రతుకు మీద ఆశ కల్పించాలి. దానికి ఒకటే మార్గం వెంకమ్మ కళ్ళ ముందు కనిపిస్తోంది.

ఒక ధ్యేయం కల్పించుకోవాలి. ప్రేమకి ఎల్లలు పెట్టకూడదు. కుటుంబాన్ని దాటి అవతలికి తీసుకెళ్ళాలి. ఇందుకే నేమో.. ఈ విధంగా రాసి పెట్టింది విధి!

మొట్ట మొదటి పని, నాంచారిని, నాగరాజుని ఎక్కడికీ పంప కూడదు. ఎవరొచ్చి అడిగినా, వాళ్ళు తన బంధువుల పిల్లే అని చెప్పాలి. ఉప్పెన తరువాత.. ఏ బంధుత్వం ఉందని.. ముక్కూ మొహం తెలియని ఆ సంఘం వాళ్ళు తమకి అన్నివిధాల సాయ పడ్డారు? ఇళ్ళు కట్టడంలో.. రోడ్లు బాగు చెయ్యడంలో, ఉపాధి కల్పించడంలో అంతా వాళ్ళే తిరిగారు. అదే చెయ్యాలి.. వాళ్లనే ఆదర్శంగా తీసుకోవాలి. విశ్వప్రేమని విశ్వసించాలి.

"అమ్మా!" నిద్రలోకదిలి వెక్కుతోంది నాంచారి. అమాయకమైన దాని మొహం చూస్తే గుండె చెరువై పోయింది వెంకమ్మకి. అమ్మ ఒడిలో వెచ్చగా పడుక్కుని గారాలు పోయే వయసు. అట్లా వదిలెయ్యడమేనా! నాగరాజుని కూడా గాలికొదిలెయ్య కూడదని అప్పుడే ఒక నిశ్చయానికి వచ్చింది వెంకమ్మ. ఇద్దరి మధ్యలో దూరి పడుక్కుంది.. చెరో చెయ్యీ వాళ్ళ మీద వేసి. కృష్ణవేణిని కూడా మనుషుల్లో పడెయ్యచ్చు.. వీళ్ళిద్దర్నీ అప్పచెప్తే. మనసులో ఆలోచన స్థిరపడగానే హాయిగా నిద్ర పట్టింది వెంకమ్మకి.

నావ మీద కూర్చుని చుట్టూ చూసింది వెంకమ్మ. నది మధ్యలోకెళ్ళింది నావ. ఒక పక్క మడ అడవులు. ఇంకొక పక్క కొంచెం దూరంలో తలలూపుతున్న అరటి చెట్లు. చల్లగా, నెమ్మదిగా సాగుతున్న కృష్ణమ్మ! గాలికి నుదుటి మీద పడుతున్న వెంట్రుకల్ని వెనక్కి నెట్టింది. చిరుగాలి స్పర్శకి హాయిగా కళ్ళు ముసుకుని కాసేపుండి పోయింది.

ఎన్నెన్ని అందాలు.. ఎంత హాయి! అందుకే అవని మీదున్న ప్రతీ క్షణమూ ఆనందించి తీరాలి. ఆస్వాదిస్తూ బ్రతకాలి.

గుండెల నిండుగా గాలి పీల్చి వదిలింది వెంకమ్మ. తను తలపెట్టిన పని గురించి ఒక సారి మననం చేసుకుంది. తను చెయ్యగలదా లేదా అని ఆలోచించలేదు. తనేమిటి.. తన చదువేమిటీ! తన పుట్టుకేమిటి, బ్రతుకేమిటి? మెదడులోకి తలపు వచ్చిందంటే దాని కేదో ఫలితం ఉండే ఉంటుంది. అదే నమ్మకం వెంకమ్మని నడిపించింది ఇన్నేళ్ళూ! జీవితం మీద ఒక ఆశ, చుట్టూ ఉన్న మనుషుల మీద ఒక ప్రేమ.. తన, పర అనే భేదం లేకుండా సమస్తాన్నీ ప్రేమతో పరికించడం.. అదే నేర్పింది జీవితం.

తమ బంధువులందరిలో కాస్తో కూస్తో చదువుకున్నది, చదివినది అర్ధం చేసుకోగలది వెంకమ్మ ఒకతే! అదే అక్కర కొచ్చిందిప్పుడు.

పడవ మీద పరిచయస్థులెవరైనా కనిపిస్తారేమో నని వెతికింది. పక్కింటి సరస్వతి కర్ర చేత్తో పట్టుకుని మధ్యలో ఉన్న బెంచి మీద కూర్చుంది. మొహం ముడుతలు పడి పోయినా, పళ్ళు ఊడి పోయినా.. అదే చిరునవ్వు. ఆప్యాయతతో కూడిన చిరునవ్వు. ఎన్ని వరహాలిస్తే దొరుకుతుందీ? తన చుట్టూ ఉన్నవాళ్ళ యోగక్షేమాలు కోరుతూ, వాళ్ళని ప్రేమిస్తూ ఉండే వాళ్ళకే సాధ్యం.. ఎంత వయసొచ్చినా చెక్కు చెదరని ఆ నవ్వు చూస్తేనే మనసుకి హాయి కలుగుతుంది.

నెమ్మదిగా రెండంగలు వేసి సరస్వతి పక్కకి చేరింది.

"వెంకటలక్ష్మీ! టౌనుకి బయల్దేరావా? ఎట్టున్నావే.. కృష్ణవేణికీ, సాంబడికీ పెళ్ళి చేస్తన్నావంటగా? మంచి పని చేస్తన్నావే! పిల్లలకి ఒకళ్ళంటే ఒకళ్ళ కెంత ప్రేమో నీకు తెలవదా! అట్టగే కానియ్యి. అందరికీ భోజనాలవ్వీ అని పెట్టుకోమాకు. ఊరికే దబ్బులు ఖరుసు చెయ్యమాక, అప్పు సొప్పు చేసి. నెనెక్కడికెల్తన్నా నంటన్నావా? అదిగో చిన్నోడు.. ఆసుపత్రిలో చూపిస్తానని తీసుకెళ్తన్నాడు. నాకైతే పెద్ద ఇష్టం లేదనుకో! అయినా ఆడికోసం వస్తన్నా! ఏదైనా అవుసరం పడితే చెప్పు.. సర్దుకుందాం."

అవధుల్లేని సరస్వతమ్మ వాక్ప్రవాహానికి జవాబుగా చిన్నగానవ్వింది వెంకమ్మ.

ఉద్వేగం వస్తే నోరు మూగవోతుంది. మనసు మనసుతో మాట్లాడుకుంటుంది. సరస్వతి చెయ్యి పట్టుకుని నిమురుతూ ఉండిపోయింది వెంకటలక్ష్మి.

"**వెంకటలక్ష్మీ**! నువ్వేనా? ఎంత మారి పోయావు? సాంబయ్య, కృష్ణవేణీ.. అందరూ బాగున్నారా? ఇన్నేళ్ళ తర్వాత గుర్తుకొచ్చానా?" డాక్టర్ సులోచన ఎదురుగా కూర్చున్న వెంకమ్మని చూసి పలుకరించింది ఆప్యాయంగా.

ముందురోజు గంజి పెట్టి సాగదీసి ఆరేసి, మడతల పైన బరువైన దిండు పెట్టిన చీర.. తెలుపు మీద ఆకుపచ్చ చుక్కలున్నది తీరుగా కట్టుకుని, తెల్లని జాకెట్టుతో హుందాగా ఉంది వెంకమ్మ. డాక్టరమ్మని కలవడానికి వచ్చేటప్పుడు, లోపల్లోపల ఎట్లా ఉన్నా పైకి చక్కగా కనిపించాలని తెలుసు వెంకమ్మకి. పరిస్థితులని పట్టి, చుట్టూ ఉన్న వాతావరణాన్ని బట్టి మారిపోగలదు.

ఇన్నేళ్ళ తరువాత కూడా తనని జ్ఞాపకం పెట్టుకున్న డాక్టరమ్మ పెద్ద మనసుకి మనసారా నమస్కరించింది. ఎప్పటి సంగతి? ఉప్పెన రాక ముందు తను కుట్టు నేర్చుకుంటున్నప్పటి పరిచయం. ఇంకా ఆ కాళరాత్రి కళ్ళ ముందు నిలిచినట్లే ఉంది.


KOUMUDI

రెండునెలలు, తననీ సాంబడినీ హాస్టల్లో పెట్టి, నారాయడు కుట్టు నేర్పిస్తున్నప్పుడు.. ఒక నెల గడిచిందేమో! రాత్రి ఉన్నట్లుండి సాంబడు మెలికలు తిరిగి పోవడం మొదలు పెట్టాడు. అంక పొంకాల మీద జ్వరం వచ్చేసింది. వెంటనే విజయ మేడమ్ కి కబురు చేశారు హాస్టల్ వాళ్ళు.. అప్పుడు డాక్టర్ సులోచన గారి ఆసుపత్రికే తీసుకెళ్ళి, రెండు రోజులుంచి నయం చేసి తీసుకొచ్చారు.

సులోచనమ్మ డాక్టరు కప్పుడు ముప్పై ఏళ్ళుంటయ్యేమో! ఎంత శాంతం.. ఏదో క్లబ్ మెంబరంట. వాళ్ళు లేని వాళ్ళకి, అవసరంలో ఆదుకుంటారుట. ఊళ్ళు ఊళ్ళే బాగు చేత్తారని విజయ మేడమ్ చెప్పింది. తమ కుట్టు సెంటర్ కూడా వాళ్ళే మొదలెట్టారని, ఎన్నో గ్రామాల్లో ఉపాధి కల్పించారనీ చెప్పింది. సులోచన డాక్టర్ కి వెంకటలక్ష్మి అంటే ఎందుకో చాలా అభిమానం కలిగింది.చాలా తెలివైనదని గ్రహించింది.

ఎన్నో విషయాలు చెప్పింది. సాంబడి తరువాత మళ్ళీ పిల్లని కనకుండా జాగ్రత్త పడినందుకు మెచ్చుకుంది. 'నీ అంత తెలివి అందరికీ ఉంటే దేశం ఎప్పుడో బాగు పడేది వెంకటలక్ష్మీ' అనేది. కుటుంబాన్ని పోగొట్టుకున్నాక, వెంకటలక్ష్మి తిరిగి నిలబడ్డానికి ఎంతో సాయం చేసింది. ముఖ్యంగా కౌన్సిలింగ్.. వెంకమ్మకి వేదాంత పరమైన ఆలోచనలు కలగడానికి, నిలవడానికి సులోచనమ్మే కారణం. ఇప్పుడు ఆ అమ్మనే సాయం అడగాలని నిశ్చయించుకుంది.

"డాక్టరమ్మా! మీరేం మారలేదు. పదిహేనేళ్ళ కితం ఎట్టున్నారో అట్టనే ఉన్నారు. మళ్ళీ ఆ రోజులు గుర్తుకొస్తన్నయ్యమ్మా. మీ వల్లనే కద మళ్ళీ మనిషి నయ్యా! ఇన్ని రోజులు, మా సమస్యలతో మీకు ఎందుకు తలనొప్పి కలిగించాలని ఊరుకున్నా. పైగా రోజులు ఎట్టాగో అట్టా బాగనే గడిచిపోయాయి. ఇంక ఇప్పుడు మళ్ళీ మీ దగ్గరికి రాక తప్ప లేదు." వెంకమ్మ కొద్దిగా తల దించుకుని అంది.

"నా సంగతి ఎట్లా ఉన్నా, నువ్వు మాత్రం వయసుకు మించి కనిపిస్తున్నావు. మీ పాలెంలో నీటి సమస్య అట్లాగే ఉందా? నీ ఆరోగ్యం బాగుందా? రొయ్యల టాంకులు కట్టి బాగా వ్యాపారం చేస్తున్నారట కదా? పేపర్లో చూస్తుంటాను." సులోచన కళ్ళల్లో అంతులేని ప్రేమ, కరుణ.

"మీరు చెప్పేవారు కదమ్మా! పనికి సరిపోయే ఆహారాన్ని తీసుకోవాలని. పనెక్కువై, తిండి తక్కువైతే ఎట్టుంటాదమ్మా? మా పాలెంలో అందరి పనీ అట్టాగే ఉంది డాక్టరమ్మా! పిల్లలకి కడుపు నిండా పెట్టే సరికే మా పనైపోతాంది. మా వంటోళ్ళు సర్దు కోవటమే."

"అదేంటి వెంకటలక్ష్మీ! అంత కరువొచ్చిందా మీ ఊర్లో.. చుట్టూ నీళ్ళుండగా?" కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా ఆశ్చర్యంగా అడిగింది సులోచన.

"మీరీ మధ్య పేపరు చదవట్లేదామ్మా? నా సంగతి వేరనుకోండి.. ఆడపనీ మగ పనీ చేసుకునే సరికి కీళ్ళన్నీ అరిగి పోయాయి. సంవత్సరం పై నుంచీ మా పాలెంలో అందరి పరిస్థితీ అధ్వాన్నంగా తయారయింది. చేపల చెరువులన్నీ పోయాయి. ఏదో జబ్బుట.. రొయ్యలు, చేపలు అన్నీ ఒక్కసారిగా చచ్చి పోయాయి. ఇంక ఆ చెరువులు పనికి రావన్నారు. ఏవో వ్యాపారాలు చేసే వాళ్ళు తప్ప, మిగిలిన వాళ్ళంతా చేపలు పట్టటం మీదనే ఆధారం. నేలంతా ఉప్పు దిబ్బైపోయింది. ఏదీ పండదు, ఎడారి మొక్కలు తప్ప."

సులోచన, వెంకటలక్ష్మి చెప్తున్నది వింటూనే బెల్లు కొట్టింది.

"ఇంకా ఎంత మందున్నారు?" బైట నిలుచున్న ఆయా లోపలికి రాగానే అడిగింది.

"నలుగురమ్మా!"

"వెంకటలక్ష్మీ మనం తీరిగ్గా మాట్లాడుకోవాలి. పేషంట్లందరినీ పంపేసి కూర్చుందాం. ఆయమ్మా! ఈ అమ్మని ఇంటికి తీసుకెళ్ళి, వంటామెని తింటానికేమైనా పెట్టమను. ఎప్పుడు తిందో ఏమో!"

"నేను ఈ మధ్యన చాలా బిజీగా ఉండి పేపర్ ఫాలో అవటం లేదు. పేషంట్స్ ఎక్కువైపోయారు. అందుకే వేరే కార్యక్రమాలు..

రోటరీ క్లబ్ వంటి చోట్లకి కూడా వెళ్ళట్లేదు. ఆశతో నా దగ్గరికి వచ్చే రోగులని చూడడం నా మొదటి బాధ్యత అనుకున్నాను. చెప్పు వెంకటలక్ష్మీ! ఏమయింది? అన్నట్లు ఏమైనా తిన్నావా?" డాక్టర్ సులోచన ఇంట్లోకి వస్తూనే ఫాన్ వేసుకుని, కాళ్ళు టీపాయ్ మీద పెట్టి సోఫాలో వెనక్కి వాలి కూర్చుని అడిగింది.

"అమ్మా! మీరు ముందు అన్నం తినండి. మనం తర్వాత మాట్లాడుకుందాం. నాకు వేడి వేడి ఉప్మా చేసి పెట్టింది వంటమ్మాయి." వెంకటలక్ష్మి, టీపాయ్ దగ్గర నేల మీద కుర్చుని, డాక్టరమ్మ కాళ్ళు వత్తుతూ అంది.

"అయ్యో.. అదేంటి వెంకటలక్ష్మీ తప్పు. నువ్వు ఆ పని చెయ్యద్దు."

"డాక్టరమ్మా! మీరు నాకంటే పెద్దవారు. పొద్దుట్నుంచీ ఎట్టా తిరుగుతారో, కాళ్ళ మీద ఎంత సేపు నిలబడ్తారో నాకు తెలుసు. నన్ను వత్తనియ్యండమ్మా! ఆ దుర్గమ్మతల్లి కాళ్ళు పట్టినట్టనిపిస్తాది నాకు."

వెంకటలక్ష్మి కాళ్ళు నెమ్మదిగా వత్తుతుంటే.. అట్లా నిద్రలోకి జారుకుంది సులోచన. పావుగంట అయ్యాక ఉలిక్కిపడి లేచింది. అప్పటికి రెండయింది టైము.

డైనింగ్ టేబుల్ మీద కూర్చుని, గ్లాసు లో నీళ్ళు వంపుకుంది. వంటమ్మాయి, అన్నీ బల్ల మీద సర్దేసి వెళ్ళి పోయినట్లుంది.. ఎవరూ లేరు.

"అమ్మా! ఇంట్లో ఎవరూ లేరా?" వెంకమ్మ చేతులు కడుక్కొచ్చి, వడ్డిస్తూ అడిగింది.

"పిల్లలు పై చదువులకి అమెరికా వెళ్ళారు. డాక్టర్ గారు కాన్ఫరెన్స్ కి డిల్లీ వెళ్ళారు. ఎల్లుండి కానీ రారు." సులోచన రొట్టెముక్క పప్పులో నంచుకుని తింటూ జవాబిచ్చింది.

వెంకటలక్ష్మికి డాక్టరమ్మ భోజనం చూస్తే ఆశ్చర్యం వేసింది. రెండు పల్చటి రొట్టెలు, ఆకుకూర పప్పు, వంకాయ చిక్కుడు కాయ కూర, కారట్ పచ్చడి ముక్కలు., అంతే. పెరుగు ఒక కప్పులో పెట్టుకుని చెంచాతో తినేసింది. తాము అంతకంటే ఎక్కువే తింటారు. మరి సరిపోనట్లు అనిపిస్తుంది. ఎందుకో..

"మీరు ఎక్కువ బరువులు అవీ ఎత్తడం, శ్రమ పడ్డం అవీ ఉంటాయి. అందుకే సరిపోదు. మేము ఎన్ని గంటలు పని చేసినా శారీరిక శ్రమ అంత ఉండదు. అందుకే తక్కువ తినాలి." వెంకమ్మ మనసులో మాట కనిపెట్టినట్లు చెప్పింది డాక్టరమ్మ.

"చేపలు పట్టడం, అవి తీసుకెళ్ళి టౌన్లో అమ్మటం.. బాగానే నడుస్తోందమ్మా ఈ మధ్యన వరకూ. సాంబడిని టౌనుకి పంపి ఇంటర్ చదివించాను. కృష్ణవేణి మాత్రం టెన్త్ తో ఆపేసింది. నావలో వెళ్తున్నపుడు, రోడ్ల మీదా అబ్బాయిల ఆగడాలు ఎక్కువై పోయాయని. అదీ కిందటేడే.. మా అన్న కొడుకు రాజా, చేపలు పట్టడంలో పెద్ద మొనగాడయ్యాడు. రోజుకి రెండు మూడొందలు సంపాయించే వోడు. మా అన్న, వలలు కొని అమ్మే వ్యాపారం చేసేవోడు. బాగా గడిచి పోయేది. మంచి నీళ్ళ పరిస్థితి మాత్రం అంతే.. కిలో మీటరు పైగా నడిచి తెచ్చు కోవలసిందే! నేను కూడా చేపలు పట్టే సంపాయిస్తాను." ఉపోద్ఘాతంగా మొదలెట్టింది వెంకమ్మ.

సులోచన, సోఫాలో అడ్డంగా పడుక్కుంది. పక్కనే కింద కూర్చుంది వెంకమ్మ.

"మరి ఇప్పుడెందుకు సంపాదించం లేదు, మీ అన్నా, అన్న కొడుకు?" ఏదో గుర్తుకొచ్చి ఉన్నట్లుండి లేచి కూర్చుంది సులోచన.

"అవునమ్మా! సంపాదించే వోరు.."

"మొన్నా మధ్యన పడవ మునిగి పోయింది.. మీ ఊరేనా? టి.వి లో చాలా రోజులు చూపించారని డాక్టర్ గారు చెప్పారు.. అయ్యో! ఎంత పని జరిగింది.. ఎవరైనా అది దారుణమే. కానీ మనకి తెలిసిన వాళ్ళనే సరికి షాక్ ఎక్కువగా ఉంటుంది. నిజమేనా.. మీ వాళ్ళున్నారా

అందులో?" అబద్ధమని వెంకటలక్ష్మి చెప్తే బాగుండుననుకుంటూ అడిగింది.

"మా అన్న, వదిన, అన్న కొడుకు ఉన్నారమ్మా అందులో. ముగ్గురూ కనిపించకుండా పోయారు. కృష్ణవేణి మాత్రం బతికి పోయింది, అందులో వెళ్ల లేదు కనుక. ఇప్పుడు అందుకనే మీ దగ్గరికి వచ్చానమ్మా! ఏదైనా సలహా ఇస్తారేమో అని. కృష్ణవేణి మనుషుల్లో పడ్డానికి రెణ్ణెలలు పట్టింది. నేను మాత్రం అప్పుడు మీరు చెప్పిన మాటలు గుర్తు పెట్టుకుని, రోజూ బోధిస్తూ ఉండే దాన్ని. మీరు ఇచ్చిన భగవద్గీత రోజూ చదువుతూ ఉంటాను ఇప్పటికీ. ఊర్లో స్కూలు లైబ్రరీకి వచ్చిన వార్తా పత్రికలు కూడా చదువుతుంటాను. అట్టాగే ఎన్ని ఇబ్బందులొచ్చినా సర్దుకు పోవడం నేర్చుకున్నాను." మంద్రం గా వెంకటలక్ష్మి చెప్తుంటే కళ్ళలో నీళ్ళు కారి పోతున్నాయి సులోచనకి.

"అమ్మా! మీరు ఎన్నో చూస్తుంటారు కద.. దీనికి ఇట్టా కదిలి పోతే ఎట్టమ్మా?"

"అది వేరు వెంకటలక్ష్మీ! అంతమంది ఒకే కుటుంబం వాళ్ళు, అదీ రెండు సార్లు జరిగితే తట్టుకున్నావంటే.. నిజంగా నువ్వు మునుల సంతతికి చెందిన దానివయ్యుంటావు." మెచ్చుకున్నట్లు చూసింది సులోచన.

"అంత పెద్దోళ్ళతో పోలికేంటి డాక్టరమ్మా! నేను చాలా సామాన్యురాలిని. కన్నకొడుకుని, మేనకోడల్నీ ఎట్టా కాపాడు కోవాలా అని కొట్టుకు పోతున్న దాన్ని. ఆ అగాధం దాట్టానికి సహాయం చేస్తారేమో అడుగు దామని వచ్చిందాన్ని.. నన్ను అంత ఎత్తెయ్యకండమ్మా! మీకు దణ్ణం పెడతాను." వెంకటలక్ష్మి సోఫా చెక్కకి తల ఆన్చి కళ్ళు ముసుకుంది. కంట్లోంచి రెండు చుక్కలు రాలాయి.

నిజమే! ఈ లంకల్లో ఉన్న పల్లె ప్రజల జీవితాలు దినదిన గండాలే. బ్రతికున్నవాళ్ళ ఊపిరి నిలుపుకోవడానికే ఎక్కడి లేని శక్తీ చాలదు. ఇంక పోయిన వాళ్ళ గురించి ఏం బాధ పడతారు? పడ్డానికి సమయం ఎక్కడుందీ! పోనీ అక్కడి నుంచి వేరే ఊరికి వలస వెళ్తే బాగానే ఉంటుందేమో.. కానీ నీళ్ళ లోంచి బైట పడ్డ చేపల్లా కొట్టుకుంటారు. అయినా ఇళ్ళు, వాకిళ్ళు.. కొద్దో గొప్పో భూములు వదిలి ఎక్కడికెళ్ళగలరు? ఏ విధంగా బ్రతగ్గలరు?

భూమి దున్నుకోడం, చేపలు పట్టడం తప్ప ఇంకే విద్య రాని వాళ్ళు అందరూ!

"మరి ఇప్పుడేం చేద్దామని వెంకటలక్ష్మీ?"

"మా పిల్లల్నే ఎక్కడికైనా పంపేద్దాం అని చూస్తా ఉంటే.. పక్కింటి పిల్లలమ్మా.. చంటి పిల్లలు. వాళ్ళు, పడవ మునిగినప్పుడు ఎవరో ఒడ్డుకు చేరిస్తే వచ్చి పడ్డారు.వాళ్ళమ్మా నాన్నా.. కొట్టుకు పోయారు. ఇప్పుడు వాళ్ళని మా కృష్ణవేణి వదలటానికి ఒప్పుకోవట్లేదు. సాంబడికీ, కృష్ణవేణికీ పెళ్ళి చేసి, ఆ పిల్లల్ని నా దగ్గర పెట్టుకుందామనుకుంటన్నా. ఇద్దరు పిల్లల్ని పెంచడం చాలా కష్టమైన పనే.. కానీ, వాళ్ళని చూసే కృష్ణవేణి తేరుకుంది.. మనుషుల్లో త్వరగా పడింది. మీ సలహా కావాలమ్మా!"

"అంటే నేనేం చెయ్యాలని?" ఆలోచిస్తూ అంది సులోచన.

"సాంబయ్య ఇంటర్ పాసయాడు. వాడిని ఇక్కడే ఏదైనా పనిలో పెట్టి, కృష్ణవేణికి మీ దగ్గర.. హాస్పిటల్ లో ఆయాగానో ఏదో ఇప్పిస్తారేమోనని అడగడానికొచ్చానమ్మా! మీరు ఏదైనా అవసరం పడితే కలవమని అప్పుడన్నారు కదాని.." నట్టుతూ అంది వెంకమ్మ.

ఎవరినైనా సహాయం అడగడం ఎంత కష్టమో! అందులో స్వయంగా తన కాళ్ళ మీద నిలబడి, సంసారం లాక్కొచ్చిన వెంకమ్మ లాంటి వాళ్ళకి మరీ బాధగా ఉంటుంది. కానీ.. పిల్లల క్షేమం కోసం తప్ప లేదు.

"మరి ఆ చిన్న పిల్లల్నేం చేస్తావు? వాళ్ళని చూసుకోగలవా?"

"కష్టమే అనుకోండమ్మా! కానీ తప్పదు. అక్కడే స్కూల్లో చేర్పిస్తాను."

"సరే. చూద్దాం. నిన్ను కాంటాక్ట్ చెయ్యడానికెట్లా?"



KOUMUDI

"మా షావుకారు గారికి ఫోన్ ఉందమ్మా! ఇదిగో నంబర్. వాళ్ళు నాకు కబురంద జేస్తారు. నేను వెంటనే బయల్దేరి వస్తాను." వెంకమ్మ షావుకారు పేరు, ఫోన్ నంబరు ఉన్న కాగితం ఇచ్చింది. పైన వెంకటలక్ష్మి, నూలపాలెం అని కూడా రాసింది.

సులోచనకి ముచ్చటేసింది. ఇంత తెలివి తేటలున్న మనిషి, ఏ టౌన్ లోనో సిటీ లోనో ఉంటే ఎట్లా ఉండేదో!

"అయితే.. సాంబడివి, కృష్ణవేణివి వివరాలు కూడా రాసియ్యి. ఇంగ్లీష్ లో బయోడాటా అంటారు.. అదీ."

"సరిగ్గా ఉందో లేదో కానీ అది కూడాతెచ్చేనమ్మా! సాంబడిని, మా స్కూలు మాష్టరు దగ్గరికి తీసుకెళ్ళి రాయించుకొచ్చానమ్మా! ఇవిగో ఇద్దరి కాగితాలు. ఈ టౌన్ లోనే ఏదైనా ఉద్యోగం దొరికితే, పెళ్ళి చేసేసి పంపిద్దామనుకుంటున్నా డాక్టరమ్మా! అప్పుడు నా బాధ్యత తీరినట్లుంటుంది."

వెంకమ్మ లేచి నిలబడింది. మరీ ఎక్కువ సేపు డాక్టరమ్మని ఇబ్బంది పెట్ట కూడదు కదా!

"పెళ్ళి సంగతి చూద్దాం. ముందు పని దొరకనీ. అందులో అన్నం పప్పు ఉన్నట్లున్నాయి. తినెళ్ళు. దారిఖర్చులకి ఇవిగో.." సులోచన బాగ్ లోంచి డబ్బు తీసి ఇవ్వబోయింది.

"అయ్యయ్యో! డబ్బులొద్దు తల్లీ! భోజనం అట్టాగే చేసి వెళ్తాను." వెంకమ్మకి సులోచన వంటి వాళ్ళతో మాట్లాడుతుంటే భాష యాస లేకుండా వస్తుంది. కుట్టు ట్రైనింగ్ అయిన రెండునెలల్లోనూ చాలా నేర్చుకుంది. పెద్ద వాళ్ళతో అణకువగా మాట్లాడ్డం, వాళ్ళ మనసు గ్రహించి మసలుకోవడం.

✱✱✱

వెంకమ తేలిక పడ్డ మనసుతో పాలెం బయలెదేరింది. డాక్టరమ్మ తప్పకుండా సాయం చేస్తుందన్న నమ్మకం కలిగింది.

"ఏందమ్మా నువ్వనేది. నిన్నొక్కదాన్నీ ఇక్కడొదిలేసి, మేం టౌనుకెళ్ళాలా? మతుండే మాట్టాడతన్నావా? పైగా నేనూ, కిష్టవేణీ.. ఊరుకోమ్మా. కలో గంజో కలిసే తాగుదాం. రోజులెప్పుడూ ఇట్టనే ఉండి పోతయ్యా? మళ్ళీ వరి సాగు చేసే రోజులొస్తయ్యేమో!" సాంబడికీ, వెంకమ్మకీ అరగంట నుంచీ వివాదం జరుగుతోంది.

అంతకు ముందే సులోచన దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. సాంబడినీ, కృష్ణవేణినీ తీసుకుని టౌనుకి రమ్మని. దానిమీద గొడవ చేస్తున్నాడు సాంబడు. కృష్ణవేణి, పిల్లల్ని దగ్గరగా కూర్చో పెట్టుకుని, వాళ్ళ తలలు దువ్వుతూ వింటోంది.

"నువ్వే కదా.. నీ వివరాలన్నీ ఇచ్చావు. మరి ఇప్పుడిట్టా అంటావేందిరా సాంబా! నేను ఒక్కదాన్నీ ఎందుకయింది? ఈ ఊర్లో నాకు తెలీని వాళ్ళున్నారా? సరస్వతి ఆంటీ వాళ్ళు పక్కనే ఉంటారు, పిలుస్తే పలికేట్లు. ఇంకేం భయం చెప్పు."

"అప్పుడేదో నువ్వడిగావు కదా కాదంటం ఎందుకులే అని ఇచ్చా. మరి పిల్లల్నేం చేస్తావు? నువ్వొక్కదానివీ చూసుకోగలవా? అయ్యన్నీ కుదిరే పన్లు గావులే. ఊరుకో.. నే చేపలు పట్టటానికెల్తన్నా. ఇంటి సంగతి చూసుకో!" సాంబడు, చెప్పులేసుకుని బయటికెళ్ళబోయాడు.

"ఆగరా సాంబా! పిల్లలు.. మీ భవిష్యత్తుకి అడ్డం రాకూడదురా. మీరు చక్కగా ఉంటే ఆళ్ళు కూడా పైకొస్తారు." ఆ మాటలకి కృష్ణవేణి చివ్వున తలెత్తి చూసింది.

"అత్త చెప్పేది నిజమే సాంబా! మనం కొత్త బ్రతుకు తెరువు చూసుకోవటమే నయం. ఎంతో కొంత సంపాదించుకుని, ఇల్లు అదీ చూసుకున్నాక అత్తని, పిల్లల్ని కూడా తీసుకెళ్ళి పోదాం."

ఇంక సాంబడు ఏం మాట్లాడ లేక పోయాడు.

"పిల్లల్ని కూడ తీసుకెళ్దాం. డాక్టరమ్మ ఆళ్ళని కూడ చూస్తాది."

"అది కాదేమ్మా! కొత్త చోటు, కొత్త మనుషులు.. ఎట్టా ఉంటాదో! ఆ పన్లు మనం చెయ్యగలవో లేదో. ఏం కనుక్కోకుండా మూటా ముల్లే సర్దేసుకుని ఎల్లాలంటే.. భయంగా ఉండదా?"

"ఇదంటే మన సొంతూరు. అంగుళం అంగుళం మనకి తెలిసిందే. బానే ఉంది. కానీ బతికుండాలిగా. అస్సలు ముందు ఎట్టుందో చూడకుండా సవాలక్ష అనుమానాలూ, నువ్వూ! సంగతి ఏందో చూడాలి కదా! నచ్చక పోతే అట్టనే వచ్చేయచ్చు. ఇయ్యాల మనం యెల్తన్నామంతే!" వెంకమ్మ ఆదేశించినట్లు చెప్పింది.

కృష్ణవేణి గబగబా లేచి, పిల్లలకి స్నానాలు చేయించి తయారు చేసింది.

"అక్కా! మనం ఎక్కడికి కెల్తన్నాం? అక్కడ అమ్మా వాల్లుంటరా?" నాగరాజు ఉత్సాహంగా అడిగాడు. గళ్ళ నిక్కరు, నీలం బుష్షర్టు.. వాళ్ళింటికెళ్ళి, పెట్టి లోంచి తీసి వేసింది కృష్ణవేణి. కళ్ళు పెద్దవి చేసి, సంభ్రమంగా అడుగుతుంటే ముద్దొచ్చేశాడు.

"లేదురా కన్నయ్యా! చెప్పా కదా.. చాలా రోజులయ్యాక, మనవే వాళ్ళ దగ్గరకెల్తామని. అంతలో మనం బాగా చదువుకుని, పెద్దోళ్ళయి, పెద్ద ఉద్యోగం చెయ్యాల. అందుకన్నమాట మనం యెల్లేది." బుగ్గమీద ముద్దెట్టి అంది.

వాడి అమాయకపు మొహంలో నవ్వు విరిసింది. కొద్దిగా సిగ్గు పడుతూ చూశాడు.. ఎఱబడిన బుగ్గలతో.

"నేను కూదా.." నాంచారి కృష్ణవేణి కొంగు పట్టుకుంది. రెండు నెలల్లో చాలా మాటలొచ్చేశాయి దానికి.

"అట్టగే పిల్లా నువ్వు కూడా! ఒక్క నిముషం కూర్చోదేం.. నేను కూడా గబగబా తయ్యారయ్యి వచ్చేత్తా."

నావ ఎక్కేటప్పుడు.. ముదుకీ వెనక్కీ వెళ్తూ కొంచెం భయపడ్డాడు నాగరాజు. సాంబడు ఎత్తుకుని తీసుకెళ్ళాడు. కృష్ణవేణి, నాంచారిని ఎత్తుకుంది.

పడవ ఎక్కాక, భయం పోయి కళ్ళు తెరిచి నీళ్ళలోకి దీక్షగా చూస్తున్నాడు నాగరాజు.

"ఏందిరా అట్ట చూస్తన్నా?" వెంకటలక్ష్మి అడిగింది.

"అమ్మ, నాయన కనిపిస్తారేమో అని చూస్తన్నా అత్తా!"

---

ఆ రోజు ఆదివారం. డాక్టర్ సులోచనకి డ్యూటీ లేదు. ఎమర్జెన్సీకి తప్ప పిలవద్దని జూనియర్ డాక్టర్లకి చెప్పేసింది. వరండాలో తీరిగ్గా పేము కుర్చీలో కూర్చుని నవల చదువు కుంటోంది. స్థంభానికి అలుకున్న సన్నజాజి పరిమళం వరండా మొత్తం ఆక్రమించింది.

వెళ్తూ వెళ్తూ పళ్ళు కొనుక్కెళ్ళారు వెంకమ్మ బృందం.

"రండి రండి వెంకటలక్ష్మీ! ఇవన్నీ ఎందుకు చెప్పు. మరీ చాదస్తం కాకపోతే. అందరూ పైన కుర్చోండి. మొహమాట పడద్దు."

కృష్ణవేణీ, సాంబయ్య డాక్టర్ గారి కాళ్ళకి నమస్కరించి కూర్చున్నారు. వాళ్ళని చూసి పిల్లలు కూడా.. సులోచనకి నవ్వొచ్చింది వాళ్ళని చూస్తుంటే. వెంకమ్మ మాత్రం ససేమిరా అంటూ కిందే కూర్చుంది, గోడకానుకుని.

"ఇటు రండి బాబూ! నీ పేరేంటి?" తడుముకోకుండా చెప్పాడు నాగరాజు.. పెద్ద పెద్ద కళ్ళతో చుట్టూ చూస్తూ. వాడు పుట్టాక, ఇదే మొదటి సారి అటువంటి ఇల్లు చూడటం.

"నా పేరు నాతారి.." నాంచారి కొంచెం దూరంగా నిల్చుని చెప్పింది.

"అట్లానా! మంచి పేర్లు. మరి స్కూలు కెళ్తారా?" కాసేపు వాళ్ళతో చిన్నపిల్లై మాట్లాడి, పని కుఱ్ఱాడిని పిలిచి, తోటలోకి తీసుకెళ్ళి ఆడించమంది.



KOUMUDI

కృష్ణవేణి గాభరాగా చూసింది.

"భయం లేదమ్మా. తోటలో పిల్లలు ఆడుకోడానికి సామగ్రి అంతా ఉంది. పేషంట్స్ తో వస్తుంటారు కదా.. అన్ని ఏర్పాట్లు చేశాం. ఆ అబ్బాయిక్కూడా అలవాటే, పిల్లల్ని చూసుకోడం."

కృష్ణవేణి ఆదుర్దాని ముచ్చటగా గమనించింది సులోచన.

వంటమ్మాయి వచ్చి అందరికీ టీ ఇచ్చింది. వేడి వేడి టీ తాగుతూనే అందరికీ ఉత్సాహం వచ్చింది.

"ఇప్పుడు చెప్పండి. ఏం చెయ్యదలుచుకున్నారో."

సాంబడు డాక్టరమ్మని ఏ భావం లేకుండా చూశాడు. అనేక మంది మనస్తత్వాలు సంవత్సరాల తరబడి పరిశీలించిన సులోచనకి అతడి పరిస్థితి అర్ధమై పోయింది. అమ్మ అన్నీ చెప్పింది కదా.. మళ్ళీ నన్నడగటవెందుకుటా..

"నిజమే! మీ అమ్మ అన్నీ చెప్పింది. కానీ నీ నోటంట తెలుసు కుందామని. నువ్వు అమ్మ కంటే ఎక్కువ చదువుకున్నావు. జీవితం మీద ఒక స్పష్టత వచ్చుండాలి. అదే, ఏమిటో అని."

గతుక్కుమన్నాడు సాంబడు. పెద్దోరితో జాగ్రత్తగా ఉండాలి.

"అదే డాక్టర్ గారూ! అమ్మ కొత్త జీవితం ఆరంభించ మంటా ఉంది. నాకేమో.. ఎంత వరకూ నిలబడ గలమా అని డౌటేస్తాంది. కష్ట పడ్డానికేం భయం లేదనుకోండి. అందరూ ఒక గూటి దగ్గరుంటే అదో నిశ్చింత."

సులోచనకి అర్ధమయింది. ఇతగాడికి వెంకటలక్ష్మి తెలివి తేటలొచ్చాయి. కానీ.. కొత్త ప్రయోగాలు చేసే ధైర్యం లేదు. ప్రోత్సాహం ఇస్తే పైకొస్తాడు. కుఱాడు కూడా చక్కగా ఉన్నాడు. మంచి కళైన మొహం. ఇన్ని ఎదురు దెబ్బలు తిన్నా మొహంలో ప్రసన్నత పోలేదు. నవ్వుతూ ఉన్నాడు. కొద్దిగా ముడుచుకున్న కను బొమ్మల్ని చూసి అనుకోవాలి.. జీవితం అంత తిన్నగా నడవట్లేదని.

సాంబడు వేసుకున్న తెల్లని బట్టలు అతనికొక వెలుగు నిచ్చాయి.

"ఏదైనా ప్రయత్నం చేస్తేనే కద ఫలితం తెలిసేది. పక్షి రెక్కలొచ్చాక కష్టపడి ఎగరటం నేర్చుకుంటేనే ఆకాశం హద్దులెక్కడా అని చూడ గలుగుతుంది. తన ఆహారాన్ని తను సంపాదించుకోగలుగుతుంది. అందుకే తల్లి పక్షి సమయం వచ్చి నప్పుడు పిల్లల్ని గూట్లోంచి కిందికి తోసేస్తుంది. అవి రెక్కలు అల్లల్లాడించు కుంటూ ఎగిరి పోతాయి. మీ అమ్మ అదే పని చెయ్యాలనుకుంటోంది.. మీరు బాగా ఎదగడానికి.. " సులోచన పావుగంట సేపు, వాళ్ళందరికీ జీవితం మీద ఆశ కల్పించడానికి ప్రయత్నించింది.

సాంబడినీ, కృష్ణవేణినీ ఏమి చెయ్యమందామనుకుంటోదో చెప్పింది.

"అట్టనే చేద్దామమ్మా! సాంబ ఇంటర్లో సైన్సే తీసుకున్నాడు. నాక్కూడా టెంత్ లో సైన్సంటే ఇష్టం ఉండేది. కానీ ఏం చేద్దామన్నా డబ్బుల్లేవని యెనకాడతన్నాం." కృష్ణవేణి సన్నగా అంది. ఒక సమయంలో మగవాళ్ళు వెనకాడుతుంటే ఆడవాళ్ళు పగ్గాలు తీసుకుంటేనే జీవన రథం నడుస్తుంది.

**సాంబడు** మరునాడే బయలుదేరి వెళ్ళాలి, గుంటూరు మెడికల్ కాలేజీలో చేరడానికి. కృష్ణవేణికి ఇచ్చిన మాట ప్రకారం పెళ్ళి చేసుకునే వెళ్తానన్నాడు.

ఆ సంవత్సరమంతా రోజుకి నాలుగైదు గంటలు మాత్రమే పడుకున్నాడేమో! కలలో, మెలకువలో కూడా అదే మననం. పాఠ్యాంశాలన్నీ అనేకానేక సార్లు క్షుణ్ణంగా చదివి, నిద్రలో అడిగినా కూడా చెప్పగల స్థాయికి చేరుకున్నాడు.

ఫిజిక్స్ మాష్టారింట్లో రాత్రిళ్ళు కూర్చుని, వాళ్ళ పదో క్లాసబ్బాయి చేత లెక్కలు చేయిస్తూ తన ఫిజిక్స్ ప్రాబ్లమ్స్ చేసుకునే వాడు..



KOUMUDI

అనుమానం వచ్చినప్పుడు మాష్టార్ని అడుగుతూ.

శనాదివారాలు కెమిస్ట్రీ మాష్టారింట్లో.. వారి కిష్టమైన తోటపని చేస్తూ, పక్కనే పలక, బలపం పెట్టుకుని ఫార్ములాలు వేసేవాడు.

బయాలజీ మొదట్నుంచీ తనకి ఇష్టమయిన సబ్జెక్ట్. భోజనం చేస్తున్నప్పుడు, కాలేజ్ లో ఖాళీ దొరికినప్పుడు, ఆ పుస్తకాలని అదే తిరగెయ్యడం. ఏ పేజీలో ఏబొమ్మ్ముందో ఠంచనుగా చెప్పగలడు.

ఒక తపస్సులా చదివాడు. అందుకనే ఏ లాంగ్ టెర్మ్ కోచింగులూ లేకుండా ఇరవై ఐదో రాంక్ వచ్చింది యమ్సెట్ లో. తను కోరుకున్న గుంటూరు మెడికల్ కాలేజ్ లోనే సీట్ వచ్చింది.. అది కూడా రిజర్వేషన్ కోటాలో కాదు. జనరల్గా.

పెళ్ళి భోజనాలయ్యాక కృష్ణవేణి, వెంకమ్మ దగ్గరికి వచ్చింది. గట్టిగా కౌగలించుకుని, భోరుమంది.

అందరూ నిర్ఘాంతపోయి చూస్తున్నారు. ముందుగా తేరుకున్నది సులోచన. కృష్ణవేణిని లోపలి గదిలోకి తీసుకెళ్ళి, ఏడవనిచ్చింది. ఆ ఉధృతం తగ్గాక తడిపిన తువ్వాలిచ్చి మొహం తుడుచు కోమంది.

“ఇవేళ కరువు తీరా ఏడిచావు కదా! దీనితో నీ గతంలో జరిగిన దుర్ఘటన లన్నింటినీ మనసులో ఒక మూలకి నెట్టెయ్యి. నీ ముందొక ఆశయం ఉంది. నీకొక ధ్యేయం ఉంది. మీ సాంబ తన వృత్తిలో చాలా పైకొస్తాడు. నాకా నమ్మకం ఉంది. అలాగే నువ్వు కూడా నీ వృత్తిలో శిఖరాన్నందుకోవాలి. నర్సింగ్ లో ఎదిగేందుకేముంది అనద్దు. చాలా ఉంది. పోను పోను నీకే తెలుస్తుంది. నిస్సహాయులకి సేవచేసి, సేద తీర్చే అవకాశం అందరికీ రాదు. నీకొచ్చింది. అంది పుచ్చుకో..” పది నిముషాలు కర్తవ్యం బోధించి హాల్లోకి నడిచింది.

“ఏమీ ఫరవాలేదు. ఆ ఇమోషన్ చాలా సహజం. ఇప్పుడింక ఏ పరిస్థితుల్లోనూ ఏడవదు. సాంబా! యు ఆర్ వెరీ లక్కీ. అమ్మాయి చెయ్యి ఎప్పటికీ వదలద్దు. అంత నెమ్మది, అణకువ ఉండి అర్ధం చేసుకునే భార్య దొరకడం సులువేం కాదు.”

“నేను లోపలికి వెళ్ళచ్చామ్మా?” సాంబడు అడిగాడు. సులోచన తలూపింది.

సాంబడు లోపలికెళ్ళే సరికి కృష్ణవేణి మొహం కడుక్కుని, తల దువ్వుకుని మామూలుగా అయిపోయింది. చేతులు చాపి కౌగిలిలోకి తీసుకుని, వీపు నిమురుతూ ఉండి పోయాడు.

ఆ కౌగిలిలో ఆవేశం లేదు. కామం లేదు. ఓదార్పు, భరోసా, అంతులేని ప్రేమ ఉన్నాయి.

కృష్ణవేణి నిశ్చింతగా కళ్ళు మూసుకుని ఉండి పోయింది.

## 12

గుంటూరు మెడికల్ కాలేజ్ ఆవరణలోకి అడుగు పెడుతుంటే సాంబడి ఒళ్ళు పులకరించింది. కలలో కూడా ఊహించనిది.. టౌను దాటి బయటికెప్పుడూ వెళ్ళని సాంబడు, చేపలు పట్టుకుంటూ మహా అయితే మార్కెట్లో చేపల బేరాలాడుతూ రోజుకి వందో రెండుందలో దొరుకుతే, అదే మహ భాగ్యమని మురిసి పోయిన సాంబడు మెడికల్ కాలేజ్ లోనా!

మనసులోనే దేవతలకి నమస్కరించుకున్నాడు. అతని దృష్టిలో అమ్మ, డాక్టర్ సులోచన, తనని చదివిస్తున్న అజ్ఞాత వ్యక్తి దేవతలు. దేముడనే వాడు ఎక్కడో ఆకాశంలో కనిపించకుండా ఉండడనీ, మంచి చేసే మనుషుల రూపంలోనే ఉంటాడనీ అతని నమ్మకం. ఏ ట్యుటోరియల్స్ లోనూ చేరక పోవడం వల్ల అతనికి తెలిసిన వాళ్ళెవరూ అక్కడ ఉండే అవకాశం లేదు.

“హలో డాక్టర్!” తన పక్కగా వచ్చి ఎవరో పిలిచినట్లయింది.

ఎవర్నో అనుకుని అటూ ఇటూ చూశాడు.

"మిమ్మల్నే డాక్టర్.." సాంబడి భుజం మీద తట్టి పిలిచాడు తెల్లని కోటు వేసుకున్న అబ్బాయి. ఇరవై ఏళ్ళుంటాయేమో! సాంబడు సంభ్రమంగా చూశాడు. అప్పుడే డాక్టర్ అని పిలుస్తారా?

"నా పేరు రాజేంద్ర ప్రసాద్. థర్డ్ ఇయర్.. ఇక్కడి గేట్లో అడుగు పెట్టాక డాక్టర్ అవకుండా ఉండరు కదా! అందుకే అలవాటు చేస్తున్నా నీకా పిలుపు. దా! కాంటీన్ కెళ్ళి మాట్లాడు కుందాం."

సాంబడు మంత్రం వేసినట్లు అతని వెనుకే వెళ్ళాడు.

కాంటీన్ లో మరొక ముగ్గురు కలిశారు. పరిచయాలయ్యాక, కాఫీ టిఫిన్ ఆర్డర్ ఇచ్చారు.

అబ్బ.. ఎంత మర్యాదగా, ఫ్రెండ్లీగా ఉన్నారో! సాంబడికి ఆనందం కలిగింది.

"సార్! నేను కాఫీ తాగనండి. టిఫిన్ కూడా ఇప్పుడే చేసొచ్చా. ఏం అనుకోకండి." తన పేరు, ఊరు చెప్పాక అన్నాడు.

"మరేం ఫర్లేదులే! బిల్ నువ్విస్తే చాలు, తినక పోయినా ఫర్లేదు." ప్రసాద్ నవ్వుతూ భుజం తట్టాడు.

"బిల్ కూడా ఇవ్వలేనండి. నా దగ్గర డబ్బుల్లేవు." నిర్మొహమాటంగా అన్నాడు సాంబడు.

సాంబడిని ఒక సారి పరికించి చూశారు అందరూ! పెద్ద ఖరీదైనవి కాకపోయినా శుభ్రంగా ఉతికి, ఇస్త్రీ చేసిన బట్టలు.. చేతిలో ఒక నోట్ బుక్, జేబులో ఒక పెన్. అంతే! మొహంలో అమాయకత్వం, తెలివీ సమపాళ్ళలో కనిపిస్తున్నాయి. తను అనుకున్నదే తప్ప ఎవరి ప్రభావంలోనూ పడిపోడని అర్ధమవుతోంది.

చకచకా ప్రశ్నలడిగారు, ఒకళ్ళ తరువాత ఒకళ్ళు. అందరికీ అదే క్రమంలో జవాబిచ్చాడు, సబ్జెక్ట్లకి సంబంధించినంత వరకూ.

సినిమాలు, నవలలు వంటి జనరల్ నాలెడ్జ్ మాత్రం శూన్యం. రాజకీయాలు కూడా అంతే.

"కనీసం మన ఛీఫ్ మినిస్టర్, ప్రైమ్ మినిస్టర్ ఎవరో తెలుసా?" ప్రసాద్ అడిగాడు. సాంబడు కొద్దిగా తల వంచి నవ్వాడు, మెరుస్తున్న పలువరుసతో. అతడి నవ్వు చూస్తే ఎవరికీ ఏమీ అనుబుద్ధి కాదు.. దాంతోటే ఎదుటి వాళ్ళని బుట్టలో వేసేస్తాడు.

"సరే.. మేమిస్తాం పోనీ! నీక్కావలసినవి తిను." తల అడ్డంగా ఊపాడు.

"వద్దు సార్. ఆకలి లేనప్పుడు తినను. నేను తిరిగి ఇవ్వలేనప్పుడు ఇంకొకరి దగ్గర ఏదీ తీసుకోను." ధృఢంగా అన్నాడు. ఏదో కాసేపు తమాషా చేసి, ఆనందిద్దామనుకుని వచ్చిన సీనియర్స్ అతని సీరియస్నెస్ చూసి ఏమీ మాట్లాడలేక పోయారు.

"హాస్టల్లో చేరుతున్నావా?"

"లేదు సార్! నగరంపాలెంలో ఒక చిన్న రూం తీసుకున్నా. హాస్టల్లో ఐతే ఎక్కువై పోతుందని. నేనే వండుకుంటా.. ఒక స్టౌ, కాసిని గిన్నెలు తెచ్చుకున్నా."

"తెలివైనవాడివే! హాస్టల్లో ఫుడ్ అయితే రెండు రోజుల్లో బోర్ కొట్టేస్తుంది. మరి వంటొచ్చా? నీకు పోను పోను టైమ్ ఉంటుందనుకుంటున్నావా వంటకీ వార్పుకీ?" గళ్ళ చొక్కా అనంత్ అడిగాడు.

"టైమ్ దేముంది సార్! మన చేతిలో ఉంటుంది. అన్నీ మానేజ్ చెయ్యగలననే అనుకుంటున్నా. మీ అందరి హెల్ప్ కూడా ఉంటుంది కద సార్! ఒక సారి ఈ కాలేజ్ గేటు లోపలికి వచ్చాక, ఒక ఫామిలీ లోకి వచ్చినట్లే అని చెప్పారు సార్! నాకేం సంకోచం లేదు. సందేహం లేదు."

వింటున్న శ్రోతలకి మతి పోయింది.

"వార్నాయనో! ఏంటా భాష.. ఏంటా కాన్ఫిడెన్స్? నా వల్ల కాదు బాబోయ్! మాటకొక సారి ఆ 'సార్' మానెయ్యి బాబూ! బుద్ధి



KOUMUDI

తక్కువయి నీ జోలికొచ్చాం. ఇంకెవర్నైనా పట్టుకుంటే కాస్త కాఫీ దక్కేది నీతి బోధలు తప్పేవి.” ప్రసాద్ చేతులెత్తేశాడు.

“థాంక్స్ సార్..” నాలిక్కరుచుకున్నాడు నవ్వుతూ. సీనియర్లు కూడ నవ్వేశారు.

“ఇంట్రడక్టరీ క్లాస్ ఉందిట.. ఎక్కడో కొంచెం గైడ్ చేస్తారా అన్నా!” వినయంగా అడిగాడు సాంబడు.

“ఆ పేరేంటయ్యా.. ఇక్కడ చేరే ముందైనా మార్చుకో పోయావా?”

“కన్న తల్లిదండ్రుల్నీ, వారు పెట్టిన పేరునీ ఎట్లా మార్చుకుంటాం అన్నా? అయినా పేరులో ఏముంది చెప్పండి?” మళ్ళీ ఒక ఝలక్ ఇచ్చాడు సాంబడు.

“అర్జంట్ కాదు కానీ.. నీకు వీలయినప్పుడు ఒక సారి రా. కొన్ని విషయాలు మాట్లాడాలి.” డాక్టర్ సులోచన గారి ఉత్తరం చదివి, ప్రొఫెసర్ పర్మిషన్ తీసుకున్నాడు సాంబడు.

మూడో సంవత్సరం లోకి వచ్చాడు సాంబడు. హాస్పిటల్ కి వెళ్ళడం, వార్డ్ డ్యూటీలు మొదలయ్యాయి. క్లాసులో మధ్యరకమైన విద్యార్థిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రతీ సబ్జెక్ట్ లోనూ మొదటి సారి పాసవడం కూడా మెడికల్ కాలేజ్ లో ఎన్నతగ్గ విషయమే! అట్లా యావరేజ్ గా ఉండటమే కావాలనుకున్నాడు. పదిమంది దృష్టిలోనూ పడడం ఇష్టం లేదు సాంబడికి. తన వృత్తికి కావలసిన విద్య, మెలకువలు నేర్చుకొనడం ముఖ్యం అనుకున్నాడు. మొదటి రాంకులంటే.. అక్కడ కొంత పోటీ, కొంత అసూయ, కొంత పక్షపాతం ఉండటానికి అవకాశం ఉంది. సాదా సీదాగా చదువు ముగించి, తన ధ్యేయం నెరవేర్చుకోవాలి.. అంతే!

పైగా, ఇంటికెళ్ళి వండుకోవడం, కావలసిన సరుకులు తెచ్చుకోవడం.. ప్రతీ నెల అయిన జమా ఖర్చులు సులోచనకి పంపడం.. ఇవన్నీ కూడా సమయం వెచ్చించ వలసిన విషయాలే. చిన్న సిలిండర్ ఉన్న గాస్ స్టౌ కొనిచ్చింది సులోచన. అందులో తక్కువ సమయంలో ఎక్కువ పోషక పదార్థాలు కలసిన వంటలు నేర్చుకున్నాడు.

పప్పు, బియ్యం, కూరలు కలిపి వండేసి, నెయ్యి, ఉప్పు, నిమ్మకాయ పిండితే రోజుకి సరిపోయే భోజనం తయార్. పెరుగు కొనుక్కొచ్చుకుని తినేస్తాడు. కాఫీ, టీలు ఎట్లాగా అలవాటు లేదు.

“డాక్టర్ గారూ! ఈ అబ్బాయి నిజంగా మెడిసిన్ చదువుతున్నాడా? ఇంత తక్కువ ఖర్చా? మా అబ్బాయీ ఉన్నాడు..మీ వాడికి రెండేళ్ళు సీనియర్. మూడు నాలుగు రెట్లు చులాగ్గా స్పెండ్ చేస్తాడు.” పెద్దమనిషిగారు ఫోన్లో అడుగుతుంటే నవ్వేస్తుంది సులోచన. ఆవిడకి ఎప్పుడూ నిరాశ కలిగించలేదు సాంబడు.

బస్లో కూర్చుని, మెడికల్ జర్నల్ చదువుతున్నాడు సాంబడు.

“హలో డాక్టర్!” పరిచయమైన పిలుపు.. ప్రసాద్ వచ్చి ఖాళీగా ఉన్న పక్క సీట్లో కూర్చున్నాడు.

“నమస్తే అన్నా!” చిరునవ్వు నవ్వాడు సాంబడు. మొదటి రోజు కలిసినప్పటి నుంచీ, ప్రసాద్ అతనికి ఒక గైడ్లాగ, శ్రేయోభిలాషిలాగ అయిపోయాడు.

“ఎందాక ప్రయాణం? మీ ఊరికా?”

“అవునన్నా! అమ్మని చూడాలనిపించింది.” అమ్మ ఉందని తప్ప, సాంబడి గురించిన ఇంకే విషయాలూ తెలియవు ఎవరికీ.

“నేను కూడా మా నాన్నని చూడాలని వెళ్తున్నా. నాన్నగారికి హార్ట్ ప్రాబ్లమ్. బై పాస్ చెయ్యాలన్నారు. రేపు ఫిక్స్ చేశారు సర్జరీ.”

“అయ్యో.. సారీ అన్నా! నయమై పోతుంది. ఎక్కడన్నా?”

“విజయవాడలో.” హాస్పిటల్ పేరు చెప్పాడు ప్రసాద్.

"ఈ బస్ మా ఊరెళుతుందన్నా! అమ్మని చూసి వచ్చేటప్పుడు హాస్పిటల్కి వస్తాను రేపు. ప్రొఫెసర్ గారిని రెండ్రోజులు ఆఫ్ అడిగానెట్లాగూ. అవసరం ఐతే ఇంకొక రోజు కూడా అడగచ్చు. నాన్నగారి పేరు?"

జేబులో ఉన్న చిన్న పుస్తకంలో, పేరు, అడ్రస్ రాసుకున్నాడు సాంబడు.

"ఇదీ సాంబా విషయం. ఏం చేద్దాం?" డాక్టర్ సులోచన చెప్పవలసింది చెప్పి ఆగింది, సాంబడినే చూస్తూ. వెంకమ్మ కూడా అక్కడే కింద కూర్చుంది.

సులోచనగారింట్లో వరండాలో కూర్చున్నారు అందరూ. కడిగిన ముత్యాల్లా వచ్చారు నాగరాజు, నాంచారీ. రెండేళ్ళలో చాలా మార్పు వచ్చింది వాళ్ళలో. ఇద్దరూ పొడుగు పెరిగారు. చక్కగా మాట్లాడుతున్నారు. నాంచారి కూడా ఇంగ్లీషు, తెలుగు అక్షరాలన్నీ నేర్చుకుంది. నాగరాజు సరేసరి. ఎప్పుడూ క్లాసులో ఫస్టే. హాస్టల్కి ఆనుకునే స్కూల్ ఉంది. పెద్దహాలు.. అందరికీ ఇనప మంచాలు, పరుపులు, పరుపుల మీద రబ్బరు గుడ్డలు, వాటి పైన దుప్పట్లు, పైన ఫాన్లు. ఇద్దరిద్దరికి చొప్పున ఇనప రేక్లు, మంచం కింద బట్టలు పెట్టుకునే పెట్టెలు.. ఉన్నంతలో శుభ్రంగా ఉంటుంది హాస్టల్. అక్కడున్న సదుపాయాలన్నీ, దాతలు ఇచ్చినవే.

కృష్ణవేణి, సాంబడు ఏమంటాడో అని ఆతృతగా ఎదురు చూస్తోంది.

చాలా సేపు మాట్లాడలేదు సాంబడు. పిల్లలతో సహా అందరూ నిశ్శబ్దంగా ఎదురు చూస్తున్నారు.

"మీరెట్లా చెప్తే అట్లాగే నమ్మా! మాకు తల్లీ, తండ్రీ, గురువు, దైవం అన్నీ మీరే. కానీ పిల్లల మాటేమిటి? వాళ్ళు ఉండగలరా? పైగా అంత ఖర్చు.."

అమ్మయ్య అనుకుంది కృష్ణవేణి. పిల్లల గురించి ఒక ఆలోచన అప్పటికే వచ్చింది సులోచనకి. కృష్ణవేణి, ఇంటర్ మీడియట్ వొకేషనల్ కోర్స్ అయ్యాక, సులోచన హాస్పిటల్ లోనే పని చేస్తోంది. సులోచన ప్రోద్బలంతో బి.యస్సీ నర్సింగ్కి అప్లికేషన్ పెట్టింది. తన మార్కులు, అనుభవం అన్నీ గమనించిన నిర్వాహకులు సీటు ఇచ్చారు. అయితే.. సీటు దొరికింది హైద్రాబాద్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్లో. తమకి కావలసిన కాలేజ్కి ట్రాన్స్ఫర్ చేయించు కోవచ్చు.. కానీ ఆ కాలేజ్లో సీట్ రావడమే కష్టం. బోధన, హాస్పిటల్ అనుభవం.. అన్నీ బాగా ఉంటాయి.

"హైద్రాబాద్ పంపేద్దాం, హాస్టల్ అదీ ఉంటుందెట్లాగా!" అంటుంది సులోచన. సాంబడి అభిప్రాయం, అనుమతి కావాలని అతన్ని పిలిచింది. తను చెప్పినది సాంబడు కాదనడని తెలుసు. అయినా, కృష్ణవేణి అతని భార్య.. ముఖాముఖీ మాట్లాడి కానీ ఏ నిర్ణయం తీసుకో దల్చుకోలేదు.

"వెంకటలక్ష్మికి హాస్టల్లో పని దొరికింది. తను చెయ్యగలిగిందే.. వంటలో, మెయిన్ట్ నెన్స్ లో సహాయం. అక్కడ నలుగురైదుగురు ఉంటారు. మరీ ఎక్కువ స్ట్రెయిన్ అవదులే. ఉండటానికి వసతి, భోజనం కాక, నెలకి వెయ్యి రూపాయలు జీతం. పిల్లలని తనే స్వయంగా చూసుకోవచ్చు. అట్లా అని ప్రత్యేకంగా చూడ కూడదు. అందరినీ సమానంగా చూడాలి. ఆ సంగతి వెంకటలక్ష్మికి చెప్పనక్కర్లేదనుకో!"

"మీకంతా తెలుసమ్మా. మాకు ఏది మంచో ఏది చెడో మీరే చూసుకుంటారు. ఇంక నేను చెప్పేదేముంది?" సాంబడు చటుక్కున వెళ్ళి సులోచన కాళ్ళకి నమస్కారం చేశాడు.

"ఇదేంటి సాంబా! నాకిష్టం ఉండదని తెలుసుకదా!" కాళ్ళు వెనక్కి లాగేసుకుంది సులోచన.

"అమ్మా! మరి ఖర్చులు.. చివర్లో స్కాలర్షిప్ వస్తుంది. కానీ ముందుగా మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలి కదా!"

"ఫరవాలేదయ్యా. వెంకటలక్ష్మి జీతంలో కొంచెం కొంచెం తీసుకుంటాలే. అన్నట్లు పాలెం లో ఏర్పాట్లు చేసుకోవాలి ఒక వారం

లోగా.. సరేనా?”

“ఇవేళ నేను కూడా వెళ్ళి అన్నీ సర్దేసి, సరస్వతి ఆంటీకి అప్పజెప్పి వస్తానమ్మా!” సాంబడు లేచాడు.

“మేం కూడా రావచ్చా సాంబన్నా!” పిల్లలు ఇద్దరూ ఒకేసారి..

“నేను కూడా..” కృష్ణవేణి అంది చిరునవ్వు నవ్వుతూ.

చల్లని గాలి గుండెల నిండుగా పీలుస్తూ, ఎదురుగా కనిపిస్తున్న తన ఊరిని తనివి తీరా చూస్తున్నాడు సాంబడు, పడవలో చెరో పక్కనా పిల్లలిద్దరినీ కూర్చో పెట్టుకుని. పిల్లలైతే మూడేళ్ళయింది ఆ వూరొచ్చి. నాంచారికి గుర్తు కూడా లేదు. కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూస్తోంది.

ఒడ్డుకి చేరగానే, బల్ల వేసిన వెంటనే, ఒక్క దూకు దూకాడు సాంబడు. అదే కాలిబాట. అవే మడ అడవులు. ముళ్ళ తుప్పలు, పొదలు తప్ప, పనికొచ్చే మొక్కలేం లేవు. నెమ్మదిగా ఇది జనావాసం లేని అరణ్యమైపోతుందా? సాంబడికి దుఃఖం వచ్చింది. తను పుట్టి పెరిగిన ఊరు. ఎట్లాగైనా కాపాడుకోవాలి తను పైకొచ్చి. అప్పటి వరకూ? ఫరవాలేదు. చేపలున్నంత వరకూ.

తమ ఇల్లు చూడగానే నాగరాజు పరుగెత్తాడు.. వాడికేం గుర్తుకొచ్చిందో! నాంచారి నోట్లో వేలేసుకుని చూస్తుండి పోయింది. కృష్ణవేణి కళ్ళలో తిరుగుతున్న నీళ్ళని లోపలే అదిమేసింది. వెంకమ్మ మూడిళ్ళనీ రోజూ శుభ్రం చేస్తూ ఎక్కడి వక్కడ సర్దేస్తూ ఉంటుంది. అందుకే అన్ని ఇళ్ళూ వాస యోగ్యంగానే ఉన్నాయి.

“ఏందే! అందరూ వచ్చారా.. ఎన్నాళ్ళకెన్నాళ్ళకి.” అంత మొహం చేసుకుని నవ్వుతూ వచ్చింది సరస్వతమ్మ, కఱ్ఱ పట్టుకుని.

“నమస్తే సరస్వతి ఆంటీ! మీ రెండో అబ్బాయికి ఇల్లు కావాలని చూస్తున్నాడట కదా! మా ఇంట్లో ఉండమని చెప్పండి. అద్దె అదీ.. ఏమీ అక్కర్లేదు. మీ ఇంటికి పక్కనే ఉంటాడు కూడా..” సాంబడిని చూసి తెగ ముచ్చట పడిపోయింది సరస్వతి. దగ్గరగా వచ్చి, బుగ్గలు పుణికింది.

“ఎంత వాడవయ్యావురా సాంబడూ! డాక్టరవతన్నావంటగా! మనూర్లో మొట్టమొదటి డాక్టర్వి నీవేరా. చాలా సంతోషంగా ఉంది. అట్టగే మా వోడు మీ ఇంట్లో ఉంటాడు. మరి అమ్మ? కృష్ణవేణి ఇంట్లో ఉంటదా?”

“లేదాంటీ అమ్మ కూడా టౌను కొచ్చేస్తోంది. అక్కడ, పిల్లలిద్దరూ ఉండే హాస్టల్లోనే ఉద్యోగం వచ్చింది. నెలకొక సారి వస్తుందనుకో.. మిమ్మల్నందరినీ కలవడానికి. వేణి, హైద్రాబాద్ వెళ్తోంది.. పై చదువులకి. అందుకనే ఈ ఏర్పాట్లన్నీ చేస్తున్నాం.”

“అయ్యో.. వెంకటలక్ష్మి కూడా వెళ్ళిపోతాందా! అదే అనుకున్నాలే.. మీరందరూ ఎక్కడుంటే అది కూడా అక్కడే ఉంటుందని. మంచిదేరా. చక్కగా చదువుకుని మనూరి పేరు నిలబెట్టండి. ఇప్పుడే మా రెండో వోడిని పిల్చుకొస్తా.” నెమ్మదిగా అడుగులు వేస్తూ సరస్వతి వాళ్ళింటి వైపుకి వెళ్ళింది.

వెంకమ్మ ఇంటి తాళం తీసి తలుపులు బార్లా తెరిచింది.. గాలి చొరడానికి. సాంబడు లోపలికి వెళ్ళి, నలువైపులా చూశాడు.. ప్రతీ గోడా చేతితో తడుముతూ!

షావుకారికి ఫోన్ చేసి వస్తున్నామని చెప్తే, అందరినీ అక్కడికే భోజనానికి వచ్చెయ్యమన్నాడు. కృష్ణవేణీ, పిల్లలూ, సరస్వతి కొడుకు వచ్చి ఇల్లు చూసుకుని మాట్లాడే వరకూ వాకిలి అంతా తిరుగుతూ మొక్కల్లోనే గడిపారు. వాళ్ళ ఇళ్ళలోకి వెళ్ళలేదు.

“ఎట్టెట్టా.. మా తల్లి కృష్ణవేణే.. హైద్రాబాద్ యెల్తన్నావా? మా అమ్మే! బాగా చదువుకుని.. ఇక్కడికే వచ్చెయ్యాల. ఏమంటారు..” షావుకారు భార్య, రెండు చేతులూ చాచి ఆహ్వానించింది.

**తిరిగి** వచ్చేస్తుంటే.. ఒక్కసారిగా జ్ఞాపకాలు చుట్టు ముట్టాయి సాంబడిని.

ఇదే కిట్టమ్మలో ఎన్ని కథలు జరిగాయి.. ఊర్లో అందరికీ అన్నం పెడుతూనే, కోపం వచ్చినప్పుడు వాళ్ళని కూడా తీసుకుని వెళ్ళి పోయింది కిట్టమ్మ. ఈ పడవల ప్రయాణం మానేసి, ఇంకేదైనా ఏర్పాటు చేస్తే కానీ సమస్య పోదు. క్షేమంగా అద్దరి చేర్చే వాహనం.. లేదా బ్రిడ్జ్. కానీ బ్రిడ్జ్ అంటే మాటలా! ప్రభుత్వాలు కల్పించుకోవాలి. దానికి లంకలో ఉన్న ఊళ్ళలో పట్టించుకునే రాజకీయ నాయకులే లేరు.

ఏ పూటకా పూట గడుస్తే చాలనుకునే బడుగు జీవులున్న చోట అవన్నీ ఎట్లా వస్తాయి?

చదువైపోయాక తనేమైనా చెయ్యగలడా! వెనకాల ఏ దన్నూ లేదు. నిలదొక్కుకోడానికే సంవత్సరాలు పడుతుంది. కుటుంబం మొత్తం ఊరి సమస్యల నుంచి పారిపోతున్నామా అనిపించింది ఒక క్షణం.

"లేదు లేదు.. బయిటికి వెళ్ళి ఏదైనా చేస్తేనే కద ఫలితం వచ్చేది.." మళ్ళీ సర్ది చెప్పుకున్నాడు.

"సాంబన్నా! ఎంత పెద్ద చేపో.. చూడు.." నాగరాజు చేతి మీద కొట్టి చూపించాడు.

నిజమే.. అలల్లో పల్టీలు కొడ్తోంది.. ఎంతో స్వేచ్ఛగా. ఏ వలలోనో చిక్కుకునే వరకూ!

కృష్ణవేణి ఏం చేస్తోందా అని చూశాడు సాంబడు. చివరున్న బల్ల మీద కూర్చుని, నీళ్ళలోకి చూస్తోంది. పక్కకి వెళ్ళి, తన చేతిలో చెయ్యేసి కూర్చున్నాడు. ఇద్దరూ కలిసి, తాము భవిష్యత్తు లోకి చెయ్యబోయే ప్రయాణం గురించి చర్చించు కున్నారు.

డాక్టరమ్మకి మాట ఇచ్చినందువల్లో ఏమో.. చిత్రంగా కృష్ణవేణిని చూస్తే స్నేహితురాల్లాగనే అనిపిస్తోంది.

చిరునవ్వు నవ్వుతూ కృష్ణవేణిని చూశాడు.

"ఇంకా మూడేళ్ళు.." చెవిలో అన్నాడు గుసగుసగా! కృష్ణవేణి సిగ్గుతో తలొంచుకుంది.

మధ్యలోనున్న బెంచీ మీద వెంకమ్మ, దగ్గర పడుతున్న రేవుని చూపిస్తోంది పిల్లలకి.

"అమ్మా! మీరిక్కడా.." ఆశ్చర్యంగా చూసి, ఆపరేష థియేటర్ దగ్గరున్న లాంజ్లో కూర్చున్న సులోచన దగ్గరికి వెళ్ళాడు సాంబడు.

విజయవాడలో పేరెన్నికగన్న హాస్పిటల్ అది. సాంబడి సీనియర్ ప్రసాద్ వాళ్ళ నాన్నగారికి ఆపరేషన్ అవుతోంది.

"మా రోటరీ క్లబ్ మెంబర్, బాగా కావలసిన వారు, చౌదరిగారికి సర్జరీ అవుతుంటే వచ్చాను. నువ్వేమిటి ఇక్కడా?"

"నేను కూడా నా ఫ్రెండ్ ప్రసాద్ నాన్నగారి సర్జరీ కే వచ్చాను. అతనికి కాస్త మోరల్ సపోర్ట్ కోసం. ప్రసాద్ నాకు రెండేళ్ళు సీనియర్. కాలేజ్లో చేరిన రోజు నుంచే ఫ్రెండ్ అండ్ గైడ్ అయ్యాడు.

"అవునా! ప్రసాద్ నాన్నగారి గురించే నేను వచ్చింది కూడా. కొద్దిగా బిపి, షుగర్ లాంటి కాంప్లికేషన్స్ ఉన్నాయి, రమ్మంటే వచ్చాము. మాకు వాళ్ళు ఎప్పటి నుంచో తెలుసు. సుధాకర్ థియేటర్లో ఉన్నారు. భలే కలిశాము కదూ!" సులోచన చిరునవ్వు నవ్వింది.

"నిజమే నమ్మా! పొద్దున్నే కదా మీ దగ్గర సెలవు తీసుకున్నా. అనుకోకుండా ఆత్మీయుల్ని కలుసుకుంటే ఎంతో ఆనందం కలుగుతుంది కదూ.."

"ఆంటీ! డాడీకి ఫరవాలేదు కదా?" ప్రసాద్ ఆదుర్దాగా వచ్చి సులోచన పక్కనే కూర్చున్నాడు.

"సర్జరీ అవుతోంది కదా.. అంతా కంట్రోల్ లోనే ఉంది. హి విల్ బి ఆల్ రైట్." ప్రసాద్ చెయ్యి పట్టుకుని నిమురుతూ అంది సులోచన. చౌదరి గారికి భార్య లేదు. ప్రసాద్ ఒక్కడే కొడుకు. కళ్ళనిండా నీళ్ళు.. చేతులు వణుకుతున్నాయి.

"మీ డాడీ నవ్వుతూ బయటికి వస్తారు ప్రసాద్. అంతా చక్కగా అవుతుంది." సాంబడు గబగబా ప్రసాద్కి అటు పక్కన కూర్చుని,

భుజం మీద చెయ్యేశాడు.

“నాకు డాడీనే అంతా చేశార్రా! అమ్మ నాకు ఐదేళ్ళప్పుడు పోయింది. ఎన్ని పనులున్నా సాయంత్రం ఏడు గంటలకి ఇంటికి రావలసిందే. తనే స్వయంగా నాకు అన్నం తినిపించాలి. కథలు చెప్తూ నిద్ర పుచ్చాలి. ఆయన కనుక లేకపోతే నేను ఒంటరి నైపోతాను.”

సాంబడికి ఏం మాట్లాడాలో తెలియట్లేదు. తన భుజం మీద స్నేహితుడి తల ఆన్చి ఓదార్చాడు.

థియేటర్ తలుపులు తెరుచుకున్నాయి.

“అంతా బాగా అయింది. ఎవ్విరి థింగ్ నార్మల్. కొంచెం సేపయ్యాక, గ్లాస్ డోర్ లోంచి చూడచ్చు.” సుధాకర్ థియేటర్ గౌన్ తోనే అలసటగా వచ్చి కూర్చున్నాడు.

“థాంక్స్ అంకుల్. రండి మా ఛాంబర్ లోకి వెళ్దాం. నువు కూడా దా సాంబా!” ప్రసాద్ లేచి దారి తీశాడు. రెండు మూడు కారిడార్లు దాటాక, చివర్లో ఒక పెద్ద సూట్ లోకి తీసుకెళ్ళాడు.

సులోచన, సుధాకర్ మామూలుగా. సాంబడు ఆశ్చర్యంగా వెనుకే అనుసరించారు.

“సాంబా! ఈ హాస్పిటల్ మాదే. నేను టెంత్ లో ఉండగానే డాక్టర్ని అవాలని ముందుగా నర్సింగ్ హోమ్ కట్టించారు డాడీ. సుధాకర్ అంకుల్ వారానికి మూడు రోజులు ఇక్కడికి వస్తుంటారు. ఆంటీ, అంకుల్ మా ఫామిలీ ఫ్రెండ్స్.”

సుధాకర్ లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చాడు.

“ఓ.. అయితే మీరిద్దరూ ఫ్రెండ్స్ అన్నమాట. స్మాల్ వరల్డ్.

ప్రసాద్ అయోమయంగా చూశాడు.

“ఇవేళ అందరికీ ఆశ్చర్యాలే! సాంబడు మాకు అల్లుడు.” సులోచన నవ్వుతూ అంది.

సాంబడు క్లుప్తంగా తమ అనుబంధాన్ని వివరించాడు.

“నేను మెడికల్ కాలేజ్లో చేరడానికి ఈ అమ్మే కారణం. లేకపోతే చేపలు పట్టుకుంటూ ఉండే వాణ్ణి. వీరి ఋణం ఏమిచ్చినా తీర్చుకోలేను.”

“అంతే కాదు..” సుధాకర్ చెప్పబోతుంటే చెయ్యి గట్టిగా నొక్కింది సులోచన.

“ఉండండి కాఫీ తాగి మాట్లాడు కుందాం.” ఆయా తెచ్చిన కాఫీ తాగుతూ, సర్జరీ గురించి చర్చ మొదలు పెట్టింది. సుధాకర్, సులోచన సూచన అర్ధం చేసుకుని, థియేటర్లో విషయాలు చెప్ప సాగాడు. ప్రసాద్ చాలా శ్రధ్ధగా వింటున్నాడు. అతనికి సర్జరీ మీద ఆసక్తి. ఎక్కడ సీటొచ్చినా చదివేయడానికి నిశ్చయించుకున్నాడు.. ఎంత డబ్బయినా కట్టి.

సాంబడు అప్పుడప్పుడే హాస్పిటల్కి వెళ్ళడం మొదలు పెట్టాడు. అందుకే.. కొంచెం అర్ధం అయి, కొంత అర్ధం అవక అవస్థ పడుతున్నా, డాక్టర్ సుధాకర్ వివరించే పద్ధతి నచ్చి, ముందుకు వంగి వినసాగాడు.

ఆ రోజంతా ప్రసాద్ దగ్గరే ఉండి, మరునాడు పొద్దున్నే కాలేజీ సమయానికి గుంటూరు చేరుకున్నాడు సాంబడు. ఆ రోజే కృష్ణవేణి హైద్రాబాద్ ప్రయాణం..

ఇద్దరి చదువులూ అవడానికి సరిగ్గా మూడేళ్ళు పడుతుంది.

13

"సాంబా! నా చదువు ఇంకొక నెలలో అయిపోతుంది. మూటా ముల్లే సర్దేసి వచ్చేస్తున్నా. అక్కడ ఏదైనా హాస్పిటల్లో చేరి పోతాను. జీతం ఎంత ఇచ్చినా సరే. ఒక్కదాన్నీ ఉండటం ఇంక నా వల్ల కాదు. పళ్ళ బిగువున ఇన్నేళ్ళూ భరించాను ఒంటరి తనాన్ని. మనసులో మాట చెప్పుకోవడానికి కూడా ఎవరూ లేక ఎంత అల్లాడి పోయానో తెలుసా? ఇక నీ చదువు కూడా అయి, హౌస్సర్జన్సీ కొచ్చావు కనుక మన సంగతి ఆలోచించు. నీ వేణి." కృష్ణవేణి ఉత్తరం చదివి ఆలోచనలో పడ్డాడు సాంబడు. నిజమే..వియో గానికి, విరహానికి తెర దించాలి.

హౌస్ సర్జెన్సీలో స్టైఫండ్ ఇస్తారు. ఒక్కరి కైనా, ఇద్దరికైనా ఖర్చులో పెద్ద తేడా ఉండదు. ఇప్పుడున్న గదిలోనే ఉండచ్చు. ఇంటి వాళ్ళు, క్రిష్టియన్స్. చాలా మంచివాళ్ళు. ఐదేళ్ళుగా అదే గదిలో ఉంటున్నాడు. ఆ మధ్యన వంట చేసుకోడానికో గట్టు, అటాచ్డ్ బాత్ రూమ్ కూడా కట్టించారు.. రేపే ఒక మాట చెప్పి.

"డాక్టర్! ఒక కొత్తరకం సర్జరీ అవుతుందిప్పుడు. థియేటర్ లోకి వస్తారా? పది నిముషాల్లో డ్రెస్ మార్చుకుని, చేతులు వాష్ చేసుకుని వచ్చెయ్యండి." అసిస్టెంట్ సర్జన్ మాటలు వింటూనే..ఆలోచన లోంచి బైట పడి పరుగెత్తాడు సాంబడు.

"అట్టా అడగాలా డాక్టర్ బాబూ! మీరు ఎక్కడా ఉన్న జాడే ఉండదు.. మీ ఆవిడని తప్పక తీసుకొచ్చెయ్యండి. మీ ఇద్దరికీ చక్కగా సరి పోతుంది ఇల్లు. ఇంకా కావాలంటే ఆనుకుని ఉన్న ఒక గది కూడ ఇస్తాం. మా బాబు ఎట్టాగా అమెరికా యెల్లి పోయాడు. రెండేళ్ళ వరకూ రాడు." సాంబడు ఇంటి ఓనర్, మేరీ అంది.

కృష్ణవేణి ఉత్తరానికి జవాబివ్వకుండా తన ప్రయత్నాలు మొదలు పెట్టాడు సాంబడు.

డాక్టర్ సులోచనకి చెప్పాడు ముందుగా.

"నేనేమంటాను సాంబా! అసలు ఇన్నాళ్ళూ దంపతులని విడివిడిగా ఉంచడం ఏం బాగా లేదు. అప్పుడప్పుడు అనుకుంటూ ఉంటాను.. వేణిని, గుంటూరు లోనే నర్సింగ్ కాలేజ్లో చేరిపించాల్సిందేమో అని. మీరు ఇద్దరూకూడా చాలా పట్టుదలతో ఉన్నారు. చదువుల్లో ఒక స్టేజ్ దాటారు. కొంత సంపాదనకి చేరుకున్నారు. ఇంక ఆపై మెట్లంటావా.. ఇద్దరూ కలిసే ఎక్కచ్చు.హాయిగా కాపురం పెట్టుకోండి. ఇంక ఏ సంకోచాలూ వద్దు." సులోచన వెంటనే స్పందించింది.

ఇంక వెంకమ్మ.. చుట్టూ పిల్లల్లతో ఆవిడకి ఎప్పుడూ ఒంటరితనం బాధించే ప్రశ్నే లేదు. అందరు పిల్లలూ ఆవిడకి మాలిమే! నాంచారి ఐతే వీలున్నప్పుడల్లా వెంకమ్మ వెనుకే ఉంటుంది. నాగరాజు ఆరోక్లాసుకొచ్చాడు. ఇప్పుడు వాడికి తల్లిదండ్రుల గురించి.. తమ గురించి బాగా తెలుసు.

"ఇంతకన్న ఆనందమేందిరా సాంబా!నా దగ్గర పది వేలున్నయ్యి. ఇక్కడ నాకు ఖర్చులేం లేవు. అవి ఇస్తా.. మీ సంసారానికి కావలసినవి కొనుక్కోండి." అమ్మ ఆప్యాయతకి కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి సాంబడికి. త్వరలో ఆవిడని తీసుకెళ్ళి జాగ్రత్తగా చూసుకోవాలి. ఎంత కష్టపడింది తమ కోసం..

"అమ్మా!" ఎదకి హత్తుకుని అట్లా ఉండిపోయాడు కొంచెం సేపు. తల్లి ప్రేమకి సాటి ఏదన్నా ఉందా సృష్టిలో!

ఆరోజు శరీరం,మనసు కూడదీసుకుని, అమ్మ కనుక డాక్టరమ్మ దగ్గరికి వెళ్ళక పోతే.. తమ బతుకులు ఎట్లా ఉండేవో! ఊహించడనికి కూడా భయం వేస్తుంది. ఏరోజు చేపల డబ్బులు ఆరోజు తిండికి సరిపోతాయా లేదా అని.. దినదిన గండం.. సన్నగా వణికాడు.

"వెర్రి నాగన్నా! ఏందిరా? నీకు డాక్టరయ్యే రాత ఉంటే ఇంకో విధంగా వచ్చేది అవకాశం. ఏ తల్లైనా నేను చేసినట్లే చేస్తుంది. రేపు నీకు పిల్లలు పుడితే.. వాళ్ళు తప్ప ఎవరూ కనిపించరు.. నేను కూడా.." నవ్వింది వెంకమ్మ.

"పోమ్మా!" బుగ్గలెర్రబడ్డాయి సాంబడికి.. అంతటి ఆజాను బాహుడికీ.

ఆరేళ్ళలో చాలా మారారు సాంబడూ, కృష్ణవేణీ కూడా.

సాంబడికి.. తనకి అవసరమైనంతే తినడం, ఏ అలవాట్లూ లేకపోవడంతో చక్కని శరీర సౌష్ఠవం వచ్చింది. పైగా ఎక్కడికెళ్ళినా నడిచే వెళ్తాడు. పది కిలో మీటర్ల వరకూ ఢోకా లేదు. విజ్ఞానం పెరగడంతో హుందాతనం అబ్బింది. పరిశీలనా శక్తి ఎప్పుడూ ఎక్కువే అతడికి. డాక్టరయ్యాక చుట్టు ప్రక్కల వారి మనస్తత్వాల పరిశీలన మరింత ఎక్కువయింది.

చాలా కొద్ది మంది స్నేహితులు సాంబడికి. వాళ్ళలో ప్రసాద్ ముఖ్యుడు. ప్రతీ సబ్జెక్ట్కీ అతని సహాయం ఉండేది. ప్రసాద్, యమ్మెస్ చెయ్యడానికి మణిపాల్ వెళ్ళి పోయాక, కొన్నాళ్ళు ఎడారిలో ఉన్నట్లు అనిపించింది. ఎప్పుడైనా ఉత్తరాల ద్వారానే యోగక్షేమాలు తెలిసేది. ఫోన్లు చెయ్యడానికి డబ్బులు కావాలి కదా! ప్రసాద్ కి సమస్య లేక పోయినా, అతని చేత కూడా పెట్టించడం ఇష్టం ఉండదు సాంబడికి.. ఇంటి వాళ్ళింట్లో ఫోన్ ఉన్నా కూడా.

వయసుతో పాటు, శరీరం రంగు కూడా చామన చాయకి మారింది.. పడవల మీద సముద్రంలో విహారం లేక పోవడం వలన. ఎప్పుడూ లేతరంగు బట్టల్లో చూడగానే ఆకర్షణీయంగా ఉంటాడు.

వెంకమ్మ అతని నడుం దగ్గరికి వచ్చింది. బరువు పనులూ అవీ లేకపోవడం వల్ల అంత ముదిమి గా కనిపించడం లేదు. హాస్టల్లో మెడికల్ కేర్ బాగా ఉంటుంది. ప్రతీ వారం డాక్టర్ సులోచన, సుచాకర్ వచ్చి చూస్తారు. అవసరమైన మందులు, విటమిన్లు ఇస్తారు. దాంతో ఆరోగ్యం బాగుండి.. కళకళ్ళాడుతోంది.

నుదుటి మీద చిన్నగా సింధూరం బొట్టు పెడుతుంది. చూడగానే పవిత్ర భావం కలుగుతుంది.

"కొంచెం పెద్దిల్లు తీసుకున్నాక, నువ్వు నా దగ్గరికి వచ్చెయ్యాలమ్మా! కాదన కూడదు. ఇప్పుడే తీసుకెళ్ళి పోదును.. కానీ ఒకటే గది. అందుకే ఆలోచిస్తున్నా. మనం సెటిల్ అయ్యాక, నాగరాజుని, నాంచారిని కూడా తీసుకెళ్ళి పోదాం."

"మీ కోసం ఎవరో వచ్చారమ్మా! అర్జంట్గా రమ్మంటున్నారు." ఆయా వచ్చి చెప్పింది, పెట్టిలో బట్టలు సర్దు కుంటున్న కృష్ణవేణికి.

మూడేళ్ళలో ఎవరూ తన కోసం రాలేదు. సహాధ్యాయులందరితో అవసరం అయినంత వరకే స్నేహంగా ఉంటుంది. ఊర్లో ఎవరూ లేరు.. ఊర్నించి ఎవరూ రారు.

"నిజంగా నాకోసమేనా? ఎవరికో చెప్పబోయి.."

"భలే దానివమ్మా! ఇక్కడ ప్రతీ ఒక్కరి పేరు నాకు తెలుసు. మీ పేరు, ఊరు కూడా చెప్పేరు ఆ బాబు."

"బాబా! మగతనా.." మరింత షాక్. తన కాలేజ్లో మగవాళ్ళే ఉండరు. చూస్తే పోలా.. పెట్టి మూసేసి లేచింది.

బైట తోటలో, రెండు చేతులు పాంట్ జేబుల్లో పెట్టుకుని, అటూ ఇటూ పచార్లు చేస్తూ.. ఎవరు.. ఓహ్! గుండె దడదడ లాడుతుండగా రివ్వున పరుగెత్తి అడుగు దూరంలో ఆగి పోయింది.

"సాంబా! నిజమేనా.. నువ్వేనా? గాట్టిగా గిల్లు." చెయ్యి చాపింది.

సాంబడు పకపకా నవ్వుతూ చెయ్యి అందుకుని పెదవుల కానించుకున్నాడు.

చుట్టూ చూసింది కృష్ణవేణి. అక్కడా అక్కడా ఎవరో తిరుగుతూనే ఉన్నారు. లాభం లేదు, వేషా లేస్తే ఎవరో మోసేస్తారు. ఇక్కడికొచ్చి, ఇట్లా ఏడిపించడం ఏవన్నా బాగుందా? నలుగురికీ వినిపించకుండా గట్టిగా దెబ్బలాడింది. అటువంటి కొట్లాటలు భార్యా భర్తలకే సాధ్యం. కృష్ణవేణి అలుగుతుంటే, సాంబడు నవ్వుతూ వింటున్నాడు.

"అయిందా! ఇప్పుడు నేను మాట్లాడచ్చా?"

"ఊ.." బుంగమూతి పెట్టి, తల పక్కకి తిప్పింది. నిగ్రహించుకోడానికి నానా అవస్థా పడ్డాడు సాంబడు.

వాళ్ళ పెళ్ళయి ఆరేళ్ళవుతోంది. అదేం విచిత్రమో.. అన్నేళ్ళుగా కలగని వింత కోరికలు ఒక్కసారిగా విజృంభిస్తున్నాయి. అంత కాలం కృష్ణవేణికి దూరంగా ఎట్లా ఉండగలిగాడో.. తలచుకుంటేనే ఆశ్చర్యం వేస్తుంది. ఆ గొప్పదనం, తామేమిటో నిరూపించుకోవాలన్న పట్టుదలదే! లేకపోతే ఎన్నిసార్లు ఈ అందాల భరిణని ఎదురుగా పెట్టుకుని, బండలా ఏ స్పందనా లేకుండా ఎట్లా ఉండగలిగాడూ!

కృష్ణవేణి కూడా పట్నవాస ప్రభావమో ఏమో.. చాలా మారింది. నాజూగ్గా.. గట్టిగా నడుస్తే కంది పోతుందేమో అన్నట్లు తయారయింది. అందులో నర్సింగ్ లో శారీరిక శ్రమ ఎక్కువ.. చాలా సేపు నిలబడ్డం.. వార్డుల్లో నడవడం, ప్రతీ క్షణం అప్రమత్తతతో ఉండాలి.

వేర్వేరు ప్రదేశాల నుంచి వచ్చిన రకరకాల మనుషులతో మసలటంతో.. చాలా నెమ్మదిగా, ఎదుటి వారిని ఆకట్టుకునేట్లు మాట్లాడ్డం నేర్చుకుంది. అందులో తన వృత్తిలో కూడా, రోగులకి సాంత్వన కలిగించేలా నడుచు కోవాలి. ఏదైనా శ్రద్ధగా, మనఃస్ఫూర్తిగా చెయ్యడం వెంకమ్మ దగ్గర నుంచే వచ్చింది కృష్ణవేణికి.

అనురాగం అంతా కళ్ళలో నింపుకుని చూస్తుండి పోయాడు సాంబడు.

"మాట్లాడవేం మరీ!" సాంబడి కేసి చూసిన కృష్ణవేణి బుగ్గలు ఎర్రబడ్డాయి.

"ఏయ్.. ఏంటా చూపులూ? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారూ? అక్కడ కూర్చుని మాట్లాడు కుందాం పద." దూరంగా ఉన్న బెంచీ దగ్గరికి నడిచింది. సాంబడు అనుసరించాడు.

చకచకా నడుస్తున్న కృష్ణవేణిని వెనుక నుంచి చూస్తుంటే మళ్ళీ అలజడి మొదలయింది సాంబడిలో. వెడల్పాటి జడ.. చిన్నప్పట్నుంచీ అట్లాగే ఉంది. లయబద్ధంగా పిరుదుల మీద ఊగుతున్న జడని పట్టుకుని తన మెడ చుట్టూ చుట్టుకుంటే..

చేతులు రెండూ కట్టుకుని, గట్టిగా నిశ్చయించేసుకున్నాడు.. ఇంక ఆగటం ఏమాత్రమూ తన వల్ల కాదు. ఎక్కడికైనా ఎత్తుకుపోయి..

నర్సెస్ హాస్టల్ ముందున్న తోట ఒక మాదిరి పెద్దదే. పెద్ద లాన్.. మధ్యలో చిన్న కొలను. లాన్ చుట్టూ పూల మొక్కలు. తోట చుట్టూ వేప, తంగేడు, పున్నాగ, దేవుడు గన్నేరు మొదలయిన పెద్ద చెట్లు. చెట్ల మధ్యలో ఉన్న బెంచీ మీద కూర్చుంది కృష్ణవేణి.

చేతులు కట్టుకుని ఎదురుగా నిల్చుని తదేకంగా చూస్తున్నాడు సాంబడు.

"ఏంటి.. అట్టాగే చూస్తానే ఉంటావా? మరీ యిద్దూరం లాగుందే యవ్వారం.." ఒక్క కసురు కసిరింది కృష్ణవేణి. ఏవో సంకెళ్ళు తెంచుకుని ఆకాశంలో విహరిస్తున్నట్లు అనిపించిది సాంబడికి. చిన్నప్పటి అమాయకత్వం, పరుగెత్తుకుని మళ్ళీ వచ్చినట్లు అనిపించింది.

నవ్వుతూ వెళ్ళి పక్కన కూర్చున్నాడు.

"అట్టా నవ్వమాకయ్యా.." సినిమాలో హీరోయిన్ అన్నట్టుగా అంది మురిపెంగా.

"ఎంత నాజూగ్గా ఉన్నాయీ వేళ్ళు.." కృష్ణవేణి చేతిని, తన రెండు చేతుల మధ్యా అపురూపంగా, సున్నితంగా పట్టుకుని అన్నాడు.

"కృష్ణవేణీ! నువ్వా?" గట్టిగా.. బరబర లాడుతున్న గొంతు, కొంచెం దూరంలోనే..

ఉలిక్కిపడి లేచి నిలుచుంది. ఎదురుగా హాస్టల్ వార్డెన్ కమ్ హెడ్ నర్స్ పారిజాతం, తీక్షణంగా చూస్తూ.

"నువ్వు కూడా ఇటువంటి పనులు చేస్తున్నావా?" నమ్మలేనట్లు చూస్తోంది లాన్ చుట్టూ వాకింగ్ చేస్తున్న పారిజాతం ఆగిపోయి.

"మేడమ్! సారీ.. ముందు మీకు పరిచయం చెయ్యాల్సింది. ఇతను డాక్టర్ సాంబడు, మా మేనత్త కొడుకు. అంతే కాదు నా హజ్బెండ్ కూడా.. గుంటుర్లో హౌస్ సర్జెన్సీ చేస్తున్నాడు. ఇవేళ వెళ్ళి పోతున్నా కదా! నన్ను తీసుకెళ్ళడానికి వచ్చాడు."



KOUMUDI

నమ్మలేనట్లున్నాయి పారిజాతం చూపులు.. ఎట్లా ఈవిడని నమ్మించడం? ఆవిడేదో చేసేస్తుందని కాదు.. అనవసరంగా.. తప్పు చెయ్యకుండా తప్పుడు అభిప్రాయం కలిగించడం ఎందుకని! కృష్ణవేణి నిస్సహాయంగా చూసింది సాంబడిని.

సాంబడు ఏ మాత్రం తడబడకుండా, పేంట్ జేబులోంచి పర్స్ తీశాడు. పారిజాతం దగ్గరగా వెళ్ళి, తెరిచి చూపించాడు. అందులో కనిపించేట్లున్న రెండు అరల్లో.. ఒక దాంట్లో తమ పెళ్ళి ఫొటో.. ఇద్దరూ దండలతో, కృష్ణవేణి మెడలో మంగళసూత్రం వేళ్ళాడుతూ! ఇంకొక దాంట్లో సాంబడి ఫొటో ఐడి.

పారిజాతం కళ్ళ నిండా నీళ్ళతో చూసింది సాంబడిని.

“సారీ డాక్టర్! కృష్ణవేణి చాలా మంచి అమ్మాయి. ఎప్పుడూ ఎవరితోనూ మాట అనిపించుకోదు. తన నడవడిని ఎవరూ ఎంచలేరు. అందుకే ఆశ్చర్య పోయాను. చాలా సంతోషం. గాడ్ బ్లెస్ యు మై చిల్డ్రెన్.” చేత్తో గాల్లో క్రాస్ చేసి, ఆ చేతిని పెదవులకానించి వెళ్ళిపోయింది.

“ఎంత తెలివైనవాడివి సాంబా! థాంక్యు.” బెంచీ మీద సాంబడిని ఆనుకుని కూర్చుంది.

“మరి.. కృష్ణవేణమ్మ మొగుడ్నా ఇంకేమన్నానా!” నడుం చుట్టూ చెయ్యేసి అన్నాడు కొంటెగా.

“ఇన్నాళ్ళూ ఈ చిలిపితనం ఎక్కడికెళ్ళిందటా?”

“ఇదిగో ఈ కార్డ్ సంపాదించడానికి వెళ్ళింది.” ఇంకా తెరచే ఉన్న తన పర్సోలో ఐడి చూపించాడు.

**సామాన్లన్నీ** ఆటోలో ఎక్కించి నిలుచున్నాడు సాంబడు. పది నిముషాలయింది. కృష్ణవేణి జాడ లేదు. చుట్టు పక్కలంతా పరిశీలిస్తున్నాడు. సంధ్యా సమయం.. ఇక్కడి డ్యూటీ అయిపోయింది, మరి నా ఇంకొక అర్ధ భాగానికి కూడా నీ స్నేహం కావాలి అంటూ భూదేవి నెమ్మదిగా కదులుతోంది. పన్నెండుగంటలు నాకు కన్నుల విందు కలిగించి వెళ్ళిపోతావా అంటూ కినుకతో ఎర్రగా, పెద్దగా అయి, తన కెంజాయ కిరణాలని నలుదిశలా వ్యాపింపజేశాడు ఆదిత్యుడు.

ఆ కిరణాలలో మెరుస్తున్న చెట్ల అందాలని ఆనందంగా పరికిస్తున్నాడు సాంబడు.. కృష్ణవేణి ఆలశ్యం చేస్తోందని కొంచెంకూడా అసహనంగా లేదు. సహజంగానే నెమ్మదస్తుడు.. జీవితంలో ఎదుర్కున్న ఆటుపోట్లు, కష్టాలు మరింత సహనశీలిగా మార్చాయి.

అటువంటి గుణం ఉన్నవాళ్ళు ఏ వృత్తిలోనైనా రాణిస్తారు. అందరి అభిమానాన్నీ చూరగొంటారు.

“సారీ సాంబా! అందరికీ వీడ్కోలు చెప్పి వచ్చే సరికి కాస్త..” కృష్ణవేణి పరుగెత్తుతున్నట్లుగా నడుస్తూ వచ్చింది. ఫరవాలేదులే అన్నట్లు నవ్వాడు.

కృష్ణవేణి వెనుక పెద్ద కలకలం. మొత్తం హస్టల్ అమ్మాయిలంతా అక్కడే ఉన్నారు. అంత తొందరగా వెళ్ళిపోతున్నది కృష్ణవేణి ఒక్కతే. మిగిలిన వాళ్ళు సిటీ లోనే అన్ని హాస్పిటల్స్ లో ప్రయత్నిద్దామని అనుకుంటున్నారు. ఒకమ్మాయి రెండు దండలు తీసుకొచ్చింది, తోటలోని పువ్వులతో కట్టినవే!

వార్డెన్ పారిజాతం సాంబడిని పిలిచి కృష్ణవేణి పక్కన నిల్చోబెట్టింది. ఇద్దరి చేతా దండలు మార్పించింది. ఆవరణ అంతా చప్పట్లతో మారు మోగిపోయింది. తమ జీవితాలు కూడా త్వరగా స్థిరపడితే బాగుండునని దేవుడిని ప్రార్ధించుకుంటున్నారు కొందరు.

“హేండ్‌సమ్ కపుల్ కదూ!” ఎవరో గట్టిగానే అన్నారు. మళ్ళీ చప్పట్లు.

“ఇటెక్కడికి సాంబా? మనం రైల్వే స్టేషన్‌కి కదా వెళ్ళాలిసింది? నీకు దారి తెలుసా? తిన్నగా వెళ్ళాలి.” కృష్ణవేణి గాభరాగా అంది

ఆటో మోజమ్‌జాహీ మార్కెట్ దగ్గర ఎడం పక్కకి తిరుగుతుంటే.

చిరునవ్వు నవ్వాడు సాంబడు.

"ప్రతీ దానికీ ఏంటా నవ్వు? భూమి తల్లకిందులయినా అట్టా నవ్వుతానే ఉంటావా?"

"భూమి గుండ్రంగా ఉంటుందే మొద్దమ్మాయ్! తలక్రిందులవటం ఏంటీ?" ఆటో అబ్బాయికి ముందే అడ్రస్ కాగితం ఇచ్చాడేమో.. అతను నిర్వికారంగా పోనిస్తున్నాడు.

"అయ్యోరామా! ఈయన దేనికీ చలించడు.. ఆటో అబ్బాయ్! కుడి వేపుకి తిప్పు." నెత్తి కొట్టుకుంది.

అందరికీ ధృఢ చిత్తం ఉన్నట్లుగా కనిపించే మనుషులు స్వంత వాళ్ళకి మాత్రం, నిమ్మకి నీరెత్తినట్లుగా కనిపిస్తారు. కృష్ణవేణి కూడా, సాంబడి నిశ్చలత్వం చూసి చిరచిర లాడిపోతోంది.

"నేనున్నా కదా! నిశ్చింతగా ఉండు పిల్లా!"

కృష్ణవేణి మారు మాట్లాడకుండా కళ్ళు మూసుకుని ఒక చేత్తో ఆటో కడ్డీ, ఇంకొక చేత్తో సాంబడి చెయ్యి పట్టుక్కూర్చుంది. ఊరుకోలేక కొంచె సేపయ్యాక కళ్ళు తెరిస్తే, ఆటో నిమ్స్ హాస్పిటల్ దాటి వెళ్తోంది. ఇంక గాభరా పడ్డం మానేసి, కుతూలంగా చూస్తోంది, ఎటెళ్తున్నామా అని.

శ్రీనగర్ కాలనీ రోడ్డు తిరిగి, అక్కడ ఎడం వైపునున్న ఒక సందులో పెద్ద భవనం దగ్గర ఆగింది ఆటో. గేటు దగ్గర గూర్ఖా సాంబడిని చూస్తూనే సెల్యూట్ చేసి, గేటు బార్లా తెరిచాడు. విశాలమైన పోర్టికో దగ్గర మెట్ల మీద కూర్చున్న యాభై ఏళ్ళావిడ ఎదురొచ్చి, సామాన్లు దించడంలో సాయ పడింది.

ఆటో పంపించేసిన సాంబడు, సామాన్లు లోపలికి తీసుకెళ్ళి, హాల్లో ఒక పక్కగా ఉన్న గదిలో పెట్టించి, బయటికి వచ్చాడు. కృష్ణవేణి మెట్ల దగ్గరే నిలుచుండి పోయింది, సంభ్రమంగా చూస్తూ!

"దా వేణీ! మా ఫ్రెండ్ ప్రసాద్ తెలుసు కదా! అతనిదే ఈ గెస్ట్ హౌస్. నిన్ను తీసుకు రావడానికి వెళ్తున్నానని చెప్పగానే ఇక్కడ రెండ్రోజులుండి గుంటూరు వెళ్ళండని ఈ ఏర్పాట్లు చేశాడు. నేను ఇదే కదా మొదటి సారి రావడం.. హైద్రాబాద్ అంతా రేపెల్లుండి చూద్దాం. నువ్వు కూడా అన్నీ చూళ్ళేదనుకుంటా! నేను తెల్లారుఝామునే వచ్చి, ఇక్కడ నా సామాన్లు పెట్టేసి, భోంచేసి అటొచ్చాను. అదీ సంగతి." చేతిలో చెయ్యేసి, గట్టిగా పట్టుకుని లోపలికి తీసుకెళ్ళాడు. గుమ్మం దగ్గరకెళ్ళగానే, సామాన్లు లోపల పెట్టించినామె పళ్ళెంలో హారతి తీసుకొచ్చి, ఇద్దరికీ కలిపి తిప్పింది.

"అబ్బాయి, ప్రసాద్ చెప్పాడమ్మా! నా పేరు శాంత. అబ్బాయిని నేనే పెంచాను. బాగా అలవాటు.

కృష్ణవేణి ఇంక ఆశ్చర్య పడటం మానేసింది. సాంబడు అన్నీ ప్లాన్ చేసుకునే వచ్చాడని తెలిసి పోయింది. ఏది చేసినా అంతే.. ఒక స్పష్టత, ఒక నిబద్ధత కనిపిస్తుంటాయి.

తమ సామాన్లు పెట్టిన గదిలోకి తీసుకెళ్ళి అంతా చూపించాడు సాంబడు.

"పొద్దుటి నుంచీ సామాన్లు సర్ది, అందరికీ టాటాలు చెప్పీ అలిసి పోయుంటావు. స్నానం చేసిరా. అక్కడే షాంపూ, సబ్బు.. అన్నీ ఉన్నాయి. తరువాత నేను చేస్తా." హాల్లోకి వెళ్ళి టివి ఆన్ చేశాడు.

పాత హిందీ పాటలు వస్తున్నాయి. హాయిగా, మధురంగా. అలా వింటూ సోఫాలో కునుకు తియ్యడం మొదలు పెట్టాడు. కృష్ణవేణి, చేతి మీద తట్టి లేపింది.

"సాంబా! లే.. ఆకలేస్తోంది."

సాంబడు కళ్ళు నులుముకుంటూ లేచాడు.

"అబ్బా! అరగంట పడుక్కున్నానా.. మంచి నిద్ర పట్టేసింది. సరిగ్గా పది నిముషాల్లో వచ్చేస్తా."

కృష్ణవేణి బారెడు జుట్టునీ, ఫాన్ కింద ఆర బెట్టుకుంటోంది, ఫాన్ కింద నిలుచుని. లేత నీలం ఆర్గండీ చీర మీద తెల్లని లక్నో ఎంబ్రాయిడరీ చేసిన చీర, ఎగ్జిబిషన్ లో కొన్నది కట్టుకుంది. దాని మీద అదే నీలం రంగు చికెన్ జాకెట్. మెడలో సన్నని మంగళ సూత్రాల గొలుసు పల్చని విద్యుత్ దీప కాంతిలో మెరుస్తోంది. ఆ మెరుపులో, నున్నని మెడ నిగనిగ లాడుతూ..

స్నానం చేసి, తెల్లని పైజామా లాల్చీ వేసుకుని, తడి జుట్టుని వెనక్కి దువ్వి బాత్రూం లోంచి వచ్చాడు సాంబడు. వస్తూనే.. అలా చూస్తూ నిలబడి పోయాడు.

నీలాల మబ్బుల మధ్యలో తొంగి చూస్తున్న పున్నమి చంద్రుడిలా ఉంది కృష్ణవేణి మొహం. విశాలమైన కళ్ళని సన్నగా ఐ లైనర్ తో దిద్దింది, మరింత విశాలమయ్యేట్లు. నుదుటి మీద నిలువు బొట్టు..

మెల్లిగా, దగ్గరగా వచ్చి వెనుకగా నిల్చుని, పట్టుకుచ్చులా పరుచుకున్న జుట్టుని వాసన చూస్తూ ఉండి పోయాడు సాంబడు. రెండు చేతులతో, జుట్టు ఒక పక్కగా లాగి, వేణిని తన వైపుకి తిప్పుకున్నాడు. అదే మొదటి సారి చూస్తున్నట్లుగా.. తనివి తీరా, కళ్ళలోకి చూస్తున్నాడు. కృష్ణవేణి కాసేపు తను కూడా తీసి పోకుండా చూసి, రెప్పలు వాల్చేసింది. మొహం దగ్గరగా తీసుకురాబోయాడు.

తలుపు మీద టక్.. టక్..

నిట్టూర్చి, వెళ్ళి తలుపు తీశాడు సాంబడు.

"బాబూ! భోజనం.. తొమ్మిదవుతోంది. మీరు తినేస్తే, నేను వంటిల్లంతా సర్ది వెళ్ళిపోవాలి. మళ్ళీ పొద్దున్నే వస్తా. తోటలోనే వెనుక పక్క ఉంది నా క్వార్టర్." శాంతమ్మ.. ఒక పక్కగా నిలబడింది.

బల్ల మీది ఆధరువులు చూడగానే పరుగెత్తుకుంటూ వచ్చింది ఆకలి.

ఆలు ఫ్రై, చిక్కుడు కాయ కూర, వెల్లుల్లి పాయ పప్పులుసు, గడ్డ పెరుగు. వేడి వేడి అన్నం తెల్లని పళ్ళాల్లో వడ్డించింది శాంతమ్మ. కరగ బెట్టిన నెయ్యి కమ్మని వాసన వేస్తోంది. గడ్డ పెరుగు.. కమ్మగా!

తృప్తిగా భోంచేసి, లేవబోయారు.

"బాబూ! మిమ్మల్ని మేడమీదున్న గదిలో పడుకోమన్నాడు ప్రసాద్. నేను పావుగంటలో వెళ్ళి పోతా.. వీధి తలుపేసుకుని వెళ్ళండి."

అలాగే అన్నట్లు తలూపి, హాల్లో టివి చూస్తూ కూర్చున్నారు సాంబడు, వేణి దంపతులు.

ప్రసాద్ వాళ్ళ గెస్ట్ హౌస్ మరీ పెద్దదీ కాదు, చిన్నదీ కాదు. మేడమీద మూడు గదులు, కింత ఒక గది, పెద్ద హాలు, కిచెన్. హాలు తక్కువ ఫర్నిచర్‌తో, గోడలకి అలంకరించిన ఆహ్లాదమయిన చిత్రాలతో.. లోపలికి వెళ్ళగానే హాయిగా అనిపిస్తుంది. శాంతమ్మ పెట్టిన రుచికరమైన భోజనం మరింత హాయి కలిగిస్తోంది. కాళ్ళు జాపుకుని విశ్రాంతిగా కూర్చున్నారు. కనురెప్పలు బరువెక్కి పోయి, నిద్ర వస్తా వస్తాననంటోంది.

"బాబూ!.. నే వెళ్తున్నా. తలుపేసుకోండి. మేడ మీద కుడి వైపున్న గది. అందులో మీకు అవసరమైనవి అన్నీ పెట్టాను. ఇంకా ఏమైనా కావాలంటే వంటిల్లు తీసే ఉంది. ఫ్రిజ్‌లో అన్నీ ఉన్నాయి."

శాంతమ్మ వెళ్ళగానే తలుపేసి మేడ మీదికి దారి తీశాడు సాంబడు. వెనుకే నెమ్మదిగా నడిచింది కృష్ణవేణి, తల కొద్దిగా వాల్చి..

ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న సమయమే అయినా, ఏదో తెలియని బిడియం..

గుమ్మం దగ్గరే ఆగాడు సాంబడు, వేణి వచ్చే వరకూ!

తెర తొలగించి లోపలికి అడుగు పెడుతూనే కళ్ళు విప్పార్చి నిలబడి పోయారు ఇద్దరూ.

లేత నీలం కాంతిలో.. పందిరి ఉన్న డబల్ కాట్ మంచాన్ని సన్న జాజి మాలలతో అలంకరించారు. ఒక పక్కగా ఉన్న డెకొలామ్ బల్ల మీద, ఫ్లాస్కు, పళ్ళు ఉన్నాయి. రెండు గాజు కప్పుల్లో పాయసం, మీద గాజు మూతలు .. ఇదేమీ ఊహించలేదు సాంబడు కూడా. అంతలో.. బల్ల మీదున్న ఫోన్ మోగింది.

తటపటాయిస్తూ ఎత్తాడు. “హలో డాక్టర్! హాపీ ఫస్ట్ నైట్..” ప్రసాద్ గొంతు మంద్రంగా! సాంబడు స్పందించే లోపే ఫోన్ పెట్టేశాడు.

14

“వెల్ కమ్.. మన పాలస్‌కి” సాంబడు కృష్ణవేణిని, నగరంపాలెంలో తన గదికి ఆహ్వానించాడు.

ఇంటి ఓనర్ మేరీ ఎదురొచ్చి లోపలికి తీసుకెళ్ళింది. పాతకాలం డాబా ఇల్లు. ముందు పెంకులతో వేసిన పంచ. పంచ వెనుక పెద్ద హాలు. దానికి ఒక పక్కగా ఉన్న గదే సాంబడిది. ఆ గది వెనుక సామాన్ల గది. మేరీ ఆ సామాన్ల గది ఖాళీ చేయించి సాంబడికి ఇచ్చింది. హాలుకీ, సాంబడి గదికీ విడివిడిగా గుమ్మాలున్నాయి. రెండు గుమ్మాలకీ అమ్మాయి నమస్కారం పెడుతున్నట్లుగా క్రాస్ స్టిచ్ డిజైన్ కుట్టిన తెల్లని తెరలు.

పంచలో ముందు రెండు స్తంభాలు. రెండింటికీ బఠాణీ పూల తీగలు వేళ్ళాడుతున్నాయి, నిండా పూలతో. నాపరాళ్ళ వరండా అయినా.. ఏళ్ళ తరబడి పామి పామి కడగడంతో రాళ్ళు నున్నగా అయి, పాలిష్ రాళ్ళ లాగనే ఉన్నాయి. నాలుగు పేము కుర్చీలు, టీ పాయ్, దాని మీద మడత పెట్టిన పేపరు.

సాంబడి గదిలో కొత్తగా కొన్న ఇనుప మంచం, దాని మీద మెత్తని పరుపు. సరికొత్త దుప్పటి వేసుంది. రెండు దిళ్ళు. దిళ్ళ కవరు మీద కూడా కుట్టిన డిజైన్లు. ఒక గోడకి అల్మారా. ఇంకొక పక్క గోడకి ఒక బల్ల, రెండు కుర్చీలు. కిటికీకి కూడా కర్టెన్.. చాలా శుభ్రంగా ఉంది గది. వెనుక కొత్తగా తీసుకున్న గదిని వంటిల్లుగా మార్చింది మేరీ.

ఇంటి మొత్తానికి కొత్తగా రంగులు వేసినట్లున్నారు. ఇంకా పెయింట్ వాసన పోలేదు.

కృష్ణవేణికి గదిలోకి అడుగు పెట్టగానే హాయిగా, చల్లగా అనిపించింది. ఒళ్ళు పులకరించింది. ఇది తమ ఇల్లు. ఎప్పటి నుంచో కలలు కంటున్న ఇల్లు. మంచం మీద కూర్చుని గదంతా చూసి గట్టిగా ఊపిరి పీల్చి అడిగింది,

“ఇదంతా నిజమేనా?”

“అవునురా! ఇది మనిల్లు. ఇక నుంచీ మనం కలిసే ఉంటాం. నువ్వు ఒంటరివి కాదు. కష్ట సుఖాల్లో మనిద్దరం ఒకటి. వంటిల్లు చూశావా?” లోపలికి తీసుకెళ్ళాడు సాంబడు. వంటిల్లు చిన్నదైనా తీరుగా సర్ది ఉంది. నాలుగో సంవత్సరంలో ఉండగానే, ఒక క్లినిక్‌లో పార్ట్ టైమ్ గా ఫ్రంట్ డస్క్ దగర పని చెయ్యడం మొదలుపెట్టాడు.. రోజుకి రెండు గంటలు. ఆరునెలలయ్యాక గాస్ స్టౌ కొన్నాడు.

తమ కొత్త సంసారానికి కొన్న కుకర్, స్టీలు గిన్నెలు, పళ్ళాలూ.. అన్నీ తళతళా మెరిసి పోతున్నాయి.

“వీటన్నిటికీ డబ్బు..”

“కొంత నేను దాచింది, కొంత అమ్మ ఇచ్చింది. నాకు తోచినవి తీసుకున్నా. ఇంకేవైనా కావలిస్తే వచ్చే నెల తీసుకుందాం.”

సాంబడు వెనుక తలుపు తెరిచాడు. చల్లని గాలి పలుకరించింది.

దొడ్లో కూడా పంచ ఉంది. పక్కగా, బాత్‌రూం లెట్రిన్ ఉన్నాయి. పంచలో రుబ్బుగుంట, రోలు, రోకలి..

“చాలా బాగుంది సాంబా! ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను. సరుకులన్నీ కూడా తెచ్చి పెట్టేశావా? నిన్ను అర్జంట్‌గా ముద్దు పెట్టేసుకోవాలనిపిస్తోంది.” అనేసి సిగ్గు పడిపోయింది కృష్ణవేణి.

“మరెందుకాలశ్యం..” సాంబడు పెరటి తలుపు వేసి, దగ్గరగా వచ్చి నడుం చుట్టూ చేతులు వేసి, వేణి మొహం పైకెత్తాడు.

“ఛీ.. పో! ఏదో అనేశాను జోష్‌లో..”

“మాట జారితే వెనక్కి తీసుకోలేవమ్మాయ్!” పరిష్వంగంలో బంధించి పెదవులందించాడు.

“ఇవన్నీ ఎప్పుడు చేశావు సాంబా?” మెరుస్తున్న కళ్ళతో అడిగింది వేణి, కొంచెం సేపయ్యాక.

“నీ విరహ వేదన అందగానే రంగం లోకి దిగాను. ఇంక నిన్ను బాధ పెట్ట కూడదనిపించింది. ముందుగా పెద్దవాళ్ళని అడిగాను. ప్రసాద్‌ని కూడా సలహా అడిగాను. అతనే అన్ని ఏర్పాట్లు చేశాడు. ‘ఇక్కడితో ఆపద్దు మీ ప్రస్థానం.. కానీ ఇద్దరూ కల్సి చెయ్యండి’ అని సలహా ఇచ్చాడు. అంతే మన గూడు తయారయి పోయింది. మేరీ ఆంటీ బోలెడు సంతోషించారు, తనకి కంపనీ ఉంటుందని.”

“అంకుల్..”

“కిందటేడే పోయారు. ఆంటీని వాళ్ళబ్బాయి అమెరికా తీసుకెళ్దామని ప్రయత్నం చేస్తున్నాడు. ఆంటీ ఇక్కడి చర్చ్‌లో చాలా యాక్టివ్. చర్చ్ ద్వారా కూడా ట్రై చేస్తున్నారు. మతం వేరని కానీ ఆచారాలన్నీ మనవే. అన్నట్లు ఆంటీకి చేపల పులుసు చాలా ఇష్టం. అందులో నువ్వు ఎక్స్‌పర్ట్ వని చెప్పాను.”

“పాలు తీసుకొస్తా.. ఈ లోగా ఉప్మా చేసేస్తావా వేణీ. నేను అరగంటలో హాస్పిటల్ కి వెళ్ళాలి.” స్నానం చేసొచ్చి అడిగాడు సాంబడు.

“ఉప్మా రెడీ. నువ్వు తినేసి హాస్పిటల్‌కి వెళ్ళిపో. నేను మేరీ ఆంటీతో కలిసి బజారుకెళ్ళి కావలసినవి తెచ్చుకుంటా.” పొద్దున్నే తయారయిపోయి, దుర్గమ్మ ఫొటో దగ్గర అగరొత్తి వెలిగించి, ఉప్మా చేసింది కృష్ణవేణి.

“ఓ.. చాలా ఫాస్ట్ గా ఉన్నావే! కొంచెం ముందుగా వెళ్తే ఛీఫ్ వచ్చేలోపు కొంచెం ప్రిపేర్ అవచ్చు. థాంక్యు. పాలెక్కడివి?” ఉప్మా తినగానే వేడి వేడి పాలు తెచ్చి ఇచ్చిన వేణి జడలాగి అన్నాడు.

“మన్లో మనకి థాంక్స్ వద్దు సాంబా! మనిద్దరం ఒకటే. ఆంటీని అడిగి వాళ్ళ పాల వాడినే వతను పెట్టుకున్నా. చిక్కని గేదె పాలు. పావు నీళ్ళు కలిపితే కూడా ఎంత చిక్కగా ఉన్నాయో చూడు.”

పాలలో నీళ్ళ లాగా సంసారంలో కలిసి పోయిన కృష్ణవేణిని చూస్తూ ఉండి పోయాడు సాంబడు.

“ఏంటి డాక్టర్.. మీ ఛీఫ్..” ఉలిక్కి పడి లేచి, వేణి బుగ్గ మీద ఓ ముద్దిచ్చి షూస్ వేసుకుంటున్నాడు సాంబడు.

“ఏదో ఒక సిల్లీ పని చెయ్యక పోతే తోచదా నీకు?” తెచ్చి పెట్టుకున్న కోపంతో నిష్ఠూరం వేసింది వేణి.

“నా పెళ్ళాం బుగ్గ.. నా ఇష్టం.” బాగ్ అందుకుని తలుపు తీసి మాయమయ్యాడు.

“ఛీ.. సిగ్గు లేదు..” మురిపెంగా బుగ్గ తుడుచుకుంటూ పనిలో పడింది కృష్ణవేణి.

దబదబా తలుపు చప్పుడు.

బద్ధకంగా లేచి, ఆవలిస్తూ తలుపు తీసింది కృష్ణవేణి. చేతికున్న వాచ్ చూసింది. మూడున్నర.

"ఇంత సేపా? రోజూ ఇట్లానే ఉంటుందా?"

"ఇంకా ఆలస్యం అవుతుంది. ఇవేళ తొందరగా అయిపోయింది. రేపు నైట్ డ్యూటీ. వంట చేశావా? ఆకలేస్తోంది." సాంబడు మాట్లాడుతూనే, బట్టలు మార్చుకుని మొహం కాళ్ళు, చేతులు డెట్టాల్ సబ్బుతో కడుక్కుని వచ్చాడు.

బల్ల మీద అప్పటికే రెండు కంచాలు, మూతలు పెట్టిన గిన్నెలు, మంచినీళ్ళ సీసా, గ్లాసులు సర్ది ఉన్నాయి.

"నువ్వు కూడా తినలేదా? ఇంత సేపుండకు రోజూ!" గిన్నెల మీద మూతలు తీసి, కంచాల్లోకి వడ్డించాడు.

"బజారు కెళ్ళొచ్చి, వంట చేసే సరికి, నిద్దరొచ్చేసింది. మంచం మీద వాలి పోయాను. రేపట్నుంచీ ఎక్కడైనా హాస్పిటల్స్‌లో ఖాళీలున్నయేమో వెతికి అప్లై చేస్తాను. కొంచెం అలవాటవాలి. గుంటూరు నాకు కొత్త కదా! ఆంటీ బాగా సహాయంగా ఉన్నారు. ఎంతవరకో అంతే.. అనవసరపు విషయాలకి పోరు. ఆవిడ గది కూడా హాలుకి అటు పక్క ఉంది. అందులోనే టివి. డాక్టర్‌కి డిస్టర్‌బెన్స్ లేకుండా మా బెడ్ రూంలో పెట్టుకున్నామని చెప్పారు." తను కూడా మొహం చన్నీళ్ళతో కడుక్కునొచ్చి కూర్చుంది కృష్ణవేణి.

"నిజమే.. నేను చాలా లక్కీ. ఈ ఊరొస్తూనే మంచి ఇల్లు దొరికింది. దోసకాయ పప్పు చాలా బాగుంది. అచ్చు అమ్మ చేసినట్లే ఉంది. ఎన్నాళ్ళయిందో ఇట్టాంటి వంట తిని. గుత్తొంకాయ ఐతే అద్భుతం. ఇన్నేళ్ళూ హాస్టల్ కదా.. వంట మర్చిపోయుంటా వనుకున్నా."

"వంట చెయ్యటం, ఈత కొట్టటం, సైకిల్ తొక్కడం.. ఇట్లాంటివి మర్చిపోడం ఉండదు సాంబా! సాయంత్రం నువ్వెళ్ళే క్లినిక్‌కి నేను కూడా రానా? ఆ డాక్టర్ గారికి తెలుస్తుందేమో.. ఎక్కడైనా నర్స్ కావాలంటే.." వేణి నిద్రమత్తులోనే అన్నం కలిపి తింటూ అంది.

"ఒక నెల రోజులు ఆగు వేణీ.. ఇన్నేళ్ళు కష్టపడ్డావు. కాస్త విశ్రాంతి తీసుకో! ఆదివారం నాకు ఆఫ్. అమ్మని, పిల్లల్ని చూసొద్దాము. అట్లాగే ఆఫ్ ఉన్నప్పుడు ఈ చుట్టు పక్కల విశేషాలన్నీ చూద్దాం. కనకదుర్గమ్మ గుడికి వెళ్ళాలి. ఆ లోగా నీ రిజల్ట్స్ కూడా వస్తాయి. అందాకా.. చెయ్యాల్సిన డ్యూటీలు చాలా ఉన్నాయి."

"నీతో ఇదో గోల.. అన్నీ డబల్ మీనింగ్ డయలాగ్‌లు."

"మనలో మనకి డబల్ మీనింగ్ లెందుకమ్మాయ్! అన్నీ సింగిల్ మీనింగ్‌లే." సాంబడు కొంటెగా నవ్వుతూ లేచి, పళ్ళాలు, గిన్నెలు అవీ సర్దేస్తున్నాడు.

"ఇప్పటి వరకూ కష్టపడొచ్చావు కదా! నే సర్దుతాలే. నువ్వెళ్ళు."

"అలవాటు అమ్మడూ! మర్చిపోనీకు. పైగా ఇద్దరం చేసుకుంటే త్వరగా అయిపోతుంది.. త్వరగా ముగించేసుకుని వేరే పన్లు చేసుకోవచ్చు.."

"అదిగో.. మళ్ళీ.."

"హలో డాక్టర్! హౌ ఆర్ యు.." వరండాలో కూర్చుని పేపర్ చదువుతున్న సాంబడు తలెత్తి చూశాడు సంభ్రమంగా చిర పరిచితమైన గొంతు విని.

"వావ్! అన్నా.. నువ్వే! నిజంగా? ఈ మధ్యన ఎక్కడా కబుర్లే లేకపోతే అలిగావేమో అనుకున్నా. దా.. దా." సాంబడు ఒక్క ఉదుట్న

లేచి ప్రసాద్‌ని గాఢంగా కౌగిలించుకున్నాడు.

"ఏదీ నాకు పరీక్షలు, ప్రాక్టికల్స్.. కేసులు. నువ్వు కూడా చాలా బిజీ కదా! మా మరదలేదీ?"

కొత్త గొంతుక విని బైటికొచ్చింది కృష్ణవేణి. సాంబడు పరిచయం చేశాడు. వంగి కాళ్ళకి దణ్ణం పెట్టింది.

"అయ్యో.. అదేంటమ్మా! నాకు అసలే.."

"మీరే కద అన్నారు మరదలు అని.. మరి ఆగౌరవం ఉండాలి. పైగా మాకు అన్నీ మీరే కదన్నా! ఏమీ అనుకోవద్దు.. నాక్కూడా అన్నా అనే పిలవాలనుంది.." అంటుంటే గొంతు జీర పోయింది.

"అయ్యో అదేంటి తల్లీ! నీకెట్లా అనిపిస్తే అట్లా." ప్రసాద్ దగ్గరగా వచ్చి తల మీద చెయ్యేశాడు.

సాంబడు గాభరాగా వేణిని చూశాడు.

"ఏం లేదు.. అచ్చు మా అన్న లాగుంటేనూ!" కళ్ళలో నీళ్లతో నవ్వేసింది వేణి. నిజమే అనుకున్నాడు సాంబడు. అప్పటి వరకూ గమనించనేలేదు.. ఒడ్డూ పొడుగూ అంతా పెద్దయ్య కొడుకు రాజా లానే ఉన్నాడు ప్రసాద్. ఎవర్నైనా ఏ దృష్టితో చూస్తే అట్లాగే కనిపిస్తారు.

"లోపలికి దా అన్నా! ఇంక మీ హాస్పిటల్ నీ చేతుల్లోకి తీసుకోవడమే మిగిలినట్లుంది కదూ!" హాల్లోకి దారి తీశాడు.

"ఇదేంటి.. ఇటు పక్కకి.." లోపలికి వస్తూ ఆశ్చర్యంగా అడిగాడు ప్రసాద్.

"మేరీ ఆంటీ అమెరికా వెళ్ళింది. మమ్మల్ని ఈ హాలు కూడా వాడుకోమంది. ఆవిడ సోఫాలు, కుర్చీలు అన్నీ అట్లాగే ఉన్నాయి. మా కిచెన్ లోంచి ఇందులోకి దారి కూడా ఉంది." సాంబడు తెర తీసుకుని వంటింట్లోకి వెళ్ళాడు.

హాలు చాలా పెద్దది. మేరీ చాలా కళాత్మకంగా పెడుతుంది. అన్ని వస్తువుల మీదా ఆవిడ చేతి నాజూకు పనితనం కనిపిస్తుంది, రకరకాల డిజైన్లున్న ఎంబ్రాయిడరీల రూపంలో.  గుమ్మం ఎదురుగా జీసస్ బొమ్మ.. కరుణతో చూస్తూ.

పెద్ద ట్రేలో మురుకుల ప్లేటు, రెండు గాజు గ్లాసుల్లో మంచినీళ్ళు పట్టుకుని వచ్చాడు సాంబడు.

ప్రసాద్ సోఫాలో కూర్చుని మంచినీళ్ళ గ్లాసు అందుకున్నాడు.

అంతలో కృష్ణవేణి, రెండు కప్పుల్లో కాఫీ తీసుకొచ్చింది.

"అదేంటి మన డాక్టర్ కాఫీ.. టీ తాగని మంచి బాలుడు కదా!"

"డాక్టర్ తాగడన్నా! ఇది నాకు. హైద్రాబాద్‌లో అలవాటయింది. మురుకులు తీసుకోండి. నేనే చేశాను. ఇవేళ మీరు ఇక్కడ భోజనం చెయ్యాలిసిందే!" కృష్ణవేణి కప్పు తీసుకుంటూ అంది.

"నేను కాఫీ తాగేసి, మురుకులు తింటా. ఏమీ అనుకోరు కదూ?" ప్రసాద్ కాఫీ వాసన ఆస్వాదిస్తూ తాగాడు. "చాలా బాగుందమ్మా! మా శాంతమ్మ చేసినట్లే ఉంది."

కృష్ణవేణికి, శాంతమ్మ, ఆవిడ ఆదరణ గుర్తుకొచ్చాయి. నిజమే.. ఆవిడే నేర్పించింది కాఫీ పెట్టడం. అక్కడున్న రెండు రోజులూ మరపురాని మధుర స్మృతులు. తామిద్దరూ కల్సి చెయ్యీ చెయ్యీ కలుపుకుని, గోల్కొండ కోట ఎక్కడం ఎట్లా మర్చి పోగలదు? సాలార్‌జంగ్ మ్యూజియమ్ లోని అపురూప చిత్రాలు, శిల్పాలు.. ఒకటా రెండా.. ఎన్నెన్నో! ఇద్దరినీ దగ్గర చేసిన జ్ఞాపకాలు.. బుగ్గలెర్రబడుతుంటే, ఖాళీ కప్పు వంకతో లేచి వంటింట్లో కొచ్చి పడింది.

సాధ్యమయినంత వరకూ శాంతమ్మ తమని వంటరిగా వదిలేసింది. అనవసరపు కబుర్లు పెట్టుకోలేదు. సాంబడి చిలిపి పనులకి అడ్డు లేకుండా చల్లగా జారుకునేది. ఒక అమ్మని తీసుకు పోయినందుకు పశ్చాత్తాప పడి దేవుడు, ఇటువంటి అమ్మలని ఇచ్చాడేమో తనకి!



KOUMUDI

ఇటువంటి స్నేహితుడు దొరకడం నిజంగా అదృష్టం. మర్చే పోయింది.. ఈ సారి బయటికెళ్ళినప్పుడు, పబ్లిక్ బూత్ నుంచి శాంతమ్మతో, అత్తతో, డాక్టరమ్మతో మాట్లాడాలి.. ఇవేళే!

మొహం కడుక్కుని, కాస్త పౌడరద్దుకుని హాల్లోకి వెళ్ళింది.

మురుకులు తినడం మానేసి కబుర్లలో పడ్డారు స్నేహితులు. సాంబడికి తెలిసిన ప్రసాద్ క్లాస్‌మేట్స్ ఏం చేస్తున్నారో పేరు పేరునా చెప్పుకున్నారు.

"నా యమ్మెస్ అయిపోయింది. సూపర్ స్పెషాలిటీ చెయ్యాలా వద్దా అని చూస్తున్నా. నాన్నగారు పెద్దవారై పోతున్నారు. వచ్చేసి హాస్పిటల్, బిజినెస్ పనులు చూద్దామా అని.. ఏ సంగతీ నిర్ణయించుకోలేక పోతున్నా. ఈ లోగా కొత్త సమస్య వచ్చింది.."

భృకుటి ముడిచి చూశాడు సాంబడు. ప్రసాద్‌కి సమస్యా! చటుక్కున గుర్తుకొచ్చింది. అతనికి ఇంకా పెళ్ళి కాలేదు. ఇరవైఎనిమిదేళ్ళొచ్చాయి. సులోచనమ్మ అడుగుతే యమ్మెస్ అయిపోనియ్యండన్నాడు.

"అమ్మాయా?" సంశయిస్తూ అడిగాడు.

అవునన్నట్లు తలూపాడు ప్రసాద్.

"ఇంత మంచి విషయం అంత లేట్‌గా నెమ్మదిగా చెప్తారేంటన్నా? పెళ్ళి హడావుడి అంతా నాదే! రండి వంటింట్లో కూర్చుని మాట్లాడు కుందాం. నేను వంట చేస్తుంటా.." కృష్ణవేణి ఆనందంగా లేచింది.

"కొంత ప్రాబ్లమ్ ఉంది అందుకే.." నసిగాడు ప్రసాద్.

"ఆ ప్రాబ్లమ్స్ మనం సాల్వ్ చేద్దాం లెండి. రండి.." కృష్ణవేణిని ఇద్దరూ అనుసరించారు.

వంటిల్లు మరీ చిన్నది కాదు.. వెనుక పంచలోకి తలుపు తెరుస్తే బోలెడు గాలి, వెలుతురు. గాలి తగలని చోట గాస్ పొయ్యుంది. ఒక పక్కగా చిన్న ఇనుప బల్ల, రెండు కుర్చీలు ఉన్నాయి. బల్ల మీద కూరలు, చాకు, కటింగ్ బోర్డ్ ఉన్నాయి.

"కూర్చోండన్నా. మీరొచ్చే ముందే ఇవన్నీ తీసి పెట్టా. ఈ రోజు ఫలారం వద్దన్నారు మీ ఫ్రెండు. పెందరకళే భోంచేసి లైబ్రరీకి వెళ్తాన్నారు. కుర్చీలు కొంచెం సదుపాయంగా ఉండవేమో.."

వంటిల్లు చాలా శుభ్రంగా ఉంచుకుంది కృష్ణవేణి.

"ఎట్లా ఉన్నా సర్దుకుంటామమ్మా! డాక్టర్లం.. ఏడెనిమిది గంటలు నిలబడుతుండాలి.. సర్జరీకి. నీకు తెలియందేముంది. ఎక్కడో అక్కడ, కూర్చోగలుగుతే.. అంత కంటేనా?" ప్రసాద్ కూర్చుని, చాకందుకున్నాడు.

"అదేం నీవల్ల కాదు గానీ, నేను తరుగుతుంటా.. నీ సమస్య చెపుతుండన్నా." సాంబడు చాకు లాక్కుని, బెండకాయలు ముందుకి జరుపుకున్నాడు.

ప్రసాద్ పర్స్ లోంచి ఫొటో తీసి బల్ల మీద పెట్టాడు. "తను కూడా డాక్టరే.."

"చాలా బాగుందన్నా! ఇంకేంటీ.. నీకు నచ్చిందంటే మనసులు కలిసే ఉంటాయి కదా. వివరాలు చెప్పు మరీ.." సాంబడు ఉత్సాహంగా అన్నాడు.

"అవును.. ఐశ్వర్యా రాయ్ లాగుంది." కృష్ణవేణి సంబర పడిపోయింది.

"ఇంకేంటన్నా.. నాన్నగారికి అభ్యంతరం ఏముంటుంది? అమ్మాయి డాక్టర్. చక్కగా ఉంది.."

"మణిపాల్ లో నాకంటే ఒకేడాది జూనియర్. పీడియాట్రిక్స్ చేస్తోంది. తను చేరిన రోజే అనుకోకుండా పరిచయం అయింది..

కారిడార్లో ఇద్దరమే నడుస్తుంటే. అప్పటి నుంచీ రెండు సంవత్సరాలు రోజూ కలవడం.. కబుర్లు. ఇద్దరివీ అన్ని అభిప్రాయాలూ కలిశాయని అనను.. కానీ ఒకరినొకరు గౌరవించుకునే సంస్కారం ఉంది. ఇక్కడికి వచ్చే ముందే నా అభిప్రాయం చెప్పాను. తనకి కూడా ఇష్టమే."

"మరేంటన్నా ప్రాబ్లమ్? ఇద్దరూ జోడీ చక్కగా ఉన్నారు."

"వాళ్ళు చాలా బీదవాళ్ళు. తండ్రి టీ ఎస్టేట్‌లో గుమాస్తా. ఎవరో దాతలు చదివిస్తున్నారు. మణిపాల్ లో ఫీజులు చాలా ఎక్కువే.. కానీ ఈ అమ్మాయి, మంగళ, చాలా మెరిటోరియస్. అందుకని తక్కువ ఫీజ్ తో చేర్చుకుంది మానేజ్‌మెంట్. నీకు తెలుసు కదా.. మా పరిస్థితి. మా వాళ్ళలో కట్నాలు కోట్లలో ఉంటాయి. నాన్నగారితో చెప్పాలంటేనే భయం వేస్తుంది. ఎదిరించి చేసుకుని, ఈ వయసులో నాన్నగారిని బాధ పెట్టడం ఇష్టం లేదు."

"సులోచనమ్మ సహాయం తీసుకుంటే.."

"అవును సాంబా! అందుకే నీ దగ్గరికి వచ్చాను. నువ్వే ఆంటీకి చెప్పాలి. నాకు మొహమాటంగా ఉంది. నాన్నగారికి అసలే హార్ట్ ప్రాబ్లమ్ కదా! జాగ్రత్తగా డీల్ చెయ్యాలి. సంబంధాలు వస్తున్నాయి.. చదువైపోయింది కదా అని గొడవ ఇంట్లో." ప్రసాద్ మాటలు వింటుంటే కృష్ణవేణికి నవ్వొచ్చింది. ఇప్పుడు పిల్లలు మా గర్ల్ ఫ్రెండ్ అని పేరెంట్స్ కి పరిచయం చేస్తుంటే ఈ బాబు చాలా అమాయకుడిలా ఉన్నాడు. ప్రసాద్ మాటల్లో పడి, కృష్ణవేణి పొయ్యి కేసి తిరిగి వంటలో మునిగిపోడం వల్ల ఎవరూ గమనించ లేదు.

సాంబడికి అర్ధమయింది. ప్రసాద్ వాళ్ళ బంధువర్గంలో ఎవరూ ప్రేమ పెళ్ళిళ్ళు చేసుకోరు. కోట్లాది ఆస్థులు చేతులు మారుతుంటాయి. చౌదరిగారు ఒప్పుకోకపోతే ఎట్లా? ఒకసారి వద్దంటే అంతే.. తండ్రినో, ఆ అమ్మాయినో ఎవర్నో ఒకరిని వదులు కోవలసిందే.

"సరే అన్నా! ఇవేళే సులోచనమ్మని కలుద్దాం. కృష్ణవేణీ భోజనాలయ్యాక, అంతా సర్దేసి తయారవు. నేను మా ఛీఫ్ ని పర్మిషన్ అడిగి వస్తా ఈ లోగా.

"వదినమ్మ గురించి చెప్పన్నా!"

ప్రసాద్ తనే కారు డ్రైవ్ చేస్తున్నాడు.

"తనకి తెలుగు రాదు.. అదొక్కటే ప్రాబ్లం. నాన్నగారితో ఫరవాలేదు కానీ చుట్టాలతో ఎట్లాగ అని.. మనిషి ఎంత నాజూకో.. మనసు అంత ధృఢం. అనుకున్నది సాధించే వరకూ వదలదు. మీ ఇద్దరి లాగనే!" పక్కకి తిరిగి చిరునవ్వు నవ్వాడు.. సిగ్గు పడుతున్న సాంబడిని చూస్తూ.

"అది చాల మంచి గుణం కదన్నా. అందుకే మేమీరోజు ఇట్లున్నాం. అసలు మీతో పాటుగా తెచ్చెయ్యాలిసింది. వదినని చూస్తే ఎవరైనా వప్పుకుంటారు." కృష్ణవేణి, వెనుక సీట్లోంచి అంది.

"ఎంత సేపమ్మా! మా నాన్నగారు సరే అనాలే కానీ.. ఒక రోజులో ఇక్కడుండదూ?"

సరిగ్గా గంటన్నరలో సులోచన ఇంటి దగ్గరున్నారు. ముందే ఫోన్ చేశారేమో.. ఆవిడ వీళ్ళ కోసం చూస్తోంది.

"అమ్మా!" కృష్ణవేణి పరుగున వెళ్ళి సులోచనని కౌగలించుకుంది. సాంబడు వంగి కాళ్ళకి మొక్కాడు. ప్రసాద్ దగ్గరగా వెళ్ళి హత్తుకున్నాడు.

సులోచనకి తను పెంచిన చిన్ని మొక్కలే వృక్షాలయినప్పుడు కలిగే ఆనందం కలిగింది. గర్వంగా చూసింది ముగ్గురినీ.

"వెంకటలక్ష్మికి ఫోన్ చేద్దాం. మీ ప్రోగ్రామ్ ఏమిటో తెలియదు కదా.. అందుకే రమ్మనలేదు. రండి లొపలికెళ్దాం."

ఆలోచిస్తు ఉండి పోయింది సులోచన. ఆవిడ చేతిలో మంగళ ఫొటో.

“ఆంటీ! మాట్లాడరేం?” ఆతృతగా అడిగాడు ప్రసాద్.

సులోచన మాట్లాడకుండా లేచి వెళ్ళి ప్రసాద్ నుదుటిని చుంబించింది. ప్రసాద్ మొహం లోకి వెంటనే వెలుగొచ్చింది.

“చూడ చక్కని పిల్ల. చౌదరిగారు వద్దనరు. ఆయనకి డబ్బు మీద వ్యామోహం లేదు. మనుషులంతా ఒక్కటే.. అవకాశం రావడం అనేది ఛాన్స్ అని అంటుంటారు. నేను ఫోన్ చేస్తాను. వెంటనే వెళ్ళి నాన్నగారిని కలిసి చెప్పు. సాంబడిని, కృష్ణవేణిని కూడా తీసుకెళ్ళు. మీరెళ్ళే లోపుగా నేను ఫోన్ చేసి విషయం చెప్తాను.”

వంటమ్మాయి తెచ్చిన టీలు తాగి అత్యంత ఉత్సాహంగా బయలు దేరారు ముగ్గురూ.

దారిలో హాస్టల్ దగ్గర ఆగి, వెంకమ్మనీ, పిల్లల్నీ పలకరించి వెళ్ళారు.

“మీ ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటి డాక్టర్?”

కృష్ణవేణి చటుక్కున ముందుకు వంగింది. సాంబడికైతే ప్రసాద్ పిలుపు అలవాటే.. కృష్ణవేణికి కొత్తగా ఉంది.

“అట్లా ఎందుకు పిలుస్తారన్నా? మీరంతా డాక్టర్లే కద.”

“అన్న పిలిచిన మొదటి పిలుపు అది. ఏదైనా సీరియస్ గా మాట్లాడాలనుకున్నపుడు అట్లా పిలుస్తాడు. అందులో చిన్నబుచ్చడం ఏమీ లేదు.” సాంబడి మాటలకి ప్రసాద్ నవ్వి, అతని భుజం తట్టాడు.

“చాలా సింపుల్ అన్నా! నేను ఒక సంవత్సరం సీరియస్‌గా పిజి ఎంట్రెన్స్‌కి తయారవుదా మనుకుంటున్నా. వేణి ఎక్కడైనా హాస్పిటల్‌లో ఉద్యోగం లో చేరుతుంది. మొదటి సారి సీట్ రాకపోతే, సగం రోజు ఎక్కడైనా జాబ్ చేస్తూ మళ్ళీ చదువుతాను. మూడు సార్లు అయ్యాక.. అప్పుడు ఆలోచిస్తాం. గవర్నమెంట్ కోటా లోనే రావాలి కదా. ప్రైవేట్ గా చదవలేను.”

అవునన్నట్లు తలూపాడు ప్రసాద్.

“చూద్దాం.. ఎక్కడైనా తెలిసున్న వాళ్ళ నర్సింగ్‌హోమ్ లో. గుంటూరైతేనే నయం.. నీకు మంచి లైబ్రరీ ఉంది. దొరుకుతుందిలే. మంచి ఇన్స్టిట్యూట్‌లో చదివింది కదా!” ప్రసాద్ వాళ్ళింటి పోర్టికోలో కారు ఆపి, దిగాడు. వెనుకే సాంబడు, కృష్ణవేణి.

చౌదరిగారు హాల్లో కూర్చుని ఉన్నారు. ముఖంలో ఏ భావమూ కనిపించడం లేదు. ఫోన్ ఒళ్ళో ఉంది.

## 15

ప్రసాద్ భయంగా ఇంట్లోకి అడుగు పెట్టాడు.

“రండి బాబూ! రామ్మా.. కూర్చోండి. కులాసానా? చాలా రోజులయింది.. అన్నీ సర్దుకున్నారా, పిజి ఎంట్రెన్స్‌కి ప్రిపేర్ అవుతున్నావా?”

సాంబడు, కృష్ణవేణి ఒకర్నొకరు చూసుకున్నారు. హార్ట్ ఆపరేషన్ అప్పుడు ఒక్కసారే ఆయన్ని కలిశాడు సాంబడు. కృష్ణవేణి అయితే ఆయన్ని చూడనే లేదు. ఓరగా ప్రసాద్‌ని చూశాడు.. ప్రసాద్ పెదవి విరిచాడు.. నేనేం చెప్పలేదు, నాకు తెలీదన్నట్లు.

చౌదరిగారి దగ్గరగా వెళ్ళి, పాదాలనంటి పక్కనున్న సోఫాల మీద కూర్చున్నారిద్దరూ.

“బాగున్నారా డాక్టర్‌బాబూ! అమ్మాయ్.. ఇల్లు అదీ సదుపాయంగా ఉందా?” శాంతమ్మ లోపలి నుంచి వచ్చింది, మంచినీళ్ళ గ్లాసులు తీసుకుని.



KOUMUDI

చౌదరిగారి ఒళ్ళో ఫోన్‌ని, శాంతమ్మని చూసి జరిగింది ఊహించాడు సాంబడు.

"బాగున్నాం సార్!" తమ భవిష్యత్ ప్రణాళికని చెప్పాడు సాంబడు.

కాసేపు నిశ్శబ్దం..

ప్రసాద్‌కి అసహనంగా ఉంది.. చిరచిర లాడుతోంది. తనని పలకరించడం మాట పక్కన పెడితే, మొహం కూడా చూడట్లేదు. అక్కడ్నుంచి వెళ్ళిపోదామా అనుకున్నాడు ఒక క్షణం. కానీ వివేకం మేలుకొంది. ఆయనకి ఇష్టం లేదన్నమాట. అట్లాంటప్పుడు ఏం చెయ్యాలో అనుకునే వచ్చాడు. ఇంక సమస్యేముంది.. పెళ్ళి మాటే ఎత్తడు. కానీ.. కళ్ళ ముందు మంగళ మెదిలింది, బిడియంగా చూస్తూ.

ఏదో చేసెయ్యాలి.. రెండంగల్లో తండ్రి పక్కన కూర్చుని, గట్టిగా కౌగలించుకుని భోరుమన్నాడు. చిన్నప్పుడు, తనక్కావలసినది దొరక్కపోతే అట్లాగే చేసేవాడు. చౌదరిగారు, ఏదో జరుగుతుందని ఊహించారు. అలిగి వెళ్ళిపోవడమో, పోట్లాడడమో.. కానీ ఇది మాత్రం కాదు. పిల్లలు ఎంత ఎదిగినా తల్లిదండ్రుల ముందు చంటి పిల్లలే! ఆర్ద్రమైపోయింది ఆయన మనసు.

సాంబడు, కృష్ణవేణీ బిత్తరబోయి చూస్తున్నారు.

"ఏంట్రా ఇదీ! నాకు కోపం వస్తుందనీ, వచ్చిందనీ తెలుసు నీకు.. కానీ ఎందుకు వచ్చిందో తెలుసా?" ప్రసాద్‌ని విడిపించుకుని, మంచినీళ్ళ గ్లాసు తీసుకుని, నీళ్ళతో మొహం తుడిచి, ట్రేలో ఉన్న నాప్కిన్‌తో తుడిచారు.

ప్రసాద్ గట్టిగా ఊపిరి పీల్చి వదిలి తలూపాడు.

"మీకు చెప్పకుండా అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయికి డబ్బు లేదు. తెలుసు నాన్నగారూ!"

"హు.. అందుకే నాక్కోపం వచ్చింది. ఇరవై ఏడేళ్ళు, ఒంటరిగా.. అమ్మా, నాన్నా అయి పెంచిన తండ్రిని ఇంతేనా అర్థం చేసుకున్నది? ఇన్నేళ్ళ దగ్గరితనంలోనూ నీకు స్నేహితుడిని కాలేక పోయినందుకు బాధగా ఉంది. ప్రేమ అనేది, తల్లిదండ్రుల పర్మిషన్ తీసుకున్నాక పుట్టదు. ఆ సంగతి నాకు తెలుసు. నా స్వభావాన్ని నువ్వు తెలుసుకోలేదు. అందుకే నేను.." మాట్లాడలేక పోయారు చౌదరిగారు.

ప్రసాద్‌కి ఏమనాలో తెలియలేదు. నిజమే.. ముందే తండ్రి దగ్గరికి రావలసింది. ఎందుకంత భయపడ్డాడు.. తమ దగ్గరున్న ఆస్థి అంతస్థుల వల్లనా? కాదని తెలుసు ప్రసాద్‌కి. మరి? తండ్రి ఒక్కసారి కూడా ఎవరికీ దానధర్మాలు చెయ్యగా చూడలేదు. ఎవరూ, ఫలానా చౌదరిగారు మాకు ఇది చేశారు, మమ్మల్ని ఆదుకున్నారు అని చెప్పగా వినలేదు. అందుకే.. డబ్బు మనిషేమోనని అనుకున్నాడు. కానీ తన దగ్గరకొచ్చేసరికి పుత్రప్రేమ గెలుస్తుందని ఊహించలేదు.

"సారీ నాన్నగారూ! మిమ్మల్ని ఇంతలా హర్ట్ చేశాను."

"నాదే తప్పులే. నేనేం చేస్తున్నానో నీక్కూడా తెలియనివ్వలేదు. ఒకసారి ఈ ఫైల్ చూడు. అందులో అన్ని వివరాలూ ఉన్నాయి. ఇది నేనే స్వయంగా చూసుకుంటుంటాను. నీ స్నేహితుల్ని పైకి తీసుకెళ్ళు. అమ్మాయిని, వాళ్ల వాళ్ళని పిలిపించు. మాట్లాడదాం." చౌదరిగారు తన గదిలోకి వెళ్ళి పోయారు.

మిగిలిన ముగ్గురూ నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"తీసుకోండి బాబూ!"

శాంతమ్మ తెచ్చిచ్చిన పానీయాలు తాగాక, సాంబడిని, కృష్ణవేణిని మేడ మీదికి తీసుకెళ్ళాడు ప్రసాద్. కార్లో సామాన్లు, లోపల పెట్టించమని, పని కుర్రాడితో చెప్పి.

ప్రసాద్ గది, సంపన్నుల ఏకైక వారసుడి గది లాగానే ఉంది. రెండు భాగాలు.. ముందరి భాగంలో సోఫాలు, టివి వంటి

పరికరాలు. వెనుక భాగంలో పెద్ద మంచం, వార్డ్‌రోబ్‌లు. సాంబడిని, కృష్ణవేణిని సోఫాల్లో కూర్చోమని తను పది నిముషాలు లోపలికెళ్ళొచ్చాడు.

"మీ సామాన్లు పక్క గదిలో పెట్టించాను. వెళ్ళి, కాసేపు పడుకోండి. బాగా అలిసిపోయారు. ఒక గంటయ్యాక, ఇక్కడే కలుద్దాం. మంగళని రమ్మని ఫోన్ చేశాను. బెంగుళూరులో మా ఆఫీస్ వాళ్ళు అరేంజ్ చేస్తారు. రేపు పొద్దున్నకి వచ్చేస్తుంది. నువ్వు రేపు పర్మిషన్ అడిగావు కదా సాంబా?"

"అది కాదు ప్రసాద్! మేమెందుకిక్కడ.. బస్సెక్కి.."

"మిమ్మల్ని తీసుకొచ్చిందే ఇక్కడ మీరిద్దరూ ఉండాలని. మంగళకి తోడుగా వేణి ఉంటుంది. మీకభ్యంతరం లేకపోతేనే.."

"అన్నా! ఇంకేం చెప్పద్దు. గంటయాక వస్తాం. లేదా నువ్వు పిలు.. ఎప్పుడు పిలిచినా వచ్చేస్తాం. నీ వెంటే మేం." కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే, ప్రసాద్ చెయ్యి పట్టుకుని, గట్టిగా ఊపి తలుపు తీసుకుని బైటికొచ్చాడు సాంబడు. కృష్ణవేణి కూడా నమస్కారం పెట్టి సాంబడి వెనుకే వెళ్ళింది.

ప్రసాద్ సోఫాలో కూర్చుని ఫైల్ తెరిచాడు.

ఫైల్ చదువుతున్నంత సేపూ ప్రసాద్ కళ్ళు తుడుచుకుంటూనే ఉన్నాడు. తన ఆదాయంలో నాలుగవ వంతు దాన ధర్మాలకి ఉపయోగిస్తున్నారు చౌదరిగారు. తన ఊరు, తన జిల్లా, రాష్ట్రం.. దేశం.. ఎల్లలు లేనే లేవు. అయితే.. అన్నీ యన్‌జిఓ సంస్థల ద్వారా. రోటరీ క్లబ్ ద్వారా ఇతర దేశాల్లోకి కూడా వ్యాపించింది ఆయన ఆపన్న హస్తం.

తండ్రి మహోన్నత వ్యక్తిత్వం ముందు తానెంత అనిపించింది ప్రసాద్‌కి.

సంస్థల ద్వారా కాకుండా కొన్ని వ్యక్తిగతంగా కూడా చేసినవి ఉన్నాయి.. వేరే ఫోల్డర్‌లో! తనకి బాగా తెలిసిన స్నేహితుల ద్వారా ఆ సహాయాలని అందించారు, ఎవరికీ తెలియ నియ్యద్దని మాట తీసుకుని.. వారి అభివృద్ధిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ

అవి చదువుతుంటే ప్రసాద్ కళ్ళు పెద్దవయ్యాయి, నమ్మ లేనట్లు. కుడి చేత్తో చేసే దానం ఎడం చేతికి తెలియకూడదన్న సూక్తిని అక్షరాలా పాటించారాయన.

పూర్తిగా చదివి, సోఫాలో వెనక్కి జారగిలబడి, కళ్ళు మూసుకుని ఉండిపోయాడు. అలాగే నిద్ర లోకి జారుకున్నాడు.

అతి సున్నితంగా తలుపు మీద టకటక శబ్దం.. ఉలిక్కి పడి కళ్ళు తెరిచాడు ప్రసాద్. గడియారం ఎనిమిది గంటలు చూపిస్తోంది. తలుపు తీశాడు.

"బానే ఉన్నావు కదా! భయం వేసింది, ఎప్పటికీ రాక పోతుంటే. అందుకే.."

"సారీ సాంబా! నిద్ర పట్టేసింది. ఐదు నిముషాల్లో వస్తా. కింద డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చోండి. ఆకలేస్తోందా?"

**రెండేసి మెట్ల** చొప్పున దిగుతూ, కిందికి వెళ్ళే సరికి, చౌదరిగారు భోంచేస్తూ కనిపించారు. సాంబడు, కృష్ణవేణీ ఎదురుగా కుర్చీల్లో కూర్చుని తమ గురించి చెప్తున్నారు. శ్రద్ధగా వింటూ.. కావలసినవి వడ్డించుని తింటున్నారు చౌదరి గారు.

"నాన్నగారూ! మంగళ రేపు పొద్దున్న వస్తోంది. తన పేరెంట్స్ కి చెప్పింది. వాళ్ళు కొంచెం భయ పడుతున్నారంతే. అంతకు మించి ఏ ప్రాబ్లం లేదు." తండ్రి పక్కనున్న కుర్చీలో కూర్చుని, బోర్లించి ఉన్న పళ్ళెం తిరగేశాడు.

"సాంబా! మొదలు పెట్టండి.. ప్లీజ్. ఆలశ్యం అయిపోయింది కదూ! పొద్దున్నెప్పుడో తిన్నదే."


KOUMUDI

శాంతమ్మ వచ్చి, పళ్ళాల పక్కనే ఉన్న చిన్న గిన్నెల్లో, కూర, పప్పు, చారు వేసింది. అన్నం వడ్డించుకుని నెమ్మదిగా కబుర్లు చెప్పుకుంటూ తిన్నారందరూ.

భోజనం అయ్యాక, కప్పుల్లో పాయసం తీసుకొచ్చింది శాంతమ్మ.

"పెళ్ళి ఏ విధంగా చేసుకోవాలనుకుంటున్నావు?" చౌదరిగారు అడుగుతుంటే తెల్ల మొహం వేశాడు ప్రసాద్.

"నాన్నగారూ! మీరు అమ్మాయిని చూడకుండా.."

"సరే.. నేను వద్దంటే మానేస్తావా?"

"అంటే.. మీరు ఒకే సారి పెళ్ళనే సరికి కొంచెం గాభరా వేసింది. అందుకే."

సాంబడు, వేణీలు నవ్వుతూ చూస్తున్నారు.

"సరే.. అమ్మాయి వచ్చాక మాట్లాడదాం. నాకు మీటింగ్ ఉంది.. ఒక సారి క్లబ్‌కెళ్ళొస్తా. మీరేం మొహమాట పడకండి సాంబా! మీ ఇల్లే అనుకోండి. కావలసినవి అడగండి. శాంతమ్మ చూస్తుంది."

చౌదరిగారు చెప్పులేసుకుని బయటికి వెళ్ళిపోయారు.

"మనం కృష్ణ ఒడ్డుకి, బారేజ్ దగ్గరికి వెళ్దామా? ఇదివరకు చూశారా?" ప్రసాద్ అడిగాడు.

"ఐదు నిముషాలో వచ్చేస్తాం. రెండు సార్లు దుర్గమ్మ గుడికెళ్ళాం కానీ. కృష్ణ ఒడ్డూ, ప్రకాశం బారజీ అదీ చూడలేదు."

జన సందోహం.. విజయవాడ ప్రజలందరూ అక్కడే ఉన్నట్లు అనిపించింది.

అయినా సరే! క్రిష్ణమ్మని చూస్తుంటే ఏదో ఆనందం. ప్రసాద్, బారేజ్ దాటి, దూరంగా ఖాళీగా ఉన్న ప్రదేశానికి తీసుకెళ్ళాడు. పట్టణం అంతా విద్యుద్దీపాల కాంతిలో మెరిసి పోతోంది. కొండ మీద దుర్గమ్మ గుడి.

చల్లని గాలి సేద తీరుస్తుంటే, హాయిగా ఉంది. అక్కడ ఒక బండ మీద కూర్చున్నారు.

కృష్ణవేణికి చాలా ఉత్సాహంగా ఉంది. కలలో నైనా ఊహించని ఇంతటి అదృష్టాన్ని ప్రసాదించిన దుర్గమ్మకి మనసులోనే నమస్కరించింది. ఇదే కృష్ణమ్మ.. పాలెంలో. కానీ ఎంత తేడా! ఏదైనా స్థానాన్ని బట్టే ఉంటుంది ప్రాముఖ్యత, ప్రాధాన్యత.

"ఏమిటాలోచిస్తున్నావు వేణీ?" నుదిటి మీద చెల్లా చెదురుగా పడుతున్న ముంగురులను వెనక్కి తోసుకుంటూ నవ్వింది కృష్ణవేణి. అప్పుడే విచ్చుకున్న కలువ పువ్వులా ఉంది.

"ఏం లేదన్నా! ఎక్కడ పుట్టి ఎక్కడికెళ్తోందీ కృష్ణమ్మ. ఈ పయనాన్ని ఎవరు నిర్దేశించారు? ఎక్కడెక్కడ ఏ భూముల్ని సస్యశ్యామలం చేస్తోందీ.. ఎక్కడ ఉరుకులు వేసుకుంటూ భీతిని కలిగిస్తోందీ.. అంత విచిత్రంగా ఉంది. మన జీవితాల్లాగే. లేకపోతే మేమేంటి.. మీతోటి ఈ అనుబంధమేంటి. ఈ ప్రేముడి ఎట్లా కలిసిందీ?"

"ప్రేముడి అంటే.."

"ప్రేమ ప్లస్ స్నేహం. క్లుప్తంగా స్నేహం అనుకోవచ్చు. ఆ స్నేహం ఎవరి మధ్యనేనా అవచ్చు.. అన్నా చెల్లెలు, తల్లిదండ్రులు పిల్లలు, భార్యాభర్తలు, స్నేహితులు.. ఏ బంధం అయినా స్నేహం అనే పునాది లేకపోతే నిలవదు. అదే ప్రేమబంధం. ప్రకృతి అంతా నిండిన విశ్వప్రేమ."

ఆసక్తిగా వింటున్న స్నేహితులిద్దరూ చప్పట్లు కొట్టారు. సిగ్గుపడిపోయింది కృష్ణవేణి.

"ఇంత విజ్ఞానం ఎప్పుడు సంపాదించావు వేణీ?" ఆశ్చర్యంగా అడిగాడు సాంబడు.



KOUMUDI

"మా హాస్టల్‌కి దగ్గర్లోనే స్టేట్ లైబ్రరీ ఉంది. అక్కడ మెంబర్షిప్ తీసుకున్నాను. అప్పుడప్పుడు పుస్తకాలు తెచ్చుకుని చదివేదాన్ని. నా రూమ్మేట్‌కి సాహిత్యం మీద చాలా అభిరుచి. అదే నాకు కొంచెం అంటించింది."

"వెరీ ఇంట్రెస్టింగ్. నేను కూడా తెలుగు పుస్తకాలు చదవడం మొదలు పెట్టాలి. ఇప్పటి వరకూ ఇంగ్లీష్‌వే తప్ప తెలుగు జోలికి పోలేదు."

"చాలా గొప్ప సంపద అన్నా! పోగొట్టుకోవద్దు." కృష్ణవేణి మాటలు ఇద్దరు వైద్యులనీ ఆలోచింపజేశాయి. ఆ ప్రభావం వారి మీద చివరి వరకూ నిలిచి పోతుంది.

❦❦❦

మంగుళూరు దగ్గర, ఒక టీ ఎస్టేట్‌లో, చిన్న క్వార్టర్ ముందర నిరాడంబరంగా జరిగి పోయింది, ప్రసాద్, మంగళల వివాహం. మంగళ తల్లీతండ్రీ విమల, నరసప్పలు చాలా ఆనందంగా జరిపించారు.

చౌదరిగారు నరసప్ప చెప్పిన మాటకి తలూపేశారు.. పెళ్ళి వాళ్ళింటి దగ్గరే జరగాలని. మంగళే దుబాసీగా పని చేసింది. అతనికి తుళు భాష తప్ప ఇంకేమీ రాదు.

చౌదరిగారు, పెళ్ళికొడుకు, శాంతమ్మ, సాంబడు, కృష్ణవేణి.. అంతే మగ పెళ్ళివారు. "ఆడపిల్ల ఇంట్లోనే పెళ్ళి చెయ్యడం సాంప్రదాయం.. అది వారి స్థితిని బట్టే చెయ్యనియ్యాలి. వారికి వారి అమ్మాయి పెళ్ళి చేశామన్న ఆనందం దక్కనియ్యాలి." అదే చౌదరిగారు అన్నది.

విజయవాడ వచ్చి, వియ్యంకుడి ఇల్లు వాకిలీ చూసిన నరసప్ప మరింత భయపడ్డాడు. కానీ.. చౌదరిగారి నిరాడంబరత్వం, స్నేహశీలత చూసి ఆకాశమే హద్దుగా ఆనందించాడు. అతని అమాయకమైన నవ్వు మొహం చూసి, చౌదరిగారికి కూడా అంతే ఆనందం కలిగింది. ఇంక మంగళలో అందం సౌశీల్యం పోటీ పడుతున్నాయి. చల్లని సంసారంలోకి కావలసిన లక్షణాలన్నీ మంగళలో కనిపించాయి.

సరదాగా, చలోక్తులతో ప్రయాణం చేసి ప్రకృతి ఒడిలో సేద తీరుతూ, ఏ మాత్రం హడావుడి లేకుండా జరిగింది ప్రసాద్ పెళ్ళి. ఉన్న కొద్దిమందీ మనసారా మాట్లాడుకోవడానికి వీలయింది. భాష రాదన్న బాధే లేదు.. మనసులు కలిస్తే మాటలతో పని లేదని తెలిసిపోయింది. సైగలతో, హావభావాలతో, నవ్వులతో.. మంద్రంగా చెవుల కింపుగా వినిపిస్తున్న సంగీతంతో.. ఓహ్!

"ఇటువంటి పెళ్ళి మనోళ్ళలో ఎక్కడా అయుండదు." చౌదరిగారు, పెద్దగా నవ్వుతూ అన్నారు.

"మీరు ఇంత హాయిగా, ఎటువంటి సంకోచం లేకుండా నవ్వడం ఇప్పుడే చూస్తున్నా నాన్నగారూ!" ప్రసాద్ వెలిగి పోతున్న మొహంతో అన్నాడు.

"అదే పరిసరాల ప్రభావం. ఇక్కడ మనల్ని గమనించే వాళ్ళెవరూ లేరు.. కొండలు కోనలు తప్ప. మనవెవరో ఎవరికీ తెలియదు.. సాటి మనుషులమనే తప్ప. ఇంతకంటే ఏంకావాలి.. హిపోక్రసీ తొలగడానికి."

మంగళ చటుక్కున వచ్చి మామగారి కాళ్ళకి మొక్కింది.. చెంపల మీదుగా కన్నీళ్ళు..

"ఏమిటిది తల్లీ!" భుజాలు పట్టుకుని దగ్గరగా తీసుకుని అడిగారు చౌదరిగారు, రుమాలుతో కోడలి చెంపలు తుడుస్తూ.

"అయామ్ సో లక్కీ పప్పా! భేషజాల్లేని సహజమైన వాతావరణంలో మీ ఇంట్లో కోడలిగా అడుగు పెట్టడం.. ఇంత కంటే ఏం కావాలి, ఏ ఆడపిల్లకైనా?"

కృష్ణవేణి క్కూడా కన్నీళ్ళు ఆగలేదు. తను కూడా లక్కీనే.. ఇటువంటి ఉదాత్తులతో స్నేహబంధం కలవడం ఒక వరం. అందరికీ

లభ్యమయ్యేది కాదు.

చక్కని ఉడిపి వంటకాలతో విందు భోజనం.. చౌదరిగారికి ఎంతో నచ్చేసింది. పళ్ళెంలో అరిటాకులు వేసి, చిన్న చిన్న కప్పుల్లో సాంబారు, రసం, మజ్జిగ పులుసు, ఎత్తుకెత్తు కొబ్బరేసిన బీన్స్ కూర, బంగాళా దుంపల వేపుడు.. కొబ్బరన్నం. కొన్నింట్లో మిరియం వాసన, కొన్నింట్లో జీలకర్ర వాసన.. ఆధరువులన్నీ వేరుగా ఉన్నాయి తెలుగు వారికి. చివరగా భక్ష్యాలు.. నోట్లో వేసుకుంటే కరిగిపోయాయి.

"కోడలు నేర్పిస్తుంది.. అప్పుడప్పుడు చేస్తుండాలి శాంతమ్మా!" చౌదరిగారికి భక్ష్యాలు బాగా నచ్చాయి.

విజయవాడలో రిసెప్షన్‌కి మూడు వేలు పైగా వచ్చారు అతిథులు. ఫంక్షన్ మొత్తం సాంబడి చేతుల మీదుగా జరిగింది. టౌన్నుంచి, వెంకమ్మ, నాగరాజు, నాంచారీ.. సులోచన వాళ్ళ కారులో వచ్చారు.

అందరికీ బట్టలు కొనుక్కోమని డబ్బిచ్చారు చౌదరిగారు.. కొన్ని రోజుల ముందే.

చౌదరిగారు తల్లిదండ్రులకి ఒక్కడే కొడుకు. దూరపు బంధువులు తప్ప ఎవరూ లేరు. అతని భార్య తమ్ముళ్ళిద్దరూ అమెరికాలో ఉంటారు. అక్క లేక పోవడంతో వాళ్ళు అంతగా బాంధవ్యం పెట్టుకోలేదు. రిసెప్షన్‌కి వచ్చారు కానీ వాళ్ళ షాపింగులతోనే సమయం అంతా గడిపేశారు.

ఎక్కడ చూసినా సాంబడు, కృష్ణవేణిలే..

రిసెప్షన్ అయిన మరునాడు.. అందరూ హాల్లో విశ్రాంతిగా కూర్చున్నారు. మరునాడే మంగళ ప్రయాణం. ప్రసాద్ కూడా మంగుళూరు వెళ్తున్నాడు. నరసప్ప వాళ్ళూ పొద్దున్నే వెళ్ళిపోయారు..

"మేం మధ్యాన్నం బయల్దేరతాం ప్రసాద్! ఇంక మా జాబ్స్ అవీ.. ప్రయత్నాలు చేసుకోవాలి." సాంబడు ప్రసాద్‌తో అన్నాడు.

అప్పుడే తన గదిలోంచి బైటికొచ్చిన చౌదరిగారు ఒక స్లిప్ ఇచ్చారు.

"కుగ్లర్ హాస్పిటల్‌లో నర్స్ కావాలిట. జీతం బాగానే ఇస్తారు.. పని బాగా నేర్చుకోవచ్చు. ఈ చీటీ తీసుకుని వెళ్ళి, అక్కడ ఎడ్మినిస్ట్రేషన్ వాళ్ళని కలవండి."

సంభ్రమంగా చూస్తూ చీటీ అందుకున్నాడు సాంబడు. అంత బిజీగా ఉంటూ కూడా చిన్న చిన్న విషయాలు ఎంత బాగా గుర్తు పెట్టుకుంటారు.. ఎప్పుడో.. మొదటి సారి ఇంటికొచ్చినప్పుడు తాము ఏం చెయ్యాలనుకుంటున్నామో చెప్పాడంతే.. రెండు నెలలు పైన అయింది. కృష్ణవేణి కూడా అదే ఆరాధనతో చూస్తోంది.

"ప్రసాద్! టైమ్ లేదనద్దు.జీవితంలో ఏ సమయంలో ఏది చెయ్యాలో అది చెయ్యాలి. అమ్మాయికి ఇంకా పది రోజులు సెలవుందిట కదా. వెళ్ళి చెప్పేసి, యూరోప్ వెళ్ళి రండి. మన మానేజర్ ఏర్పాట్లు చేస్తాడు. ప్రొఫెషన్, పర్సనల్ లైఫ్‌రెండూ ముఖ్యమే." చౌదరిగారు చెప్పాక, ఇంక ఎవరికీ ప్రశ్నలడిగే అవకాశమే ఉండదు. అదొక ఆర్డినెన్స్.. అంతే!

పంట్ మీద పక్క పక్కనే నిల్చుని, కృష్ణమ్మ విన్యాసాలు చూస్తున్నారు సాంబడు, కృష్ణవేణీ. కొంచెం దూరంలో వెంకమ్మ, పిల్లలు బల్ల మీద కూర్చున్నారు. నూలపాలెం నుంచి టౌనుకి ఇప్పుడు విరివిగా రవాణాలు జరుగుతున్నాయి, రెండేళ్ళ క్రితం, ప్రభుత్వం పంట్ ఏర్పాటు చెయ్యడం వల్ల. పంట్ నిర్వహణ పంచాయితీకి ఇచ్చేశారు. బాగానే నడుస్తోంది. రష్‌ని బట్టి ఎన్ని ట్రిప్‌లు వెయ్యాలీ అనేది నిర్ణయిస్తారు.

పంట్ మీద, ట్రాక్టర్లు, ట్రక్‌లు, కార్లు తిరుగుతుంటాయి. ఆటోల సంగతి చెప్పనే అక్కర్లేదు.

కృష్ణవేణి కుగ్లర్ హాస్పిటల్ లో చేరి మూడేళ్ళయింది. మధ్య మధ్యలో అవసరమైన స్పెషాలిటీ ట్రైనింగులిస్తూ మంచి సిస్టర్ గా తయారు చేశారు హాస్పిటల్ వాళ్ళు.బియస్సీ నర్సింగ్ లో ఎట్లాగా తనకి డిస్టింక్షన్ వచ్చింది. ఒకటి రెండేళ్ళలో యమ్మెస్సీ లో చేరదామనుకుంటోంది. అప్పుడు కాలేజ్‌లో టీచింగ్ జాబ్ చెయ్యచ్చు. కాస్త పని వేళలు తక్కువగా, ఒక క్రమంగా ఉంటాయి.

సాంబడికి రెండవసారి ఎంట్రెన్స్ లో గుంటూరు లోనే సర్జరీలో సీట్ వచ్చింది. ఈ సారి తన రిజర్వేషన్ కోటాని ఉపయోగించుకున్నాడు. మూడవ సంవత్సరం లో ప్రవేశించాడు.

ప్రసాద్, మంగళ విజయవాడలో తమ నర్సింగ్ హోమ్‌ని చూసుకుంటున్నారు. వాళ్ళకి ఒక సంవత్సరం పాప. చౌదరిగారు ఇంట్లో ఉన్నంత సేపూ మనవరాలిని వదలరు.. పైగా నాన్నమ్మ పేరే దానిది, కనకదుర్గ. పేరు పెట్టేటప్పుడు ప్రసాద్‌కి సాంబడు తనని కలిసిన మొదటిసారి అన్న మాట గుర్తుకొచ్చింది. అందుకే అమ్మ పేరు పెట్టాడు. చక్కగా, ఏ భేషజం లేకుండా దుర్గా అని పిలుస్తారు.

నాగరాజు పదో తరగతిలోకి వచ్చాడు. బళ్ళో ఉన్న మూడు సెక్షన్లలో మొదటి పదిమందిలో ఉంటాడు. నాంచారి ఎనిమిది.. ఫరవాలేదు.. ఫస్ట్ క్లాస్ మార్కులొస్తాయి. ఇప్పుడు వాళ్ళిద్దరికీ తమ గురించి తెలుసు పూర్తిగా, స్పష్టంగా. రెండేళ్ళ క్రిత, అమ్మ తరపు బంధువులొచ్చి తీసుకెళ్తామంటే.. ససేమిరా వెళ్ళమనేశారు. వాళ్ళకి వెంకమ్మే, అమ్మ.. అత్త, అన్నీ!

వీలున్నప్పుడు అందరూ కలుస్తుంటారు. సరదాగ ఎక్కడికైనా పిక్నిక్‌కి వెళ్తుంటారు.

సరస్వతమ్మ పెద్దకొడుకు కూతురికి పెళ్ళని ఫోనొస్తే బయల్దేరారు, పాలెం. ఆరేళ్ళ తరువాత.

రేవు దగ్గర దిగ్గానే ఆటోలు రెండు తయారుగా ఉన్నాయి. పంటు రేవు ఎదురుమొండి దగ్గరుంది. పాలెంకి దూరం. ఏడెనిమిది కిలోమీటర్లుంటుంది.

“ఇప్పుడు టైమ్ లేదురా సాంబా! నడవలేం. ఆటో మాట్లాడు.” నడిచి వెళ్ళడానికి తయారయిపోతున్న్న సాంబడిని వారించింది వెంకమ్మ.

“ఊరు చాలా మారిందమ్మా!” అటూ ఇటూ మెడ నొప్పెట్టేట్లు చూస్తూ అన్నాడు సాంబడు. కృష్ణవేణి కూడా మాటా మంతీ లేకుండా గమనిస్తోంది. నాగరాజు, డ్రైవర్ పక్కనే కూర్చుని ప్రశ్నల పరంపర గుప్పిస్తున్నాడు.

“ఇక్కడ పెద్ద చెట్లెందుకుండవు?”

“నేల్లోపలంతా ఉప్పునీరు బాబూ! అందుకే పెరగవు.” ఆటో అబ్బాయి తన పరిజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాడు.

“మరైతే ఉప్పే పండించచ్చు కదా?”

“అటు పక్కున్నాయి బాబూ, ఉప్పు మళ్ళు.”

“మళ్ళా..” పకపకా నవ్వింది నాంచారి.

“అవును పాపా! కూరగాయలకీ, ఆకు కూరలకీ మాదిరిగా, ఉప్పు తయారీకి కూడా నేల గట్టి, చదును చేసి, అందులోకి ఉప్పునీరు పంపేస్తారు.”

“మరి ఉప్పొకటీ ఉంటే చాలా!అన్నం, పప్పు అవీ కావాలి కదా తిండానికి?”

“ఉప్పు చేసి అమ్మి, బియ్యం అవీ కొనుక్కుంటారు. మరిక్కడ ఆ ముళ్ళ చెట్లు తప్ప యెయ్యా రావు కదా? రేత్రిళ్ళు చేపలు పట్టారు.”

అప్పటి వరకూ, అటూ ఇటూ చూస్తూ, సంభాషణంతా వినోదంగా వింటున్న సాంబడు చేపలనగానే చటుక్కున తిరిగాడు.

"రాత్రి పూట పడుతున్నారా చేపలు?"

"అవును బాబుగారూ! మోటారు బోట్లు సొంతం వి కానీ అద్దెకి తీసుకుని కానీ రాత్రిళ్ళు పడతారు. అప్పుడు మంచి చేపలు కొట్టుకొస్తయ్యంట."

సాంబడు కృష్ణవేణిని చూసి తలెగరేశాడు. వేణి సరే అన్నట్లు చిరునవ్వు నవ్వింది. "మీదేవూరు?"

"ఎదురుమొండి బాబూ! నేను కూడా రేత్రిళ్ళు సేపలు పడ్తంటా.. మా యావిడ్నేసుకుని."

"మీ ఆవిడ్నేసుకునా? మోటారు బోట్లు, వలలు అద్దెకి దొరుకుతాయా ఇక్కడ? అద్దె ఎంటుంటుంది?"

"రెండొందలు పైనే ఉంటుంది బాబూ! చేపలు కాని దొరికితే మూడొందలు పైమాటే వస్తుంది. రేవు కూడా దాటనక్కర్లా. ఎదురుమొండిలోనే కొనేస్తారు, గుత్తేదార్లు."

"అట్లనా? ఇవేళ రాత్రికి దొరుకుతుందేమో కనుక్కుంటావా? సరదాగా వెళ్ళి చేపలు పడదామని ఉంది."

"నా బోటు, వల ఇస్తాను బాబూ! నేను తోల్తా.. మీరు పడుదురు. ఎప్పుడైనా పట్టారా?"

వెంకమ్మకి నవ్వొచ్చింది. మాట్లాడద్దన్నట్లు సైగ చేశాడు సాంబడు.

"నువ్వు నేర్పిద్దువుగానీ.. ఎన్ని గంటలకొస్తావు? అమ్మా! రేపు కదా పెళ్ళి. అట్టా యెల్లిరానా?"

"వెళ్ళిరా! నీ సరదా ఎందుకు కాదనాలి.. ఎక్కువసేపు ఉండద్దు. పెళ్ళి ఏడింటికే. మనం భోజనాలవగానే వెళ్ళిపోదాం." వెంకమ్మ కొడుకు సంబరం చూసి ముచ్చట పడి సరే అంది. పైగా పెద్దరికం నిలిపి అడిగాడు కానీ, తనని అడిగి వెళ్ళే వయసా?

"బాబుగారూ! సరిగ్గా పదింటికొచ్చేత్తానండి. అమ్మాయిగారిని కూడా తీసుకు రండి చానా బాగుంటాది. నా పేరు దాసండీ."

# 16

ఠంచన్‌గా పదింటికొచ్చేశాడు దాసు ఆటో తీసుకుని. సాయంత్రమే పెళ్ళికూతుర్ని చెయ్యటం, చేపలు, కోడితో భోజనాలు అయ్యాయి.

"లగ్నం పొద్దున్నే ఏడింటికే. అందరూ తయ్యారవ్వాలి తొందరగా. పెందళకడే పడుకోండి." సరస్వతాంటీ అందరినీ తరిమేసింది. కృష్ణవేణీ వాళ్ళిల్లే బాగులు చేయించి వెంకమ్మా వాళ్ళకిచ్చారు.

"మేం అవుసరమైనప్పుడు వాడుకుంటున్నాం బావా! అందుకే మంచి కండిషన్లో ఉన్నాయి మీ ఇళ్ళన్నీ." సరస్వతి రెండో కొడుకు ఇంట్లోకెళ్ళగానే చెప్పాడు.

"ఐతే సేపలేటకెల్తన్నారా? పోయిరండి. రేపు మన భోయనానికి సర్పొయ్యేన్ని పట్రండి." సరస్వతమ్మ తీసుకెళ్ళవలసినవన్నీ తెచ్చి ఇచ్చింది. కప్పుకోటానికి గొంగళీ, ఫ్లాస్కులో టీ, మంచినీళ్ళు, మధ్యరాత్రి ఆకలేస్తుందంటూ పప్పు చెక్కలు, కాసిని అరటిపళ్ళు..

"ఆంటీ!" గోలెట్టాడు సాంబడు. "మేం వెళ్ళేది రెండు మూడు గంటలకి. నువ్వేమో రెండ్రోజులకి సరిపోయేట్లు ఇత్తన్నావు."

"పర్లేదులేరా.. దాసు కూడా ఉన్నాడు కదా!"

ఆటో తిన్నగా చేపల రేవు దగ్గరికి తీసుకెళ్ళాడు దాసు. రేవు దగ్గర ఒక మాదిరిగా శుభ్రంగానే ఉంది.. మరీ ఎక్కువ పబ్లిక్ రారు కదా.. చేపల వేట వాళ్ళు తప్ప.

దాసు బోటు.. రంగులవీ వేసినట్లున్నాడు, మెరిసి పోతోంది. మధ్యలో చిన్న గూడు కూడా ఉంది. ఒడ్డు నుంచి బల్ల వేసి, సామాన్లన్నీ



KOUMUDI

లోపల పెట్టొచ్చి, చెయ్యివ్వబోయాడు సాంబడికి. అక్కర్లేదన్నట్లు తలూపి, సులువుగా ఎక్కేసి, కృష్ణవేణికి చెయ్యందించాడు. సుతారంగా అందుకుని మూడంగల్లో బోటులోకి చేరుకుంది వేణి. సెల్వార్, కమీజ్ వేసుకుందేమో.. కుచ్చిళ్ళు అడ్డుకుంటాయన్న బాధ కూడా లేదు.

బెంచీ మీద ఇద్దరూ కూర్చోగానే మోటార్ ఆన్ చేసి, పడవ నడప సాగాడు దాసు.

"ఇయ్యాల పున్నమి బాబూ! పుచ్చపువ్వు లాంటి యెన్నెల. అందుకే కొంచెం అటేపెల్దాం. సంద్రం వేపైతే.. అలలు యెగసి పోతుంటాయి. చేపలు కనిపించగానే వలేసేద్దాం."

సాంబడు, వల విప్పి నాణెం చూస్తున్నాడు. మంచి కండిషన్‌లో ఉంది. ఒకళ్ళే వేసి తిప్పగల చిన్న వల. ఆటోలో కూడా సంపాదిస్తాడు కదా దాసు.. పడవ కూడా రయ్యిమని వెళ్ళిపోతోంది.. మోటారు చప్పుడు ఎక్కువగా లేకుండా.

దాసు బోటుని తిప్పటంలో మునిగి ఉంటే.. మధ్యకి రాగానే వల తీశాడు సాంబడు. చేపలు బిలబిల్లాడుతూ ఎగురుతున్నాయి. వల విప్పి, తిప్పి, నదిలోకి విసిరాడు.

సప్.. చప్పుడు విని వెనక్కి తిరిగిన దాసు, 'బాబుగారూ' అనే లోపు.. వాటుగా వల పైకి లేపి, లోపలికి తీసుకొచ్చేశాడు. ఒక్క విసురుకే ఎన్నో చేపలు.. గూట్లో ఉన్న గంపలోకి విదిల్చాడు.. దాసు నిర్ఘాంతపోయి చూస్తున్నాడు.

కృష్ణవేణి హాయిగా నవ్వింది.. తీరైన పలువరస మెరుస్తుండగా!

"పున్నమి వెన్నెల కాంతిలో నావ కావల కృష్ణవేణి హాయిని కలిగిస్తుంటే
నావ లోపలి కృష్ణవేణి వింత కాంతు లీనుతూ వయ్యారాలు పోతుంటే,
నా మనసు పరవళ్ళు తొక్కుతోంది.
చంద్రుడా ఎందుకయ్యా చల్లని వేడితో నా మేనిని తాకుతావు..
కాస్త దయ తలచి మబ్బుల చాటుకి పోరాదా!"

సాంబడు వేట మానేసి, కృష్ణవేణి పక్కకి చేరి సన్నగా పాట పాడడం మొదలెట్టాడు.

ఏదో అర్ధమయినట్లు దాసు మౌనంగా ముందుకి తిరిగి నెమ్మదిగా నావని నడప సాగాడు.

"బాబుగారూ మీరు.." పాలెంలో ఇంటి దగ్గర దింపి, డబ్బులు తీసుకున్నాక అడిగాడు దాసు. వలలో పడిన చేపలు.. ఐదారు కిలోలుంటాయి, రకరకాల సైజుల్లో. సగం దాసుకిచ్చి, సగం ఇంటికి తీసుకొచ్చాడు సాంబడు.

"మాదీవూరే. మేం కూడా గంగ పుత్రులమే." సందేహం తీర్చాడు.

"మేరీ ఆంటీ ఇంకలేరుట." పొద్దున్నే మోగిన ఫోన్‌లో మాట్లాడిన సాంబడు, వంటింట్లోకొచ్చి చెప్పాడు. కృష్ణవేణి బాబుకి పాలు కలుపుతోంది.

సాంబడి యమ్మెస్ అయి రెండేళ్ళయింది. గుంటూరులో ఒక పెద్ద ప్రైవేట్ హాస్పిటల్‌లో పని చేస్తున్నాడు. కృష్ణవేణి యెమ్మెస్సీ నర్సింగ్‌లో చేరింది, గుంటూరులోనే. వాళ్ళ బాబుకి ఎనిమిది నెలలు.. పాకుతూ చేతికందినవి పీకి, నోట్లోకి తోసేస్తుంటాడు.

వెంకమ్మ హాస్టల్ నుంచి వచ్చేసి, సాంబడి దగ్గరే ఉంటోంది.. మనవడి ఆలనా పాలనా చూస్తూ.

**నాగరాజు** ఇంటర్‌లో చేరాడు. నాంచారి పదో తరగతి. ఇద్దరూ తమ జీవన విధానానికి అలవాటు పడిపోయారు.

నెలకొకసారి సాంబడు, ప్రసాద్ తప్పక కలుస్తుంటారు.. ఏదైనా కేసుకి సలహా, అసిస్టెన్స్ అవసరమైతే విజయవాడ వెళ్తుంటాడు సాంబడు. ఒకరికొకరు తోడుగా స్నేహాన్ని నిలుపుకుంటున్నారు. మేరీ అమెరికన్ పౌరసత్వం తీసుకుని అక్కడే ఉండిపోయింది.. ఇల్లంతా సాంబడికే అద్దెకిచ్చి. అద్దె ప్రతీనెలా చర్చ్‌లో ఇమ్మంది.

"అయ్యో! మనం ఈ విధంగా ఉండటానికి ఆవిడ సహాయం ఎంతో ఉంది. నిన్ను ఆవిడ కొడుకు లాగనే చూసుకుంది. చర్చ్‌లో ఎప్పుడో సర్వీస్ చేస్తారు. కనుక్కుని వెళ్దాం." వెంకమ్మ అంది, వార్త విని.

"మనం వేరే ఇల్లు చూసుకోవాలేమో!" సాంబడు విచారంగా అన్నాడు. ఆంటీ లేదనే బాధ ఒకటి.. అలవాటయిన ఇల్లు పరిసరాలు మార్చడం ఒకటి..

నెల లోగా, ఒక ఆదివారం చర్చ్‌లో సర్వీస్ పెట్టారు. ఫాదర్ ఫోన్ చేశారు..

"డాక్టర్! మీరు తప్పకుండా రావాలి. మీతో కొన్ని పాయింట్స్ డిస్కజ్ చెయ్యాలి."

"ఐతే చర్చ్‌కి ఇమ్మని చెప్పుంటారు. మా కాలేజ్‌లో చెప్తున్నారు, కొత్తపేటలో డాక్టర్ల వీధికి దగ్గర్లో అపార్ట్‌మెంట్స్ కడుతున్నారుట. ఒకటి బుక్ చేద్దాం. ఏడాది లోపు ఇస్తారుట. అంతవరకూ ఉండనిస్తారేమో అడుగుదాం." కృష్ణవేణి అంది.

ఐతే.. ఆ అవసరం రానియ్యలేదు మేరీ. ఆవిడ రాసి, రిజిస్టర్ చేసి, ఫాదర్‌కి ఇచ్చిన విల్లు చూపించారు, సర్వీస్‌కి వెళ్ళినప్పుడు..

"డాక్టర్ సాంబడు తనకి ఇష్టం వచ్చినన్నాళ్ళు ఇంట్లో ఉండచ్చు. అద్దె మామూలుగా చర్చ్‌కి ఇవ్వాలి. అద్దె పెరగదు కానీ, మైన్‌ట్‌నెన్స్, టాక్స్‌లు డాక్టర్ కట్టుకోవాలి. అతడు ఎప్పుడు ఖాళీ చేసినా.. ఇంట్లో ఓల్డ్ ఏజ్ హోమ్ నడిపే సంస్థకి ఇచ్చెయ్యండి."

సాంబడు ఉద్వేగంతో వెక్కి వెక్కి ఏడ్చాడు.

"డాక్టర్! కంట్రోల్.. మీకు చెప్పే వాళ్ళం కాదు. చావు పుట్టుకలు సహజమే కదా! షి ఈజ్ ఎ గ్రేట్ లేడీ. ప్రభువు సన్నిధిలో సేద తీరుతూ ఉంటుంది."

"అందుక్కాదు ఫాదర్! ఆంటీ ప్రేమకి కదిలింది నా గుండె. ఎప్పటి బంధం ఇది? పది సంవత్సరాలుగా.. ఒక్క సారి కూడా ఏ భేదమూ రాలేదు.. నిరంతరం ప్రేమవాహిని ప్రవహిస్తూనే ఉంది. మన చేతిలో ఏమీ లేదు కానీ.. నేనే ఆంటీ కోరిక తీర్చడానికి ప్రయత్నిస్తాను. ప్రభువు అనుమతిస్తే, సంస్థని స్థాపిస్తాను."

ఆ రాత్రి కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. పగలంతా విపరీతమైన గాలి, నల్లని మేఘాలు ఎవరో తరుముతున్నట్లు పరుగులు..

పొద్దుట్నుంచీ టివీల్లో, రేడియోలలో హాహాకారాలు. సునామీ విరుచు పడి, తూరుపు సముద్ర తీరాలన్నింటినీ కబళించేస్తోంది. అవని కంపించి పోతోంది. చెన్నై నుంచి టివి వార్తలు చదువుతూ, న్యూస్ రీడర్, భవనం కదిలిపోతోందని పరుగులు పెట్టాడు. ఈ తరంలో సునామీ అనే పేరు వినడం అదే! దక్షిణ తీర ప్రాంతాల్లో వేలాది మందిని పొట్టన పెట్టుకుంది.

. భీకర ప్రళయం రావడం క్షణాల్లో వచ్చింది కానీ దాని ప్రభావం నెలల తరబడి, సంవత్సరాల తరబడి కొన సాగుతూనే ఉంది. సునామీ ప్రభావం నాగాయలంక తీర ప్రాంతాల్లో కూడా ఎక్కువగానే ఉంది పోయిన వాళ్ళు పోగా ఉన్న వాళ్ళకి అంటు రోగాలు, జ్వరాలు.. ఎంతమంది డాక్టర్లు, నర్సులు వెళ్ళినా సరిపోవట్లేదు. రోజుకి ఇరవై గంటలు పని చేస్తున్నారు.

డాక్టర్ సాంబడు, కృష్ణవేణి వారం రోజులుగా నాగాయలంక లోనే ఉంటున్నారు. నూలపాలెం ఉన్న లంకకి టౌనుకి సంబంధం తెగిపోయింది. వెంకమ్మకి ఇరవై ఏడేళ్ళ క్రితం వచ్చిన ఉప్పెన గుర్తుకొచ్చింది. మనవడు నిద్రపోతున్నపుడు, పనమ్మాయి దగ్గర వదిలి.. దగ్గరలో ఉన్న ఇళ్లిల్లూ తిరిగి, బట్టలు, బియ్యం, పప్పులు సేకరించింది.



KOUMUDI

రోజువారీ జరుగుబాటుకీ, ఆరోగ్యానికీ అనేక సేవా సంస్థలు ముందుకొచ్చి పని చేసినా.. దీర్ఘకాల సమస్యలు అనేకం తలెత్తాయి.

ముఖ్యంగా మత్స్యకారులకి.. తీర ప్రాంతాలలో నదుల మీద సముద్రంలో చేపలు పట్టే వాళ్ళ బ్రతుకులు అతలా కుతలం అయిపోయాయి.

ఆ సమయంలో ముందుకొచ్చిన సేవా సంస్థల సేవలు గణనీయం.

ప్రసాద్, చౌదరిగారు.. ఇంకా కొంతమంది మిత్రుల ప్రోద్బలంతో గుంటూర్ రోటరీ క్లబ్‌లోనూ, రెండు దశాబ్దాలుగా ప్రకాశం, క్రిష్ణా, గుంటూరు, రంగారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాటు పడుతున్న 'అసిస్ట్' అనే సంస్థలోనూ సభ్యత్వం తీసుకున్నాడు సాంబడు.

చౌదరిగారు, ఆ రెండు సంస్థల్లోనే కాకుండా అటువంటి అనేక సంస్థల్లో సభ్యులు.. హితోధికంగా ఆర్థిక సహాయం చేస్తూ ఉంటారు. సాంబడు, తన వృత్తి ద్వారా సేవ చెయ్యడానికి సంసిద్ధ మయ్యాడు.

ఒక ఆదివారం పాలెం ప్రయాణమయ్యారు సాంబడు కుటుంబం. అప్పటికి రెండు మూడు నెలలయింది రవాణా సౌకర్యం ఏర్పడి. పంట్ మామూలుగానే నడిచింది. క్రిష్ణమ్మ అల్లకల్లోలం తరువాత.. అలిసి పోయిందేమో, ప్రశాంతంగా పారుతోంది.

అద్దరిని అడుగు పెట్టినప్పట్నుంచీ మొదలయింది, సునామీ విశ్వరూపం. అసలు చెట్లు ఉన్నవే తక్కువ. అవన్నీ కూడా అడ్డంగా పడిపోయాయి అడదిడ్డంగా. రోడ్డు మీద మాత్రం అడ్డంకులన్నీ తొలగించారు. దారి పొడుగునా.. కనిపించిన వన్నీ హృదయం కదిలించే దృశ్యాలే.

పాలెంలోకి  ఆటో అడుగిడుతూనే.. వెంకమ్మ వెక్కడం మొదలు పెట్టింది. అన్ని ఇళ్ళూ కప్పులు ఎగిరిపోయి, టార్పాలిన్లే టాపులుగా ఉన్నాయి. అవి కూడా ఎవరో దాతలు ఇచ్చినవే. వెంకమ్మ వాళ్ళ ఇలు కూడా మొండి గోడలే. అక్కడ ఎవరూ ఉండటం లేదని టాపు వెయ్యలేదు.

సాంబడు మాత్రం అన్నీ ఫొటోలు తీస్తూ, ఒక పుస్తకంలో పరిస్థితులన్నీ రాసుకుంటున్నాడు. బాబుకి ఏణ్నర్ధం వయసు. వాడి పేరు తాత పేరే. నారాయణ. అప్పుడప్పుడే బుడిబుడి నడకలతో పడుతూ లేస్తూ తిరుగుతుంటాడు.

సరస్వతమ్మ మంచం పట్టింది. వెంకటలక్ష్మిని చూసి కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

సాంబడు, ఆవిడని పరీక్ష చేసి, మందులు ఇచ్చాడు. ప్రతీ నెలా పంపుతానని చెప్పాడు.

కృష్ణవేణి, కాళ్ళు చేతులూ కదుపుతూ ఉండాలని, వ్యాయామాలు కొన్ని నేర్పించింది.

ఆ రాత్రి ఇంటి కెళ్ళాక, మంచం మీద వెల్లకిల్లా పడుక్కుని, మెడ కింద చేతులు పెట్టి కప్పు కేసి కళ్ళార్పకుండా చూస్తూ ఆలోచిస్తున్నాడు సాంబడు.

"ఏంటి సాంబా!" కృష్ణవేణి పని ముగించుకుని వచ్చి, సాంబడి కాళ్ళు వత్త సాగింది.

అదేదో మగవాడి దాష్టీకం నిలపడానికి చేస్తున్నది కాదు.. అలసి సొలసి, పగలనకా రేయనకా తిరిగి, దీనావస్థలో ఉన్న వారికి సాంత్వన కలిగిస్తున్న ఒక మానవతావాదికి, హృదయంలోంచీ ఉప్పొంగుతున్న ప్రేమతో చేస్తున్న సేవ.

కృష్ణవేణి యమ్మెస్సీ ఫస్ట్ క్లాస్‌లో పాసయి, తను చదివిన నర్సింగ్ కాలేజ్‌లోనే లెక్చరర్‌గా చేరింది. రాత్రి డ్యూటీలుండవు. ఇంటికి ఎక్కువ సమయం కేటాయించ గలుగుతోంది.

"సాంబా!" ఆదుర్దాగా పిలిచింది వేణి.. పలక్కుండా అలాగే పడుక్కున్న సాంబడిని.

"ఏం లేదు వేణీ! మనూరికి ఏదో చెయ్యాలి. ఏం చెయ్యాలా అని చూస్తున్నా. లక్షల్లో డబ్బు కావాలి. పడవలు బాగు చేయించాలి,

కొత్త వలలు కొనివ్వాలి. అసలు నేలనే మార్చెయ్యాలి. ఎలాగా? ఎలాగా?”

“అవేమీ ఒక్క రోజులో అయే పనులు కావు. కొన్నేళ్ళు పడుతుంది. ముఖ్యావసరాలు ముందు చూడాలి. సేవా సంస్థలకి ఉన్నది మనూరొకటే కాదు కదా! ఎవరైనా విదేశ సంస్థ దత్తత చేసుకునేట్లు చూడాలి. రోటరీ రవిగారూ, అసిస్ట్ రంగారావుగారూ.. ఇంకా చౌదరిగారి వంటి పెద్దలూ, విదేశ క్లబ్బులతో కలిసి.. అట్లాంటి దత్తత కర్యక్రమాలు చేపడుతున్నారని మా కాలేజ్‌లో చెప్పుకుంటున్నారు. రేపు వాళ్ళంతా నాగాయలంక దగ్గర ఏదో గ్రామానికి మంచినీళ్ళ టాంకుల ప్రారంభానికి వెళ్తున్నారుట. ఒకసారి వాళ్ళ చెవిని వేస్తే బాగుంటుందేమో!”

సాంబడు దిగ్గున లేచాడు. హాల్లోకి పరుగెత్తి, ఫోనందుకున్నాడు.

అరగంట పైగా మాట్లాడి, వచ్చి పడుక్కున్నాడు.

“ఏంటి సాంబా హుషారుగా ఉన్నావు?” కృష్ణవేణి పడుకునే, పక్కకి తిరిగి అడిగింది, తెల్లారుఝామునే సన్నగా విజిల్ వేస్తూ తయారయే హడావుడిలో ఉన్న సాంబడిని. పొద్దున్నే ఆరుగంటలకి సర్జరీ ఉంది. సాంబడి మొహం చాలా రోజుల తర్వాత తేటగా కనిపిస్తోంది.

“మనూరుని దత్తత చేసుకుంటున్నారు, ఇక్కడి రోటరీ జిల్లా వాళ్ళు, ఆస్ట్రేలియాలోని ఒక జిల్లావాళ్ళు కలిపి. నిన్ననే రవిగారు ఫోన్ చేసి చెప్పారు. త్వరలో మనూరి స్వరూపమే మారిపోతుంది. మనం వారం వారం వెళ్ళి, మనూరి వాళ్ళని ట్రీట్ చేద్దాం..” వస్తా.. కృష్ణవేణి దగ్గరగా వచ్చి ఒక ముద్దందించి వెళ్ళిపోయాడు.

కృష్ణవేణి కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ ఉండిపోయింది. సునామీ వచ్చినప్పట్నుంచీ తమ జీవనంలో కూడా మార్పు వచ్చింది. ఎప్పుడూ పాలెం ధ్యాసే! హాస్పిటల్‌కి దగ్గర్లో అపార్ట్‌మెంట్ బుక్ చేశారన్నమాటే కానీ, ఎట్లా వస్తోందో, ఎంతవరకూ వచ్చిందో పట్టించుకోలేదు. ‘మేరీస్ సీనియర్ సిటిజెన్ హోమ్’ రిజిస్టర్ చేశారు. ఈ ఇంటిని దానికి సరిపోయేట్లు మార్చాలి. మళ్ళీ తాము చదువుకునే రోజుల్లోని పోరాట వాతావరణం వచ్చేసింది. ఇంకెటువంటి ఆలోచనకీ ఆస్కారం లేకుండా.

“అమ్మా!” నిద్రకళ్ళతో దగ్గరగా వచ్చిన నారాయణని పైకి లేపి పక్కనే పడుక్కోబెట్టుకుంది. వాడు నాయనమ్మ దగ్గరే పడుక్కుంటాడు. ఎప్పుడు తెలివొస్తే అప్పుడు లేచి వచ్చేస్తుంటాడు.

కాస్త తీరిక చిక్కాక, ఎక్కడికైనా తీసుకెళ్ళాలి వీడిని.. మూడేళ్ళొచ్చాయేమో, ఇప్పుడిప్పుడే అన్నీ గమనిస్తున్నాడు.

నిద్రపోతున్న కొడుకుని, మధ్యకి జరిపి, లేచింది కృష్ణవేణి.. తొమ్మిదింటికి కాలేజ్‌లో ఉండాలి. ఆలోగా చెయవలసిన పనులూ..

“డాక్టర్! అర్జంట్‌గా బయల్దేరు.. సర్జరీ ఉంటే ఎవరికైనా అప్పజెప్పి..” పొద్దున్నే ప్రసాద్ ఫోన్.

కృష్ణవేణి కూడా బయల్దేరింది. నారాయణకి ఐదేళ్ళు వచ్చాయి. స్కూలుకెళ్తున్నాడు. వాడి సంగతులన్నీ వెంకమ్మే చూసుకుంటుంది.. సాంబడు సంవత్సరం క్రితమే కారు కొన్నాడు.రోడ్డు చాలా బాగుండడంతో అరగంటలో విజయవాడలో ఉంటారు.

“చౌదరిగారికి బాగా లేదనుకుంటా. అట్లాంటప్పుడే ప్రసాద్ ఖంగారు పడుతుంటాడు.” మాట్లాడకుండా డ్రైవింగ్ మీదనే దృష్టి నిలిపాడు సాంబడు.

అనుకున్నంతా అయింది. ఇంటి ముందు రోడ్డంతా కార్లతో నిండి పోయింది. దూరంగా పార్క్ చేసి, నెమ్మదిగా నడుస్తూ లోపలికి వెళ్ళారు. ప్రసాద్, సాంబడిని చూస్తూనే ఆపుకోలేకపోయాడు.. అప్పటి వరకూ, పంటిబిగువున ఆపుకున్న దుఃఖాన్ని. చౌదరిగారిని పడుకోబెట్టిన ఐస్‌బాక్స్ దగ్గరే కూర్చుని ఉన్నారు, మంగళ, పాప, శాంతమ్మ. పాప వెక్కుతూనే ఉంది.. కళ్ళు, మొహం ఎర్రగా అయిపోయాయి.


KOUMUDI

చుట్టుప్రక్కల ఊళ్ళ నుంచి, సేవాసంస్థల వాళ్ళందరూ వచ్చేశారు.. పెద్ద పెద్ద పూల దండలు పట్టుకుని. ఆ మహామనీషి ఆఖరి యాత్ర ఘనంగా జరిగింది.

"ఎందరికో విద్యాబిక్ష పెట్టిన మహానుభావుడు. నీకొక విషయం ఇప్పుడు చెప్పాలి.." వైకుంఠ సమారాధన రోజు, సాంబడి పక్కగా కూర్చుని సులోచన అంది..

"నేను గ్రహించానమ్మా! నా జీవితంలోని అజ్ఞాత వ్యక్తి ఈయనే కదూ! నా మీదా, నా అభివృద్ధిమీదా ఆయన చూపించిన ఆసక్తిని బట్టి.. ప్రసాద్‌కి కూడా ఆ విషయం తన పెళ్ళి ముందే తెలిసింది కదూ? అంతకు ముందుకీ, ఆ తరువాతకీ ప్రసాద్ నా పట్ల చూపించిన ఆత్మీయతలో వెంట్రుకవాసే తేడా ఉంది. స్నేహితుడిని సోదరుడిగా చూస్తున్న భావన.. వారి కుటుంబసభ్యుడిగా నన్ను స్వీకరించడం నా అదృష్టం. చౌదరిగారి ఆశయాల ప్రకారం నడవడమే నేను చూపించగలిగిన కృతజ్ఞత."

నీళ్ళు నిండిన కళ్ళతో చూసింది సులోచన. ఆ కళ్ళలో ప్రశంస.

"డాక్టర్ సాంబడూ?"

"నమస్కారం రవిగారూ! నేనే.. బాగున్నారా? ఈ మధ్యన మీటింగ్స్‌కి రాలేకపోతున్నా సార్. హాస్పిటల్ పనీ, ఓల్డ్ ఏజ్‌హోమ్, రూరల్ విజిట్స్.." తాపీగా పొద్దున్నే ఇడ్లీ తింటున్న సాంబడు సెల్‌లో పేరుని బట్టి పలకరించాడు.

"నాకు తెలుసు డాక్టర్! అందుకే గద.. మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యం. మీరివాళ ఫ్రీగా ఉంటే మీ ఊరెళ్దాం. మనోళ్లంతా వస్తున్నారు. అక్కడ ఒక ఇనాగరల్ ప్రోగ్రామ్ ఉంది."

"ఇవేళ నాకు ఆఫ్ సర్! మా ఫామిలీ అంతా వెళదామనుకుంటున్నాం.. ఇంతలో మీ ఫోన్.."

"అదే ఒక సామెతుంది కదా! వైద్యుడూ పాలే కోరాడు..."

"వద్దు సార్.. మీరు ఆ రకంగా నాదగ్గరకు రాకూడదు. పదికాలాలు మంచి పనులు చేస్తూ ఉండాలి." సామెత పూర్తి చెయ్యనియ్యలేదు సాంబడు.

"నన్ను సార్ అనద్దని ఎన్నిసార్లు చెప్పానయ్యా! ఎంత కాలం దూరం పెట్టేస్తావు?"

"సరే.. సారీ అన్నా!"

"అదీ మంచి బాలుడి లక్షణం. ఒక గంటలో బయల్దేరదాం. సిస్టర్ కూడా వస్తున్నారు కదా?"

పంట్‌లోకి ఎక్కాక పరిచయాలయ్యాయి. ఆస్ట్రేలియా నుంచొచ్చిన బ్రూస్ దంపతులు, అసిస్ట్ రంగా రావుగారు, ప్రసాద్, మంగళ, మూర్తిగారు.. ఇంకా గుంటూరు, ఒంగోలు, విజయవాడ పట్టణ ప్రముఖులు, మొత్తం ఇరవై మంది ఉంటారు. కార్లు కూడా పంట్ ఎక్కేశాయి.

కృష్ణమ్మ మీది గాలి పీలుస్తుంటేనే ఒళ్ళు పులకరించింది, సాంబడికీ కృష్ణవేణికీ. నారాయణని ఒళ్ళో పెట్టుకుని బెంచ్ మీద కూర్చుంది వేణి. దుర్గ, ప్రసాద్ కూతురు.. నారాయణ కంటే రెండేళ్ళు పెద్దది, వాడి పక్కనే కూర్చుని తన స్కూల్ విశేషాలు చెప్తోంది. వెంకమ్మ, పంట్ రెయిల్ంగ్ నానుకుని నలు పక్కలా చూస్తూ ఆ నదితో తన అనుబంధాన్ని నెమరేసుకుంటోంది.

వస్తూ వస్తూ నూనూగు మీసాల నాగరాజునీ, శల్వార్ కమీజ్ చున్నీతో ఉన్న నాంచారినీ ఎక్కించుకుని వచ్చారు సాంబడు వాళ్ళు.


KOUMUDI

ఇద్దరూ చాలా పెద్దరికంగా ఉంటారు. రెయిలింగ దగ్గర నిలుచుని నీళ్ళలోకి చూస్తున్నారు వాళ్ళు. మంగళ, ఆస్ట్రేలియన్ లేడీ, వివియన్ దగ్గర నిల్చుని వివరాలు అడుగుతోంది. తమ రోటరీ క్లబ్ కార్యకలాపాలు వివరిస్తూ, ఇక్కడి లైఫ్ గురించి తెలుసుకుంటోంది, వివియన్.

పంట్ దరిని చేరగానే, వాలుగా పరిచిన బల్ల మీద నడిచి లంకలో అడుగు పెట్టారు రోటరీ బృందం. కార్లో ప్రయాణం చేస్తూ అనుకున్నాడు సాంబడు,

"అట్లాగే ఉంది.. ముళ్ళతుప్పలూ ఇసకా. అక్కడక్కడ మొండి వృక్షాలు కనిపిస్తున్నాయి."

ఊర్లోకి ప్రవేశిస్తుండగానే సాంబడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. మొగలో పెద్ద ద్వారం, దాని మీద "నువ్వులారిపాలెం.. స్వాగతం" అని రాసుంది. రోడ్లు వేసినట్లున్నారు.. నున్నని రోడ్డు కాకపోయినా ఒక మాదిరిగా బానే ఉంది.

ద్వారం దాటగానే కార్లని ఆపేశారు ఊరి వాళ్ళు.

సరస్వతమ్మ ఆంటీ కొడుకు, షావుకారు, అతని కొడుకు, స్కూల్ మాస్టర్, టీచర్.. ఎందరో తెలిసిన వాళ్ళు రోడ్డుకి అడ్డంగా నిలబడ్డారు, చేతుల్లో దండలు పట్టుకుని.

అతిథులంతా కార్లు దిగారు.

ప్రతీ ఒక్కరి మెడలోనూ, దుర్గ, నారాయణలతో సహా.. పాలెంలోనే పూచిన రకరకాల పూలతో చేసిన హారాలు వేశారు. ఆస్ట్రేలియన్ దంపతులకి అన్నీ వివరిస్తూ కూడా నడుస్తున్నారు రవిగారూ, రంగారావుగారూ!

మధ్యలో మంచినీటి శుద్ధికి కట్టించిన ఆర్. ఓ ప్లాంట్ దగ్గర ఆగి, దాన్ని ప్రారంభించారు.

నడుస్తుంటే సాంబడి మొహం వెలిగి పోతోంది. చిన్న చిన్న ఇళ్ళు, కట్టారు. రెండు పోర్షన్లుగా ఉన్న డాబా ఇళ్ళు. తీరుగా వరుసగా. వరండా, గది, వంటిల్లు. ఎర్రని సిమెంట్ నేల తళతళా మెరుస్తోంది.

కృష్ణవేణి, సాంబడు, నాగరాజుల ఇళ్ళని ప్రాథమిక విద్య కేంద్రానికి రాసి ఇచ్చేశారు. అది కూడా తయారయింది.

వెంకటలక్ష్మి ఆశ్చర్యంగా చూస్తూ, తిరుగుతోంది.

కొన్నిఇళ్ళు చూశాక అందరూ బడి దగ్గరికి వెళ్ళారు. అక్కడ షామియానా వేసి, కుర్చీలు, మైకు, వేదిక ఏర్పాటు చేశారు. అందరికీ పానీయాలు ఇచ్చారు బడిలో చదువుతున్న పిల్లలు.

పెద్దలందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు చెప్పారు సర్పంచ్ కరుణాకర్. షావుకారు చాలా ఉద్వేగంతో మాట్లాడాడు.

గ్రామస్థులలో కొంతమంది ప్రతీ ఒక్కరితో మాట్లాడారు.

చివర్లో.. ఊహించని కార్యక్రమం. వేదిక మీదున్న పెద్దలు నవ్వుతూ చూస్తుండగా..

డాక్టర్ సాంబడు దంపతులకి ఆత్మీయ సత్కారం.

మధ్యలో రెండు కుర్చీలు వేసి, సాంబడిని, కృష్ణవేణిని ఆహ్వానించారు రవిగారు.

"నూలపాలెం గర్వించదగ్గ దంపతులు. వీరిని ఆదర్శంగా తీసుకుని గ్రామంలో ప్రతీ ఒక్కరూ వివిధ రంగాల్లో పైకి రావాలి. కష్టాలు వచ్చాయని కృంగి పోకుండా.. అవరోధాలన్నీ అధిగమించి, శిఖరాల నందుకున్న నిరంతర శ్రామికులు. అకుంఠిత దీక్షతో, మొక్కవోని ఆత్మవిశ్వాసంతో నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుంటూ కన్నవారి కలలని నిజం చేసిన మహావ్యక్తులు. ఈ విధంగా స్వయంకృషితో ప్రతీ ఒక్కరూ ఎదిగిననాడు, మన రాష్ట్రంలో, దేశంలో బడుగు బలహీన వర్గాలనేవే ఉండవు."

సాంబడికి, కృష్ణవేణికి పూలదండలు వేసి, శాలువాలు కప్పి సత్కారాలు చేశారు.. ఒక్కొక్కరుగా పెద్దలందరూ.



KOUMUDI

“డాక్టర్ సాంబడుగారి మాతృమూర్తి, వెంకటలక్ష్మిగారు ఆదర్శమూర్తి. ఆవిడ చొరవ, ప్రోత్సాహం వల్లే వారు ఈ స్థాయికి చేరుకోగలిగారు.” ప్రసాద్ వెంకటలక్ష్మిని వేదికమీదికి ఆహ్వానించి, పూలదండ వేసి, శాలువా కప్పాడు.

చప్పట్లతో మారుమోగిపోయింది ప్రాంగణమంతా. ముందు వరుసలో కూర్చున్న సరస్వతాంటీ ఆనందభాష్పాలు తుడుచుకోకుండా అట్లాగే వదిలేసింది.

రాత్రి పదిగంటలు.. పున్నమి వెన్నెలలో కృష్ణమ్మ తళతళ్ళాడుతోంది. అప్పుడే చేపలు పట్టడానికి ఒక పడవ నీటిలోకి వెళ్ళింది. అందులో ఇద్దరే.. నెమ్మదిగా నడుస్తోంది నావ.

ఆరోజు ఫంక్షన్ హడావుడికి బాగా అలిసిపోయారేమో, ఇంకెవరూ వేటకి రాలేదు. ఒడ్డుకి దగ్గరదగ్గరగానే తిరుగుతోంది నావ. ఒడ్డునున్న మడ చెట్లన్నీ నీళ్ళలోకి వంగి చూస్తున్నాయి.

వెలుగు నీడల సయ్యాటలలో కెరటాలు అలసిపోయి, మెల్లగా కదులుతున్నాయి. వాటితో ఊసులాడుతూ ఆడుకుంటున్నాయి ఎన్నో చేపలు. రంగురంగుల చేపలు.

“ఇటొచ్చి వల గట్టిగా పట్టుకొయ్యే కృష్ణవేణీ!” సాంబడు అరిచాడు వెనక్కి తిరిగి.

“ఈ డాక్టర్‌గారి మీదికి ఎప్పుడో విసిరాను కదా పెద్ద వల. చిక్కుకు పోయాడు. తప్పించుకోలేడంతే.” నడుం చుట్టూ చేతులు వేసి, సాంబడి భుజం మీదినుంచి, నదిలో కనిపిస్తున్న చంద్రబింబం కేసి కొంటెగా చూసింది కృష్ణవేణి.



KOUMUDI